సంపుటము 21
సంచిక 5

భారతి

తారణ, వైశాఖము
1944 మే

పశ్చాద్విలాపము

= 'స్వైరవిహారి' =

ఈనవమధురసుధానిధానములోన నేహాలాహలము నూహించినావో?
ఈనిరుపమవిపంచీనినాదములోన నేశతఘ్నిధ్వని నెంచినావో?
ఈస్వచ్ఛతమనిమ్నగాస్వాదుసలిలమం దేకీటకతతి నూహించినావో?
ఈస్వర్ణఖచితమణీస్వైరకాంతిలో నేకుహూకాళిమ నెంచినావో?

తనువు సర్వ మవశతను గన్న నేమాయె,
స్వాంతమా! యొకింత వశములోన
నీవుగూడ లేక, జీవితాంతముదాక
విడని యేడ్పుబరువు నిడితి వకట!

నాలోని యాశ సన్నగసన్నగా వృద్ధిజెంది క్రమముగా గ్రసించె నన్ను;
నీలోని త్యాగ మవేలమై స్వకకాంతి సరసిలోన మరుగుపరచె నిన్ను;
నాలోని క్రోధ మంతటనంతటను వృద్ధిజెంది క్రమముగా గ్రసించె నన్ను;
నీలోని శాంత మంచితమునై స్వకకాంతపరిపూర్ణతను మాటుపరచె నిన్ను;

ఇట్టి ఈ మన భేదమే తుట్టతుదకు
నిన్ను లేకుండినను నిల్పె; నన్ను నున్న
లేనియటు సేయు, నిక నెన్నడేని నే స్పృ
శించగలనె త్వత్ప్రేమభావాంచలముల?

అణగిపోదా? చటులాశనిభీషణధ్వానాన గానధునీనినదము
కలగిపోదా? పూతిగంధానిరుద్ధసాంద్రతయందు ప్రసవసౌరభ భరంబు

నన లెత్తునా ? క్రుధానైచ్యనికృత్తమై భూమిపై బడిన వల్లీమతల్లి
మనగల్గునా? భీష్మమారుతాహతమునై ఆరాటపడు శరదంబుదంబు

పూర్వకృతదోషము నెటో మాపుకొనుకొఱకు
శతసహస్రములైన యోచనలు వోడము
నాయెడదనైన నిపు డేల చేయి కాల
నాకులను బట్టుకొనుట యి ట్లాకులతను ?

అంబుజినీహృదయవిషాద మెంతది? తూరుపున వెలుంగు తోచువరకె
తద్గర్భబందీకృతద్విరేఫవ్యథయునుగూడ నంతలో నొసరిల్లు
బహుళదారిద్ర్యదుస్సహతాపభరచంద్రమఃఖేద మొక పక్షమాత్రమె కద
తన్ముఖాలోకనోత్సవలక్ష్యకుముదినీహృత్తపఃఫలము ఫలించు నపుడె

ఇపుడు నాజీవితమ్మున, నీజగమున
నాశలే తోపనటు లిరు లలముకొనిన
వేగినంతనె జగమెల్ల వెలుగుగాని
వేగ దిక నాదు బ్రతుకున వెలుగె లేదు.

వలదనేకద్విరేఫములై వోలుచు క్రొన్ననల తావులు వలపించ విక నన్ను;
శ్రుతిపేయతానసమంచితములై వెలయు నినాదములు వినిపించ విక నాకు;
ప్రీణితాఖిలజగచ్ఛ్రేణిమై విలసిల్లు నిదురవలతి స్పృశించ దిక నన్ను;
వ్యాప్తహారిద్రరిదంతము లౌ సువర్ణప్రభలు కనిపించ విక నాకు;

ఇకను నాదేహశిలయందు నింద్రియమ్ము
లుండియును లేనిలోజము; ఒక్క మనసు
మాత్రమే సుంత తెలివొందె, మరలమరల
కాటువడిన యెడందనే కాటువేయు.

నేనుమాత్రము:—

అచిరకారిత్వమున భిన్నమైన అమృత
కలశశకలనికరము నొకటిగ మరల
నొనరుచుటకు యత్నములు సేయుదును; తెగిన
తీగనె బిగించి మరల నదింప నెంతు.

పెండ్లిండ్లు - దేశీయాచారములు

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

వివాహవర్ణనాసందర్భము నాధారము చేసికొని యాంధ్రసారస్వతము దేశీయాచారముల నెంతవరకు సూచించుచున్నదో మన మించుక పరిశీలించుట యుక్తము కాకపోదు.

ఆంధ్రసారస్వతమున కాదిగ్రంథముగా గ్రహింపబడుచున్న భారత మాదిపర్వమున నన్నయ ద్రౌపదీ వివాహమును వర్ణించుచు, పాండవు లలంకృత వివాహమండపమునకు వచ్చుట, కాంతాసహస్రంబుతో ద్రౌపది యాగమనము, ధౌమ్యుడు దీప్తశిఖానలమున వివాహమంత్రాహుతులను వేల్చుట, ముందుగ ధర్మపుత్రునకు, క్రమంబున తక్కిన సోదరులకు ద్రౌపది పాణిగ్రహణంబు సేయించుట, జనుల యాశీర్వాదము, చదల కుసుమవృష్టి విస్తరిల్లుట — వీనిని మాత్రమే వర్ణించెను. ఇది హోమము, పాణిగ్రహణము ప్రధానముగా వర్ణితమైన వైదికవివాహ మనుట సాహసము కాదు గదా. కావుననే నన్నయసృష్టి ప్రధానముగా వైదికదృష్టి యనుట. లేదా నన్నయనాటికి దరువాతి కవులు వివాహసందర్భమున వర్ణించిన కొన్ని యాచారములు వాడుకలోనికింకను రాలేదనవలయును.

ఇక నన్నిచోడుడు కుమారసంభవమున నీశ్వరుని వివాహమును వర్ణించెను. శివుడు రజతగిరినుండి పరివారముతో హిమగిరికి శుభప్రయాణముల జనుదేరగా హిమవంతు డాతని రాక యెఱిగి మహాహేమతోరణములు, వస్త్రతోరణములు, మకరతోరణములు, వాతపూరణములు, కేతనానీకములు, కలువతీగలు మొదలగువానితో బురము నలంకరింపించి, పరమేశ్వరున కెదురుసని, నమస్కరించి, తోడ్కొనివచ్చి పురప్రవేశంబు చేయించెను. మరునాడుదయమున నీశ్వరునకు హిమవంతుడు సుప్రభాతార్చనావిధి నభ్యర్చితుం జేసి 'వివాహమండపంబును' నిర్మింప నుద్యుక్తుండు కాగా, కల్పవృక్షములు కంబంబులుగా, కనకాచలంబు నేలకట్టుగా, నవరత్నవర్గంబు రంగవల్లులుగా సుందరంబగు పచ్చ పందిరి, తోరణంబులు, మేలుకట్లు, అమృతరసరసాయనాబ్ధిరూపం బగు పూర్ణకుంభంబులు భానుమండలరూప దర్పణంబులతో గూడి సిద్ధమయ్యెనట. వేదవేది హోమకుండమైయుండెను. అంత హిమవంతుడు హైమవతిని మంగళస్నానంబుచేయించి కైసేయ నియమించి యుద్వాహమండపంబునకు రావించిన నామె వచ్చి నిజజనకు నూరుపీఠంబున నుండెనట. * అంత నీశ్వరుండును అభ్యంగనోద్వర్తన స్నానానంతరంబున నలంకరించికొని రాగా బృహస్పతి " దేవా, లగ్నం బాసన్నం బయ్యె విజయం చేయు" డని చెప్ప హోమద్రవ్యముల బట్టుకొని బ్రహ్మయును, హేమదండచామర

---

* వివాహమునకు బూర్వ మలంకృతయగు వధువు జనకు నూరుపీఠంబున నుండెనని వర్ణించినవాడు నన్నెచోడు డొక్కడే కానబడుచున్నాడు. ఇది "అగ్నైనాం పితురంకా దుద్వహతి, గురోర్వా. అగ్నైనాం దక్షిణే హస్తే గృహీత్వా స్వరథమారోప్య స్వాన్ గృహానానయతి" అను బోధాయన సూత్రమున దెలుపబడిన యాచారమున కనుకూలమైనదిగా నున్నది. వధువు పితురంకమునుండి వరునిచే నుద్వాహము చేయబడుచున్నది గావుననే దీని కుద్వాహము - వివాహము అను పేరు గలిగినది.

ములతో ఇంద్రుడు విష్ణువును, దిగధీశులు, యక్షకిన్నరాదులు వెంటరా వివాహమంటపమునకు వచ్చి "వేదికాతలోపరి దుకూలాంబరాలంకృత మణిపీఠాసనాసీనుండై యున్నంత హైమవతియు దదర్ధంబు నలంకరించినది. అంత బృహస్పతిదత్తసుముహూర్తంబున బరమేష్ఠికృత హోమపురస్సరంబుగా విధివిహిత విధానంబున గిరీశుండు గిరిజను బరిణయం బయ్యె. విప్రఘోషణములు, గంధర్వగానము, వేణువీణానిస్వనము మొదలగునవి చెలగెను. సురభు లభివాంఛితవస్తువు లెల్లవారికి గురిసినవి. తుంబురు, నారదగాన మా యోలగంబున బర్వినది. నందికేశ్వరాది వాద్యనికరంబు లాతోద్యంబులై చెలంగ రంభ నాట్యము సల్పినది. పరమేశ్వరుండు పార్వతీసమేతుండై యుండ, దేవతలు శివుని బ్రార్థించి మన్మథుని తిరిగి బడయగా, మహేశ్వర వివాహోత్సవముతో మనసిజు పునరవతరణోత్సవము కూడ నాపట్టణవాసు లమితోత్సాహముతో జరిపినట్లు చెప్పుచు వసంతోత్సవము నతిచమత్కారముగా కవి వర్ణించినాడు. ఆంధ్రవాఙ్మయమున వసంతోత్సవము నింత విపులముగా, చమత్కారముగా మరి యే కవియు వర్ణించినట్లగపడదు. శివుని వివాహము మన్మథుని పునరవతరణమునకు గారణమగుటచే నీ వర్ణనమున కిచ్చట ప్రసక్తికలిగినది. కాని మన దేశములో పెండ్లి యైదవనాడు బుక్కా వసంతము (కాశ్మీరజలము) మొదలగు వానితో జరుపబడు వసంతోత్సవమున కిదియే మూలమగునేమో విచారింపవలసియున్నది. ఇప్పటికి నీదేశమున నాచారమైయున్న ఈ వసంతోత్సవము నాంధ్రప్రబంధకవు లేల వర్ణింపలేదో!

నన్నెచోడుడు ఈ శివునివివాహవర్ణనాసందర్భమున ప్రత్యేక వివాహమండప నిర్మాణమును వర్ణించినట్లే రంగనాథరామాయణకర్తయు వర్ణించినాడు. సీతాకల్యాణ సందర్భమున జనకుడు లగ్ననిశ్చయము గావించి పురమును, దన యంతిపురమును గైసేయ బరిచారకుల వేగ బంపగా వారు పురమెల్లెడల గైసేసి, యంతఃపురంబంత గరంబొప్ప గైసేయ, "కల్యాణవేది విరచింపు డన" శిల్పవేదు లెంతయును

"బచ్చురాజగతిపై బసిడికంబములు
మెచ్చుగా నిల్పి యామీద నీలంపు
బోదెలు గురువిందముల దూలములును
బాదుగా నిడి – హాటక మణిమయాయతకవాట
వాటంబుగా నాల్గు వాకిండ్లమర్చి [ముల
ఆలోన నేకొండనూ బలుపచ్చ
మేలి పెండ్లి యరుగు మృగనాభి నలికి
ముత్తెంపు నిగ్గుల మ్రుగ్గు తీర్పరచిరి."

అంత దశరథజననాథచంద్రు డాభ్యుదయికము జేసి ఒక్కొక సుతున కభ్యుదయముకొరకు నన్నూరు వేలచొప్పున బదారులక్షల ధేనువుల భూసురోత్తముల కిచ్చి, వసిష్ఠసంయమి లగ్నసమయముం దెలుపగా వర్గ్యయానముల గొడుగులు నడువ, క్రంతలుగొని పుణ్యకాంతలు నడవ, కైసేసి గణికానికాయముల్ నడవ, వేదనాదములతో విప్రులు నడవ, పుడమిరే డప్పుడు పుత్రులు దాను, వనజలోచనలు నివాళిక లొసగ ఖచితోరునవరత్నంబగు నాకల్యాణవేది మచితపీఠంబుల నుండిరట. అప్పుడు "జనకుడు మధుపర్కసమయము దీర్చి,కోమలి దెరమరుగున వేడ్క నిలిపి"అగ్నిసాక్షిగా గొనుమనుచు రామచంద్రునకు ధారవోసెను. అంత సుముహూర్త మని తెరదీయుట, వధూవరుల పరస్పరావలోకనము, రఘువీరుడు చెలికేలుపట్టుట (పాణిగ్రహణము), ఒండొరు లొక్కపీఠమున నుండి హోమము సేయుట, తలంబ్రాలు, లాజహోమము, మునుల దీవనలు, పుష్పవృష్టి, ఆటపాటలు మొదలగువానితో పెండ్లి నాలుగుదినములు నిండినట్లు వర్ణింపబడినది కూతులకు బుద్ధులు గరపి భూషణాంబరము లిచ్చి, యల్లునకరణ మిచ్చి, తక్కినవారి కర్హసత్కారములు చేసి యనుపుటయు నిందు గలదు.

'పరిణయాగార'వర్ణనమును తిక్కనార్యుడును అభిమన్యు వివాహోత్సవవర్ణనసందర్భమున జేసినాడు. విరాటుడు పురంబున నుత్సవంబు సాటించి, నిజమందిరంబునందు రత్నప్రదీపావళి, మణిస్తంభపంక్తి, విచిత్రవితానములు, ముక్తాదామములు,కుసుమమాలికలు,మంగళభూరుహపల్లవతోరణములు మొదలగువానితో గూడిన పరిణయాగారమును చందనముతో నలికించి అణిముత్తియముల మ్రుగ్గులు వెట్టించెనట. అందు వైదికలౌకిక వివిధార్హవస్తుభరముచే వేదిక పొలుపొందునట్లు పురో

హితుడు చేసినాడు. లగ్నం బాసన్నం బగుచువచ్చెనని ధర్మతనయుని కెఱింగింప నాత డభిమన్యునకు శృంగారంబు సేయించి, భద్రగజారూఢుం జేసికొని, యోగ్య వస్తువుల విస్తరిల్లిన క్రంత నడువగా, విప్రాశీర్వాదంబులు మాగధగానంబులు సెలంగ చొత్తెంచిన, విహిత పరిపాటితో విప్రవృద్ధజనులు తెరయొద్ద వధూవరుల నిలిపి "సాంవత్సరికదత్తకాలకళావిశేషంబుల" తెర యెత్తించుటయు, నమ్మానిని యుం గుమారుడును మార వికారము లంకురింపగా నన్యోన్యావలోకనంబు సేసిరి. పిదప తలబ్రాలుపోయుట, తీగబోడి మృదులపాణి పల్లవమును గుమారుండు మెలపుమై గ్రహించుట*, ఏకాసనమున నుండి హోమము చేయుటతో వివాహము నిర్వహింపబడెను. పిదప మత్స్యమహీనాథుండు మణిభూషణంబులు, తాంబూలంబులతోడి పళ్లెరంబుల బచరించి పాండవులకు గట్నిచ్చి సౌభద్రునకు నరణం బిచ్చె. నృత్తగీతాదులతోడను, పరిహాసాదివిలాసముల తోడను రాజమందిరము పరమసంపద్భరితం బయ్యె నని వర్ణించినాడు.

ఇందు పరిణయాగారనిర్మాణమే కాక, క్రంత నడచుట, వధూవరుల నడుమ తెఱపట్టుట-యెత్తుట, తలబ్రాలు పోయుట, బంధువులకు గట్నిచ్చుట, అల్లునకరణమిచ్చుట మొదలగు దేశీయాచారములు గమనింపదగినవి. నన్నిచోడుని రచనలో నివి లేవు. కాని తిక్కనార్యుని రచనలోను, రంగనాథరామాయణరచనలోను నివి సమానముగనే కనబడుచున్నవి. రంగనాథరామాయణమున దేశీయములగు గాథలుకూడ కొన్ని చేరియుండుటచే వివాహవిషయమున దేశీయములగు నాచారములుకూడ నందు బొందుపరుపబడియుండు ననుట సంభావ్యమే. తిక్కనార్యుడు ద్విపదరామాయణకర్తకు బూర్వుడా, పరుడా యను విషయము సందిగ్ధమే యైనను, అతనికి సహజముగ గలిగిన జాతీయతాదృష్టియే భాషావిషయమునవలె సంప్రదాయవర్ణన విషయమునకూడ దేశీయత నాదరించునట్లు చేయుటచే నాతడు దేశీయములగు నీ వివాహసంప్రదాయములను వర్ణించియుండును. కాని దేశీయసంప్రదాయముల నాదరించిన వీరిద్దరి వర్ణనలలోనుగూడ మంగళసూత్రధారణము చేరనేలేదు. కొన్ని విషయములందు రంగనాథరామాయణము ననుసరించినట్లున్న భాస్కరరామాయణమే కారణముచేతనో సీతవివాహసందర్భమున నీ దేశీయాచారములను వర్ణింపలేదు. కాని యీ రెండింటను దశరథుడు సుతుల యభ్యుదయార్థము గోదానము చేయుటనుగూర్చిన వర్ణనమాత్ర మొక్కటీరుననే యున్నది. చూడుడు :

"ఆయతశుభయుక్తి నాభ్యుదయికము
జేయింప నర్థితో జేసి యావిభుడు
ఒక్కొక్క సుతున కభ్యుదయంబుకొఱకు
వెలయంగ నన్నూఱువేల యాలెక్క
గలయ బదాఱులక్షల ధేనువులను
గలధౌతఖురములు కనకశృంగములు
దలకొని చెలువొందు తామ్రపుచ్ఛములు
దొరసి మించిన కాంస్యదోహనంబులును
వరుస వేష్టించిన వరవస్త్రములును
గలిగి సవత్సలై కర మొప్పువాని
లలి భూసురోత్తములకు భక్తి నిచ్చి"
(రం. రా. బాల)

ఇట్లే భాస్కరరామాయణమున—

"అనురక్తి దశరథుం డభ్యుదయార్థమై
నలువురు సుతులకు నాలుగేసి
లక్షలుగా బదార్లక్షల సంఖ్యల
గోవుల గలధౌతఖురము లలర

* కన్నడపంపకవి విక్రమార్జునవిజయమున నర్జునుడు ద్రౌపదిపాణిపల్లవమును గ్రహించినరీతి నిట్లు వర్ణించినాడు :

"ఇడిది రెమంజినొత్తులుగి
తెంకణగాళియొళాదసోంకినో
ళ్నడుగువశోకవల్లరియ
పల్లవదొళ్నవచూతపల్లవం
తొడదఱవోలాగిఘర్మజల
దింనడుపాకెయపాణిపల్లవం
బిడిదుబెడంగనాల్దుదుగు
దాణ్ణనొప్పువపాణిపల్లవం"

గనకశృంగమ్ముల గనకపట్టమ్ముల
దామపృష్ఠంబుల దనర జేసి
గంధమాల్యాంబరకలితలగా జేసి
వత్సలతోఁగూడ వరుస గూర్చి
కాంస్యదోహలములతోడ గరుణ భూసు
రోత్తముల కిచ్చి శోభనాయత్తమతిని
మఱియు బెక్కు సువర్ణముల్ మహిమతోడ
వేదువారల కందంద వేడ్క నొసగి"
(భా. రా. బాల. ౭౩౮)

కాని రం. రా. మున "కల్యాణి సీతఁ గోమలిఁ జెరముఱుంగున వేడ్క నిలిపి, శ్రీరామ నాపుత్రి సీత సధర్మచారిణి గాసుమగ్ని సాక్షిగా నను మధారవోసెను. అంతట సుముహూర్త మని తెరదీయ గాంతనెమ్మోము మున్ననుగొని యలరె" అని కలదు.

భాస్కర రా. న "కనకవితర్దికాతలంబున రాఘవుం బ్రాఙ్ముఖుంబుగా నునిచి జనకుండు సీతం దోడ్కొని తెచ్చి రాముని కభిముఖుంబుగా దనముందరం గూర్చుండ బెట్టికొని యిట్లనియె: 'రామా, యిక్కన్య మహాగుణ శోభిత; నీకుం బరతంత్ర' యని చెప్పి సువర్ణయుక్తంబుగా ధారవోసి పాణిగ్రహణంబు సేయించి యిచ్చిన తదనంతరంబ వధూవరు లగ్నికిం బ్రదక్షిణంబు సేసిరి" అని కలదు. తెరమరుగు భాస్కరుడు తీసివేసినాడు.

అనంతామాత్యుడు భోజరాజీయమున పుష్పగంధిరత్నమండనుల వివాహమును వర్ణించినాడు. వరుడు సుస్నాతుడై యలంకరించుకొని కల్యాణచిహ్నములు కొమరుమిగుల పౌరోహితాదులతో, జయభేరీ ఘంటాదిమహారావముతో "నరుదెంచె వివాహవేదికిఁ." అప్పుడు బిట్టుబిల్లు విభు డాతరుణిం గనుగొన్న "కాముడేమి చేయునో యని తెరయెత్తిరట." పుష్పజాతులు వ్రాలు నాదిగ జైడిపళ్లెరంబులనించుకొనిన పుణ్యసతీనివహంబు కరతలాక్షతపాత్రిక లొప్ప అటు చేరి నేసలిడిరి. అంత శుభలగ్నోదయ సూచకంబగుచు జలంబులందు మునుంగు తామ్రఘటికాపాత్ర నిరీక్షించి మంగళాశీర్వాదపురస్సరంబుగా సుముహూర్తం బనుచు మౌహూర్తికుండు జయఘంటపై నక్షతలు చల్లిన—

"కంగున ఘంటపైఁ గొడుపు
గ్రక్కున వైచుడు మార్కొనాదముల్
నింగియు దిక్తటంబులును
నిండగ విప్రుల వేదనాదము
పొంగి చెలంగుచుండ దెర
పుచ్చినఁ* ముచ్చట వోవజూచి ర
య్యంగజు డార్వ నొండొరుల
యాననపద్మము లాపధూవరుల్"

"అంత బురోహితానుమతి
నక్షతపాత్రలు నేరదేర న
క్కాంతయుఁ గాంతుడుం ముఖవి
కాసము లొప్పగ దోయిలించి య
త్యంతపు బ్రీతి నొండొరుల
యాదలలం దలంబ్రాలు వోసి రం
తంతను మేనులందు బుల
కాంకురజాలము లుల్లసిల్లగన్."

పిదప నాత డాపల్లవపాణిం బాణిగ్రహణంబు చేసి, మణికలితకనకాసనాసీనుండై హోమతంత్రంబు దీర్చి విప్రజనంబుల యాశీర్వచననిచయంబు వడసియుండ నుభయపక్షబంధువులు నాదంపతులకు నంబరాభరణాదుల నిచ్చిరట. పిదప "జామాతృప్రముఖ ప్రభూత్తమజనుల్, హేమపాత్రములం జతుర్విధములై యింపారు నాహారము"లను భుజించిరి.

ఈవివాహమునను తెరపట్టుట, పుణ్యస్త్రీ నివహంబు కరతలాక్షతపాత్రిక లొప్ప నేసలిడుట, వధూవరుల తలంబ్రాలు, పాణిగ్రహణము, హోమము అనునవి ప్రధానములైనవి. కాని యిందు మఱియొక విశేషము మాత్రము గమనింపదగియున్నది. పూర్వకవుల రచనలలో "దేవా, లగ్నం బాసన్నంబయ్యె" నని పురోహితుడు తెలుపుటయే కాని, సుముహూర్తంబును దెలుపగల యంత్రము లున్నట్లెవరును వర్ణించలేదు. అనంతామాత్యుని కాలమునకు గాలమును దెలుపు జలఘటికాయంత్ర మొకటి వాడుకలో నున్నట్లు తెలియు

* వావిళ్లవారి ముద్రితప్రతిలో 'దెరవచ్చిన' యని కలదు. కాని యది 'తెరపుచ్చిన' అనుదానికి అచ్చుపొరపాటని తోచుచున్నది.

చున్నది. "తదుత్సవానందరసనిమగ్నంబగు తద్వధూవరుల వియోగాగ్నిపుంజంబునుంబోలె శుభలగ్నోదయసమయసూచకంబగుచు, జలంబులందు మునుంగు తామ్రఘటికాపాత్రను నిరీక్షించి మంగళాశీర్వాదపురస్సరంబుగా సుముహూర్తం బనుచు మౌహూర్తికుండు జయఘంటపై నక్షతలు చల్లె"నట. అప్పుడు ఘంటపై కంగున గొడుపు వైచినారట. దీనినిబట్టి వివాహములందు సుముహూర్తఘడియను దెలుపు జలయంత్రవిశేష మొకటి కలదనియు, (రంధ్రముగల) తామ్రపాత్ర యొకటి జలమందు మునుగుటచే గడియలు సూచింపబడుచుండె ననియు దెలియుచున్నది. క్రీడాభిరామమునందలి "యంత్రాధీశు మోసాలపై"నుండిన గడియారము సుప్రసిద్ధమేగదా. దాని వెనుక నున్న యంత్ర మెట్టిదో తెలియదు. మఱియొకచో సుశీల యను నామె యొక పిచ్చుకుంటుకు వివాహమైన సందర్భమున నామె వరుని మెడను హారమువైచి తలపై బ్రాలు వోసినట్లు చెప్పినాడు:

"గ్రక్కున వెలువడి తనచే
జొక్కుల గుదివోలె నున్న సురుచిరహారం
బక్కడిపి యుఱితవైచుచు
దక్కక చేతండ్లఁ బ్రాలు తలపైఁ బోసెన్"
(భో. రా. ౫ – ౩౮౧)

ఇక్కడ హారసమర్పణము, తలబ్రాలు వివాహకృత్యము లైనవి. కాని వెనుక తల్లిదండ్రులు చేసిన వివాహవిషయమునగూడ 'మంగళసూత్రధారణము' వర్ణింపబడియుండలేదు.

ఇక శ్రీనాథుని దమయంతీవివాహవర్ణన మతివిపుల మగుటయే కాక విశేష దేశాచార సంఘటితము నైయున్నది. విదర్భమహీవల్లభుడు "సర్వలక్షణ కళాసంపూర్ణమై యుదయాస్త నిర్దోషమై యతిశయిల్లు శోభనాంశము మీరు శోధించి చెప్పుడా" యని పల్కువారు నట్టి లగ్న మరసి చేపట్టి "యాసన్నమయ్యె దేవ శుభముహూర్త" మని చెప్పిరట. కాని వారాసమయము నెట్టి జలఘటికా యంత్రసహాయమున నరసి చేపట్టినట్లు నగపడదు. విదర్భరాజింట ఘటికాయంత్రము లేదేమో. కుమారుని బిలువనంపుట, దమయంతికి వివాహనేపథ్యము గావించుట, అట నలుడును వివాహోచిత శృంగారం బంగీకరించి రథం బెక్కి వివాహమండపంబునకు వచ్చునప్పుడు నృపగృహద్వారభూమి తరుణియునుబోలె

" పేరటాండ్రు హస్త పంకేరుహముల
బూఁచి యెత్తిన కనకంపుఁ బూజెకుండ
లున్నత స్తనములు గాగ నొప్పు మిగిలె" నట.

ఇచ్చట పూజకుండలు - ఐరేనికుండలు - నృపగృహద్వారముననే యుంచబడినట్లు వర్ణింపబడినది. ఇవి వివాహమండపమున నాలుగు వైపుల నుంచుట దక్షిణదేశాచారముగా గనబడుచున్నది. "నాల్గు వంకల నుప్పొంగుచు బూజకుండ లమరెన్ గన్గొంటె" అని యయాతి చరిత్ర (౪ ఆ.). అనంతరంబ వివాహమంటపంబు చేరి సమున్నత కనకాసనంబున నాసీనుండై మధుపర్కపు దేనియ బారణచేసి, 'పావన కౌతుకసూత్రరక్ష' గ్రహించి నెలత చేయి పట్టెను. అంత మామ యల్లునకు మండలాగ్రము, కటారి కత్తులాని తేజీహయము, వీటికా పేటి, గారుత్మతభుక్తిపాత్రము, మణి కాంచన ముఖ్యవస్తువులను పరిణయదక్షిణార్థమయి యొసగెను. వధూవరు లగ్నికి బ్రదక్షిణ మొనర్చుట, అంసుకగ్రంథిక్రియాచారము, ఔత్తానపాది నక్షత్రము చూచుట, యరుంధతిని గనుట, పురపురంధ్రి మంగళాశీర్వచోయుక్త మహిత శోభనాక్షతారోపణము, లాజలను దోయిలించి వేల్చుట, ఒక్క పురంధ్రి నృపాలు చెట్టుబట్టించుట మొదలగునవి జరిగిన పిదప "పురంధ్రీజనవిలోకనార్థంబు సహస్రరంధ్రకృతంబుగా జేయబడిన కౌతుకాగారమున" బ్రవేశపెట్టినాడీ దంపతులను శ్రీనాథుడు. అప్పుడు—

"దశశతాక్షుండు గొడుగు కుందనపు బైడి
కంటకముబోని వేజాలకముల యింటి
మధ్యభాగంబునందు శ్రీమంచ మెక్క
రంబుజాక్షియు నిషధదేశాధిపతియు."

పురంధ్రీజన విలోకనార్థమట యీ దంపతులు మంచ మెక్కుట. వివాహసందర్భమున నీ పురంధ్రులు వధూవరులను జూచియుండరా? ఇట్టి ప్రత్యేకపు జేర్పాటుకు-జాలకములయింట మంచ మెక్కి యుండగా జూచు

టకు గారణమేమో. అప్పటికే భీమరాజు గారియింట స్త్రీలకు ఘోషాపద్ధతి ప్రబలినదని తలంపవలయునా ? లేక యిది రెడ్డిరాజుల యిండ్లలోని యాచారమేమో! పిదప నిరువంక పెండ్లి చుట్టంబులకు భోజనంబులు.

"వెండియొడ్డెనలపై వెలచి తెచ్చిన పైడి పళ్లెంబు"లలో "రంకుమృగరోమకృత నూత్నరత్న కంబళాది నానావిధాభ్యర్హితాసనముల" గూర్చుండి వియ్యంపు మేలంబుల నుభయవిధబాంధవులు నాడుచు జతుర్విధాహారంబులు భుజియింపదొణంగిరి. అం దోదనమునుగూర్చిన వర్ణనము పిండివంటకములు, కూరలు, పాసెము, బూరియలు, లడ్డువంబులు ఆజ్య ఖండశర్కరాదులు, శశిలాంఛనక్రవ్య తేమనంబు, స సమశరకేతన వ్యంజనామృతంబు, జంబీరరసముతో నూనియతో నావంబెట్టిన కిటిముద్రావలయములు, దధిపిండఖండములు, పుల్లపెరుగుతో మిళితమైన యావపచ్ఛళ్లు, పానకములు, మాఱువడ్డనలలోని హాస్యములు మొదలగువాని సూక్ష్మవర్ణనము లాంధ్రదేశీయాచారములను, నాకాలపు రెడ్డిరాజుల వైభవమునే కాక శ్రీనాథుని భోజనప్రియత్వమునుగూడ సూచించునవి వలెనున్నవి. కాని వీనిలో గొన్ని సంస్కృత వైవధ మునసే లేకపోలేదు. పిదప నంపకములు, సుతకుహీత వులు సెప్పాటు, బసవునకు నూరుగ్రామముల నొసంగుటలతో నంపకములైనవి.

ఇందు కౌతుకాగారమున వధూవరులు మంచముపై గూర్చుండుట, బూజముబంతి, భోజనాది వర్ణనలు, అంపకములు మొదలగు విశేషవర్ణనలున్నను, వెనుకటి కవులు వర్ణించిన తలంబ్రాలు లేవు. మంగళసూత్రమును గట్టించలేదు. శ్రీనాథుని కాలమున నీమంగళసూత్రధారణ మాచారముగ లేకపోలేదు. ఈతని కాశీఖండములో అనిమిషేంద్రాది దేవతల యాండ్రకే మంగళసూత్రము లున్నట్లు సూచించినాడు. దక్షాధ్వర సందర్భమున దధీచి యను విప్రర్షి యచ్చటి సభవారిని జూచి,

"ఏమి గుడువంగవచ్చినా రిండ్లు విడిచి
హరుని వెలివెట్టినట్టి యీ యాగమునకు
బంచవదనుని కను జేవురించెనేని
తత్‌క్షణమునంద తమ యాండ్ర త్రాళ్లు దెగవె"

అని చెప్పినాడు. దీనినిబట్టి యప్పటి యాండ్రకు త్రాళ్లుండుటయేకాక "యాండ్ర త్రాళ్లు దెగుట" పురుషులకనర్థసూచక మను విషయముకూడ ప్రసిద్ధమై యున్నట్లు తెలియుచున్నది. శివుని హాలాహలభక్షణము నంగీకరించిన అగజమంగళసూత్రముయొక్క గట్టితనమునుగూర్చి పోతనామాత్యుడు తన భాగవతమున నిట్లు వ్రాసియున్నాడు:

"మ్రింగెడువాడు విభుం డని
మ్రింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో"

(భాగ. ౮–౨౪౧)


ఇట్లాకాలమున నాంధ్ర త్రాళ్లు దెగుననుట యశుభసూచకమనియు, వారి యైదువతనము వారు ధరించిన మంగళసూత్రముపై నాధారపడియుండుననియు నమ్మకము వ్యాపించియుండె నని తెలియుచున్నది.


కాని పోతనామాత్యుడుకూడ రుక్మిణీపరిణయ సందర్భమున నామెకు మంగళసూత్రము కట్టించనే లేదు. అయ్యాదవేంద్రుని నగరంబు సమారబ్ధవివాహ కృత్యంబై సముచితరీతి నలంకృతంబై యుండ "ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్ రుక్మిణిన్"

శ్రీనాథపోతనలతరువాత నాంధ్రప్రబంధరచనా శక్తి వాడుకలోనికి వచ్చినపిదపనే వివాహవర్ణనలలో మంగళసూత్రధారణముకూడ చేర్పబడుచువచ్చిన ట్లగపడుచున్నది. పెద్దనార్యుడు స్వారోచిషమనోరమకు మంగళసూత్రమును గట్టించిన ట్లిదివరకే తెలుపబడినది గదా. ఆముక్తమాల్యదాకారుడుగూడ రంగనాథునిచే గోదాదేవికి మంగళసూత్రము కట్టించెను.

"గళమున గట్టెను హరి మం
గళసూత్రము పులక లతివగాత్రము బొదువన్
నెలతయు బతియును గరముల
నలవరిచిరి కంకణంబు లన్యోన్యంబున్"

మీకు బాగా యిష్టమైన ఆహారములను మీకు అధికశక్తి నొసంగునట్లు చేసుకోండి!







ప్రతి గృహిణి ఏ ఆహార పదార్థములు శక్తి నిచ్చునవో తెలుసికొనవలెను. డాల్డా పాకశాస్త్రమను పుస్తకము (ఇంగ్లీషులో అచ్చువేయ బడినది) 150 ఇండియన్ వివిధ తినుబండారములు తయారుచేయు పద్ధతులతో కూడినది. మిక్కిలి వుపయోగకరమైన విషయములు గలవు. మీకు ఒక కాపీ వుండుట ముఖ్యావసరము. 4 అణాల టిక్కెట్లు *Dept.* C110 *P. O. Box No.* 353, *Bombay*, పంపుడు.

మనకు ప్రియమైన కొన్ని ఆహార పదార్థములు మన ఆరోగ్యమున కేమాత్రము మంచివికావన్న విషయం మీకసలు తెలుసా? అవి ఆకలిమాత్రము తీరుస్తవి — గాని మనము పనిపాట్లవల్ల కోల్పోవుచున్న శక్తినైనా తిర్గి యివ్వజాలవు. ఇది బాగా ఆలోచించ వలసిన విషయమే సుమా; ఏమంటారు? మన ఆరోగ్యము, సంతోషము, పనితనము, యివి అన్నియు మన శక్తిమీద ఆధారపడి వున్నప్పుడు, మనం తినే ఆహారం పూర్తిగా బలాన్ని చేకూర్చలేకపోతే, మనం ఎప్పుడో ఒకప్పుడు మూల పడవలసిందేగా మరీ.

అన్ని పదార్థములు యేదో కొంతవరకు బలాన్ని చేకూర్చగలవు. కాని మనం నిత్యం తినే వాటిలో కొన్ని బలము యేమాత్రము యివ్వలేవనే చెప్పాలి. అటువంటప్పుడు యీ రకపు ఆహార పదార్థములను మంచి పుష్టినివ్వగల యితర పదార్థములతో కలపటంవలన బలము వృద్ధిచేసుకో వచ్చును. ఆహారమును విటమిన్లతోనిండిన డాల్డాతో వండినయెడల దీనికి బాగా తోడ్పడుతుంది. ప్రకృతి సిద్ధముగా బలమును, ఆరోగ్యమును, చేకూర్చగల శక్తి డాల్డా మీకు యివ్వగలదు. డాల్డాతో వండటం చాల మంచి పద్ధతి — మనకు క్షేమకరము.



విటమిన్లతోనిండిన డాల్డా *బలమునకు*

HVM. 34-23-40 TL

THE HINDUSTAN VANASPATI MANUFACTURING CO., LTD.


బాధను శీఘ్రముగా నివారణ చేయును

ఓడ్మన్సు సైప్రెస్ సాల్వు



దీనిగుణము మీకు అత్యద్భుతముగా కన్పించును. పైబాధలకు ఈతైలము వెంటనే ఉపయోగింపుడు. వెన్వెంటనే గుణము కన్పించును.

వాడి చూడుడు - ఉచితము



నరముల బలహీనత, గుండెదడ, వ్యాకులము, తలదిమ్ము, నిస్త్రాణ, హృదయమున నొప్పి, ఇంద్రియనష్టము, వెన్నుపోటు, ఆకలిలేకుండుట మున్నగు దోషములుండిన టపాఖర్చుకు 4 అణాల టపాబిళ్లలు పంపి రెండుదినములకు సరిపోవు ప్రొఫెసరు జేమ్సు ఎలెక్ట్రోటానిక్ పెరల్సు "ఫ్రీపాకెటు" (ఉచితముగా పంపబడుమందు) తెప్పించుకొని వాడి, దాని అద్భుతగుణమును గమనింపుడు.

ఆంగ్లోఇండియన్ డ్రగ్ అండ్
కెమికల్ కంపెనీ, బొంబాయి.

మీ బిడ్డకు లివర్, స్ప్లీన్ (బల్ల) వ్యాధి యున్నచో



తదితర వైద్యశాస్త్రపు మందులు నిరుపయోగముగయుండిన సమయమందు, యాభయంకరముగు లివర్, స్ప్లీను వ్యాధిని జయప్రదముగ నివారణకు తేగల్గినటువంటి ఒక అద్భుతచికిత్స, జమ్మి వెంకటరమణయ్యగారిచే కనిపెట్టబడిన, యీ ఔషధరాజము గత 36 సంవత్సరములలో, వేలకొలది వ్యాధిగ్రస్థ శిశువులను రక్షించింది, భారతదేశమందంతటనున్న సుప్రసిద్ధ వైద్యులచే మిక్కిలి కొనియాడబడినది.

జమ్మిగారి

లివర్ క్యూర్

వాడుడు

అన్ని చోట్ల అమ్మబడును.

జమ్మి వెంకటరమణయ్య & సన్స్

మైలాపూరు, మద్రాసు.

హెడ్ ఆఫీసు: కుంభకోణం. బ్రాంచీలు:- కలకత్తా, బొంబాయి, బెంగుళూరు, తిరుచినాపల్లి, లక్నో, విజయనగరం.

ఇందు మఱికొన్ని దేశీయాచారములు పూర్వకవుల వర్ణనలలో లేనివియు దెలుపబడినవి. గోదాదేవికి "యావకద్రవమున నరుణాంఘ్రినఖపంక్తు లభ్యక్తములు సేసె నతివ యొకర్తు; నలయక వ్రేళ్ల మట్టియలు బిల్లాండ్లిడి పాయవట్టము బెట్టె పై నొకర్తు; కటకములు హస్తసరము లంగదము లంగుళీయకములును బాహువల్లికల వ్రేళ్ల నిలిపి, తాటంకనాసామణుల నమర్చి, చౌనిపె సీమంతవీథి జేర్చుకట్ట యొకర్తు." ఇందు గోదాదేవి కలంకరించిన లత్తుకమట్టెలు, పిల్లాండ్లు, తాటంకములు మొదలగునవి దక్షిణదేశీయాచారప్రసిద్ధము లనవచ్చును. అంత మధుపర్కం బొసంగి, యయ్యాళ్వారు దేవేరియుం దానును ధారవోయ నాకన్యకారత్నంబు బరిగ్రహించిన యనంతరంబు—

"కలధౌతద్రవచిత్రము లైనట్టి యము
క్తాన్యూతమౌ మేచకాం
చలపుం బెండెలి వారి, లగ్నము సమా
సన్నంబుగా వేల్పుఁబె
ద్దలు వంపన్ గుడజీరకంబులు సము
ద్యత్ప్రేమ నన్యోన్యమున్
జాలమస్తంబుల నుంచి రర్థిగనుమిం
చుల్చిట్టుసుత్రాడగన్"

వనమాలిమూడమున మానిని ముత్తెపుబ్రాలు పోసినది. అప్పు డతివగళమున గట్టెను హరి మంగళసూత్రము. పిదప లాజహోమము, సప్తపదులు, అరుంధతీదర్శనము కాగా బ్రహ్మరుద్రాదు లర్పించు నుడుగరలు గైకొని, యతివం దోడ్కొని రంగనాథుడాత్మపట్టణమునకు విజయముచేసెనట.

ఇందు గుడజీరకంబు లన్యోన్యమస్తంబుల నుంచుట మఱియొక విశేషము.

ఇక స్వరోచివివాహమున మఱికొన్ని చిల్లరయాచారములుగూడ వర్ణింపబడినవి. మహీకాంతు నొక దొరనగర విడియించుట. లగ్ననిశ్చయము. విత్తాధిపతికి విజ్ఞానపత్రిక లిఖించి నిజప్రధానుల బంచి నలకూబరు రావించుట. పేరటాండ్రు పాటలు పాడగా ఐదువలు రాజునకు పసుపుల నలుగులిడుట. గొజ్జగినీట మజ్జనము. చంచజ్జరరాహికంచుకము చాయమడుంగుల నొత్తుట. అలంకారము. కదిసెన్ లగ్నమటంచు మంత్రులు దెలుప చౌదంతిపై నారూఢుడై పట్టణంబు వికచాంబురుహాక్షు లుబ్బున జూచుచుండ, వేత్రహస్తుల ప్రశస్తతర సాహోనినాదంబు పెంపొలయ నిరంతరగతి గ్రంతనడవ రాజభవనాంగణంబునకు వచ్చుట. ఇందీవరాక్షు డెదురుసని తోడ్కొని రా, వైవాహికక్రియారంభసంరంభముతో గొలగొలమను కౌతుకాగారము సొచ్చి విద్రుమపాదసువర్ణపీఠిపై గూర్చుండ, పసిడిహరివాణమున మధుపర్కము. జామాత నర్చించి ధారవోయుట. అనంతరము మెట్టుబ్రాల పుట్టికల యెడం గదియంబట్టిన పెందెరను తూర్యములు మొరయ వంచుట. వధూవరుల పరస్పరావలోకనము. తలబ్రాలు. "కట్టెన్ మంగళసూత్రమున్." మణిపీఠి సురీపట్టముపై బఱచి సతీపతుల నందు గూర్చుండబెట్టిరి. నాహుతులను వేల్చుట. లాజహోమము. సనెకల్ మట్టించుట. పేరటాండ్రు చెఱగులు ముడివెట్టుట. ధ్రువారుంధతీదర్శనము. కూరిమిమంత్రితోడ నలకూబరుడేకతమాడి చీరలు హారవిభూషణావళి నారదమౌనిచేత కుబేరుపేరుగా నమ్మగనికి నమ్మనకుం జదివించుట. బాంధవులు వధూవరుల కుడుగర లొసగుట. మామ అల్లునికి గానుకలిచ్చి, కూతు కరణంబిచ్చి, పసుపునకు గొన్ని గ్రామముల నొసంగుట. వచ్చిన బంధువుల కుడుగరలిచ్చి పంపుట.—ఈ మొదలగు వైదిక లౌకికాచార సంపన్నంబై పెద్దనార్యుని స్వరోచిమనోరమా వివాహవర్ణన మిప్పటి యాంధ్రదేశ సంప్రదాయమును సంపూర్ణముగా సూచించుచున్నది.

సామాన్యముగా దరువాతి ప్రబంధములందలి 'పరిణయ' వర్ణనములు దీనిని బోలియే యున్నవన వచ్చునుగాని అచ్చతెనుంగు భాషను రచింపదొడంగిన యయాతిచరిత్రకారుని రచనలో మాత్రము మఱికొన్ని దేశీయాచార విశేషములు ముఖ్యముగా గమనింపదగియున్నవి.

శుక్రుడు యయాతిం జూచి నీకు నిద్దేవయాని జేకొనవచ్చునని యొడంబరచి రాజునుం గూతును దోడ్కొని పీటికిం జనుదెంచునప్పుడు వృషపర్వు డెదురువచ్చి యయాతికి

"పొలుపొ కప్రపసంట్లు కస్తురి మెకం
 బుల్ మేలిజవ్వాదిపి
ల్లులు రాచిల్కలు మానికంబులును జి
 ల్గుల్ మంచిముత్యాల సే
రులు మేల్ బోగపురెంకెముల్ పసిడితే
 రుల్ పల్లకుల్ లోనుగా
నలుపొచేసె"నట.

వివాహనిశ్చయ మైనతోడనే యిట్లు 'ఉలుఫా' కానుకల నొసంగుట ప్రస్తుతము దక్షిణదేశమున నాచరింపబడుచున్న 'నిశ్చితార్థము' అనుదానిం బోలియున్నట్లగపడుచున్నది.

అంత శుక్రుని పనుపున వృషపర్వుడు వీడుకై సేయ బనుచుట. ఊరిలోనివారికి పెండ్లి (పేరంటము) పిలుపు. దీనిని వెఱకటి కవు లెవరును వర్ణించలేదు.

"ఎల్లియసోకుటొజ్జ యత
 డేపున జేయును గూతు పెండ్లియం
చల్లన పైడిపళ్లెరము
 లందును గందముఁ బూలుఁ బచ్చప్రోల్
పెల్లుగ నించి పొల్తుకలు
 పేరటముల్ దగ జెప్పి వీటిలో
నెల్లెడ ప్రిమ్మరం దొడగి
 రింపుగ వాయిదముల్ చెలంగగన్"

వధువున కలంకరణము. మట్టెలు, పిల్లాండ్లు, వీరమద్దియలు, బన్నసరములు, పంజాల కమ్మదోయి, బవిరలు మొదలగు నాభరణము లిప్పుడు వెనుకబడినవి. యయాతిస్నానము. అలంకరణము. "ఎడలేదు లగన మనుచున్-బడిబడి బిలువంగ నపుడు బలువాయిదముల్, గడలుకొనంగా నచ్చర-పడతులు ధవళములు పెండ్లిపాటలు" పాడిరట. ఈసందర్భమున ధవళములు, పెండ్లిపాటలు పాడుట దక్షిణదేశీయాచారమే. ప్రబంధరచనలలో నంతరించినను నాయకరాజులనాటి దక్షిణదేశవాఙ్మయమున - ముఖ్యముగా రంగాజమ్మ మన్నారుదాస విలాసనాటకము మొదలగువానిలో దేశీయములగు నీ ధవళములు, పాటలు విశేషముగా నిలిచియున్నవి. వెలియేనుగు నెక్కివచ్చి రాజువాకిట దిగగా నాతనికి గాళ్లు గడిగి "నెలంత లంత బంగారపుబళ్లెరంబుల వగన్ ననుముత్తెపు ముగ్గులోన నిం పారెడు కెంపుదివ్వియల నారతు లిచ్చి"రట. వాకిట వరుడు నిలిచియుండ నారతులిచ్చుటయు దక్షిణదేశాచారముగనే యున్నది. ఇక కన్యాదానపు తంతంతయు నీకవి "ముక్కలిపీటమీదటన్ గోమలులంత బెండ్లికొడుకుం దగ నుంచిన బొల్పుమీరగా, భామినుకుం దెఱంగునను రక్కసిముజ్జ యొసంగె గూతునున్"అను నొక్క మాటతో ముగింపు చేసినాడు. ఇచ్చట మధుపర్కము చెప్పబడలేదు. అంత దేవయానను "తెరమరుగున నిడి, తెరదిగిచిన సమయంబున "తాళిగట్టె నపుడె తలిరాకుబోడికి పుడమిరేడు వేడ్క గడలుకొనగ" వివాహవర్ణనమున తాళిగట్టించిన తెలుగు కవులలో తెలగనార్యుడే మొదటివాడుగా గనబడుచున్నాడు. తెరదించినతోడనే యన్యోన్యావలోకనాది వర్ణనలను బెంచక తాళికట్టునకు ప్రాధాన్య మొసగినాడు. భాషావిషయమున నచ్చతెనుంగు నీత డాదరించినట్లే యాచారవర్ణనావిషయమునగూడ నచ్చ తెనుగు దేశపుటాచారములనే యాదరింపజొచ్చెనేమో యని తోచుచున్నది. లేదా అచ్చతెనుంగునియమమే యాతని నట్లొనరింపజేసినదా!

పిదప ముత్తియంపు తలబ్రాలు. వేల్పుట. వేల్పులకు మ్రొక్కించుట.

"తగ బ్రాకెనయును దీవిచి
నగవుల పసులైన వెనుక నాలవనాడొ
ప్పౌగ నాగవల్లి నేయగ
బగడపు టుప్పరిగలోన బవతుల వెల్లన్"

పొలుపుదీర్చిరట.

అందు నాల్గు పూజకుండల మీదుగా గలయంజుట్టిన నూలితోడ దివియల్ గవ్వట్టుచున్ జుట్టిరా, నెలతుక లిట్లు ప్రోలు తగ నేర్పు చెలంగగ జేర్చి తీర్చిరట. పిదప గొజ్జగి మేడలోపల కెంపుగోళ్ల సిరిమంచము పై వధూవరుల నునిచి తెలనాకులు బాగాలును పెనిమిటులగూర్చి రైదువయొలనాగలకెల్ల వీడ్యమ్ములిడిరి. పిదప నేలరేండ్లు యయాతికి చదివింపులు. వృషపర్వుడింతికి బసుపున కిచ్చుట. శుక్రుడల్లునకు గానుకలు. కూతునంపకములు. తల్లి బుద్ధులుసెప్పుట లాలించి యనుపుట. శుక్రుని యప్పగింతలు. రాజు

కదలుట. తన వీడు సొచ్చి యేనుగు డిగి పైదలియుం దాను బైడిపల్లేరముల ముత్తైదువ లారతు లీగా దన నగరు సొచ్చెను.

ఇట్లే తెలగనార్యుని వివాహవర్ణనములో మధుపర్కమే కాక లాజహోమము, ధ్రువారుంధతీదర్శనము, సప్తపది మొదలగు వైదికాచారము లేమియు వర్ణింపబడలేదు. వీనినన్నిటిని "తొలివేల్పుమిన్కుల తెఱంగున వేల్పించి"యను వాక్యముతో సరిపెట్టినాడు. పెండ్లికి పేరంటము పిలుచుట, ప్రాకెన, నాగవల్లి, ప్రోలు, మంచముపై మిథునవీడ్యములు మొదలగు తెలుగు దేశపు టాచారములను ప్రత్యేకముగా వర్ణించుటచే నీకావ్యపు 'టచ్చతెనుగు' దనమును నిలువబెట్ట దలచినాడా యని తలంపవలసియున్నది. మఱియు నిచ్చటి వివాహపు కృత్యములన్నియు బోలతులచేతనే నిర్వహింపబడిన ట్లగపడుచున్నదిగాని పౌరోహితుని ప్రసక్తి కానరాదు.

ఇట్లు ఆంధ్రసారస్వతమునందలి వివాహవర్ణనాచారసంప్రదాయపరిశీలన సందర్భమున నన్నపార్యుని ద్రౌపదీ వివాహవర్ణనము మొదలుకొని తెలగనార్యుని దేవయానీవివాహవర్ణనమువరకు నాయాకవుల వర్ణనారీతులు, అందలి చేర్పులు కూర్పులు మొదలగువానిని గమనించియున్నాముగదా. నన్నపార్యుని వైదికాచారసంపత్తికి దగినట్లే ద్రౌపదీవివాహవర్ణనమును వైదికాచారబహుళం బైయున్నదనుట సాహసము కాదు. "ఆంధ్రావళి మోదముం బొరయునట్లు"గా భారతమును "ప్రబంధమండలి"గా రచింపదొరకొనిన 'కళావిదు'డైన తిక్కన భాషాజాతీయవిషయముల దేశీయత నెక్కువగ నవలంబించినట్లే ఉత్తరావివాహవర్ణనవిషయమున వైదికాచారములతోపాటు దేశీయ సంప్రదాయములనుగూడ జేర్చి రచియించినాడనుటయు దబ్బఱకాబోదు. తరువాతికవు లనేకు లీపద్ధతినే సాగించుచువచ్చిరి. కాని కాలక్రమమున నాంధ్రసారస్వతమున నచ్చతెనుగురచనయం దాదరము ప్రబలినట్లే అందలి కవుల వివాహవర్ణనా రీతులలో వైదికాచారవర్ణనముకంటె నచ్చతెనుగుదేశపుటాచారములను వర్ణించుటయం దభిరుచి పెరుగుచువచ్చిన ట్లగపడుచున్నది. యయాతిచరిత్రకారుని రచనలో వైదికాచారములు కేవలస్మరణ మాత్రముచేతనే యెట్లాదరింపబడినవో మనము చూచియేయున్నాముగదా.

ఇంతికంటెను కొంచెము తరువాతివాడగు చేమకూర వెంకటకవి విజయవిలాసమునందలి వివాహవర్ణనములను పరికింతము. వెంకటకవి తరువాతివాడగుటయే కాక తంజావూరి రఘునాథరాయల యాస్థానమున నుండి యీగ్రంథ మాతనికి కృతిగా రచియించుటచే నింకను దక్షిణ దేశీయసంప్రదాయము లిందు మనకు బొడగట్టవచ్చును. ఈ విజయవిలాసమున రెండు వివాహముల వర్ణనలు గలవు. మొదటిది పాండ్యరాజు కూతురు చిత్రాంగదకు, నర్జునునకు జరిగిన వివాహము. రెండవది సుభద్రావివాహము. మొదటిదానిలో తొలుత వివాహార్థమై రాయబారము, ముహూర్త నిశ్చయము, చిత్రాంగదను కొంతలు పెండ్లికూతు జేయుట, ముత్తియపు సేసల్ జవ్వనుల్ సల్ల, విప్రవధూశుభగానలీల శోభిలగ వివాహవేదికకు పెండ్లికుమారుడు వచ్చుట, అవల నల పెండ్లికూతురును రాగా పేరటాండ్రు కొందరు తెరవంచిన నర్జును డతివను జూచుట. అంత

"అంగజరాజ్యం బేలుట
కుం గట్టిన తోరణంబొకో యన నతి డా
శృంగారవతికి గట్టెన్
మంగళసూత్రంబు చతురిమన్ గళసీమన్."

పిదప ముత్యాల్ దోయిటన్ ముంచి యనురక్తిన్ దలబ్రాలు వోయుట. ఈచందంబున గళ్యాణోచితకృత్యంబు లెల్ల నొనరిచిరట. ఇది చిత్రాంగద వివాహము. ఇక సుభద్రావివాహసందర్భమున నర్జును, సుభద్రను పెండ్లికొడుకు పెండ్లికూతును జేయ నపేక్షజెలగి, మంచిలగ్నమున కరపంకజముల గంకణముల గట్టిరట. మేనుల్ మేలిమృగీమదకుంకుమంబులన్ నలుగిడిరి. పేరటాండ్రు ధవళంబుల బాడుచు నల్లభంబులన్ బట్టిరట. అంతర్వాణి పురోహితు డొక డచట జేరియుండ, కిరీటి కొక శంపాంగి సంపంగినూనె యంటి జలకం బార్చి యలంకృతుని జేసెను. అట్లే కన్యకారత్నముగూడ మజ్జనంబొనర్చి యలంకృతయై యుండ —

"నందకుమారానుజయకు
తం దన నందనుడు గట్ట దైవతపతి వే
దక్కం దెచ్చు తాళిబొట్టన
జందురు దరుణరుచిఁ బ్రాగ్దిశకఁ గనవయ్యెన్"

"కులదేవతను దెచ్చి నిలిపిరి మాణిక్య
చకచకల్ గల పెండ్లిచవికెదండ,
ఐరేని గొనివచ్చి రైదువల్ పాటలు
పాడుచు శుభవేళ వేడుకలర,
బులుగడిగిన ముత్తెముల బాసికంబులు
పరవిఁ గట్టిరి నేర్పు సంఘటిల్ల
దలఁబ్రాల కేర్చి ముక్తామణుల్ నింపిరి
పసిడిపళ్లెముల సంభ్రమము మీఱ"

ఇట్లంతిపురమున నుత్సవమయ్యెనట. ముహూర్తము దగ్గఱించెను. మాటలోపలనే మాధవుడును వచ్చెను. అంతలో మహర్షీశ్వరులు, నరుంధతి, శచియును వచ్చిరి. సుముహూర్తం బిది లెండటంచు గురు డచ్చో దెల్ప దేవేంద్రుడు తమ దేశమునుండి తెచ్చిన 'బాసికము' ను సింగారించి, మందారదామము కంఠంబున జేర్చి పెండ్లికొడుకుం బ్రాగ్దంతి నెక్కించుటయు, నాతడు రుక్మిణీదేవి గృహాంగణంబున నైరావతంబుం దిగి ద్విజపురంధ్రులు ముత్తెపునేసలు జల్లగా, కుడిపదము మున్నుగా నిడి గడపదాటి, యారతులొసంగ కల్యాణవేదికడకు నేగెను. అప్పుడు గన్యారత్నమును జనానందంబుగా బాడుచు బేరటాండ్రు పెండ్లిచవికకు తోడితెచ్చిరి. కొందరు మధుకరవేణులు దెర నమర్చిరి. మధుపర్కం బొసంగి వసుదేవుడు పైడిపళ్లెములో బదాబ్జములు గడిగి తన మేనల్లునకు గన్యను ధారవోసెను. అంత వధూవరులను గడానిబంగారపు మెట్టుబ్రాల పుటికలలో గదియించి కొందరైదువలు తెరవంపగా బడతుక మోము గానంబడియె. అంత "సిగ్గుదొట్రిలిన ముఖాబ్జ మెత్తి, మెడక్రిందికి హస్తయుగంబు సాచి, వేనలిఁ దెమలించి, సౌఖ్యకలనస్థితి గట్టిగ బట్టి కట్టె నవ్వేలదుకకంఠసీమ గురువీరుడు మంగళసూత్రమయ్యెడన్," సుభద్రపయి నర్జునా, డర్జునుపై సుభద్రయున్ దని దలఁబ్రాలు వోసిరి. బంగారుపీటమీద కూర్చుండిన వధూవరులకు పాకశాసని దీవించి, సేసలిడెనట. పాలోమీమఘవంతులకు వధూవరుల వందనములు. "వియ్యంపుమర్యాద వేగుజామున శచీజాని బువ్వాన భోజనము చేసె"నట. అంత ఇంద్రాదులకు గట్టనిచ్చి సాగనంపుట.

"ఏల యాలస్య మిక నిందు? బ్రోలుసొచ్చి
నాగవలి సేయుడురుగాక, వేగ గదలి
పొండు దంపతులని ధనుష్కాండరథహ
యంబుల నొసంగి నరుఁబయనంబు నేసె."

కృష్ణుడు ధర్మజానకు శుభలేఖ వ్రాసి చారులచే బంపెను. దేవకీయు సుమూర్తకు ధైర్యము చెప్పి యత్తవారింటికి బంపినది. ఇచ్చట వైవాహికోత్సవము ఐదు నాళ్లును మహామహిమన్ జరిపిరి. ఇట్టి వివాహముల లోను లాజహోమారుంధతీదర్శనసప్తపద్యాచారముల ప్రశంసయే కానరాదు. కాని మంగళసూత్రధారణము, ధవళములు మొదలగు పెండ్లిపాటలతోపాటు బాసికములు, ఐరేనికుండల నమర్చుట, కులదేవతను దెచ్చి పెండ్లిచవికయందు నిలుపుట, కుడిపదంబు మున్నుగా నిడి గడపదాటుట, బంగారపు మెట్టుబ్రాల పుటికలలో వధూవరుల నుంచుట, ప్రోలు (ఇంద్రప్రస్థము) సొచ్చి నాగవలి సేయుట మొదలగు విశేషాచారములు మఱికొన్ని వర్ణింపబడినవి.

ఇట్టి దేశమున ప్రాచీనములగు నార్యాచారములతో దేశీయాచారములు సమ్మేళనము బొందుటచే నేది యెప్పటినుండి ప్రారంభించి యెట్టి మార్పులను బొందినదో తెలిసికొనుటకు వీలులేని స్థితి యేర్పడినను, ఆయా దేశభాగములందలి వాఙ్మయాదర్శంబున ప్రతిఫలించిన ఆయా కాలపు జనుల జీవితపద్ధతులను ఆచారవ్యవహారములను బట్టి పరిశీలించినచో ప్రాచీనార్య సంప్రదాయములకు భిన్నమగు దక్షిణదేశీయ సంప్రదాయములు కొన్ని గలవని మనకు దోచక మానదు. ఇట్లు గ్రహింపదగిన యీ దక్షిణదేశీయములగు వైవాహిక సంప్రదాయములలో నీతాలికట్టు, లేదా మంగళసూత్రధారణ మనుదానికి విశేష ప్రాధాన్యము కలదని వ్యక్తమగుచున్నది.

శాకుంతల విమర్శనము

౩. పాత్రీకరణము (Characterisation)

= శ్రీ నండూరి బంగారయ్య =

పాత్రీకరణము ప్రత్యేకము సముద్రమంత విద్య. కవికి బ్రహ్మత్వమును ప్రతిపాదించు శక్తి ఇదియే. మానవస్వభావమునందలి రహస్యముల నెల్ల అనుసంధించి కవి తన పాత్రల ముఖమున సృష్టికి ప్రతిసృష్టి చేయుటయే ఈవిద్యకు పరమావధి. పాశ్చాత్య విమర్శకుల మతమున పాత్రీకరణశక్తి లేనివాడు నాటకరచనమునం దనధికారి యనియే. కాని మన యలంకారశాస్త్రములం దీశక్తినిగూర్చిన ప్రసక్తియే కానరాకుండనున్నది.

అంతమాత్రమున మన కవుల కీవిద్య యపరిచితమని భావింపరాదు. దృశ్యప్రబంధములందును, శ్రవ్యప్రబంధములందునుగూడ ఈవిద్య నత్యచ్ఛదశకు గొనిపోయిన 'కవిబ్రహ్మ' లెందరో తెనుగునను, సంస్కృతముననుగూడ ఉన్నారు. ఆంగ్లకవులలో షేక్స్పియరు ఈవిద్యకు అందెవేసిన చేయి. బెర్నార్డుషా మున్నగు నవీనవిమర్శకులు షేక్స్పియరు నెంత నిరసింపజూచినను ఇప్పటికిని పాత్రీకరణశక్తిలో షేక్స్పియరునుమించిన చేయి ఆంగ్లసారస్వతమున నుదయింపలేదు. అయితే ఈ షేక్స్పియరుకు ఎంతమాత్రము దృష్టియైన ప్రసరింపని దివ్యభూములలో సంచరించుచు 'బాణోచ్ఛిష్ట మిదం జగ' త్తనినట్లుగ పాత్రీకరణవిద్య యను సముద్రము నాపోశనముపట్టిన యగస్త్యులు సంస్కృతములో వ్యాసుడు; తెలుగులో తిక్కన. ఈయిరువురు షేక్స్పియరుకు ఏయే శక్తులలో నతీతులో నిరూపించుటకు సాధనము లున్నవి. కాని ఇది యదనుకాదు. మొత్తముమీద వ్యాసుడు, తిక్కన, షేక్స్పియరు–ముగ్వురును ఒకే తరగతికి చెందిన పాత్రీకరణకారులు. అనగా ఈముగ్వురికిని యథార్థప్రదర్శనము (Objective presentation) అనునదియే గమ్యస్థానము. నేను చదివినంతలో సంస్కృతదృశ్యప్రబంధకారులలో పాత్రీకరణమున యథార్థప్రదర్శనము నే తలపెట్టినవాడు మృచ్ఛకటికము రచించిన శూద్రకుడు. ఈతనికిని, పైముగ్వురకును ఎంతో యంతర మున్నను మొత్తముమీద తరగతిమాత్ర మొకటి.

యథార్థప్రదర్శనమని, ఆదర్శీకరణ (Idealisation)మని, జాతిలక్షణనిరూపణ (Typification) మని మన మెరిగినంతవరకు పాత్రీకరణము మూడు తరగతులుగ గానవచ్చుచున్నది.

యథార్థప్రదర్శన మనగా మానవప్రకృతిని ఉన్నదున్నట్లుగ చిత్రించి యానందింపవలె నను నుద్దేశముతో చేయబడు పాత్రీకరణము. ఏమనుష్యుని యందుగాని గుణదోషములు రెండును మిశ్రితము లయి యుండునుగాని కేవలము గుణమేగాని, కేవలము దోషమేగాని మూర్తీభవింపదు. కైవల్యము నిరుపాధికము. అందుచే నుపాధిలో నున్న పాత్రమును–అవతారపురుషుడు మొదలుకొని అణువువరకు—దేనిని చిత్రించినను గుణదోషమిశ్రితముగనే చిత్రింపవలసి యుండును. అట్లు చిత్రించుటనే యథార్థీకరణ మందురు.

ఇదిగాక మరిరెండు తరగతుల పాత్రీకరణము కూడ మహాకవులలో గానవచ్చుచున్నది. అందు ఆదర్శీకరణ మను విద్యకు కాళిదాసు లక్ష్యము.

"సో౽హ మాజన్మశుద్ధానా మాఫలోదయకర్మణామ్
ఆసముద్రక్షితీశానా మానాకరథవర్త్మనామ్
యథావిధిహుతాగ్నీనాం యథాకామార్చితార్థినామ్

యథాపరాధదండానాం యథాకాలప్రబోధినామ్
త్యాగాయ సంభృతార్థానాం సత్యాయ
మితభాషిణాం
యశసే విజిగీషూణాం ప్రజాయై గృహమేధినాం
శైశవేభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణామ్
వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజామ్."

అను శ్లోకములలో ఆదర్శీకరణమే తన కభిమతమైనట్లు కాళిదాసే వ్యక్తపరచుచున్నాడు. తన పాత్రములలో నెక్కడను లోపములు లేనట్లుగ సంస్కరించి లోకమున కాదర్శప్రాయముగ చిత్రించుటయే ఈ తరగతి పాత్రీకరణమునకు ప్రధానము. కాళిదాసుని నాటకత్రయమునందును, రఘువంశకుమారసంభవము లందునుగూడ ఈ యాదర్శీకరణమే ప్రత్యక్షమగు చున్నది.

జాతిలక్షణనిరూపణ మని వేరొకతరగతి పాత్రీకరణమునకు ప్రత్యేక మొక జాతినంతను గైకొని దూషించుటగాని, భూషించుటకాని అభిమతము. ఒక సోషలిష్టు నాటకము వ్రాయుచున్నా డనుకొనుడు. అందు ఒక పాత్రమును క్యాపిటలిష్టుల లక్షణముల నన్నిటిని నిరూపించుదానినిగను, వేరొక పాత్రమును సోషలిష్టుల లక్షణముల నన్నిటిని నిరూపించుదానిని గను చిత్రించి క్యాపిటలిష్టులందు ద్వేషమును, సోషలిష్టులపట్ల అనురాగమును ఉదయింపచేయుటయే కవి ముఖ్యోద్దేశమై యుండును.

ఆదర్శీకరణము, జాతిలక్షణనిరూపణముగూడ సాధారణముగ యథార్థమునకు దూరముగ నుండును. తమ కభీష్టములగు నాదర్శములను ప్రతిపాదించుట కయి ఆయాకవులు ప్రకృతిని అతిశయోక్తికి తావలముగ చిత్రింతురు. క్యాపిటలిష్టు లని కవి యనుకొన్న జాతియంతయు పిశాచగణమై, సోషలిష్టు లనుకొన్న వారందరు దేవగణమై ప్రవర్తింపరు. సమ్యగ్దృష్టివిహీనులకు మనస్సులోని భావములు ప్రకృతిలో నధ్యాసితమగుచుండునుగాని వాస్తవమున కవి నిష్పాక్షికముగ పరీక్షించు సమచిత్తుల దృష్టికి గోచరింపవు. అందుచే నీరెండుతరగతుల పాత్రీకరణమును అంతగ ప్రశస్తము కానేరదు.

ప్రకృతము విమర్శనీయమగు శాకుంతలమున నున్న పాత్రీకరణములో ముప్పాతికమూడువంతులు ఆదర్శీకరణమే. శకుంతలాదుష్యంతులను గైకొందము. నాటకమునందలి పాత్రములను భారతమునందలి పాత్రములతో పోల్చిచూచినచో నాదర్శీకరణ మన నేమో మనకు మరింత విస్పష్టమగును. కాళిదాసునాటకమునకు మూలము భారతమునందలి శకుంతలోపాఖ్యానమే కదా! అయినప్పుడు శకుంతలోపాఖ్యానమునందలి పాత్రములను యథామాతృకముగ తన నాటకములలో చిత్రించినాడా? లేదు. అట్లు చిత్రించియుండినచో దుష్యంతుని యందు దోషమారోపితము కావలసివచ్చుచున్నది. మూలమున కణ్వాశ్రమమునుండి శకుంతల రాజసభకు వచ్చినపుడు ఆమె నెఱిగియుండియు ఎరుగనివానివలె నటించి వాక్పారుష్య మవలంబించినా డని యున్నది. ఎంతో నమ్మించి గాంధర్వవివాహమున కొడబరచిన శకుంతలను ఎవ్వరును సాక్ష్యము లేరుగదా యనిన యంశమును ఆధారముగా గైకొని ప్రజాభిప్రాయమునకు వెఱచి "నీ వెవ్వతెవో నేనెఱుగనుపొ"మ్మనుటలో దుష్యంతుని వర్తనము మిక్కిలి నీచముగా గనవచ్చుట లేదా? మొదట నామెను తనతో సంగమమున కొడబరచుటలో కేవలము స్వలాభముమాత్రమే చూచుకొన్నాడు. లోపల తొందరపెట్టుచున్న కామమును కాదనలేక పోయినాడు. "కరుణానిరతులయిన మాజనకుల నడిగి నన్ను పాణిగ్రహణము చేసికొను"మని వివేకవతి యగు శకుంతల యెంత చెప్పినను వినకపోయినాడు. తీర నలుపురిలోనికి వచ్చుసరికి తన గాంధర్వవివాహము నొప్పుకొనుటకు ధైర్యము లేకపోయినది. శకుంతల యెట్లును తన మాహాత్మ్యముచే సత్యమును నిరూపించుకొనగలదు గదా యనిన ధైర్యముతో నట్లు వర్తించినా డని సమర్థింపవచ్చునుగాని ఆసమర్థనమైనను దుష్యంతుని పాత్రమున కెంత గౌరవముగ నుండునో చదువరులే గ్రహింపగలరు. కాళిదాసునకు దుష్యంతునియం దీలోపము నిరూపించుట యిష్టము లేకపోయినది. అందుచే దూర్వాసుని శాపవృత్తాంతము గల్పించినాడు. శాపవశమున సమ్మోహితుడై శకుంతలను నిరాకరించినాడేగాని లేకుండిన అతడట్టి పని కొడంబడని ఆదర్శపురుషుడని చిత్రించుటయే కాళిదాసుని యుద్దేశము. అందుచే

దుష్యంతుని పాత్రచిత్రణమున ఆదర్శీకరణ మను విధానము విస్పష్టమగుచున్నది. దుష్యంతుని సమర్థించు సందర్భమున శకుంతలను నెపపెట్టుటకూడ కాళిదాసున కభిమతముకాదు. అందుచే ఆమెపైకూడ దోష మారోపితము కాజాలని ప్రక్రియ వెదకవలసివచ్చినది. ఎంత కాలమును పతియొద్దనుండి వార్తయే రానందున ఆమె శరీరమే మరచిపోయి తదేకదృష్టితో నాలోచించుచున్నట్లు చిత్రించినాడు. అట్టి స్థితిలో దూర్వాసుడు వచ్చినాడో పోయినాడో చూడకపోవుటలో నామెకు స్వాతంత్ర్య మేమున్నది? ఇక ఆమెయందు మాత్రము దోష మెట్లు నిరూపితముకాగలదు? ఇట్లు—

"త్వమర్హతాం ప్రాగ్రసరః స్మృతోఽసి నః
శకుంతలా మూర్తిమతీవ సత్క్రియా,
సమానయం స్తుల్యగుణం వధూవరం
చిరాయ వాక్యం నగతః ప్రజాపతిః"

అను కణ్వవాక్యమున కనుగుణముగ కాళిదాసు శకుంతలాదుష్యంతులను చిత్రించుకొనివచ్చినాడు.

"ఈశకుంతలాదుష్యంతుల చిత్రణము మూలమునందలి యనౌచిత్యములను పరిహరించుచున్న" దని మాత్రము చెప్పరాదు. మూలమున ననౌచిత్యము నారోపించుటకే వలనుపడదు. చిత్రించు పాత్రములో—అది నాయకపాత్రమే కానిండు— ఎక్కడను ఏలోపమును లేకుండ చిత్రింపవలె నను బాధ్యత కవి కెన్నడును లేదు. భారతమునందలి పాత్రీకరణము స్వభావమునకు సన్నిహితముగ నున్నది. జగన్మోహనమూర్తియగు శకుంతలను చూచి దుష్యంతు డుద్రిక్తుడగుటయు, తరువాత ప్రజాభిప్రాయమునకు వెరచి విపరీతవర్తనుడగుటయు సహజము. అది పాత్రములో, అనగా దుష్యంతుని శీలమునకు లోపమే కావచ్చును. కాని పాత్రీకరణములోమాత్ర మనౌచిత్యము కానేరదు. దుష్యంతుడు సద్గుణసముద్రుడే. కాని ఈ యొక్క యంశమునమాత్రము విపరీతముగ వర్తించినాడు అని నిరూపించుటయే భారతకారుని యాశయము. అతని చిత్రణము యథార్థమునకు సన్నిహితముగ నున్నది కావున దానిని యథార్థప్రదర్శన మంటిమి. కాళిదాసు శకుంతలాదుష్యంతులలో లోపలేశమైనను లేకుండ చిత్రించుటకు పాటుపడినాడు కావున అతని చిత్రణమును ఆదర్శీకరణ మనవలసివచ్చుచున్నది.

ఈ యాదర్శీకరణ మింకొక ఘట్టమునకూడ ప్రత్యక్షమగుచున్నది. అది శకుంతలాపాత్రమునకు సంబంధించినది. మూలములో ప్రత్యాదేశించినపుడు శకుంతల దుష్యంతుని అనరాని మాట లన్నది. "ఇట్టి యనృత మాడుచున్నందులకు నీతల వేయిచెక్కలుగావలదా?" అని శపించునంతదూరముకూడ పోయినది. కోపము వచ్చినపుడు ఒడలు మరచి మాటాడుట యథార్థమునకు సన్నిహితము. కాని కాళిదాసు ఈఘట్టమున శకుంతలచే దుష్యంతు నంత పరుషముగ తిట్టింపలేదు. తన భాగధేయమునే నిందించుకొనుచు, "భగవతి వసుమతి దేహి మే వివరమ్" అని యామె సభనుండి వెడలిపోయినది. పతివ్రతయయిన శకుంతలచే భర్తను దూషింపచేయుటకు కాళిదాసు డొప్పికొనలేదు. ఈ యంశమునుగూర్చి నాటకమును మూలముతో సరిపోల్చు ఘట్టమున నింకను దీర్ఘమగు చర్చ యున్నది గాన ప్రకృతము విరమింతము. ఈఘట్టమునకూడ "భారతమునందలి యనౌచిత్యమును కాళిదాసు పరిహరించినా" డనిమాత్రము వ్రాయవ్వరాదు. శకుంతలోపాఖ్యానమునందలి పాత్రీకరణము ఒక పద్ధతి నవలంబించినది; కాళిదాసుని పాత్రీకరణము వేరొక మార్గమున బోయినది.

ఈ యాదర్శీకరణమున ముఖ్యముగ సిద్ధించు ననర్థ మేమనగా, నది విశ్వాసమును గొలుపనేరదు. చిత్రణమును చూచినపుడు "ఇది నిజమే" యనిపింపదు. కాని కాళిదాసునిలోని విశేష మేమనగా, ఆదర్శీకరణముకూడ యథార్థప్రదర్శనమా యను విభ్రాంతి యుదయింపజేయజాలిన కౌశలముతో నాత డాదర్శీకరణము నిర్వహించినాడు. ఒక్క శాకుంతలమునందే కాదు— కుమారసంభవమునందు, రఘువంశమునందుకూడ నంతే. చిత్రించిన పాత్రములందు ఆదర్శీకరణము నిరూఢము. కాని ఆస్వాదించు చదువరికిమాత్ర మవి సజీవములయి చైతన్యసంపదతో నలరారుచుండును. ఇట్లు చేయగల్గుట మిగుల నపురూపమే.

కాని ఒకొక్కొక్క ఘట్టమునమాత్రము కాళిదాసుని చిత్రణములనుగూర్చికూడ విశ్వాసరాహిత్యతీర్మానమును ప్రవేశపెట్టవలె నని బుద్ధిపుట్టుచుండును. అట్టి ఘట్టములు శాకుంతలమునందుకూడ లేకపోలేదు.

"శిష్యః:—అహో! మహానుభావః ఖలు పార్థివో దుష్యంతః, యత్ప్రవిష్టమాత్రఏవాశ్రమపదం అత్ర భవతి రాజని నిరుపప్లవాని నః కర్మాణి సంవృత్తాని.

కాకథా బాణసంధానే జ్యాశబ్దేనైవ దూరతః
హుంకారేణేవ ధనుషః స హి విఘ్నా నపోహతి"

అను భాగమును చదువునపుడు మన కంత మాత్రము నమ్మక ముదయించుట లేదు. ఇట్లే—

"కంచుకీ:—నకిల ప్రసితం యువాభ్యాం యథా వాసంతికైః తరుభిరపి దేవస్య శాసనం ప్రమాణీకృతం; తదాశ్రయిభిః పత్రిభిశ్చ? తథాహి—

చూతానాం చిరనిర్గతాపి కలికా
బధ్నాతి న స్వం రజః
సన్నద్ధం యదపి స్థితం కురబకం
తత్కోరకావస్థయా
కంఠేషు స్ఖలితం గతేపి శిశిరే
పుంస్కోకిలానాం రుతం
శంకే సంహరతి స్మరోఽపి చకిత
స్తూణార్ధకృష్టం శరమ్."

అను భాగముకూడ విశ్వాస ముదయింపజేయునదిగా లేదు. శకుంతలాపాత్ర చిత్రణమునకూడ—

"క్షౌమం కేనచి దిందుపాండుతరుణా
మాంగల్య మావిష్కృతం
నిష్ఠ్యూత శ్చరణోపభోగసులభో
లాక్షారసః కేనచిత్,
అన్యేభ్యో వనదేవతాకరతలై
రాపర్వభాగోత్థితై
ర్దత్తా న్యాభరణాని తత్కిసలయో
ద్భేదప్రతిద్వంద్విభిః"

ఇత్యాదిభాగములు విశ్వాసజనకములుగ లేవు. కాని మొత్తముమీద నవి దుష్యంతపాత్రచిత్రణమునందలి కొన్ని యతిశయోక్తులు పట్టుబడునంత సులభముగ పట్టుబడుట లేదు. ప్రధానపాత్ర చిత్రణముననే కాదు—

"సహజంకిల యద్వినిందితం
నఖలు తత్కర్మ వివర్జనీయమ్
పశుమారణకర్మదారుణః
అనుకంపామృదురేవ శ్రోత్రియః"

"ఇది పల్లెవాడు పలికిన వాక్కు కానేరదు. ఇందు కాళిదాసు సులభముగ దొరకి పోవుచున్నాడు" అనిపించుచున్నది. కవి యెప్పుడును తన పాత్రముల ద్వారా మాటాడుచు నుండునే యనుకొనుడు. కాని పట్టుబడరాదు. అందులోనే కళాప్రాగల్భ్య మున్నది.

కాళిదాసు మానవమాత్రులగు దుష్యంతాదులను చిత్రించుటలోకూడ వారికి దైవమహిమ నారోపించి యాదర్శీకరించుచుండగా వాల్మీకి మున్నగు మహర్షులు అవతారపురుషులను చిత్రించుటలోకూడ సాధ్యమయినంతవరకు వారి మహిమలను దూరముగ నుంచి వారిని మానవమాత్రులుగనే చిత్రించుటకు పాటుబడిరి. అందుచేతనే వారు కాళిదాసునికంటె ఎన్నియో మడుంగులు ప్రశంసింపదగిన ఉత్తమశిల్పు లగుచున్నారు. ఆదర్శీకరణము విశ్వాస ముదయింపచేయదను రహస్యమును వారు పూర్ణముగ గుర్తించినవారగుచున్నారు.

ఆదర్శీకరణమునందు ఇంకొక అనర్థముకూడ గోచరించుచున్నది. తాను ఉచిత మనుకొనిన యాదర్శమునకు సృష్టిలోని యుదంతములు అనుగుణముగ లేవని గదా ఆదర్శీకరణకారుడు సృష్టియందలి నిమ్నోన్నతములను సవరింపజూచుచున్నాడు? ధర్మరాజు అసత్య మాడినా డనుకొనుడు. ధర్మరాజువంటి ఉత్తమునిచే నసత్యమాడించుట యనుచితముగ దోచి దానిని ఆదర్శీకరణకారుడు పరిహరింపజూచుచున్నాడు. అదే యథార్థప్రదర్శకు డయినచో ఎట్టి యుత్తమస్వభావము గలవాడుకూడ ఒకొక్కప్పుడు అబద్ధమాడుట లోకములో నున్నదేకదా యని యథాతథముగ చిత్రించుచున్నాడు. సృష్టియందలి నిమ్నోన్నతముల నున్నవాని నున్నట్లుగనే చిత్రించి వాని రహస్యములను

కనుగొనబూనుటవలననే కళ ప్రత్యమునకు సన్నిహితముగ నుండి ఎక్కుడును గాంభీర్యమును సాధించుచున్నది. ఆదర్శీకరణమునందలి యౌచిత్యనిర్వహణ మొక్కొక్కప్పుడు కవిసమయము (Convention) కంటె నెక్కువ స్థానము నాక్రమింపలేకపోవుచున్నది.

శాకుంతలమున ప్రధానపాత్రములు ఎక్కుడుగ ఆదర్శీకరణమాత్రమునకే లక్ష్యభూతము లగుచున్నను కొన్ని యథార్థప్రదర్శనములోగూడ జేరుచున్నవి.

కణ్వుని పాత్రచిత్రణమును గైకొందము. ఈతడు కులపతి.

"రాజా—అథ భగవాన్ లోకానుగ్రహాయ కుశలీ కాశ్యపః?

శార్ఙ్గరవః—స్వాధీనకుశలాః సిద్ధిమంతః."

ఇత్యాదివాక్యములవలన గుణాతీతుడగు సిద్ధపురుషుడు. కాని ప్రప్రథమమున మనకు ప్రత్యక్షమగుటలో లలితమైన విషాదముతో ప్రత్యక్షమగుచున్నాడు.

"యాస్యత్యద్య శకుంతలేతి హృదయం
సంస్పృష్ట ముత్కంఠయా
కంఠః స్తంభితబాష్పవృత్తికలుష
శ్చింతాజడం దర్శనమ్
వైక్లబ్యం మమతావ దీదృశమహో
స్నేహా దరణ్యౌకసః
పీడ్యంతే గృహిణః కథంను తనయా
విశ్లేషదుఃఖైర్నవైః"

ఈ లలితమైన విషాదమే ఈ పాత్రమునకు ప్రాణము. శకుంతలకు తలిదండ్రు లుండియు లేనివారైరి. కాశ్యపులయినను 'శాశ్వతబ్రహ్మచర్యనిష్ఠితు' లగుటచే తలిదండ్రుల ఇరువురి ప్రేమను తమ హృదయమునుండియే స్రవింపజేయవలసినవారైరి. కేవలము సిద్ధపురుషులుగ—అనగా సామాన్యమానవులకు అతీతమగు భూమలలోనుంచి—వారిని చిత్రింపక గృహస్థులందరికిని అనుభవైకవేద్యము మగు మంగళవిషాదభారముతో వారిని కాళిదాసు ప్రత్యక్షీకరించుచున్నాడు. ఈ మంగళవిషాదము కణ్వుని పాత్రమునకేగాక చతుర్థాంకమునకెల్ల ప్రాణపద మగుచున్నది.

"శమ మేష్యతి మే శోకః
కథంను వత్సే త్వయా రచితపూర్వమ్,
ఉటజద్వారవిరూఢం
నీవారబలిం విలోకయతః"

"అర్థోహి కన్యా పరకీయ ఏవ
తా మద్య సంప్రేష్య పరిగ్రహీతుః
జాతో మమాయం విశదః ప్రకామం
ప్రత్యర్పితన్యాస ఇవాంతరాత్మా"

పెంచి పెద్దదానిని జేసిన కూతురి వియోగమునకై విషాదము. కాని ఆమె పతిని జేరబోవుచున్న శుభసమయమునోకంట తడిపెట్టరాదే యను సంకోచము. ఈ భావముల సంఘట్టనము గృహస్థు లెల్లరకు అనుభవవేద్యమేగదా! ఈ భావములను చతుర్థాంకమున కాళిదాసు మూర్తిభవింపజేసి మానవహృదయమును చూఱగొనుచున్నాడు. మానవహృదయము నింతగ నాకర్షించు ఘట్టము వేరొకటి ఈ నాటకమున లేదు. అందుచేతనే కొందరు విమర్శకులు చతుర్థాంకమునకును, శ్లోకచతుష్టయమునకును ప్రాముఖ్య మిచ్చుటకు కారణమైనది.

శార్ఙ్గరవశారద్వతుల చిత్రణముకూడ యథార్థప్రదర్శనమునకే జేరుచున్నది. వీరిరువురు బహుశః ఆశ్రమముననే పుట్టి పెరిగియుందురు. అందుచే నగరము ప్రవేశింపగనే—

"తథాపీదం శశ్వత్పరిచితవివిక్తేన మనసా
జనాకీర్ణం మన్యే హుతవహపరీతం గృహమివ.
అభ్యక్తమివ స్నాతః
శుచి రశుచిమివ ప్రబుద్ధఇవ సుప్తమ్
బద్ధమివ స్వైరగతి
ర్జనమిహ సుఖసంగిన మవైమి."

అని పలుకుచున్నారు. పైనుదాహరించిన శ్లోకములు వీరి పాత్రమునకు కీలకములు. నగరములో ప్రవేశించినదిమొదలుకొని ఈనగరమును వీడి మరల ఎప్పుడు ఆశ్రమమును జేరుకొందమన్న యాత్రతయే కాని "వచ్చిన పని యేమి? దానికి తటస్థించిన యాటంకమేమి? దీనిని చక్కబెట్టుకొను నుపాయ మేమి?" అను నాలోచనము వీరికి లేకపోయినది. అందుచే

ఎఱ్ఱ బట్టను జూచి బెదరిన పశువులవలె వీరు ఒకవైపు రాజును, ఇంకొకవైపు శకుంతలను చెడమడ దిట్టుచున్నారు: "కిముత్తరోత్తరేణ? అనుష్ఠితో గురునిదేశః. ప్రతినివర్తామహే వయమ్" అని శకుంతలకాపురమును పొత్తుపరుపకుండ వెనుకకు మరలుచున్నారు. వీరు తొందరపడు నాత్రగాండ్రు కాకుండిన శకుంతల కాపురమంత శీఘ్రముగ చెడిపోయియుండదేమో. అయితే వీరి హృదయములు మంచివి. మాటమాత్రము మోటు. లోకజ్ఞానము పూర్ణముగ శూన్యము—ఇట్టి పరస్పరవిరుద్ధగుణములను వీరిలో సంపుటీకరించి కాళిదాసు మనకు హర్షప్రదుడగుచున్నాడు.

ఇక శకుంతలచెలికత్తెలగు అనసూయాప్రియంవదలను చిత్రించిన విధానమునుగూడ గొంత విమర్శింపవలసియున్నది. వీరి చిత్రణమును తిలకించునపుడు ఇది యాదర్శీకరణమా, యథార్థప్రదర్శనమా యను ప్రశ్నము మనకు రాదు. శకుంతలపై గంభీరమైన యనురాగముతో ఆమెకు ప్రియసమాగమమును సంఘటించు నైపుణ్యముతో ఆమెతో లలితములగు, నర్మగర్భితములగు, ఆశ్రమవాసులకు అనుచితములుకాని హాస్యోక్తులతో క్రీడించు మానసికోల్లాసముతో, చమత్కృతితో వీరు ప్రత్యక్షమగుచున్నారు.

"సఖ్యౌ:—సఖి శకుంతలే, యద్యద్య తాతః సన్నిహితోభవేత్......"

అను పరిహాసగర్భితవాక్యమును దిలకింపుడు. దీనికి శకుంతలకు కోపము రాగానే ఆవాక్యమునకు మొదట ఉద్దేశించిన గమనమును మార్చుకొని "ఇమం జీవితసర్వస్వే నాప్యతిథిం కృతార్థీకరిష్యతి" అని త్రిప్పివేయుటలో నున్న చమత్కృతిని గమనింపుడు. ఇప్పటికిని అందులో గర్భీకృతమైయున్న ధ్వనిప్రాగల్భ్యమున కానందింపుడు. యౌవనమునకు, సౌందర్యమునకు, చమత్కృతికి సార్వభౌమపదము నధిష్ఠించిన మదముతో — మానసికోల్లాసముతో ఈ పాత్రములు కందుకములవలె తూలుచున్నవి. "కే ఆవామ్ పరిత్రాతుమ్? దుష్యంత మాక్రంద. రాజర్షే తాని తపోవనానినామ." అని కెవ్వన కేకలువేయుచు కిరుచున్నవి. ఇట్టి పాత్రచిత్రణ మప్రధానపాత్రముల నాశ్రయించినది గాని నాటకమంతయు నిట్టి పాత్రచిత్రణముతోనే నిండియుండిన శాకుంతలము ఇప్పటికంటెను మిక్కిలి మనోహరముగ నుండియుండెడిది గదా!

ఒక పాశ్చాత్యవిమర్శకుడు 'కాళిదాసునుగూర్చి "He is the Shakespeare of the Indian Drama" అని పలికినాడని మనవారు తబ్బిబ్బయిపోవుచున్నారు. కాని ఈవాక్యమునందు విమర్శనపాటవము శూన్యమనుటకు ఈ పాత్రీకరణపరిశోధన మొక యాధారము. కాళిదాసును, షేక్స్పియరును ఒకజాతికవులు గారు. ఇరువురును నాటకములు రచించినవారేగదా యను స్థూలదృష్టి ననుసరించి ఇరువురను ఒండొరులతో పోల్చజూచుట సాహసము. తాత్త్వికముగ ఇరువురును ఒకజాతికి చెందిన కవు లయినపుడే ఒండొరులతో పోల్చి విమర్శించుటకు వలనుపడును. "Comparisons are always odious" అని కవుల నొకరితో నొకరిని పోల్చనేరాదను వాదము నాకు సమ్మతముకాదు. ఇకముందు వాఙ్మయమునందును, లలితకళలందును జరుగవలసినది సమవిమర్శనమే (Comparitive criticism). దీనివలన ఎన్నియో అమూల్యరహస్యములు కళారాధకులకు గోచరింపగలవు. కాని సరిపోల్చునపుడు ఏకజాతికవులనే సరిపోల్చుట అభ్యుచితము. ఏర్పరచుకొన్న ఆదర్శములందును,అవలంబించిన విధానములందును కాళిదాసును, షేక్స్పియరును భిన్నజాతికవులు. వారికంటె వీ రెక్కువయని కాని, వీరికంటె వా రెక్కువ యని కాని నిరూపించుటకు వలనుపడదు. పాత్రీకరణమున కాళిదాసు అవలంబించిన ప్రధానవిధానము ఆదర్శీకరణము. షేక్స్పియరు అవలంబించిన విధానము యథార్థప్రదర్శనము. అందుచే షేక్స్పియరుపాత్రీకరణవిధానమును భారతకారునివంటి యథార్థప్రదర్శకుల పాత్రీకరణముతో సరిపోల్పవచ్చును గాని కాళిదాసుని ఆదర్శీకరణముతో సరిపోల్చుటకు వలనుపడదు..

గ్రంథప్రచురణ

= శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు =

ఒకే క్షణంలో అనేకులు ఒకే గ్రంథంయొక్క సారాన్ని ఆస్వాదించడానికి దానికి లిఖితప్రతులు గాని, ముద్రితప్రతులుగాని తయారుచెయించడమూ, లేక సభాముఖాన్ని దాన్ని వినిపించి కనపరచడమూ మొదలైన పన్లు చెయ్యడం గ్రంథాన్ని ప్రచురణచెయ్యడం అవుతుంది. గ్రంథప్రచురణ చాలా బహుళం. అదంతా సూక్ష్మకాలంలో అల్పబుద్ధి గల నాబోట్లు చెప్పబూనడం సాహసం. కాని, వర్తమానకాలంలో అన్యదేశగ్రంథప్రచురణాఫలితాలు అందరికీ విశదం అవుతూండడంవల్లా, గ్రంథప్రచురణ అనే ఘోరం నేనుకూడా చేసినవాణ్ణి అవడంవల్లా, కర్తలకి సాధారణంగా ఉండే గ్రంథసృష్టిక్షోభే కాక దాని ప్రతుల యొక్క చలామణీగురించిన బాధకూడా తెలిసిఉండడం తప్పనట్టు కనుపించడంవల్లా, నేను ఆంధ్రంలో గ్రంథప్రచురణాపరిస్థితుల్లో ఉండే వయినాలు కొంచెం స్మరిస్తాను. ఏరచనేనా గ్రంథం కావచ్చు, కాని పద గ్రంథాన్నిగురించే ప్రస్తుతం ముచ్చటించేది. అల్లానే, ప్రచురణ అనేకవిధాలుగా కావచ్చు, కాని అచ్చు ప్రతులు తయారుచెయించడమే ఇప్పుడు నే ననుకునేది.

గ్రంథప్రచురణ అన్నప్పుడు గ్రంథకర్తా, ప్రచురణకర్తా —ఇద్దరే ముఖ్యులుగా కనిపిస్తారు. కాని, ఇతర గ్రంథసాంగులు బోలెడుమంది ఉంటారు. వాళ్లని ఒకక్షణం అల్లా ఉంచుదాం. గ్రంథకర్తప్రచురణకర్తల్లో గ్రంథకర్త గ్రంథంయొక్క అంతస్సారం గురించీ, ప్రచురణకర్త గ్రంథశరీరం యొక్క రూపం గురించీ; గ్రంథకర్త గ్రంథంయొక్క జ్ఞానమూల్యం గురించీ, ప్రచురణకర్త గ్రంథంయొక్క పత్రముద్రణాదిమూల్యంగురించీ—ఇల్లా వేర్వేరు దృక్పథాల్లో చూడవలసినవాళ్లయినా, ఇద్దరికీ అరమరలులేని అన్యోన్యమైత్రి ఉన్నప్పుడే నిజంగా దేశానికి లాభించే ఫలితం ఉండడం. పోనీ ఒకడే రెండుపన్లూ చేస్తే! అనగా, ఎవడేనా గ్రంథసృష్టీ, గ్రంథప్రచురణా రెండూ తనే సాధించడానికి చాలిన బుద్ధీ, ధనమూకూడా కలవాడైతే! అయితేబాధా లేదు,బందీలేదు. కాని, నూటికి కోటికీ తప్ప అటువంటి వాణీందిరాసమైక్యం అనే ప్రమాదం సంభవించదు. ఈవిషయంలో మన సంగతి ౧౯౦౯లో రాస్తూ, హృదయకవి గురజాడ అప్పారావు అన్నది ఇది: "తెలుగుదేశంలో గ్రంథకర్తే సాధారణంగా తన ప్రచురణకర్తా, విక్రేతాకూడా కావలసిఉంటోంది" అని. ఆస్థితి రూఢిగామారిందని నేటికీఅనలేం. ఏకాలంలోనూ ఏదో రచనఉంటూనేఉంటుంది. కాని, ఫలానా రచన మాకు కావాలి అనే జనంయొక్క సంఖ్య ఉండి, అది ఇంకా ఎక్కువ అవుతూన్నప్పుడు గాని అనేకప్రతుల అవసరమూ ఉండదు, ప్రచురణకర్త యొక్క జననమూ ఉండదు. జనం అంటే ఎవరు? తప్పకుండా బతికున్నవాళ్లు. వాళ్లేది కావా లంటారు? గొప్ప గ్రంథం కావా లంటారు. గొప్ప తెలుగు గ్రంథం అంటే ఏమిటి? మామూలు తెలుగువాడికి మాన్యవర్తుల సాయం లేందే ఓ పట్టాన్ని బుర్ర చించుకున్నా సరే తెలియకుండా ఉండే తెలుగులాంటి భాషా పాకం—అని చాలామంది తెలుగువాళ్ల అభిప్రాయం. అల్లానే గొప్ప తెలుగుగ్రంథకర్త అంటే: గర్భ చిత్ర బంధ శ్లేష ద్వ్యర్థి మర్మ గుహ్య అగమ్య అభేద్య అలౌకిక మొదలైన కవిత్వాలు వీలైనన్ని మృతపదాల్తో, చాంతాళ్లలాంటి లాజాసంస్కృత సమాసాల్తో, వ్యాకరణాన్ని హడలగొట్టే నవీనాన్వయాలతో రచించడానికి సామర్థ్యం గలవాడు—అని ఇప్పుడుకూడా కొందరి అభిప్రాయం! అటువంటి రచయిత సృష్టించిన

అటువంటి గ్రంథంమాత్రమే అచ్చుపడాలని వాళ్ల దెబ్బలాట. కాని, భూలోకంలో ఉండే ఏ అరడజను మందికోమాత్రం తెలిసే గ్రంథానికి అచ్చెందుకు, అన్ని ప్రతులెందుకూ! తక్కిన మూర్ఖులకి ఉపయోగంగానూ, అందుబాటులోనూ ఉండేటట్టుఆకర్షణీయంగా రచింపబడ్డది, విమర్శకులు ఎంత కోప్పడితేంగనక, ఎందుకు ప్రచురణ కాకుండాపోతుంది! అందుకని, ఎవరైనాసరే త్రికరణశుద్ధీ, వృత్తాంతమూ, భాషా, ఓపికా మొదలైనవి ఉండి గ్రంథం రాయచ్చు. అక్కడికి గ్రంథసృష్టి అవుతుంది. సరే. దానికి ఒక ప్రచురణకర్త ఉన్నాడందాం. ప్రచురణకర్తకి సారస్వతజ్ఞానమూ, భాషాభిమానమూ, పాఠకజనమనస్తత్వావగాహనా, జనాభిరుచివిచక్షణా, వ్యాపార నిర్వహణ సామర్థ్యమూ, లాభదృష్టీ, కృతజ్ఞతా లాంటివికూడా ఉంటాయని అనుకుందాం. అక్కడికి గ్రంథం అచ్చుపడి అనేకప్రతిరూపాలు దాల్చడం అవుతుంది. బాగానే ఉంది. తరవాత, ఆ ప్రతులన్నీ చెల్లడంమాట! ప్రచురణకర్త ఎంత అంచనాశక్తి గలవాడైతేం, ఎవడు చెప్పగలడు ? గ్రంథకర్త తన గ్రంథం తన మనస్సుయొక్క గారాబుసంతానమనీ, అది ఆచంద్రతారార్కంగా ఎక్కడో అక్కడ ఉండగలందులకు తను శాసించాననీ, అది వెనకటి గ్రంథాలన్నింటినీ తలదన్ని రాబోయే గ్రంథాలన్నింటినీ కాళ్లట్టుగుని ఈడ్చిపారెయ్యగలదనీ అనుకోవచ్చు! ప్రచురణకర్త మహా ఎక్కా-గ్రంథం ఏరాం అనుకోవచ్చు! అనుకుంటేమాత్రం గ్రంథప్రతులు చెల్లద్దూ! ఒక్కొక్క గ్రంథం గట్టిఅట్ట, మేలుబైండు, దళసరికాగితాలు, చుట్టూఖాళీలు, పంక్తులమధ్య ఎడాలు, గొప్పవాడి సంతకంతో ఉపోద్ఘాతం, ప్రతీచోటా ప్రకటన ఘోష, పండితపామరహృద్యంగా గ్రంథం రాయబడ్డట్టు హెచ్చరిక, ఆకాశానికి ఎత్తేసే అభిప్రాయాలు, ఏ అర్థమేనా ఇయ్యగల సమీక్షలు, వీరిన పడికట్టురాళ్లతో బరువెక్కిన విమర్శ వైద్యుడిమెప్పు మోతాదు—ఇన్నింటితో బయల్దేరినాసరే ఒక్కప్రతీ చెల్లకపోవచ్చు : నందికేశ్వరుడునోంలో చలిమిడి చెల్లదే, అరీతిగా! కాని, ఒక్కొక్క గ్రంథంలో ఉన్నవన్నీ తప్పులూ, లేనివన్నీ మెప్పులూ అయినా దాని ప్రతులు చెల్లచ్చు! అపళంగా, గొప్ప విమర్శకుడు ఒకడు లేచి, గర్జించి—"ఒరేయ్ జనం! మొట్టమొదట నా గ్రంథమూ, తరవాత నే మెచ్చినవీ మీరు మెచ్చుకోలేంరా, మూర్ఖుల్లారా! నా అంతవాడి ఉద్దేశంలో ఏమీ పసలేని పచ్చి పిచ్చి పుచ్చు చవట చెత్తంటే అల్లా పడి చచ్చిపోతారేమర్రా, మూర్ఖుల్లారా! నే చెప్పిన గ్రంథాలు మీ అంత శూన్యులకి విషప్రాయం అయినాయిగనక నే ఉద్ధరించాలర్రా మూర్ఖుల్లారా!" అంటూ, బతికున్న జనంయొక్క అభిరుచిని ఏకలాటుగా నిందిస్తూ, తనలాంటివాళ్లు ఏకాసిని మందో తప్ప తక్కిన వాళ్లంతా మొత్తంమీద ముమ్మాటికీ మూర్ఖులు అనే ఘనవిషయం ఒంటరిగా కూచుని నిర్ణయించుకుని, తన విజయం సాధించుకుంటాడు. పైగా పాండిత్యం ఔన్నత్యమనీ, పామరత్వం వైశాల్యమనీ గుర్తించుకోక, కొన్ని నీచగ్రంథాలు ఎవరో కొందరు తుచ్ఛులు కోరుతున్నారనే మిషమీద జనప్రియత్వం గల గ్రంథాలన్నీ తుచ్ఛమే అని సూత్రిస్తాడు. అతడల్లా విచారిస్తూంటాడు. ఇక పండిత గ్రంథకర్త జనమనస్తత్వంతో నిమిత్తంలేకుండా, తనకంటె పండితులు తన రచన చూస్తారనే దుర్భ్రమతో గ్రంథం నిర్మించి, అది తన అల్లారు మానసికప్రతిబింబం అనుకోడమూ, నూటికి తొంభై మందికి నేటికీ వచనమే తెలియకపోయినా, తను అలంకారసహితంగా కన్న పద్యాన్ని యావజ్జనమూ ఆబాలగోపాలంగా నెత్తినిధరించే రోజు రాకపోతుందా అనుకోడమూ ఆపడం బ్రహ్మతరం గాదు. ఒక రచన దేశానికి అవసరమైన గొప్ప రచన అయినప్పుడు గాని జనంలో పాకదు. గొప్పతనం లేకుండానే ఏదేనా గ్రంథం జనంలో మాయమవడం బదులు వ్యాపించడం జరుగుతుందా ఆకాలం జనం అంతా భ్రష్టు లన్నమాట. రచనయొక్క గొప్పతనం, ఒకవేళ ఉంటే, అది పుట్టగానే తెలియనూవచ్చు, సాధారణంగా తెలియకపోనూవచ్చు. అక్కడికీ ఒక్కొక్క రచనయొక్క గొప్పతనం జనం వెంటనే కనిపెట్టకపోతారేమో అనే దిగులుచొప్పున ఒకొక్క విమర్శక జ్యోతిష్కుడు దానియొక్క భావియోగం పీటలైనంత అహంతో శాసిస్తూంటాడు. అశాసనాన్ని రచన వినలేదు, జనం విని గ్రహించుకోలేరు. ఏమైతేనేమి, గ్రంథగుణం ఎంతటిదైతేనేమి, గ్రంథకర్త రకం

ఎల్లాంటిదైతేనేమి, తెలుగులో గ్రంథకర్తకి డబ్బుగాని, రాజాశ్రయంగాని ఉంటే గ్రంథం శీఘ్రంగా అచ్చులో పడుతుంది. వీరేశలింగం వరకూ అన్మాటేమిటి, నేటివరకూ రాజాశ్రయమే పద్య గ్రంథకర్తని విరివిగా పోషించి, నిత్యమూ రక్షించి నిలబెడుతోంది. గ్రంథకర్తే క్రమేపీ జనానికి ప్రతులు అమ్ముకుని డబ్బు చేసుకుంటాడు. ఒకవేళ, ప్రతులు జనానికి నయించక వాళ్లవి కొనరని తోస్తే, జనానికి ఉచితంగా పంచిపెడతాడు; లేకపోతే పుస్తక భాండాగారాలకో, పోటీ పరీక్షలకో, గొప్ప వ్యక్తులకో బహుమతీలుగా ఇచ్చేస్తాడు; ఏదో ఇదవుతాడు. ముందు అనుకుంటేం అనుకోకపోతేం, పదపడి జనాన్ని రంజింపిన గ్రంథంయొక్క ప్రతులు ఎల్లానో అల్లా పుడుతూనే ఉంటాయి. గయోపాఖ్యానమూ, కాశీమజిలీలూ, భక్తచింతామణీ, వీరేశలింగ వచన కృతులూ వంటి జనప్రియగ్రంథాలు తెలుగుని ఉన్నాయి, విశేషధనం ఇచ్చి ఇంకా ఇస్తూనూ ఉన్నాయి. మరి డబ్బులేని గ్రంథకర్త (సాధారణంగా ఉండడుగదా! అందులో poetry కీ poverty కీ చాలా దగ్గరన్నాడు ఓకవి. V అంటే విక్టరీ, విజయం! కనక పొయెట్రీకి విజయం సంక్రమిస్తే పావర్టీయే గావును!) డబ్బిస్తారని ఎవరికేనా అంకితం చెయ్యడమో, ఎవర్నేనా యాచించడమో, ఎవరిచేతేనా చందా వెయించడమో జరగాలి. లేకపోతే, బదులు తెచ్చి అడ్వాన్సులు పారేసి అచ్చు సాగించి లెక్కలొచ్చిన గ్రంథ ప్రతుల్ని ముద్రాలయంలో వదిలెయ్యడం! ఆ దిక్కూ లేకపోతే, అదుగో అప్పుడు- ప్రచురణకర్త జనప్రియగ్రంథానికోసం వెతకడం పోయి, గ్రంథకర్త బయల్దేరి మీరా మీరా అని ప్రచురణ చెయ్యగలవార్ని వెతుక్కోడం!

ఆంధ్ర గ్రంథ ప్రచురణ ౧౮౦౬ నించీ జరుగుతూనే ఉందనీ, ౧౮౫౦ నాటికే తెలుగు లిపిలో గ్రంథప్రతులు అచ్చుపడ్డాయనీ తెలుస్తుంది. ప్రాచీనాంధ్ర గ్రంథ ముద్రణంతో ఆంధ్ర జనంయొక్క కళ్లు ౧౮౬౪ నించీ తెరిచిన శ్రీ వావిళ్ల వారి గ్రంథసేవనుగురించి ఎరగని ఆంధ్రుడుండడు!

౧౯౦౬ తరవాత విజ్ఞానచంద్రికామండలి జనించి, ఎంతకాలం పాటు అయితేం, నామసార్థకం చేసుకుంది. ఆ సంస్థ తెలుగుప్రజయొక్క శాస్త్రజ్ఞానప్రమాణం ఎక్కువచెయ్యాలనే సదుద్దేశంతో కీ. శే. కొమర్రాజు లక్ష్మణరావుపంతులు చేసిన ఏర్పాటు. కాని, ఆయనతోపాటు అదీ తగ్గింది. ఒక తెలుగుసంస్థని సవ్యంగా నడిపే ఒక తెలుగువ్యక్తి తప్పుకోడంతోటే ఆ సంస్థ చెల్లాచెదరైపోవడం ౧౫౬౫ నించి ఇప్పటి వరకూ నిజమే! అల్లా చెదిరిపోకుండా నిల్చినవి తెలుగులో లేవని చెప్పలేంగాని, ఉన్నవాటిని వెతికి పోల్చుకోవాలి, లెక్కపెట్టడానికి వేళ్లు చాలు! పదపడి ఆంధ్రప్రచారిణీ, ఆంధ్రభాషాభివర్ధనీ, వేగుచుక్క మొదలైన కొన్ని గ్రంథమాలలు నవలాప్రచురణ విస్తారం చేస్తూ ఆంధ్రుల్ని ఆకర్షించాయి; గ్రంథకర్తల్ని ఎంతగట్టున పడేశాయో తెలియదు. క్రమశః ఆంధ్రగ్రంథమాల, సరస్వతీ గ్రంథమండలి మొదలైనవి కూడా వెలిశాయి; కష్టనష్టాలకి ఓరుస్తూ నేటికీ ఉన్నాయి. తరవాత ప్రచురణసంఘాలు పుడుతూనే ఉన్నాయి. కొన్ని సంఘాలకి పేరు సంఘం; సభ్యుడు ఒకడే. తెలుగులోనూ, బహుశా సర్వత్రా కూడా, సంఘాలన్నీ క్రియకొచ్చేసరికి అంతే అనచ్చు. ఆ ఒక్కడే "అండ్ కో", లేకపోతే "అండ్ సన్స్." ప్రచురణసంఘాలు రెండురకాలు — పఠనగ్రంథాలు ప్రచురించేవీ, పఠనేతరగ్రంథాలు ప్రచురించేవీనూ. మొదటిరకం సంఘాలకి అసాధారణపు ప్రతినిధులు. ఆ సంఘాలకి (కొండొకచో ప్రతినిధులకి) తెలుగు రాకపోయినా వాళ్లు ధనాధికారపరిచయవ్యాపార ప్రభావాలు కలవాళ్లవడంచేత తెలుగుపఠనగ్రంథాలు తమ ఇచ్ఛాప్రకారం పెట్టించడం చిరకాలంనించి ఎరుగుదుం. కొన్ని పఠనగ్రంథాల్లోని తెలుగు, ఇంగ్లీషు చదివినవాళ్లు హిందీ మాటెట్టుగుని అరవాన్ని ఆలోచించి తెలుగులో వెలిబుచ్చిన పాకంలో పడడంచేత బహువ్యాకరణయుక్తంగా ఉండడమేకాక, తెలుగు బాలబాలికలు శాస్త్రజ్ఞానాభివృద్ధి చేసుకోడానికి మిక్కిలి తగిఉన్నట్టుకూడా కనిపెట్టబడి, ఆమోదించబడి, దించబడతాయి. ఆంధ్రగ్రంథనిర్ణాయకసంఘంలో గొప్ప ఆంధ్రులు ఉంటారు. మనలో మన

మాట, గొప్ప ఆంధ్రుడంటే, పొలం, ఆస్తి, రొఖ్ఖం, చలాయింపూ, ఆఖరికి గౌరవాధికారమూ, అవేవీ కాకపోతే ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, అరవం, కన్నడం, బెంగాలీలాంటి (తెలుగుతప్ప మరి ఏదైనా సరే) ఒక భాష తన స్వాధీనంలో ఉన్నవాడు—అన్నమాట. అటువంటి సంఘాల్లో గౌరవసభ్యత్వానికి జిల్లాబోర్డులువంటి గొప్ప సంస్థలుకూడా పడే ఆందోళన ఇంతా అంతా కాదు. ఆ గౌరవసభ్యుల మాటతో, గొంగళిపురుగుల్లాంటి చీదరగ్రంథాలు పఠనగ్రంథా లనే సీతాకోకచిలకల్లాగ మారి, ఎగిరిపోతాయి! ఈ సంగతి కూడా ఆ అఖండుడు గురజాడ అప్పారావు సూచించాడు: "క్రైస్తవమతనిబంధనల్లో పదకొండో భగవదాజ్ఞ—'నువ్వు చదివితీరాలి' అనేది లేదు! అయినా సరే, ఒకొక్క గ్రంథనిర్ణాయకసంఘంలో ఉండే మహాపూజ్యులు—'ఈగ్రంథంచదివితీరాలి' అని ఆజ్ఞాపించేసరికి, కర్మంకాలిన వేలాదివిద్యార్థులు మానవమాత్రుడికి లాభంగాని, ఆనందంగాని లేశమూ కలగని గ్రంథాలు చదివి పారెయ్యాలి" అని. కాని, సర్వే సర్వత్రా ఇది నిజం కాకపోవచ్చు. ఏమంటే, ప్రమాదంచేత ఎప్పుడేనా ఒక సార్థకగ్రంథంకూడా పఠనగ్రంథంగానూ పడచ్చు. ఇక, ప్రచురణసంఘాల వాళ్లు పోటాపోటీలు పడి, తమరి గ్రంథాలే పెట్టించుకోవా లని నిర్ణాయకసభ్యుల్ని విడివిడిగా దర్శించి, వాళ్లకి వద్దు మొర్రో అంటూంటే వందలూ వేలూ సొమ్ము గిరవాటేస్తూ, ఋషితుల్యులులాంటి ఆ సభ్యుల్ని, విద్యావిషయంలో తప్ప కడమ అన్నింటిలోనూ పేరుమోగిన కొందరు అఖండుల్ని, చెడగొట్టడానికి యత్నిస్తారు. ఆ సభ్యులూ, అధ్యక్షులుకూడా వాళ్లు, ఒకరికి తెలియకుండా ఒకరు, గుమ్మరించదల్చుకున్న పాపపుసొమ్ముగురించి భీతిల్లిపోయి, తమ రాసొమ్ముకేనేనా చూడక, తమకి దగ్గిరబంధువుని ఎవణ్ణేనా మధ్య అడ్డుంచి, ఆ పాపిష్ఠిసొమ్ము మరో దిక్కుకి పోయి ఇంకా పాడుపన్లు చేస్తూ కూర్చోకుండా దాన్ని జాగర్త చెయించేసి, దాంతోటి గౌరవవిందులూ, పైవారి ఖర్చులూ, కిందివారికి చందాలూ, ఇంట్లో నగలూ, ఊళ్లో ఎన్నికలూ - లాంటి పవిత్రపు పన్లకే దాన్ని వాడేస్తారు. పఠనగ్రంథనిర్ణయంలో ఒకొక్కప్పుడు గ్రంథం చాలామట్టుకి వెడుతుంది. పూర్వం ఒక పరీక్షకి రెండు సూక్ష్మపఠనగ్రంథాలూ, నాలుగు స్థూలపఠనగ్రంథాలూ—ఒక పరీక్షావిషయం గురించి—ఉండేవి. ఆ నాలుగు స్థూలపఠనగ్రంథాలూ ఏయేటి కాయేడు పెట్టించుకునేనిమిత్తం ప్రచురణసంఘాలు విరజిమ్మదల్చిన సొమ్ముయొక్క పరిమాణం చూసి అధికారులు హడిలి ఆకాశం అంటి, విచారణ చేసిచేసి, దారికనిపించక, ఆపరీక్షకి, ఆసంవత్సరంనించి, స్థూలపఠనగ్రంథాలు అక్కర్లేదు, అసలే తీసేశాం పొమ్మన్నారు! మహానగరాల్లో ఉండే ఇటువంటి సంఘాలు గ్రంథకర్తయొక్క హక్కులు పుచ్చుకున్నా పారితోషికంవిషయంలో ఏదో ఒక నియమప్రకారమే పోతూంటాయిగాని, గ్రంథకర్తతో అనుబంధం వీలైనంత శీఘ్రంగా తెంపేసుకుంటాయి. దేశం తెలుగుమీరింతరవాత గ్రంథవ్యాపారంలో లాభాలు చూస్తూ చూస్తూ పోగొట్టుగోలేక ప్రచురణసంఘాలూ, ప్రచురణకర్తలూకూడా ఊరూరా వెలవడం సాగింది. పైచెప్పిన నిర్ణాయకసంఘాలలోని సభ్యుల్ని అండగా మానుగుని, ఏవ్యక్తి అయినాసరే, బుద్ధిప్రజ్ఞగాని, సొమ్ముపెట్టుబడిగాని అక్కర్లేకుండానే పఠనగ్రంథప్రతులు ముద్రింపించగలిగి లాభం తియ్యగలడు, అని తేలింది. అటువంటి వ్యక్తులకి, ఏదో గోకిపెట్టడానికి, వాళ్లచుట్టూ ప్రదక్షిణాలు చేసే గ్రంథకర్తగ్రహాలకి ముట్టే దక్షిణగురించి ఊహించుకోడమే నయమనిపిస్తుంది.

విక్రేతాశ్రమంలోంచి లేచిన ప్రచురణకర్తలు పఠనేతరగ్రంథాలు అచ్చువెయ్యడం కద్దు. తెలుగు పామరజనంయొక్క ప్రస్తుత పఠనాభిరుచి ఏమిటంటే, వీలుగా ఉంటే శృంగారం, సృతిమించితే వైరాగ్యం—అంతే గాని మధ్యరంగాలు ఉన్నట్టు తోచదు. అందుకని, శృంగార వైరాగ్య గ్రంథాలకీ, భక్తి వేదాంత గ్రంథాలకీ మాత్రమే విస్తారం చలామణీ. తెలుగులో 'భక్తి' అనేది ఒక రసం అనే సంగతి రసవాదులంతా నేర్చుకోవలసిన విషయం. 'భక్తి' అనే వర్తకవ్యాపారంలో దగాపడి నష్టపోయే అంధులు ఆంధ్రుల్లో ఉన్నంతమంది ఎక్కడా ఉండరు. ఇవికాక

ఇంకా పుడుతూండే గ్రంథాలు నవలలు. నవలాజననం ఎవడూ తప్పించలేడు. వందలాది ఏళ్లనించీ కూడా విదేశాల్లోకూడా అధికజనాకర్షణ చేస్తూన్న గ్రంథాలు నవలలే. నవల ఎవడేనా సరే రాయడానికిన్నీ, నవలావస్తువు ఉన్నదీ లేనిదీ, స్వంతమూ ఇతరమూ, ఇహమూ పరమూ, గమ్యమూ అగమ్యమూ, ఊహ్యమూ సిద్ధమూ ఎదేనా సరే అయిఉండడానికిన్ని, నవలాశరీరం వర్ణనా, మననమూ, కథనమూ, సంభాషణా ఎదేనా సరే అయిఉండడానికిన్నీ నవలాపాఠకుడు ఎవరేనా సరే అయిఉండడానికిన్నీ, సావకాశా లుండడంచేత నవలాసృష్టికీ, వ్యాప్తికీ ఉన్నన్ని మార్గాలు ఏ యితర గ్రంథవిశేషానికీ ఉండవ్. కాని, ప్రతీ 'చెత్త' నవలా సారస్వతంలో నిలుస్తుందా అంటే ఎదేనా సారస్వతంలో నిలవడం అన్నింటికి మల్లేనే, దైవాధీనం- అనగా ముందే తేల్చడానికి వీల్లేనిది. అల్లా బయల్దేరిన నవలల్లోనూ, చిల్లరి గ్రంథాల్లోనూ ఎక్కువ సంఖ్య జ్ఞానదృష్టికిగాని, సారస్వత దృష్టికిగాని, కళాదృష్టికి గాని అందకపోయినా అడ్డమైన పామరుణ్ణీ క్షణంలో జ్ఞానిగా, సారస్వతుణ్ణిగా, కళానిధిగా మార్చి వాడికి సూక్ష్మంలో మోక్షం ఇప్పించగల దుకాణాలు నమ్మకంగా కలిగించగల చాతుర్యం కలవి. కొన్ని గ్రంథాలు ప్రతీ 'భూతం' మంచిదీ- ప్రతీ వర్తమానమూ చెడ్డదీ అనే ఊకదంపు పాతపాట పాడి మూర్ఖజనాన్ని శ్రమలేకుండా నచ్చగొట్టగల బాపతువి. మరికొన్ని స్త్రీపురుషానుబంధమూ, అందులో అపసవ్యప్రేమా మాత్రం కెరటం వేస్తూండి, అన్యస్త్రీ పురుషుల అపవిత్ర సాంగత్యం ఎదైనాసరే పఠించుగోడమే జన్మతారకమని కులికే ఆంధ్రమహాజనుల్ని తెప్పలతేలగొట్టే రకం. ఈరకపు పామర గ్రంథాలయొక్క ప్రతి ఒకటికి కానీ లగాయతు పావలాలోపు ఖరీదు పడేటట్లు ఖర్చులు ఖుంజాయించుకోగల ప్రతీ విక్రేత చేతుల్లోనూ పామరగ్రంథపరంపర చిక్కిపోయింది. అటువంటి వ్యాపారంలో విజయం పొందడానికి పుస్తకవిక్రేతకి కావలిసిన ఆదిసామగ్రి ఒక కక్కుర్తి గ్రంథకర్త! ప్రపంచంలో కక్కుర్తికీ లోటు లేదు, గ్రంథకర్తలకీ లోటు లేదు. గ్రంథమూల్యం తెలియక హక్కులన్నీ తెగనమ్మి, లక్షలాది పాఠకుల్ని కలిగిఉండీకూడా తమరు కక్కుర్తిగానే ఉన్న గ్రంథకర్తలు తెలుగులో ఉన్నారు. ప్రచురణకర్తల దగ్గిర సొమ్ము ముందు తినేసి, శూన్యం రాసిచ్చిన గ్రంథకర్తలూ ఉన్నారు. ప్రచురణకర్తకి విజ్ఞానం ఉండటం లేదని గ్రంథకర్తగారి ఆక్షేపణ. గ్రంథకర్తకి జ్ఞానంమాట అదేపోయె, ఇంగితజ్ఞానమూ వ్యవహారజ్ఞానమూకూడా సాధారణంగా ఉండవు గదా అని ప్రచురణకర్త ధైర్యం! తెలుగుజనం ఇదంతా చూస్తూ, రోజులమహిమ అనుకుంటూ తమరే తిడుతూనే ఆగ్రంథాలే కొనుక్కుంటూ ఉండడమేకాని, తమరు వెచ్చించిన డబ్బు యథార్థంగా పంపకం అయిందో లేదో కనుక్కోడం లేదు. "ఇటువంటి గ్రంథకర్తలూ, గ్రంథాలూ, విక్రేతలూ, పాఠకులూ ఎంతమాత్రం ఉండకూడదు" అని పండితులు జోరుగా శాసించి జారుగా ఊరుకుంటారు. గొప్పవాడైన ఆంధ్రుడు ఇదీ లేదు అదీ లేదు ఏదీ చూడడు. ఇక, తనకి నల్లమందైన పత్రికే కొనకుండా చదివేసుగోడం గడుసుదనం అని సంతోషించుగునే జనం గల ఆంధ్రంలో, గ్రంథాలు కొనాలి అనుకునే భావం సర్వత్రా ఉంటుందా! పెద్దగ్రంథం-అబ్బో, కొనలేరు. సామాన్యగ్రంథం-ఎందుకూ కొనడం, ఓమాటుచ్చుగుని చదివి ఇచ్చెయ్యచ్చు. అంతగా అయితే, తమరు ధనవంతులైనాసరే, గ్రంథాలయానికి వెడతారు. ఏదేనా గ్రంథాలయానికి వ్యక్తిత్వం ఉండాలీ అంటే అక్కడ ఫలానా శాస్త్రగ్రంథాలుమాత్రమే ఉండడమూ, లేక ఫలానాకళ గురించిన గ్రంథాలుమాత్రమే దొరకడమూ, ఫలానాచరిత్ర, ఫలానాసారస్వతం మాత్రమే తెలుసుగోడానికి వీలుండడమూ, ఫలానా ఖరీదుకంటె ఎక్కువగా ఖరీదు గల గ్రంథాలుమాత్రమే ఉండడమూ-ఇల్లా ఏదో విశేషం ఉండాలి. ఉంటే, అటువంటి గ్రంథపరంపర సంప్రతించేనిమిత్తం ఎవరేనా గ్రంథాలయానికి వెళ్లడం సమంజసం. అంతే కాని, ఊళ్లో మిక్కిలి చౌకగా దొరికే గ్రంథాలే చాలా చేతులు మారి గ్రంథాలయాల్లో ఉండడమూ, అటువంటివికూడా స్వంతానికి కొనుక్కోక ఉచితంగా చదువుకోడానికి ధనం ఉన్నవాళ్లుకూడా అక్కడికి తయారవడమూ జరుగుతూన్నంతకాలం

నరసభూపాలీయము

ఆకెళ్ల శేషాద్రి

యువ సంవత్సర ఫాల్గున మాస భారతిలో నా ప్రియమిత్రులగు, బ్రా॥ బులుసు వేంకట రమణయ్యగారు 'నరసభూపాలీయము' అను వ్యాసమున నేతద్గ్రంథకర్త వ్రాసిన పొరపాటులను, ముద్రణ స్ఖాలిత్యములను, గొంతవఱకు వ్రాసిరి. వా రాగ్రంథము నందుఁ జూపిన కొన్ని యనుపపత్తులు నిజముగా ననుపపత్తులు కాకుండుటచే వానికి నాకుఁ దోఁచిన సమాధానములును, కొన్నిటిలో నా యభిప్రాయ భేదములును నిట వ్రాయఁదలఁచితిని.

కవిప్రౌఢోక్తి సిద్ధార్థశక్తి మూలాలంకార కృత వస్తుధ్వని కుదాహరణముగా నిచ్చిన (౨ ఆ. ౧౩౩)పద్యములో వాచ్యమగు నుత్ప్రేక్షచే ఖండన వేఁ రూప వస్తువు వ్యంగ్యమనుట సరికాదనియు, ఉత్ప్రేక్షా వాచకశబ్దము వివరణపద్యములోనే యున్నది, కాని యుదాహరణపద్యములో లేదనియు, వ్రాయుచు, "వలెన్, పోలెన్, మొదలగు పదములు లేవు. కాన ఉత్ప్రేక్ష వ్యంగ్యమే యగును. అట్టి పదము లున్నపుడే ఉత్ప్రేక్ష వాచ్యమగు ననియు లేనిచో వ్యంగ్యమగు ననియు ఆలంకారికుల అనుశాసనము" అని వ్రాసిరి. వాచకశబ్దము లేకుండుట నిజమే! కాని, వాచక శబ్దాప్రయోగమాత్రమున నుత్ప్రేక్ష వ్యంగ్యమగునా? ఇట్టి యాలంకారికుల యనుశాసన మెచ్చట నున్నది?

"వారిని బోషించుటచేఁ గాఁబోలు వారి రక్తము నంటుటలేదు" అని యున్నచో 'కాఁబోలు' అను వాచకపద ముండును గనుక వాచ్యోత్ప్రేక్ష యగును. "పోషించుటచే రక్తము నంటదు" అను నప్పుడుకూడ రక్తము నంటకపోవుటలోఁ బోషించుటను హేతువుగా నుత్ప్రేక్షించుటచేఁ గ్రియాహేతూత్ప్రేక్ష వాచ్యమే, కాని వ్యంగ్యము కాదు. వాచకపదము లేదు గాన గమ్యోత్ప్రేక్ష యగును. గమ్యోత్ప్రేక్ష, వాచ్యాలంకార భేదమే కాని వ్యంగ్య భేదము కాదు.

అన్ని యలంకారములును, వాచ్యములునుగాను, వ్యంగ్యములుగాను గూడ నుండును. అలంకారము యొక్క సామగ్రియంతయుఁ బద్యములోఁ జెప్పఁబడినచో నప్పు డలంకారము వాచ్యమని చెప్పవలయును. సామగ్రి యుపాత్తము కాక వాక్యార్థముచే వ్యంగ్యమైనచో దాని నలంకారధ్వని యనవలయును. వ్యంగ్యమగు నుత్ప్రేక్షకాక, వాచ్యమగు నుత్ప్రేక్షయే, వాచ్య, గమ్య (ప్రతీయమాన) యని రెండు విధములు. ఉత్ప్రేక్షను సూచించునట్టి, 'వలెన్, కాఁబోలున్' మొదలగు శబ్దములు * పద్యములో నుపాత్తము లైనచో వాచ్యోత్ప్రేక్ష యనియు, వాచకపద మనుపాత్తము కాక గమ్యముగా నున్నచో నచట గమ్యోత్ప్రేక్ష యనియు, సర్వాలంకారికసిద్ధాంతము. గమ్యోత్ప్రేక్షయను పదమునకు గమ్యమగు (వ్యంగ్యమగు) నుత్ప్రేక్షయని యర్థము కాదు. గమ్యమగు (ఉపాత్తముకాని) వాచకపదము కలయుత్ప్రేక్ష యని యర్థము. వాచకపదము గమ్య మైనంతమాత్రమున నలంకార మంతయు వ్యంగ్యమగునా?

ఇట్టి యెవరైనఁ బొరపడుదురనియే కాఁబోలు నప్పయదీక్షితులును, విశ్వనాథుఁడును "గమ్యోత్ప్రేక్ష

---

* తే.గీ. తలఁతు ననుకొందు శంకింతుఁ దక్క్య మ్రువ, మనఁగ నాఁగఁ గానోపు నాఁజను ననఁదగు
పోలెనోక్క కావచ్చుఁ గాఁబోలు నేమొ, ఓ ఒకో వంటి దుత్ప్రేక్ష కొప్పు గుర్తు.
(అన్నారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి, తెలుఁగు కావ్యాదర్శము)

రాష్ట్రాల్లో) గ్రంథంయొక్క విలువ గుర్తించుకున్నారు. 'సర్వస్వామ్య సంకలితం' అని అట్టమీద అచ్చేసి, ఒక్కొక్క గ్రంథకర్త, అసలేమిటో కనుక్కోకుండా తనకి కాఫీ ధారపోసినవాడికి తన గ్రంథాన్ని ధారపోస్తే ఏమైనట్టూ! ఆస్వామ్యాల్లో ప్రతుల ముద్రణం, భాషాంతరీకరణం, సూక్ష్మీకరణం, విపులీకరణం, నాటకీకరణం, తెరమీదికీ గ్రామఫోనుకీ రేడియోకీ ఇయ్యడం, చౌక ప్రతుల ముద్రణం వెయ్యడం, భాగాల్లో వెయ్యడం, అన్యరాష్ట్రదేశ ఖండాల్లో ప్రచారం చెయ్యడం - గురించిన హక్కులు ఎన్ని ఉన్నాయో గ్రంథకర్తలకికూడా తిన్నగా తెలియదనిన్నీ, అందువల్ల ఇతర దేశాల్లో సుప్రసిద్ధుడైన ప్రతిగ్రంథకర్తకీ ఒక ఏజెంటు ఉండి ఈ హక్కులద్వారా ఒక్కొక్క గ్రంథంమీద కర్తకి పారితోషికవార్షికాలు ఎంతెంత రావలసిఉంటాయో కట్టి వసూలుచేస్తూంటాడనిన్నీ తెలుస్తుంది. ఆంగ్లంలో గ్రంథకర్తలు తమలో హెచ్చుతగ్గులు కట్టుగోడాలూ, కొట్లాటలూ, ఈర్ష్యలూ మానుకుని, తమకు ఉంటూండే స్వామ్యాలు గుర్తించుకుని అవి కాపాడుకునేటందుకు సంఘాలుగా ఏర్పడి వాటిద్వారా పనులు సాధించుగోడం ఎప్పుడో గదా! ఇతర దేశాల్లో గ్రంథాలు కొనేవాళ్ల సంఖ్య చాలా హెచ్చుగనక, చౌకరకపు గ్రంథాల ప్రతులు లక్షగాని, పదిలక్షలుగాని ఒకే ముద్రణంలో పడడం వల్ల గ్రంథప్రతి ఒకటికి చేతిఖర్చు చాలా తక్కువగా ప్రచురణకర్తకి కిట్టడంవల్ల విక్రేతకూడా చాలా చౌకగా దేశదేశాలాకూడా వాటిని అమ్మగలుగుతాడు. ఆంధ్రంలో ప్రతీనామకుడూ తనకి అవసరం లేక పోయినాసరే తన భాషగదా అనే జాలితో తన అభిరుచినిబట్టి ఎవో కొన్ని తెలుగుగ్రంథాలు కొంటూన్నప్పుడుగాని తెలుగుప్రచురణసంస్థలు విరివిగా పనిచెయ్యవు. సందేహాస్పదంగా ఉండే గ్రంథాల ప్రచురణగురించి సాహసించనక్కర్లేదు, పోనీ, రూఢిగా జనప్రియత్వం ఆర్జించిన గ్రంథాల విషయంలోనేనా, న్యాయమైన నియమాలతో నిజాయితీగా వ్యవహరించగల పేరు తెచ్చుగోవాలనే ఆశయంతో ఇప్పటికంటె ఎక్కువగా ప్రచురణసంఘా లున్నప్పుడుగాని తమ

గ్రంథప్రచురణగురించి నిర్భయత్వం వహించి నిశ్చింతగా రచననే ఉపాసించగల గ్రంథకర్తలు దొరకరు. భాషాభిమానం గల ప్రచురణకర్త తనకి నచ్చిన గ్రంథకర్తని ఏరి ఎన్నుకున్నప్పుడుతప్ప, విక్రేతే గ్రంథవ్యాపారం నిమిత్తం ప్రచురణకర్తగా మారి, ఆశ్రయించినవాణ్ణల్లా గ్రంథకర్తగా అడ్డెట్టుగుని వ్యవహరించడానికి వీలు ఉన్నన్నాళ్లు దేశజ్ఞానం పైకేసి వెళ్లదు. విదేశాలలో ప్రచురణచేసేవారు మాకు ఫలానా ఫలానారకాలు, ఫలానాకళ, ఫలానాశాస్త్రం, లేక సముద్రయానం, దేశాటనం, సాహసవిహారం, పరిశోధక నవల, పద్యం, నాటకం, రాజకీయం, మనస్తత్వం— ఇవి ఇవి కావాలి, ఈయీ శాఖల్లో, ఈయీ రూపాల్లో, ఈయీ సంప్రదాయాలతో, అని కోరి, నచ్చినవాళ్లనిఎన్నుకుంటూ, వాళ్లకి, అనేక సహస్రవందనాల్తో సానుభూతికూడా కలిపిఇచ్చి మాడ్చక, విరివిగా పారితోషికం యిస్తూ, వాళ్లతో మొత్తంమీద మిక్కిలి అన్యోన్యంగా ఉంటూ, పారంపర్యంగాకూడా, ఆమైత్రి అల్లానే ఉంచుకుంటున్నారని తెలుస్తుంది. జనసేవనిమిత్తం స్థాపింపబడి పనిచేస్తూన్న తెలుగుసమాజాలు ప్రచురణసంఘశాఖలు పెట్టి గ్రంథకర్తల్ని పోషించి 'ఒకవేళ లాభం పొందగలిగితే ఆలాభం ఏకవ్యక్తియొక్క లాభానికిమల్లేకాక, మళ్లీ జనానికే ఉపయోగింపబడుతుంది కదా! అటువంటి సమాజాలతరఫున ప్రచురణసంఘాలు పుట్టడం ఎప్పుడో గదా!

గ్రంథం అంటేనే సవాలక్షగ్రంథం! "గ్రంథం అనేది బెత్తం పుచ్చుగోకుండా మనికి బోధించే గురువు. మనం గ్రంథాన్ని ఎప్పుడు సమీపించినాసరే దానికి నిద్దరబద్ధకమూ, మరుపూ ఉండవు. మనం గ్రంథాన్ని ఎప్పుడు అడిగినాసరే, ఇప్పుడు కాదు అనడంగాని, ఎదో సాకుచెప్పి దాటెయ్యడంగాని దానికి తెలియదు. మనం తప్పులుచేసినాసరే గ్రంథం మనల్ని మందలించదు. మన అజ్ఞానం ఎంత దట్టమైనాసరే గ్రంథం మనల్ని హేళనచెయ్యదు"అని ఒక మహామహుడు గ్రంథాన్ని ప్రస్తుతించాడు. గ్రంథం ఒక ఆత్మయొక్క అక్షరరూపం! దాన్ని సదుదేశంతో ఒక్క అన్యహృదయానికి చేర్చగలగడం ప్రచు

రణ! జనాన్ని ఆకర్షించి జనానికి ఎందుకో అందుకు ఉపయోగపడుతూండే గ్రంథంగాని సజీవగ్రంథం కాదు. ఆకర్షణలేని గ్రంథం జనహృదయాలకి ఎక్కదు. ఉపయోగపడుతూండని గ్రంథం జనహృదయాలకి ఎక్కినా నిలవదు. జనహృదయాల్లోకి ఎక్కి నిల్చినప్పుడుమాత్రమే గ్రంథానికి సార్థకప్రచురణ! ఇంతటితో, "గ్రంథవిస్తరభీతిచేత" అగుతున్నాను. సెలవ్.



'ఎందుకుపారేస్తానునాన్నా?'

[చిన్నకథ]

= శ్రీ చాగంటి సోమయాజులు =

చెల్లిని వొళ్లో కూచోపెట్టుకుని కృష్ణుడు వంటింట్లో కబుర్లు చెప్పుతున్నాడు. వాళ్ల నాన్న పిలిచి చుట్టలు తెమ్మని డబ్బు లిచ్చేడు.

కృష్ణుడు వీధిముఖం చూడకండా, మొగుడు చచ్చిన విధవలాగ ఇంట్లో దూరి కూచుంటున్నాడు. నాన్న చుట్టలు తెమ్మని పురమాయించేడు. హైస్కూలు దాటి చుట్టల దుకాణాని కెళ్లాలి. మేష్టర్లు, తోటి విద్యార్థులు అక్కడుంటారు. కృష్ణుడికి రోడ్డెక్కడమే నామోషీకీగా ఉంది. బడిపక్క నుంచి ఎలాగ వెళ్లడ మని గింజుకుంటూ బయలుదేరేడు.

ఉదయం ఎనిమిది గంటలు కావొస్తున్నాది. బడిపెట్టే వేళ. వీధిచివరనుంచే బడి గోల సముద్రపు ఘోషలాగ వినబడుతున్నాది. బడిపక్క బడి వెళ్లకతప్పదు; రాక తప్పదు.

బడి కనబడగానే కృష్ణుడికి బెంగపట్టుకుంది. హైస్కూలు పిల్లల గందరగోళంతో కలకల్లాడుతున్నాది. వరండాలు, గదులు, చుట్టూ రోడ్లూ విద్యార్థులతో, విద్యార్థినులతో చూడ సొంపుగా ఉంది. రోడ్డువారగా కృష్ణుడు తలొంచుకుని పరిగెట్టాడు.

"కృష్ణా!" అని స్కూలువరండాలోంచి కేకొచ్చింది. కృష్ణుడు తిరిగిచూడక తప్పింది కాదు. నరిశింహం పరిగెట్టుకొచ్చి వాడి బుజంమీద చెయ్యేసి—

"ఏంరా, నువ్వు బళ్లోకి రావడం లేదు?" అనడిగేడు.

"సోమవారం చేరతాను" అని కృష్ణుడు చెప్పేడు.

"పుస్తకాలు కొన్నావా?"

"ఇంకా లేదు"

"వేగిరం కొనుక్కో. మళ్లా అయిపోతాయి. ఎక్సరుసైజుపుస్తకాలు షాపుల్లో కొనకేం. స్టోర్సులో చవగ్గా ఉన్నాయి. ధరలన్నీ దారుణంగా పెరిగిపోయాయిరా"

నరిశింహం డబుల్‌కఫ్పుచొక్కా, హానా వాపేంటూ, జోళ్లూ తొడుక్కుని నీటుగా ఉన్నాడు. కృష్ణుడుకి ఉన్న బట్టలన్నీ రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు; ఉన్నాయంటే ఉన్నాయి. ఒక నిక్కరుకి పోస్టాఫీసుంది. ఒక చొక్కా బుజం చిరిగి జారిపోతే వాళ్లమ్మ ఎత్తికుట్టింది. చెయ్యి బుట్టలాగ లేచిపోయింది. రేవు కోజత. కృష్ణుడు పేంట్లు కుట్టించమని ఎప్పుడూ ఏడవలేదు. పేంటుకైతే బట్ట ఎక్కువపడుతుంది. బట్ట ఎక్కువైతే డబ్బు ఎక్కువౌతుం దని వాడికి తెలుసు. మరి రెండు జతలు కుట్టించమని బతిమాలు

కున్నాడు. కాళ్లా వేళ్లా పడ్డాడు. ఏడ్చుకొన్నాడు. ప్రయోజనం లేకపోయింది.

నరిశింహాంచంకలో కృష్ణుడికి కొత్త పుస్తకం కనబడ్డాది.

"ఏం పుస్తకంరా అది ?" అనడిగేడు.

"ఇంగ్లీషుపుస్తకం. నేనన్నిపుస్తకాలూ కొనేశాను. జాగ్రఫీపుస్తకమే కొనలేదు. జాగ్రఫీపుస్తకా లింకా స్టోర్సువాళ్లకి రాలేదు. చూడు పుస్తకం" అని ఇచ్చేడు.

కృష్ణుడు పేజీలు తిరగేశాడు. కొత్త పుస్తకంలోంచి ఒకవిధమైన పరిమళం పైకి వచ్చింది. కృష్ణుడు పుస్తకంలోకి మొహం పెట్టి వాసనచూశాడు.

"కొత్తపుస్తకంవాసన బాగుంటుంది కదరా?" అన్నాడు నరిశింహం.

"కమ్మగా ఉంటుంది. నా కెంతో ఇష్టం" అన్నాడు కృష్ణుడు.

"నీ కింగ్లీషులో ఫస్టుమార్కు రాలేదు కదరా?"

"నాలుగుమార్కుల్లో పోయింది"

"ఎవరి కొచ్చిందిరా?"

"శకుంతల కొట్టేసింది"

"నిజమే ? నే న్నమ్మలేదు: దాని కెన్నొచ్చాయి?"

" నా కరవైనాలుగు. దాని కరవై ఎనిమిది"

"ఆడపిల్లని మేష్టరు వేసీసుంటాడు"

"నీమొహాం! అది తెలివైంది."

"తస్సాచెక్కా! ఆడపిల్లలు చదివేస్తున్నారురా!"

కృష్ణుడు మార్కులగొడవ తేగానే గొప్పవాడయిపోయాడు. తెలివైనవాడు కాబట్టే నలుగురూ గౌరవిస్తున్నారు. లేకపోతే వాడి కుళ్లుగుడ్డలని చూసి అంతా దూరంగా ఉండేవాళ్లే. వాడికి బడిపక్కని నిలబడడం, బడికెళుతున్న నరిశింహాన్ని చూడడం చాలా కష్టంగా ఉంది. ఎంచేతంటే కృష్ణుడు బడికెళ్లి చదువుకొనే అవకాశాలు తప్పిపోయాయి. వాళ్ల నాన్న ఈయేడాది కృష్ణుడికి చదువు చెప్పించనని నిశ్చయంగా చెప్పేశాడు.

"ఎక్కడేనా చదువు మాన్పించుతారండి? ఋణమో పణమో చేసి ముక్క చెప్పించకపోతే కుర్రాడెందుకేనా పని కొస్తాడా? చదువుకునే ఈడులో బడి మాన్పించి ఇంట్లో కూర్చోపెడితే తరవాత గాడిదలని కాయడానికేనా పనికిరాకుండా పోతాడు. ఏదో చూసి బడిలో వెయ్యండి" అని వాళ్లమ్మ శతపోరి చెప్తుకొస్తున్నాది.

"బళ్లో వెయ్యగానే సంబరమా? వాడు చదివేది ఫోర్తుఫారమ్. జీత మెక్కువ. నెల నెలా ఐదున్నర కట్టాలి. తూగ్గలనా? ప్రవేశ పెట్టడానికి, పుస్తకాలకే ఔతుంది పాతిక రూపాయిలు. దస్తాకాయితాలు రూపాయి. అర్ధణాపెనసలు అరణాలు! ఎక్కణ్ణుంచి తేవడం? మొహాన్ని వాడికి లేందే! వాడి ప్రారబ్ధం మనప్రారబ్ధం! వారంవారం ఎక్కడ లేని డబ్బూ బియ్యానికి ముడుపు చెల్లించడానికే తల్ప్రాణం తోక్కొస్తున్నాది. మాటలా?" అని వాళ్ల నాన్న చెప్తుకొస్తున్నాడు.

తల్లిమాట నెగ్గుతుందో, తండ్రిమాట నెగ్గుతుందో ఇంకా తేలలేదు. కృష్ణుడికి

మాత్రం సందిగ్ధంలేదు. వాడు తలిదండ్రులని బాగా ఎరుగు. తల్లి ప్రతివిషయంలోనూ బడబడలాడడమేకాని ఆఖరికి తండ్రి చెప్పినట్టే జరుగుతూఉంటుంది. అంచేత చదువుకి స్వస్తిచెప్పడమే ఖాయమని నిర్ధారణచేసుకొని నామర్దాతో కృష్ణుడు కుళ్లిపోతున్నాడు.

కృష్ణుడికి కొత్త ఇంగ్లీషుపుస్తకంపేజీలు తిరగేసినకొద్దీ గుండెల్లో గాభరా పుట్టింది. చదువుతున్న కుర్రాళ్లమీద ఈర్ష్య, తనకి చదువులేకండా పోయిందన్న దుఃఖము— రెండూ రెండు లేడికి పాములై అతని బుర్రని కరకరలాడిస్తున్నాయి.

"కృష్ణా, వేగం చేరురా. డివిజన్లు పెట్టేశారు. నేను 'జే'డివిజనులో పడ్డాను. మనబేచివాళ్లంతా 'జే' డివిజనులోనే పడ్డారు." అన్నాడు నరిశింహం.

"అమ్మ బాబో! 'జే'డివిజనుదాకా పిల్లలున్నారా?" అని ఆశ్చర్యపడ్డాడు కృష్ణుడు.

"'జే'తో ఐపోలేదు. 'కే'డివిజనుకూడా ఉన్నాది."

ఏ, బి, సి, డి అని లెక్కబెట్టి— "పదకొండు డివిజన్లే!" అన్నాడు కృష్ణుడు. ఒక్క ఫోర్తుఫారములో సుమారు ఐదు వందలమంది విద్యార్థు లున్నారు. కృష్ణుడు అక్కడ నిలబడలేక పుస్తకా న్నిచ్చేసి "నేను చుట్టల కెళ్లాలి, పోతా"నన్నాడు.

"ఈబొమ్మ చూశావట్రా ?" అని నరిశింహం పాఠాలకి ముందున్న త్రివర్ణ చిత్రం తీసి చూపించేడు.

రైతులు జొన్నచేలు కోస్తున్నారు. జొన్న రేకులని కూడదీసి కట్టుకొన్న పిట్టగూడు గుడ్లతోటే జారిపోతున్నాది. చేలమీద రెండు పిట్టలు ముక్కులు విప్పి ఎగురుతున్నాయి. కోతలవాళ్లు తలలెత్తి పిట్టలని చూస్తున్నారు. అదీ త్రివర్ణచిత్రం!

హైస్కూలు మొదటిబెల్లు ఖంగుఖంగుమంటూ దూరంగా ఉన్న పిల్లలందరినీ పిలుస్తున్నాది. రోడ్లు, వరండాలు, గదులూ విద్యార్థులతో, విద్యార్థినులతో,ఉపాధ్యాయులతో కలకల్లాడుతున్నాది.

పుస్తకాలు పట్టుకుని, సరస్వతీదేవిలాగు శకుంతల వొచ్చింది. ఆమె చిన్నపిల్ల. పదకొండేళ్లది. సూదిముక్కు, సూదిగెడ్డాం, ఆ రెంటికీ పొందికయిన నోరు కలిగి ముద్దొస్తూ ఉంటుంది. తెలివితేటల తళుకుతో దాని కళ్లు చాంచల్యాన్ని పొందుతున్నాయి.

"కృష్ణా! ఇంగ్లీషులో ఫస్టుమార్కు నాది!" అని వొస్తూనే ఉడికించింది.

"ఒక్క ఇంగ్లీషులోనేకదా! నాకు మూడింట్లో ఫస్టుమార్కు లొచ్చాయి. లెఖ్ఖల్లో నూటికి నూరు" అన్నాడు కృష్ణుడు.

"ఇంగ్లీషు ముఖ్యమైందండీ" అన్నాది శకుంతల.

"లెఖ్ఖ లంతకన్నానండి. ఆమాటకొస్తే తెనుగు ముఖ్యమండి. తెనుగులో ఫస్టుమార్కెవరిదండి?"

"ఇంగ్లీషే ముఖ్యమండి. ఎవరి నడుగుతావో అడుగు"

"తెనుగేనండి. బియ్యేవాళ్లకూడా ఇంగ్లీషులో మానేసి లెఖ్ఖలూ అవీ తెనుగులోనే చెప్పాలని పేపర్లో పడ్డాదండి"

"నువ్వు మహా పేపరు చదివిపడేశావు!"

"నే నాంధ్రపత్రిక రోజూ చదువుతాను. మాయింటిదగ్గరవాళ్ల కొస్తుంది"

రెండోబెల్లు ఖంగుఖంగుమని ప్రారంభ మైంది.

నరిశింహానికి శకుంతలమొహం చూడ్డానికి లజ్జవేసింది. వాడు చదువూసంధ్యా రాని దద్దమ్మ. వాళ్లతోపాటు సంభాషించడానికి తాహత్తు లేక తలవాల్చుకుని మౌనవ్రతం పట్టేడు. తన హానావాపంట్లాము ధగధగ లాడుతున్నా, కృష్ణుడి కుళ్లునిక్కరు కనబడు తున్నా వాడికి తక్కువతనం పట్టుకుంది. రెండోబెల్లు కాగానే చల్లగా బడిలోకి జారి పోయాడు.

"బెల్లయింది, బళ్లోకి రా" అన్నాది శకుంతల.

"నేను సోమవారంనుంచి వస్తాను" అన్నాడు.

"ఫోర్తుఫారమ్‌లో నీవని చెపతాను. ఒక్కఫస్టుమార్కు రానివ్వను."

"ఇహ నన్ని ఫస్టుమార్కులూ నీవేలే"

"ఏం?"

"ఏమీా లేదు"

"నువ్వు మాయింటికి రావడం మానేశావేంరా? మాఅమ్మా, నాన్నా 'కృష్ణుడు రాలేదేమా' అని రోజూ అంటారు"

"ఏమీా లేదు"

"నేను బళ్లోకి పోవాలిబాబూ" అని పరిగెట్టింది.

"శకుంతలా!" అని పిలిచాడు.

"ఏం?" అని ఆగింది.

ఎందుకు పిలిచాడు? ఆమెతో నిజం చెప్పేసి దుఃఖోపశమనం చేసుకొందుకా? ఎందుకు పిలిచాడో వాడికే తెలియలేదు.

"ఏమీా లేదు" అన్నాడు.

శకుంతల వెళ్లిపోయింది. ఇద్దరూ ఒక్కఈడువాళ్లు. క్లాసుకి వాళ్లిద్దరే అందరికన్నా తెలివైనవాళ్లు. ఒకరి నోట్సు ఒకరు పుచ్చుకొంటూ స్నేహంగా ఉండేవాళ్లు. పంతంతో చదివేవాళ్లు. శకుంతలతో పోటీ కృష్ణుడికి వికాసవంతరిగా ఉండేది. శకుంతలదస్తూరీ కృష్ణుడికి జ్ఞాపకమొచ్చింది. ఆమెదస్తూరీ మంచిది కాదు. కొక్కిరిబిక్కిరిగా రాస్తుంది. అతనిని ముత్యాలకోవ.

శకుంతల బడిలోకి పరిగెడుతుంటే కృష్ణుడు స్తంభించిపోయి చూస్తూ నిలబడి పోయాడు. పిల్లల గోలంతా క్రమేణా అణిగి పోయింది. వరండాలన్నీ ఖాళీ అయి పోయాయి. మేష్టర్ల మాటలు ఉండుండి వినబడుతున్నాయి. వేలకొద్దీ విద్యార్థులు డెస్కులమీద వాలి కూచుని పాఠాలు వింటున్నారు. బడిదగ్గరనుంచి కృష్ణుడు కదల లేకపోయాడు. తన చదువు పోయిందికదా అని కుమిలిపోతున్నాడు. స్కూలువరండాలో కెళ్లాడు.

"నే నిక్కణ్ణుంచి కదలను" అనుకొని స్తంభానికి జేరబడ్డాడు.

"నే నింటికే వెళ్లను" అని నిశ్చయించుకొన్నాడు.

నాలుగోక్లాసు దగ్గరనుంచి బడిలో తను చదివిన ఐదేళ్ల సంగతులూ ఒక్కొక్కటే జ్ఞప్తికివొచ్చేయి.

ఐదోక్లాసు చదువుతుండగా ఒక పిల్లడు

కృష్ణుడిమీద మేష్టరుతో చాడీలు చెప్పేడు. మేష్టరు నమ్మక అబద్ధాలు చెప్పేడని వాణ్ణే చితకతన్నేడు.

మూడో ఫారమ్‌లో తెనుగు మేష్టరు "గాంధారపతి" అంటే అర్థం చెప్పమన్నాడు. అంతా నేల చూసి, ఇంటికప్పు చూసి ధృతరాష్ట్రు డని చెప్పేరు. తనొక్కడే "గాంధారదేశపు రాజు" అని చెప్పేడు.

రెండో ఫారమ్ చదువుతుండగా దసరా తరవాత ఒక కుర్రాడు బడికి రావడం మానేశాడు. వాడి పేరు రోజూ పిలిచి మేష్టరు ఆబ్సెంటు వేస్తూఉండేవాడు. ఆఖరికి వాడు చదువు మానేశా డని తెలిసింది. ఆవేళ అటెండెన్సు రిజిష్టరులో వాడి పేరు కొట్టేసి మేష్టరు "డిస్కంటిన్యూడ్" (Discontinued) అని రాసి ఆ ఇంగ్లీషు మాటకి అర్థం క్లాసులో చెప్పేడు. ఆనాటి నుండి కృష్ణుడు "డిస్కంటిన్యూ" అన్న మాట అర్థం మరిచిపోలేదు. ఆపదం జ్ఞాపకం రాగానే అతనికి దుఃఖం పొంగి పొర్లుకొంటూ వొచ్చింది.

"నే నింటికే వెళ్లను" అని పునః నిశ్చయించుకొన్నాడు.

"నేను భోజనానికే వెళ్లను" అనుకొన్నాడు.

అతని మొహం గాలికొట్టిన కొత్తఫుట్‌బాలులాగ దుఃఖంతో పొంగి కందగడ్డయిపోయింది. ముక్కు సీటితో బరువెక్కి దిబ్బడేసిపోయింది. ముక్కు ఎగబీల్చుకొంటూ పొంగుకొస్తున్న దుఃఖానికి ఆనకట్టలు కట్టి దిగమింగుతూ స్తంభానికి జేరబడిపోయాడు.

మొదటి పీరీ డైపోయింది. కృష్ణుడు కదలలేదు. వాళ్ల నాన్న బజారుకి బయలుదేరేడు. వరండాలో కొడుకుని చూశాడు.

"ఓరి వెధవా! చుట్టలు తెమ్మంటే ఇక్కడ దిగమారేవేం?" అన్నాడు.

"చూడు!" అన్నాడు కృష్ణుడు.

"ఏమిట్రా చూడ్డం?" అన్నాడు తండ్రి.

"పాపం, కనబడదు!"

"ఏమిటిరా నీ శ్రాద్ధం?"

"నా శ్రాద్ధమే!"

"ఏమిటితా?"

"వాళ్లంతా బడికెళ్లారు"

అప్పుడు తండ్రికి కొడుకుమొహంలో విచారరేఖలన్నీ కనబడ్డాయి.

"వెర్రినాగమ్మా, అదిరా!" అన్నాడు. కృష్ణుడికి ఆనకట్టలు తెగ్గొట్టుకుని దుఃఖం కొట్టుకొచ్చింది. వెక్కి వెక్కి చుట్టుకుపోతూ ఏడుపు మొదలెట్టేడు. కొడుకుబాధంతా తండ్రికి బోధపడ్డాది. కొడుకుబాధంతా తండ్రి పడ్డాడు.

"చదువు మానిపించా నని అంత బాధపడుతున్నావా? బడివరండాలు పట్టుకొని దేవుళ్లాడుతున్నావా నాయనా? పద ఇంటికి" అన్నాడు.

"నే రాను!" అని భూమి బద్దలైపోయినంత గట్టిగా అరిచేడు.

"ఏం చేస్తావురా?"

"గోడకేసి బుర్ర బద్దలుకొట్టుకొంటాను" అని ఇంకా గట్టిగా అరిచేడు. అంతపనీ చేస్తాడేమోనని వెళ్లి తండ్రి కౌగలించుకొన్నాడు.

"పద నాయనా ఇంటికి" అన్నాడు.

"బడి నాది!" అని గట్టిగా కేకేశాడు.

"నీదేనురా బాబూ"

"బడిలోకి తీసికెళ్లు మరి"

"తల తాకట్టుపెట్టుకునేనా బళ్లో వేస్తాను. ఇంటికి పద"

"ఇప్పుడే వెయ్యి"

"డబ్బు చూసి వేస్తాను"

"ఇంటికెళ్లి లేదంటావు"

"అన్నరా"

"ఐతే పుస్తకాలు ముందు కొను"

"వెర్రి నాయినా! వాటికి మాత్రం డబ్బొద్దూ?"

"ఒక్క పుస్తకం కొను"

"ఏపుస్తకం కొనమన్నావు?"


"ఇంగ్లీషుపుస్తకం కొను"

"కొందాం, పద. ఏడవకునాయినా. నేం చచ్చిపోయాను, ఏడవకు" అన్నాడు తండ్రి. తండ్రిచెయ్యిని చంకలో పెట్టుకొని గిలగిల కొట్టుకొని ఏడుస్తూ బడిలో స్టోర్సుకి తోవ తీశాడు.

తండ్రికి ఆలోచన తట్టింది.

"చుట్టలు మానేస్తాను. ఇహను బుద్ధొచ్చింది. ఎంత మానుదామనుకొన్నా మానలేకపోతున్నాను. చుట్టలు మానేస్తే నీబడి జీతానికిసరిపోతుంది. ఇందాకా చుట్టలకిచ్చిన డబ్బులున్నాయా పారేశావా?" అనడిగేడు తండ్రి.

"ప ... ప్ప ... ప్పారీలేదు జేబులో ఉన్నాయి ... ఎందుకు పారేస్తానునాన్నా?" అన్నాడు కృష్ణుడు.



సార్జెంటు విద్యాప్రణాళిక

= శ్రీ వేదుల జగన్నాథం =

★ ★

౨

ప్రాథమికపూర్వవిద్య :

ఏ దేశములోనైనను సరియైన విద్య గరపవలె నన్నచో పసితనమునుంచి శిక్షణ ప్రారంభించాలి. మూడేండ్లు మొదలు ఆరేండ్లవరకూ ఆటపాటలద్వారా నేర్పిన విద్యయొక్క విలువ ఆజన్మాంతమూ మనస్సుల పై హత్తుకొని ఉంటుంది. అట్టి విద్య గరపుటకు దాదులతో కూడిన శిశుపాఠశాలలు, క్రెచీలు మొదలగు ప్రత్యేకసంస్థలు అవసరము. సంపూర్ణవిద్యావిధానమున కట్టి సంస్థలు పునాదులు. మన దేశములో ఈ సంస్థల సంఖ్య మిక్కిలి తక్కువ. వాటి అవసరమును గూర్చి ఇంకను విపులముగా ప్రశంసించు టనవసరము. ప్రత్యేక ధాత్రీపాఠశాలలు ప్రారంభించుట దుర్లభమైనచో ప్రాథమికపాఠశాలలలోనే శిశువిద్యకై సదుపాయములు సమకూర్చవలెను. శిశువిద్య గరపుటకు ప్రత్యేకముగా శిక్షణపొందిన స్త్రీలనే నియమించవలెను. నిర్బంధముచేసినను చేయకపోయినను ఈవయస్సులోని విద్య ఉచితముగా నీయవలెను. గృహపరిస్థితులూ, పరిసరములూ బాగుగా లేక పోయినను, తల్లిదండ్రులు కూలినాలికి పోవు సందర్భములలోనూ శిశువుల నట్టి ధాత్రీపాఠశాలలో విడిచివెళ్లవలె నని ప్రబోధముచేసి తల్లిదండ్రులను ఒప్పించవలెను. ౩ మొదలు ఆరేండ్ల మధ్య వయస్సు గల శిశువులకు (౧౦ లక్షలమందికి) విద్య గరపుటకు సాలీనా ౩౧౮.౫ లక్షలు వ్యయమగును.

ప్రాథమికవిద్య-మాధ్యమికవిద్య :

ఈ విద్యాకాలమును రెండు భాగములుగా విభజింపవచ్చును: ౧. ప్రాథమికవిద్య, ౨. మాధ్యమిక విద్య. ఈకక్ష్యలో ౬ మొదలు ౧౪ సంవత్సరముల మధ్య వయస్కులకు విద్య నేర్పబడును. ప్రాథమిక విద్య ౫ సంవత్సరములు, మాధ్యమికవిద్య ౩ సంవత్సరములుగ విభజింపవలెను. ఈ వయస్సులో విద్య ప్రతిపౌరునకూ నిర్బంధముగా, ఉచితముగా నొసగవలెను. ఈ తరగతులలోని విద్యాప్రణాళిక గాంధీమహాత్ముని వార్ధావిధానపు నమోనామీద తయారుచేయవలెను. చేతిపనులద్వారా విద్య గరపవలె నను మహాత్ముని విద్యావిధానసూత్రము ప్రపంచమంతటా ఏకగ్రీవముగా హర్షింపబడెను. ౧౪-వ సం.న పాఠశాల విడుచుసరికి ప్రతియువకుడును, యువతియు తమతమ పౌరసత్వస్థాన మలంకరించుటకు తగినవారినిగా చేయవలె నను సూత్రము ఈ తరగతివిద్యయొక్క మహదాశయము. ఈవయస్సులో నొసగు విద్య అక్షరాస్యులనుగా చేయుటయేగాక స్వయంపోషకమగు వృత్తులలో తర్ఫీజు చేయునదియై ఉభయతారకముగా నుండవలెను. ఎట్టి వృత్తులను నేర్పవలె నను విషయము స్థానికావసరములనుబట్టి నిర్ణయింపబడును. జాతిలో బహుళసంఖ్యాకమగు భావిపౌరులను తయారుచేయు సంస్థలుగనుక ఈ వయస్సు (౬ మొదలు ౧౪ సం.లు)లో విద్యను గరపే పాఠశాలలో పరికరములను, ఉపాధ్యాయులను కొరత లేకుండా సరఫరాచేయవలెను.

ప్రాథమికతరగతులలో ౩౦ మంది విద్యార్థులకొక ఉపాధ్యాయుడును, మాధ్యమికతరగతులలో ౨౫ మంది కొక ఉపాధ్యాయుడును ఉండవలెను. ఈ లెక్క నాధారముగాచేసికొనియే ఖర్చు అంచనావేయబడినది. ఆవయస్సులో పాఠశాలకు పోవు విద్యార్థులు ౫౧౫ లక్షలమంది ఉందురు. (౩౬౦ లక్షలు ప్రాథమిక తరగతులలోను, ౧౫౫ లక్షలమంది మాధ్యమికతరగతు

లలోను) పైనచెప్పిన లెఖ్ఖ ప్రకారము ౧౫.౨ లక్షల మంది ఉపాధ్యాయు లవసరమవుతారు. మొ త్తమువిద్యా విధానములోని ఖర్చు అంతటిలోనూ ఈతరహా విద్యకే ఖర్చు ఎక్కువగును. ఈవయస్సులోవారికి విద్య నొసగుటకు ౨౦౦కోట్ల రూప్యము లగును. ఒకొక్క ప్రాథమిక తరగతిలోని విద్యార్థిపై సాలునకు ౩౧.౫౮ రూపాయలును, మధ్యమతరగతి విద్యార్థిపై సాలునకు ౫౫.౩౧ రూపాయలును వ్యయమగును.

ఉన్నతపాఠశాలలు :

౧౧ సంవత్సరములు వచ్చుసరికి ప్రాథమికవిద్య పూ ర్తియగును. అవగానే బాలబాలికలయొక్క మానసిక శక్తులను, అభిరుచులను నిష్పాక్షికముగా పరీక్షజేసి ఉన్నతపాఠశాలలకు పంపించవలెను. ఉ త్తమతరగతుల లోని విద్యాఫలితము లీపరీక్షా ఫలితములపై నాధారపడి యుండును.

ఉ త్తమపాఠశాలలోని విద్య ఉచితమూ కాదు; నిర్బంధమూ కాదు. అయినను పైపరీక్షలలో తగిన వారుగా ఎన్నుకోబడిన విద్యార్థులు ధనాభావముచే చదువు సాగించుకొను పరిస్థితులలో లేనిచో వారికి పోషణఖర్చుల నిచ్చుచు ఉచితముగా విద్యగరపవలెను.

ప్రాథమికమాధ్యమిక పాఠశాలలకును, ఉ త్తమ విద్యాశాలలకును లక్ష్యములోనూ, దృక్పథములోనూ కూడా మిగుల వ్యత్యాస మున్నదని గ్రహించవలెను. మొదటిరకపు పాఠశాలలో విద్య ఒకతరహాకు వచ్చి సంపూ ర్తియగును. కాని ఉన్నతపాఠశాలలలోని విద్య ఇంకా పైఅంతస్తులకు తీసికొనిపోవు సోపానములుగా పరిగణించబడును.

పదకొండవ సంవత్సరము పిమ్మట జరిగిన పరీక్షలో అనుత్తీర్ణులైనవారికి ఉన్నతపాఠశాలా ద్వారములు పూ ర్తిగా ఎల్లకాలములకు మూసివేయ బడకూడదు. అర్హత గల విద్యార్థులను మాధ్యమిక పాఠశాలలనుండి యైనను గై కొనవలెను. ఉ త్తమవిద్య సాగించుటకు తగిన చిహ్నములు పొడసూపినచో విద్యార్థులకు ఉన్నతపాఠశాలలలోనికి అనుమతిని నిరాకరించకూడదు.

ప్రాథమికవిద్యానంతర పరీక్షలో ప్రతి ౫ గురు విద్యార్థులలోనూ ఒక విద్యార్థి ఉ త్తమ విద్యార్హత కలిగియుండునని ఇతరదేశములలోని అనుభవము చెప్పుచున్నది. ఆ అనుభవప్రకార మంచనా వేసినచో మన దేశములో ౧౧-౧౪ సంవత్సరముల మధ్య వయస్సుగలవారికి ౮౨.౫ లక్షలమందికి విద్య గరపవలసిన అవసర ముండును. ఈ వయస్సులోని వారికి ౧౦ లక్షలమందికి విద్య గరపుటకుమాత్రమే నేడవకాశము లున్నాయి. కాబట్టి మిగిలిన ౭౨.౫ లక్షలమందికి విద్యగరపుటకు నూత్నసంస్థలు నెలకొల్పవలెను. వర్తమానాచారమగు ౫ సంవత్సరములుగాక ఉన్నతవిద్యాకాలము ఆరుసంవత్సరములు చేయవలెను.

విశ్వవిద్యాలయములకు ముఖద్వారములుగా కాకుండా, ఉన్నతపాఠశాలలో నొసగు విద్య సంపూర్ణమై స్వయంస్థాయిగా నుండవలెను. స్వావలంబకమగు వృత్తులకుగాని, పరిశ్రమలకుగాని తగినవారినిగా చేయు విద్య నీపాఠశాలలో నేర్పవలెను. ఉ త్తమ పాఠశాలలను రెండురకములుగా విభజింపవచ్చును: (౧) సారస్వత, (౨) పారిశ్రామిక పాఠశాలలు. మొదటిరకపు పాఠశాలలు శాస్త్రములను, కళలను బోధించును. రెండవరకపు పాఠశాలలు పరిశ్రమలూ, వాణిజ్యమూ మొదలగు విద్యలు నేర్పును. ఈ రెండు రకముల పాఠశాలలలోనూ మొదటితరగతులయందు సామాన్యసంబంధ మెక్కువగా నుండును. చరిత్ర మొదలగు మానవసాంఘికశాస్త్రములు సామాన్య కేంద్రముగా నుండును. రెండురకముల పాఠశాలలలోని విద్యయును సంపూర్ణముగా నుండవలె నన్నచో సంగీతాదికళలతో మిళితమై ఉండవలెను. బాలికలకు గృహశాస్త్రములో తప్పక శిక్షణ నొసగవలెను.

ఒకొక్కక్క ప్రాంతములో ఏరకపు పాఠశాలను పెట్టవలసినదీ, ఏమాదిరి శిక్షణ నీయవలసినదీ స్థానికావసరములనుబట్టి నిర్ణయింపవలెను. అయినను ఒక్క విషయముమాత్రము గమనించవలెను. తమ స్వంతభూములలోగాని, ఇతరభూములలోగాని ప్రబలముగా వ్యవసాయము సాగించే పల్లెప్రాంతములలో

పాఠ్యప్రణాళిక వ్యవసాయపాక్షికముగా నుండి, ఎక్కువకాలము దానికై వినియోగించవలెను.

౨౦ మంది విద్యార్థుల కొక్కొక ఉపాధ్యాయుడుచొప్పున అంచనావేసినచో బ్రిటిషుఇండియాకుమాత్రము ౩.౬ లక్షలమంది ఉపాధ్యాయులు కావలసిఉండును. వారిలో సగముసంఖ్య పట్టభద్రులుగను, మిగిలినవారు పట్టభద్రులు కానివారుగాను నుండవచ్చును. ఉపాధ్యాయుల జీతములకు ౫౫.౧౮ కోట్లగును. మొత్తముఖర్చులో ఇది ౮౦%.

సాలీనా ఒక్కొక విద్యార్థిపై ౧౦౯ రూపాయలు ఖర్చు అగును. మొత్తము విద్యార్థులలో సగముమంది నెల ౧కి ౬ రూ. చొప్పున జీతము చెల్లింతురని ఊహించినచో ౨౬.౧౧ కోట్ల రాబడి విద్యార్థుల రుసుములవల్ల వచ్చును. అనగా మొత్తముఖర్చులో ౩౦% వచ్చును. విరాళములద్వారా ౫% వచ్చుననుకొన్నచో ప్రభుత్వంవారు ౬౫% ఖర్చు చేయవలసివచ్చును. బ్రిటిషు ఇండియాలో ౫౦ కోట్ల రూపాయల ఖర్చు తేలును. ప్రభుత్వము ఖర్చు పెట్టవలసినదానిలో ఇది రెండవ పెద్దమొత్తము.

3

విశ్వవిద్యాలయములు:

గత ౪౦ సంవత్సరములలోను విశ్వవిద్యాలయములు బాగా వృద్ధిపొందినవి. కాని ఏవిశ్వవిద్యాలయము కూడా ఉన్నత విద్యాదర్శములను పొందగలిగిన దని చెప్పుటకు తగిన స్థితిలో లేదు. సంఘావసరములకును, విశ్వవిద్యాలయవిద్యకును సంబంధము శశవిషాణప్రాయముగా నున్నది. పట్టభద్రులలో నిరుద్యోగిసంఖ్య నానాటికి హెచ్చుచున్నది. ఇట్టి శోచనీయపరిస్థితుల కనేకకారణములు తోడ్పడ్డాయి. అందులో ముఖ్యముగా పరీక్షలపట్ల అధికప్రాముఖ్యత, ట్యుటోరియల్ శిక్షణాపద్ధతి లేకపోవుట, గురుశిష్యసంపర్కములేమి, మాతృవిశ్వవిద్యాలయము లన్న ఆదరానురాగములు లేకపోవుట మున్నగు కారణాలు నేటి విద్యావిధానము నెకసక్కములపాలు చేశాయి. విశ్వవిద్యాలయముల ప్రశస్తిహీనస్థితికి ధనస్తోమత తక్కువగుటయే ముఖ్యకారణము. పౌరవిరాళములుగాని, ప్రభుత్వసహాయముగాని విరివిగా లేకపోవుటవలన విద్యార్థుల జీతములును, పరీక్షరుసుములును ప్రధానాదాయము లయాయి. అందుచేత విద్యార్థులను చేర్చుకొనుటలో కళాశాలాధికారులు ఉన్నతప్రతిభానియమాలను పాటించలేకపోతున్నారు. సమగ్రదృష్టితో నిర్ణయింపబడకపోవుటవలన నేటి విద్యావిధానములో సామరస్యసౌష్ఠవము, శిల్పము కొఱవడ్డాయి. ప్రజల అలజడికి లొంగి ప్రభుత్వమువారు విశ్వవిద్యాలయములు స్థాపించారుగాని వాటి సుస్థిరతకుగాని, అభివృద్ధికిగాని మిక్కిలి తోడ్పడలేదు. సులభమగు స్కూలుఫైనలు పరీక్షామార్గముతప్ప కళాశాలప్రవేశార్హత నిర్ణయించడానికి వేరే సాధనములేదు. ప్రతిభ గలిగిన బీదవిద్యార్థులున్నతవిద్య సాగించుట కుపాధి కలిగించు సంస్థలు బహు స్వల్పము.

౧౯౪౧-౪౨ సంవత్సరములలో కళాశాలలలో బి.ఏ, బి. ఎస్ సి. చదువు విద్యార్థుల సంఖ్య మొత్తం ౪౩,౮౪౨. అందులో ౩౨,౯౮౨ కళాతరగతులలోను, ౧౦,౮౮౦ (అనగా $\frac{౧}{3}$) శాస్త్రతరగతులలోను ఉన్నారు. కాలేజీ అధికారులు ఖర్చుతక్కువగు కళాతరగతులలోనికి విద్యార్థుల నమితముగా చేర్చుకొనుట మామూలు. పరీక్షలలో అధికసంఖ్యాకు లనుత్తీర్ణలగుచున్నా రన్న యథార్థమునుబట్టి విశ్వవిద్యాలయములకు తగిన విద్యార్థులు వచ్చుట లేదన్న విషయము తేటతెల్లమవుతుంది. ౧౯౪౦-౪౧ లో బ్రిటిషుఇండియాలోని విశ్వవిద్యాలయములలో ౨౦,౫౦౨ మంది విద్యార్థులు బి.ఏ.,బి.ఎస్ సి. పరీక్షలకు కూర్చొన్నారు. వారిలో ౧౧,౧౭౫ మందిమాత్రమే విజయమొందినారు. మిగిలిన ౯,౩౧౮ అనగా ౪౬% తప్పినారు. ప్రపంచములో ఏయితర విశ్వవిద్యాలయములోనూ పరీక్షలు తప్పుట ఇండియాలో నున్నంత దారుణముగా లేదు. ఈ తప్పుటవలన కలిగే కాల, ధన, శక్తినష్టములు కడు దుర్భరములు.

మనదేశపు విద్యాలయవిషయంలో పునాదులకంటె గోపురమే ఎక్కువ ప్రాముఖ్యత వహించింది. కళాశాలలో చేరగోరే విద్యార్థుల సంఖ్య అధికముగా

నున్నది. ఇంటరుమీడియటు (ఎఫ్.ఏ.) తరగతుల సంఖ్య కలుపుకొనకుండా చూచినచో ఉన్నతపాఠశాలలోని ప్రతి ౨౫ గురు విద్యార్థులలోనూ ఒక విద్యార్థి కాలేజీలో ప్రవేశిస్తున్నాడు. ఇంటరుమీడియటుతరగతుల సంఖ్యకూడా కలిపినచో ప్రతిముగ్గురిలోనూ ఒక్కొక్క ఉన్నతపాఠశాలావిద్యార్థి కళాశాలలో ప్రవేశించుచున్నాడు.

నేటి విశ్వవిద్యాలయవిద్యావిధానంలో ఇంటరుమీడియటుతరగతి గతి చాలా సందిగ్ధంగా ఉంది. హైస్కూలుకోర్సున కొక తోకవలె ఉంది. కాని పట్టభద్రత్వమునకు ఇంకా రెండేళ్లు చదవాలి. ఇదో త్రిశంకుస్వర్గస్థితిలో ఉన్నది. పట్టభద్రులయొక్క విద్యాకాలము రెండేండ్లుమాత్రమే అగుటచేత ప్రత్యేక కృషికై యెన్నుకొన్న విషయములలో విద్యార్థులు కూలంకషముగా పరిశ్రమగావించి పాండిత్యము పొందలేకపోతున్నారు.

ఈఇంటరుమీడియటుతరగతిని రద్దుచేసి ఉన్నత పాఠశాలయొక్క కోర్సులో ఒక సంవత్సరమును, పట్టభద్రత్వకోర్సున కింకొక సంవత్సరమును చేర్చవలెనని సాడ్లరుకమీషనువారు సలహానిచ్చారు. ఈమాదిరి సంస్కరణ అత్యవసరము; అతిఉపయోగకరము. కళాశాలలో పట్టభద్రవిద్య కనీసము మూడుసంవత్సరములైనా ఉండాలి.

ఈ ప్రణాళికలో ప్రతిపాదించిన జాతీయవిద్యావిధానంలో ౩౩ లక్షలమంది విద్యార్థులు ఉన్నతపాఠశాలలో ఉంటారు. వారిలో ౧౧ లక్షలమంది ప్రతి సంవత్సరము పాఠశాల విడిచివెడుతూంటారు. కళాశాల ప్రవేశార్హత మట్టము హెచ్చించినచో ప్రతి ౧౫ గురికి ఒక విద్యార్థి కళాశాలలో చేరుటకు తగియుండు నని ఊహించవచ్చు. అనగా ప్రతిసంవత్సరము ౭౪౦౦౦ మందిని కళాశాలలు చేర్చుకోవలసిఉంటాయి. పట్టభద్రానంతరవిద్య, రిసెర్చి కాకుండా మూడుసంవత్సరములు విశ్వవిద్యాలయవిద్య నొసగుచో ౨,౪౦,౦౦౦ మంది విద్యార్థులకు తావుచూపించాలి. అట్లు చేయుటకు నేడున్న కళాశాలలను ద్విగుణీకరించినగాని సరిపోవు.

౧౯౪౦-౪౧ లో విశ్వవిద్యాలయము లన్నింటి యొక్క ఖర్చు ౪,౬౩,౮ లక్షల మొత్తము తేలింది. అందులో ౩౯.౪% ప్రజాధనంలోంచి వెచ్చింపబడింది. ౪౭.౭% జీతములవల్ల, ౧౨.౮% విరాళములవల్లను వచ్చినది. సంస్కరింపబోయే విద్యావిధానముక్రింద ఒక్కొక్క కాలేజీవిద్యార్థిపై ౪౦౦ రూపాయలు (పోషణగాక) ఖర్చు అగును. అనగా ఇప్పుడగు సరాసరిఖర్చుకంటె ౪౦% అధికమగును. ఈఖర్చులో ఉపాధ్యాయుల హెచ్చుజీతములూ, క్లాసులో విద్యార్థుల తగ్గింపువలన అగు అదనపుఖర్చు, ట్యుటోరియల్ పద్ధతికగు ఖర్చుకూడా కలపబడిఉన్నాయి. పైన పేర్కొనబడిన ౨,౪౦,౦౦౦ స్థలములకూ సాలుసరికి ౯౬౦ లక్షల రూపాయల ఖర్చు తేలును.

సాలు ౧ కి ౨౪౦ రూపాయలచొప్పున చెరిసగముమంది విద్యార్థులు జీతము చెల్లింతురని ఊహించినచో జీతములవల్ల ౨౮౮ లక్షల రూపాయల ఆదాయం వస్తుంది. మొత్తంఖర్చులో ఇది ౩౦% సర్దుకొంటుంది. విరాళములవల్ల ౧౦% వచ్చునని తలంచవచ్చును. కాబట్టి మిగిలిన ౬౦ % ఖర్చు ప్రభుత్వం భరించవలసిఉంటుంది. బీదవిద్యార్థుల పోషణకు ౧౦% ఖర్చు అగునని అంచనావేసినచో ప్రభుత్వవ్యయం మొత్తం ౭౦% వరకు తేలుతుంది.

ఏ జాతీయవిద్యావిధానములోనైనా విశ్వవిద్యాలయము లత్యధికప్రాముఖ్యత వహించాలి. పొదుపుకొరకు, అధికఫలాపేక్షతోనూ వివిధవిశ్వవిద్యాలయములలోని కోర్సులు పరస్పరసంబంధ ముండునట్లుగా సమీకరణచెయ్యాలి. వేర్వేరు విశ్వవిద్యాలయములలోని కోర్సులు ఒకదానితో నొకటి పరస్పరవైరము లేకుండునట్లుగా చూడాలి. వివిధసంస్థలమధ్య స్పర్థావైరము తొలగించాలి. అట్లు సమీకరణచేసి పరస్పర సహాయకార్యక్రమమును నిర్వర్తించవలె నన్నచో దేశములోని విశ్వవిద్యాలయములన్నింటిపైనా ఒక కేంద్ర సంస్థ ఉండాలి. ఇంగ్లాండులో గ్రాంట్సుకమిటీ ఈ పని నిర్వహిస్తున్నది. అటువంటి సంస్థ నొకదానిని మనదేశంలోకూడా స్థాపించాలి. అట్టి సంస్థను స్థాపిం

చినయెడల విశ్వవిద్యాలయముల స్వాతంత్ర్యము సమసిపోవు ననుభయమునకు తావులేదు.

ఏయొక విశ్వవిద్యాలయముతోగాని, ప్రభుత్వముతోగాని సంపర్కము లేని ప్రఖ్యాతవ్యక్తులు మెంబర్లుగా గల అఖిలభారతవిశ్వవిద్యాలయకమీషను నొకదానిని ప్రారంభించాలి. విశ్వవిద్యాలయముల యొక్క దైనందినపరిపాలనాకార్యక్రమములో అట్టి సంస్థ ఎట్టి జోక్యమును కలుగజేసికొనకూడదు. అటువంటి కమీషనుయొక్క ముఖ్యకార్యము లేవన—

౧. దేశములోని సకలవిశ్వవిద్యాలయములకూ ప్రభుత్వాదాయమునుండి ఈయబడు విరాళముల మొత్తమును నిర్ణయించుట.

౨. వేరే ధనికులవద్దనుండి హెచ్చువిరాళములు వచ్చునట్లుగా హెచ్చరికసల్పుట.

౩. పరస్పరస్పర్ధలు లేకుండునట్లు చూచుట.

౪. సంఘములోని ఆర్థికావసరములకు, విశ్వవిద్యాలయవిద్యకు సన్నిహితసంబంధ ముండునట్లు చూచుట.

౫. పురోభివృద్ధి ప్రణాళికల ముఖ్యవిషయములలో సలహా నిచ్చుట.

౬. వివిధరాష్ట్రాభ్యంతరములు, విశ్వవిద్యాలయముల్లమధ్య వైషమ్యములు తొలగించుట.

౭. వార్షికముగాగాని, అర్ధవార్షికముగాగాని వివిధవిశ్వవిద్యాలయములను తణిఖీ చేయుట.

౮. పరస్పర వైజ్ఞానికసంబంధము కల్పించుట. విదేశములతో ఉపాధ్యాయులయొక్కయు, విద్యార్థులయొక్కయు ఇచ్చితెచ్చికొనుటలు జరిగించుట.

ఈ మొదలగు కార్యములను అఖిలభారతవిశ్వవిద్యాలయకమీషనువారు సాగించవలెను.



వాసక సజ్జిక

శ్రీ వింజమూరి శివరామరావు

అలకలు గంధధూమముల నారిచి, తీరిచి పత్రపాళి చె
క్కులల, కటి మేఖలాగుణము కూరిచి, పేరిచి వక్షమందు ను
జ్జ్వలతర తారహారములు, ఫాలతలమ్మున చిత్రకమ్ము ప
క్ష్మలముల కజ్జలమ్ము సరిగా సవరించితి నోయి మాధవా !

విమల ముజ్జ్వల మస్మదీయసకలప్రేమమ్ము కర్పూర దీ
పముగా పెట్టితి ; ద్వారతోరణముగా వ్యాకోచభావానుబం
ధము మద్వీక్షణపంక్తి కట్టితి ; సుగంధద్రవ్యసంభావ్యధూ
పముగా పట్టితి నా మనోరథము దేవా ! నీకు సంప్రీతిగా.

ఇందుశరత్సౌభాగ్యము,
బృందావనశోభ, వల్లవీఫుల్లమన
స్సౌందర్యము గృహకుడ్యము
లందున చిత్రించినాను యదుకులతిలకా !

రాలినవోయి ; రాసులుగ రాసులుగా నును తేనెసోనలో
తేలినవోయి ; తీయనగ తీయనగా పరువాలతావిలో
సోలినవోయి ; సొంపులుగ సొంపులుగా వకుళప్రసూనముల్,
మాలిక లల్లి నీకయి సుమా కయిసేసితి శయ్య కేశవా !

నీకై తావులత్రోవ తీర్చెదను నా నిశ్వాసగంధమ్ములన్ ;
నీకై హారతి నాశరీరసితకాంతిన్ కూర్చెదన్ ; పేర్చెదన్
నీకై పూవులమాల నాహృదయతంత్రీబద్ధభావాబ్జముల్ ;
రా, కల్యాణగుణాత్మకా! ప్రణయసామ్రాజ్యైకధౌరేయకా!

పుష్టి గల ఆహారం
అమరినా లేకున్నా,
మిమ్ము బలాఢ్యులనుగా చేసే



అమృత

సర్వదా అమరుతుంది
అమృత పుష్టినిచ్చే బలవర్ధకౌషధము

* కేసరి కుటీరం లిమిటెడ్, మదరాసు *

దక్కన్ హైర్ ఆయిల్

వాడుడు

అనుకరణీయములకు అందదు



వెంట్రుకల పెరుగుదలకు చాల శ్రేష్ఠమైనది. జబ్బుపడి లేచిన వారికి, ప్రసవించిన స్త్రీలకు వూడిపోవు జుట్టును వూడిపోకుండా కాపాడును.

చదువుకొనే వారు, మనోపరిశ్రమ చేయువారు దీనిని వాడి, తమ కిది ఎక్కువ అనుకూలముగా నున్నదని ప్రశంసించిరి.

DECCAN HAIR OIL COMPANY,
Hyderabad (Dn.)



డోంగ్రేగారి

బాలామృతము
బలహీనమైన బిడ్డలకు
పుష్టియున్ను, బలమున్ను
ఆరోగ్యము నిచ్చును.

తేయాకు కథ నెం. 7.



ఒక డార్జిలింగ్ ఎస్టేటులో భద్రముగా బిగించబడిన పెట్టెలు బలమైన పొట్టిగుర్రములపై నెక్కించబడి సమీపమందలి రైలుస్టేషనుకు కొనిపోబడుచున్నవి.

ఫాక్టరికి వీడ్కోలు

వాడ్చుట, చుట్టుట, పులియుట, ఆరబెట్టుట, జల్లెడపట్టుట, విభజించుట, ఈ ఆరు ఫాక్టరీదశలు గడచినపిమ్మట తేయాకుబ్లెండింగ్ ఫాక్టరీచేరుటకు సిద్ధముగానుండును.

సుపరిచితమైన పెట్టెలలో నింపుటకుపూర్వము తేయాకును కడసారి మరియొకమారు త్వరితముగా నారబెట్టి ఆఖరుదశలో దానియందుచేరియుండగల తడినిపోగొట్టుదురు.

బ్లెండింగ్, ప్యాకింగ్ చేయు కేంద్రముచేరినవెనుక సౌరభమునకును, తాజాతనమునకును, ఖ్యాతిగన్న బ్రూక్ బాండ్ తేయాకురసములను ప్రత్యేక నిపుణులు పాళ్లు కలుపుటకు సిద్ధముగానుందురు.

బ్రూక్ బాండ్

బుద్ధికుశలతను, ప్రజ్ఞను ఉపయోగించి వేరొక సంవిధానము ననుసరించి సృష్టిలో లభించే పదార్థాలను సృష్టింపగలుగుచున్నాడు. వృక్షకోటిలో సంభవించే దైనందినసంవిధానములు నీరు, బొగ్గుపులుసువాయువు, సూర్యరశ్మి, భూమియందు లభించే లవణముల సహాయముతోనే జరుగుచున్నవి. ఈ ముడిపదార్థము లన్నియు శాస్త్రజ్ఞుని అందుబాటులో ఉన్నా వాటిని ఉపయోగించుకునే సామర్థ్య మాతనికి ఇంకా లభించలేదు. కనుక నేడాతని ముడిపదార్థము లన్నియు వృక్షజంతు ఖనిజసంపదలనుండియే సంగ్రహింపవలసి వచ్చుచున్నది.

ఈసృష్ట్యనుకరణయాత్రలో శాస్త్రజ్ఞుని రథమనేకఘట్టాలను విజయోత్సాహంతో అధిగమించినా కొన్నిఘట్టాలలో తాత్కాలికఅపజయము సంభవించినది. అనేకపదార్థాలను సృష్టింపగలిగినా క్వైనా, మార్ఫిన్, స్ట్రిక్నైను, చెరుకుపంచదార, పిండిపదార్థములు మొదలైనవి ఎన్నో శాస్త్రజ్ఞుని ప్రయత్నాలను నిష్ఫలముకావించినవి. నేడివి క్లిష్టతరసమస్యలైనను శాస్త్రజ్ఞుడు వీటిని తాత్కాలికముగా విడిచి నూత్నపథములను అనుసరించుచున్నాడు. నేడు సృష్ట్యనుకరణయేకాక ప్రజాసృష్టినిసైతము చేయగల నేర్పు, సామర్థ్యము వైజ్ఞానికులకు లభ్యమైనది. సృష్టిలో లభించే వస్తువులనే సృష్టించలేకపోయినను వాటిని పోలేవి, కొన్ని కొన్నివిషయాలలో వాటిని మించి త్రోసిరాజన్న పదార్థాలను ప్రతిసృష్టికావించి నేటి రసాయనశాస్త్రజ్ఞులు సృష్టిని మరపించుచున్నారు.



శ్రీయుత మామిడిపూడి వెంకటరంగయ్యగారు

శ్రీ

= బుద్ధిరాజు రామచంద్రరావు =

శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్యగారు ప్రసిద్ధ పండితవంశమునకు జెందినవారు; వేదాధ్యయనమునకు పేరుపడిన బ్రాహ్మణకుటుంబమున జన్మించినారు. వీరి పూర్వులలో నొకరి వేదవేదాంగప్రావీణ్యమునకు మెచ్చి విజయనగరాధీశుడగు శ్రీ సదాశివరాయలు మామిడిపూడి యను అగ్రహారము నాయనకు దానమిచ్చెనట. వీరి తాత మామిడిపూడినుండి పురిణికి వలసపోయెను. (ఈగ్రామము నెల్లూరుమండలమునందలి కొవ్వూరుతాలూకాలోనిది) శ్రీ వెంకటరంగయ్యగారిచటనే ౧౮౮౯-వ సం. జనవరి ౮-వ తేదిని జన్మించిరి. ఏడేండ్ల వయసుననే ఉపనీతుడై ఆయన సంస్కృతాంధ్రములను, వేదమంత్రములను తండ్రిదగ్గఱ రెండేండ్లభ్యసించెను. పిమ్మట ఆకాలపు అభిరుచులనుబట్టి శ్రేయస్కామియగు తండ్రి యా బాలకుని చెన్నపురికి దోడ్కొనిపోయి, ఆంగ్లము నభ్యసింపజేసి, ౧౮౯౮లో గోవిందప్పనాయకపాఠశాలలో నేడవతరగతియందు జేర్పించెను. (ఈపాఠశాల పచ్చయ్యప్పకళాశాలకు సంబంధించినది)

ప్రాచీనసంస్కృతి

ప్రకృతిదేవతకు క్రీడారంగములై సహజసౌందర్యమున విలసిల్లు గ్రామపరిసరములనుండి ప్రాసాదకుట్టిమముల కృత్రిమాలంకారముల శోభిల్లు రాజధాని కేగుటవలన గలుగు మార్పును సామాన్యమానవు డూహింపలేడు. సంస్కృతాంధ్రముల నేకాగ్రబుద్ధి నభ్యసింపజేసియు, నిత్యము బ్రహ్మచారివిధుల పాలింపజేసియు, త్రికరణశుద్ధిని గలిగించియు, శిష్యవాత్సల్యమే పుత్రవాత్సల్య మనుటకు నిదర్శనమై పవిత్రమైన ప్రాచీనపాఠశాల ప్రాచీనసంస్కృతికి చక్కగా పునాదివేసెను. బాల్యమునందలి శిక్షణవలననే యౌవనమునందలి ఆశయములు సిద్ధించును.

పాశ్చాత్యవిద్యలో పట్టము

ప్రాచ్యసంస్కృతి పునాదిగా పాశ్చాత్యవిద్యాభవనము నిర్మింపబడెను. మాతృభాషా పాండిత్యమును, దేవభాషా పాండిత్యమును ఆంగ్ల భాషా పాండిత్యమును సంపాదించుటలో బాగుగా సహాయపడెను. భావపరంపరయు, భాషాస్ఫూర్తియు, విమర్శనానైపుణ్యమును నలవడుటచే శ్రీ వెంకటరంగయ్యగారు ౧౯౦౩ లో సునాయాసముగ 'మెట్రిక్యులేషన్' పరీక్షయందుత్తీర్ణులైరి. నలుబది వత్సరముల క్రింద ఈపరీక్షలో నూటికిరువదిమంది మాత్రము విజయము నొందుచుండిరి. ఆకాలమున ఉన్నతవిద్యాభ్యాస మెక్కుడుగ గౌరవింపబడుచుండుటచే పచ్చయ్యప్ప కళాశాలలో శ్రీ రామనాథ శ్రీ రామచంద్ర శ్రీ రామానుజాచార్యుల కడ విద్యార్థియై ఈయన ఎఫ్. ఏ. పరీక్షలో జయము గాంచెను. తరువాత శ్రీ వెంకటరంగయ్యగారు బి. ఏ. పరీక్షయందలి మూడుభాగములలోను-అనగా ఆంగ్లములోను, ఆంధ్రములోను, చరిత్రలోను—ప్రథమశ్రేణిలో నుత్తీర్ణులై యఖండవిజయమును సాధించిరి. ఈ సందర్భమున మద్రాసు విశ్వవిద్యాలయమువారొసంగిన 'నార్టిచ్' బహుమానమును గూడ స్వీకరించిరి.

ఉద్యోగములు

ఇట్టి ఘనత విద్యాసంపాదనమున కాయన నెక్కుడుగ ప్రోత్సహించెను. అధ్యయనమునకును, అధ్యాపనమునకును సన్నిహితసంబంధ ముండుటచే శ్రీ వెంకటరంగయ్యగారు ౧౯౦౮ నుండి పచ్చయ్యప్ప కళాశాలలో 'ట్యూటరు'గ పనిచేయుచు రెండేండ్లలో ఎం. ఏ. పట్టము గైకొనిరి. ఈవిధమున ఉపన్యసించుచు, పూర్వచరిత్రను సంశోధించుచు ఆయన ప్రథమ శ్రేణికి చెందిన కళాశాలలో ప్రధానోపన్యాసకు లగుటకు తగిన యోగ్యతను సంపాదించిరి.

శ్రీ వెంకటరంగయ్యగారి జీవితము ౧౯౧౦ లో చాల మార్పు చెందినది. అప్పటికి కాకినాడలోని కళాశాల ద్వితీయశ్రేణికి చెందినదే. శ్రీ ఆర్. వెంకటరత్నంనాయుడుగారు కళాశాల కధ్యక్షులు. ౧౯౧౦ లో శ్రీ వెంకటరంగయ్యగారు ఆ కళాశాలయందు చరిత్రలో ప్రధానోపన్యాసకులై చరిత్రను బోధించుటయందు మూడేండ్లలో నఖండమైన కీర్తిని సంపాదించిరి. అంత విజయనగరమహారాజులకళాశాలాధ్యక్షులు శ్రీ కె. రామానుజాచార్యులుగారు బి. ఏ. తరగతులలో చరిత్రను బోధింప శ్రీ వెంకటరంగయ్యగారి నాహ్వానించిరి. ఈయన ౧౯౧౩ నుండి ౧౯౨౬ వఱకు నా కళాశాలలో చరిత్రాధికారియై తన ప్రతిభను చాటుటకో యన ప్రజ్ఞావంతులగు పట్టభద్రుల నాంధ్రదేశమున వ్యాపింపజేసిరి. ౧౯౨౮ నుండి ౧౯౩౧ వఱకు నెల్లూరు కళాశాలాధ్యక్షులుగ పనిచేసిరి. పిమ్మట ఆంధ్రవిశ్వవిద్యాలయమున నూతనముగ ప్రారంభింపబడిన చరిత్ర, రాజనీతి, అర్థికశాస్త్రము అను శాఖలలో 'రీడరు'గ శ్రీ వెంకటరంగయ్యగారు నియమింపబడిరి. అధ్యాపకవిధులనేకాక కళాశాలాధ్యక్షుని విధులనుగూడ ఆయన నిర్వహింపవలసియుండెను. ౧౯౩౮ నుండి 'ప్రొఫెసరు'పదవి నలంకరించి ౧౯౪౪ జనవరిలో విశ్వవిద్యాలయసేవనుండి విరమించుకొనిరి. దేశచరిత్ర, రాజనీతి యను శాఖలను మొదట విజయనగరకళాశాలలోను, తరువాత ఆంధ్రవిశ్వవిద్యాలయములోను ప్రారంభింపజేసి వృద్ధినొందించుటలో శ్రీ వెంకటరంగయ్యగారు మిక్కిలి యదృష్టవంతులు.

సంఘసేవ

అధ్యాపకులలో నాయనకు విశిష్టవ్యక్తిత్వమును, గౌరవమును గలవు. ఆయన విద్యాలయమునుండి గ్రంథాలయమునకును, అటనుండి వాసభవనమునకును మాత్రము తిరుగక తన పాండిత్యమును సంఘసేవకు వినియోగించెను. సంఘటనములను భావములయందిముడ్చుటలోను, భావములను సంఘటనములుగ నిరూపించుటలోను సిద్ధహస్తుడై ప్రజాసామాన్యమునకు పరిచితుడయ్యెను.

దివానుపదవి

విజయనగరసంస్థానమునకు 'ట్రస్టీ'గా నుండిన శ్రీ టి. వి. కృష్ణమాచారిగారు శ్రీ వెంకటరంగయ్యగారి బహిరంగోపన్యాసములను విని మెచ్చుకొని, కొన్ని జమీందారీగ్రామముల యార్థికపరిస్థితులను పరిశీలించుటకై వీరి నాహ్వానించిరి. మద్రాసువిశ్వవిద్యాలయమునందలి డా. గిల్బర్టు స్లేటరుగారి సూత్రముల ననుసరించి శ్రీ వెంకటరంగయ్యగారు తమ శిష్యులకును, ఆ సంస్థానమునకునుగూడ లాభించునట్లు కార్యమును ముగించెను. ఈవిధముగా పాండిత్యమొక్కని సొత్తుకాక లోకజ్ఞానము గల స్త్రీపురుషులందఱి యందు చాటులో నుండి మానవోద్ధరణమునకు తోడ్పడును. విజయనగరమున నుత్సాహియగు యువరాజుకు చరిత్రను, అర్థశాస్త్రమును బోధించు బాధ్యతగూడ శ్రీ వెంకటరంగయ్యగారిపై బడెను. చిన్ననాటి యీ పరిచయమువలన ౧౯౨౬ లో యువరాజు యుక్తవయస్కుడై సంస్థానవ్యవహారములను సమర్థించుకొనునప్పు డీయనను దివానుగా నియమించెను. ఈ పదవియం దీయన ఒక్క సంవత్సరమే యుండెను. దీనివలన శ్రీ వెంకటరంగయ్యగారికి గల శక్తిసామర్థ్యములును, ఇతరుల కాయనయెడల గల గౌరవాదరణములును తెలియనగును.

ఆంధ్రవిశ్వకళాపరిషత్తుతో చిరసంబంధము

శ్రీ వెంకటరంగయ్యగారి కాంధ్రవిశ్వవిద్యాలయముతో చాలకాలమునుండి సంబంధ మున్నది.

౧౯౨౭-౨౮ లో విశ్వవిద్యాలయ స్థానమును నిర్ణయించుటనుగురించి చెన్నరాష్ట్రశాసనసభ యేర్పఱచిన యుపసంఘమున కీయన సలహానిచ్చెను. వత్సరముల కొలది 'సెనేటు' సభ్యుడుగను, కొలది వత్సరములు 'సిండికేటు' సభ్యుడుగను కూడ నుండిరి. మాతృభాష బోధన వాహికగ జేయుట కేర్పడిన సంఘములో నీయన యొక సభ్యుడు. పాఠ్యగ్రంథములను, ప్రణాళికలను నిర్ణయించు సంఘములో గూడ నీయన సభ్యుడుగ నుండెను. విశ్వవిద్యాలయమువా రేర్పఱచిన బహిరంగోపన్యాసములను ప్రప్రథమమున నిచ్చినవారిలో నీయన యొకరు. ఈసందర్భముననే ౧౯౩౧ లో ఆంధ్ర క్రైస్తవకళాశాలలో "చెన్నరాష్ట్రమునందలి స్థానికస్వపరిపాలనమునకు బీజములు" అను విషయముపై మూడుపన్యాసముల నిచ్చిరి.

వివిధోద్యమములలో భాగస్వామ్యము

గడచిన ముప్పదియేండ్లనుండియు శ్రీ వెంకటరంగయ్యగా రాంధ్రుల యభివృద్ధికి సాయపడిరి. సహకారోద్యమమునందును, గ్రామపునర్నిర్మాణమునందును, గ్రామపంచాయతీ సభలయందును ఆయన కభిమాన మెక్కువ. విజయనగరమునం దున్నపుడు నాగరక సహకార పరపతి సంఘమునకు 'డైరెక్టరు' గాను, మాండలిక సహకార పరపతిసంఘమునకు 'ప్రెసిడెంటు'గాను నుండిరి. ఆయన నెల్లూరునందున్న మూడేండ్లును నిట్టి వ్యాసంగములతోడనే గడచిపోయెను. ఈ విధముగ నాంధ్రమహాజనుల మెప్పు నొంది ౧౯౪౩ లో ఆయన తూర్పుగోదావరి మండల సహకారమహాసభకును, ఆంధ్రరాష్ట్రీయ సహకార మహాసభకును నధ్యక్షత వహించిరి.

సహకారోద్యమమునందు గాని, గ్రామపునర్నిర్మాణమునందుగాని, పంచాయతీ సభలయందుగాని ఎట్టి మార్పు చేయవలసివచ్చినను ప్రజలును, ప్రభుత్వమును గూడ శ్రీ వెంకటరంగయ్యగారి సలహాలను తీసికొని యుపయోగించుకొనెడివారు. ౧౯౨౮-౩౧ లో ఇందుకూరుపేట గ్రామపునర్నిర్మాణ సందర్భమున రాష్ట్రీయ సహకారపరపతిసంఘ మేర్పఱచిన 'కమిటీ'కీయన సమావేశకర్త యయ్యెను. ౧౯౪౧ లో గ్రామపంచాయతీసభల యధికారములను పరిశీలించుటకు ప్రభుత్వము నియమించిన సంఘములో నొక సభ్యుడుగ నుండెను. సహకార విషయమై ఈయన టౌన్సెన్ కమిటీకిని, విజయరాఘవాచారి కమిటీకిని సలహాల నొసంగెను.

గ్రంథరచన

గ్రంథములవలనను, అనుభవమువలనను సంపాదించిన యమూల్యమైన విజ్ఞానమును ముద్రింపించు నభిలాష యేపండితునికైన నుండును. కావున ఉపన్యాసముల నిచ్చుటతోపాటు గ్రంథములను రచించుటయు శ్రీ వెంకటరంగయ్యగారి కలవడెను. ఆయనరచనలే ఆయన ప్రతిభకును, విజ్ఞానమునకును తార్కాణములు. వానిలో కొన్ని విద్యార్థుల కుపయోగించునవి; కొన్ని పరిశోధకుల కుపయోగించునవి; మఱికొన్ని జనసామాన్యమున కుపయోగించునవి; కొన్ని ఆంగ్లమున, కొన్ని ఆంధ్రమున వెలువడినవి. ఆనందచరిత్ర మూడు భాగములు, ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన కథలు, హిందూదేశ చరిత్ర, ఆంగ్లేయ సామ్రాజ్య చరిత్ర, అర్థశాస్త్రానువాదము, చెన్నరాష్ట్రమునందలి స్థానిక ప్రభుత్వశాఖలు పన్నుల విధించుట, కేంద్రప్రభుత్వము, చెన్నరాష్ట్రమునందలి మాండలిక సభల యభివృద్ధి మొదలుగునవి శ్రీ వేంకటరంగయ్యగారి ప్రచురణములలో ముఖ్యములు. ఇంకను స్థానికస్వపరిపాలనము, గ్రంథాలయోద్యమము మొదలగు అనేక విషయములపై నాయన ప్రచురించిన వ్యాసము లెన్నియో కలవు. విద్యావ్యాప్తికి మాతృభాషనే యుపయోగింపవలెనని ౧౯౦౮ నుండి ఆంధ్రపత్రిక, భారతి, సహకార పత్రిక, శారద మొదలగువానికి వ్యాసములను వ్రాయుచుండిరి. ఆంగ్లమునగూడ 'హిందూస్థాన్ రివ్యూ', 'ఇండియన్ రివ్యూ' మున్నగువానిలో నాయన రచనలు విరివిగ ముద్రింపబడుచుండెను.

అధ్యాపకులకు మార్గదర్శి

అధ్యాపకవృత్తి నవలంబించిన శ్రీ వెంకటరంగయ్యగారు ఉపాధ్యాయసంఘ సభ్యులనూ మఱువలేదు.

అధ్యాపకులలో నన్ని తరగతులవారికిని ఆయన శ్రేయస్కామియు, మార్గదర్శియు నయ్యెను. 'ఎడ్యుకేషనల్ ఇండియా' అను పత్రికకు ప్రారంభమునుండియు నాయన సంపాదకుడుగ నుండి విద్యావిధానమున చేయవలసిన మార్పులను యుక్తియుక్తముగా క్రోడీకరించిరి. ఈ విధముగ దేశమునందలి యితర విద్యాధికులతో పరిచయము గలిగెను. ౧౯౩౯ లో రాష్ట్రీయ విద్యావిషయక మహాసభ కాయన యధ్యక్షు డయ్యెను. నెల్లూరు, విశాఖపట్నము జిల్లాలలో ఉపాధ్యాయ సంఘములతో సన్నిహిత సంబంధ ముండుటయే కాక ఆంధ్రాధ్యాపక మహాసభకు పలుమారు లధ్యక్షుడుగ నెన్నుకొనబడెను. కాంగ్రెసు పరిపాలనలో విద్యావిధాన సంస్కరణ సంఘ సభ్యుడుగ ఆయన నియమింపబడెను. శ్రీ వెంకటరంగయ్యగారి ప్రజారంజకత్వ మట్టిది.

జీవితసాఫల్యము

విద్యార్థులకును, ప్రజలకును సేవ చేయుటలో శ్రీ వెంకటరంగయ్యగారి జీవితము సఫలమైన దని చెప్పుట అతిశయోక్తి కాజాలదు. పరిణత మగు బుద్ధియు, విశ్వమానవదృష్టియు, పరోపకార తత్పరతయు ఆయనను స్నేహపాత్రునిగ నొనర్చెను. యుద్ధానంతరము విద్యా సంస్కరణమునందును, మానవోద్ధరణమునందును పాల్గొని శ్రీ వెంకటరంగయ్యగారు భవిష్యత్తున నితోధికముగ దేశసేవ యొనర్చి ధన్యులగుదు రని యాశించుచున్నాను.

వసంతకీర్తనము

= శ్రీ వఃల్లాది సూర్యనారాయణశాస్త్రి =

శిరములు వంచి వేడ్క నతి సేయ ఫలద్రుమపౌరబృందముల్
కరములు చాఁచి సేసలును లాజలు చల్ల లతాలతాంగులున్
స్వరములు తీర్చి గానములు సల్పఁ బికీపికవాణులున్, మనో
హరగతి రాచఠీవి వెలయం జనుదెంచితి వోవసంతమా!

చెల్లునె నేను 'కా'యనుచుఁ జెప్పఁగ 'కో'యనుచుంటి ? వీవు నా
పిల్లవె? కావు కా వని గభీలునఁ దన్నఁగఁ దల్లి, నీవు నా
తల్లివె? కావు కా వనెడుదాన వటం చెడఁబాసినట్టి యా
పిల్లకుఁ దిండి పెట్టి చదివించు నుదారుఁడ వోవసంతమా!

తొలకరివాన లీవు దయతోఁ గురిపింతు వటన్ననమ్మికన్
జెలకలు పోర్లు బీళ్లు సరిచేసిన రైతులు ముందు నీకు నం
జలులు ఘటించి నాఁగలి బుజాన ధరించి పొలాల కేరువా
కల కని యేగుచుండి రదె కన్గొను నీమహిమన్ వసంతమా!

తొలి యిలువేలుపుం దలఁచి తొయ్యలి గంధము కంఠసీమలం
దలఁదియు బొట్టు పెట్టి దరహాసముతోఁ గొను మంచుఁ బంటపే
ర్వెలయఁగ నెత్తి కెత్తునయి రేనికిఁ జెందిన విత్తనాలకుం
డలు గొనిపోవు రైతుల కశంకకుఁ దోడ్పడుమా వసంతమా!

తమ్ముడు

[కథానిక]

= శ్రీ సానిపిని జోగిరాజుచౌదరి =

వెంకటయ్యగారి శ్రాద్ధం పెట్టిన మర్నాడే చిన్నారావూ, అతని మామ రాఘవయ్యా కలిసి రాజేశ్వరుని గదిలో ప్రవేశించి, పంపకాల గొడవ తేల్చుకుంటే బావుంటుం దని మూచాయగా సూచించేరు. తండ్రిశ్రాద్ధం వెళ్లి పూర్తిగా ఒక రోజుకూడా దాటకుండానే పంపకాలనుగురించి తన తమ్ముడు అంత శ్రద్ధవహిస్తా డనికొని, రాఘవయ్యగారి దూర దృష్టినిగురించికొని ఆలోచించగల మనశ్శాంతి లేని రాజేశ్వరున కేమీ బోధపడింది కాదు.

"నే చెప్పేది తెలీలా! ఆయన అదృష్టవంతుడు. త్వరగా ఆయన దా రాయన చూసుకున్నాడు. యిక మీరుకూడా పెద్దవాళ్లయ్యారు. ఊ! ... తెలీలా! ఆయనకూడా అంతా తేటపరిచేపోయాడు, ధర్మరాజు! నే నిక్కడ ఉండగానే మీరు ఎవరిది వారు పరిమాసుకున్నట్టయితే, నేను మళ్లా శ్రమపడి ఇక్కడికి రాకుండాపోతుంది" అంటూ తన ధోరణి సాగించేడు రాఘవయ్య.

అంతవరకూ మౌనంగా వింటూన్న రాజేశ్వరుడు ఒక్కసారిగా ఉలిక్కిపడి "ఏమిటీ, మీ రనేదీ?" అన్నాడు.

"నే ననేది తెలీలా? ఆయన పిత్రార్జితమైతేనేమి, స్వార్జితమైతేనేమి కావలసినంత దిగవిడిచిపోయారు; మీ మారుతల్లికి అల్లుడు రాకముందే, మీరు ఎవరిది వారు తేల్చుకోకపోతే చేతులు కాలేక ఆకుల కోసం వెదికిన ట్టౌతుంది" అని తన పరిజ్ఞానాన్ని వెళ్లబోసేడు రాఘవయ్య.

"ఆమె మారుతల్లో, అసలుతల్లో నీ కెలా తెలుస్తుందితే" అనుకున్నాడు రాజేశ్వరుడు; పైకి "మీ రనేది మమ్మల్ని పంచుకోమనేగదూ?" అన్నాడు.

"నే ననడమేమిటే? మీ తమ్ముని ఉద్దేశంకూడా అదే" అన్నాడు రాఘవయ్య.

రాజేశ్వరుడు కుపితుడై 'నిజమా' అన్నట్టుగా తమ్ముని ముఖంవైపు చూడగా, అతను చటుక్కున తల వాలవేశాడు.

"నీవు పిన్నిని శంకించేటంత తెలివైనవాడివయ్యావని యింతవరకూ నాకు తెలీదు. దీనికోసం పంపకా లెందుకూ? యివిగో తాళంచెవులు, నీదగ్గరే పెట్టుకుని వెర్రితనమంతా నీవే దిద్దు" అంటూనే తాళాల గుత్తి తమ్మునిమీదికి విసిరేడు రాజేశ్వరుడు.

యీసంఘటనకు రాఘవయ్య చాలా విస్మితుడయ్యాడు. తన అల్లునికి తను ఎంత తేలిగ్గా వెర్రితనం యిప్పించగలిగిందీ యింటి కెళ్లి భార్యతో ఎంత రసవత్తరంగా వర్ణించి చెప్పాలో, అప్పుడే అంచనా వేసేసుకొన్నాడు. తనను రైలుదాకా సాగనంపటానికి వచ్చిన అల్లునికిమాత్రం త్వరగా కొన్ని గ్రామాలు కొనేటందుకు కొన్ని అర్థికసంబంధమైన హితోపదేశాలు చేసి మరీ రై లెక్కేడు.

... ...

వెంకటయ్యగారి ప్రథమభార్య జానకమ్మకు లేకలేక రాజేశ్వరుడు జన్మించాడు. ఆతరువాత రెండేళ్లకు చిన్నారావు కలిగాడు. లేకలేక కలిగిన రాజేశ్వరుడంటే జానకమ్మకు ప్రాణసమానం. ఆవిడ మూడోకాన్పుకు ఆడపిల్లను ప్రసవించి పురుడైనా వెళ్లకుండానే యీలోకం విడిచిపోయింది. ఆవిడ

పోయిన పదిరోజులకు ఆ ఆడశిశువుకూడా తల్లిని వెతుక్కుంటూపోయింది. బంధువుల బలవంతంమీద వెంకటయ్యగారు మళ్లా పార్వతమ్మను సశాస్త్రీయంగా పరిగ్రహించేరు. పార్వతమ్మ భర్తయింటికి వచ్చిన కొద్ది రోజులవరకూ పిల్లల్ని లాలించటానికి సిగ్గుపడినా, ఆ తరువాత అత్యధికమైన చనువు జేసుకుని అనేకవిధాల ఆదరిస్తూ, స్వంతతల్లికంటే ఎక్కువగా ప్రేమించేది. పెద్దపిల్లవాడు పరోక్షంలోమాత్రం 'మాపిన్ని' అంటాడు కాని తనను 'పిన్నీ' అని పిలవడానికి సిగ్గుపడుతున్నాడని గ్రహించింది. దీనికి కారణం వాడి మాతృస్మృతి యింకా మాయకపోవటమే ననికూడా గ్రహించింది.

ఆమె ఒక్కొక్కప్పుడు భర్తతో "మన పెద్దబ్బాయినిగురించి మీ ఉద్దేశ మేమిటి?" అనేది. అందుకాయన నవ్వుతూ "ఏమిటో, వాడు యీలోకానికి సంబంధించినవాడు కాదు" అనేవాడు.

"వాడు నిజంగా నాకు పెద్దకొడుకే" అనేది పార్వతమ్మ కౌతుకస్వరంతో...

పార్వతమ్మ కాపరానికి వచ్చిన రెండేళ్లకు ఒక ఆడపిల్ల పుట్టింది. తరువాత మళ్లా సంతానం కలగలేదు. శేషమంటే రాజేశ్వరునకు అమితమైన ప్రేమ. రాజేశ్వరుడంటే శేషుకు అమితమైన భక్తి. చిన్నారావంటే శేషుకు ఓవిధమైన భయం. దీనికి కారణం: అతను తరచు మేనమామయింటిదగ్గర ఉంటున్నందువల్ల అతనిదగ్గర శేషుకు కావలసినంత చను వేర్పడలేదు. ఆమెకు పదోఏడు జరుగుతూండగానే వెంకటయ్య క్షయజబ్బువల్ల మరణించేడు. ఎటునుంచెటొస్తుందోనని, దూరదృష్టి గల వెంకటయ్య తన మరణం ముందు తన భార్య పార్వతమ్మకు పదిహేనెకరాల మాగాణీ, శేషుకు పసుపుకుంకుమనిమిత్తం యిరవై ఎకరాల మాగాణీ, పదివేలరూపాయిల రొఖ్ఖమూ విల్లులో వ్రాసిపెట్టేడు...

... ...

—యిప్పుడు అన్నదమ్ము లిద్దరూ, సవతితల్లీ కలిసేఉంటున్నారు. పెత్తనంమాత్రం చిన్నారావు చలాయిస్తున్నాడు. పోయిన కార్తీకమాసంలోనే చిన్నారావుకు ఒక మొగసంతానం కలిగింది. రాజేశ్వరునికిమాత్రం సంతులేదు. దానినిగురించి అత నెప్పుడూ విచారపడనూలేదు. తనకు తమ్ముడైనా, కొడుకైనా చిన్నారావే. తనకు చెల్లెలైనా, కూతురైనా శేషే. యీవుద్దేశంతోనే తాళాలు తమ్మునికిచ్చేసి నిశ్చింతగా చేతులు కడుక్కున్నాడు.

రాజేశ్వరుని భార్య సత్యవతి ఒకనాటి రాత్రి భర్తపాదాలదగ్గర కూర్చుని యిలా అన్నది: "యీ యింట్లో రోజురోజూ యీ అవమానం నేను సహించలేను."

"............"

కళ్లు తుడుచుకుంటూ మళ్లీ అన్నది: "మీకైతే తమ్ముడంటే మహాప్రేమ; అతనికి మాత్రం మీరంటే ..." దుఃఖాన్నాపుకొంటూ, "వరలక్ష్మికి నేనంటే అసలే కిట్టడంలేదు." సత్యవతికి దుఃఖం పొర్లుకొచ్చింది.

ఇంతవరకూ కళ్లు మూసుకునే వింటూన్న రాజేశ్వరుడు మెల్లగా కళ్లు విప్పి "ఏమిటే, అసలుసంగతి? ఏడవడ మెందుకూ?" అన్నాడు.

"నిన్న మన దాసీ సుబ్బి, నాదగ్గర ఏడుస్తూ, దాని భర్త రోగంతో యింటిదగ్గరే ఉంటున్నందువల్ల యిబ్బందిగా ఉందని రెండుకుంచాల బియ్యం ఇప్పించమంది. నామనసు కరిగి, సత్తెయ్యను పిలిచి, దానికి నాలుగుకుంచాల బియ్యం ఇవ్వమన్నాను. అందుకు వరలక్ష్మి 'యిక్కడ ఎవళ్ల పుట్టింటివాళ్లు కట్టించిన సత్రాలూ లే'వందిట సత్తెయ్యతో. మా పుట్టింటివాళ్లకు సత్రాలు కట్టించే దక్షతే ఉంటే..." సత్యవతికి మళ్లీ దుఃఖం పొర్లుకొచ్చింది.

"మరి పిన్నితో చెప్పమనలేకపోయావా సుబ్బిని?"

"ఆమె మామగారు పోయిన నాటినుండీ పూజలూ, వ్రతాలే కాని యింటిసంగతి బొత్తిగా పరికించడం లేదు. అయినా ఆమెమాట మాత్రం ఎవరికి లెక్క?"

"అయితే అంతా కలిసి సుబ్బికి యివ్వలేదన్నమాట."

"తరువాత శేషు వచ్చి చిన్నాయనతో చెప్పగా, వచ్చే నెల జీతంలో వడ్డీతోసహా తగ్గించుకొనే నిర్ణయంమీద ఇచ్చారట."

రాజేశ్వరుడు ఒక దీర్ఘనిట్టూర్పు విడిచి కళ్లు మూసుకున్నాడు.

* * * *

"అన్నయ్యా, అమ్మ రేపు రామలింగేశ్వరాలయంలో అభిషేకం చేయిస్తుందట, దానికి రెండు వందలు ఖర్చవుతుందట; అమ్మ నీతో చెప్పమంది" అన్నది శేషు.

"చెల్లీ, అమ్మకు లోభత్వం ఎక్కువౌతూన్నట్టుంది. నీ పెద్దకొడుకు బ్రతికుండగా లోభించ నవసరం లేదని చెప్పు అమ్మతో. మొన్న కల్యాణానికి బ్రాహ్మలే దీవించే రటకాని అలగాజనం అసంతృప్తితోనే వెళ్లిపోయేరట. ఈసారి ఊరంతటికీ సంతర్పణ జరగాలి. ఆయేర్పాట్లన్నీ నేను చేయిస్తాను. పూజా విధానంలో ఎంత ఖర్చయినా వెనుదీయవద్దని అమ్మతో నేను చెప్పేనని చెప్పు" అని, గుమస్తా బ్రహ్మయ్యను పిలిచి, ఐదువందలు అమ్మణ్ణడిగి తీసుకురమ్మన్నాడు. గుమస్తా వెంటనే తిరిగివచ్చి "యిప్పుడు నిల్వసొమ్ము అంతవరకూ లేదంటున్నారండి. రెండువందలైతే..." అంటూ నీళ్లు నమిలేడు.

"ఆ! రెండువందలా! అ దెలా జరుగుతుంది? నా పేర ఖర్చు వ్రాసి ఇవ్వమను. పో"

యిదంతా చూస్తూకూర్చున్న శేషు తన పెద్దన్నగారి నిష్కల్మషహృదయాన్ని తలచుకొని, చాటుగా ఆనందబాష్పాలు ఒత్తుకున్నది. గుమస్తా సొమ్ము దెచ్చి రాజేశ్వరున కివ్వబోగా, శేషు కివ్వమని సంజ్ఞ జేశాడు. 'నీహృదయం ఎంత అగాధమో నాలాంటి అల్పుల కెలా తెలుస్తుంది బాబూ' అనుకున్నాడు మనస్సులో, వృద్ధగుమస్తా బ్రహ్మయ్య.

అభిషేకానికి రెండువేల రూపాయలు ఖర్చయింది. పిండివంటలతోసహా అన్నివర్ణాలవారికీ తృప్తికరంగా సంతర్పణ జరిగింది. యింకా అభిషేకాన్ని గురించి యితర వివరాలు వ్రాయాలంటే పెద్దగ్రంథం తయారౌతుంది. మొత్తంమీద పాటకపు జనం ఎక్కువగా అభినందించి వారి దాతృత్వాన్నీ, ధర్మశీలాన్నీ కథలుగా చెప్పుకుంటున్నారు.

భ్రాతృప్రేమతో నిండియున్న రాజేశ్వరుని హృదయం తన భార్యకు ఆయింటిలో ఏస్థానం ఉన్నదో గ్రహించనీయలేదు. సత్యవతికి ఆయింట్లో పీసమెత్తు పెత్తనం లేదు. గత నాలుగు సంవత్సరాల నుండీ అనేకవిధాల తన భర్తహృదయం తెలిసికొన్న సత్యవతికి ప్రతి చిన్నవిషయాన్ని గురించీ భర్తతో ఫిర్యాదుచేయడం వెకిలిగా కనబడ్డది. కరుణాప్రసన్నమైన తన భర్తముఖం ఒక్కసారి చూసేటప్పటికి 'యిక నాకీ ప్రపంచంలో ఏం కావాలి' అనుకొనేది. అందువల్ల తన తోడికోడలు తనను ఎన్నివిధాల అవమానించినా పెదవి కదల్చకుండా ఊరుకొనేది. కాని యీనాడు జరిగిన సంఘటనముందు కరుణాప్రపూరితమైన తన భర్తనేత్రాలు సజలమై కనిపించి క్రమంగా తననుంచి తప్పుకున్నాయి...

...అభిషేకం నాలుగురోజు లుందనగా సత్యవతి వృద్ధతండ్రి సుబ్బారాయుడు తన కుమార్తెను చూసిపోదామని రాగా, అతనిని పార్వతమ్మ, సత్యవతీ కలిసి బలవంతంచేసి అభిషేకం చూసివెళ్లమన్నారు. సుబ్బారాయుడు యీ వారంరోజులలోనూ తన కుమార్తెకు ఆయింట్లో ఎంత హక్కున్నదీ గ్రహించగలిగేడు. తను భోజనానికి కూర్చున్న సమయంలో చిన్నావిడ నౌకర్లను తిట్టే తిట్లలో కొన్ని తననే అనిపించేటంత వివరంగా ఉండటంకూడా గ్రహించేడు.

మాటల సందర్భంలో ఒకనాడు సుబ్బారాయుడు యీ సంవత్సరం వరిచేనంతా పసమీద తడిసిపోయిందనీ, అందుచేత మంచిరకం కొణామణి విత్తనాలు ఎనిమిదిబస్తాలు ఎక్కడైనా కొని పంపించమనీ రాజేశ్వరునితో చెప్పగా, అతను "ఎక్కడైనా కొనట మెందుకండీ? మనదగ్గర వన్నీ విత్తనాలకి పనికొచ్చేవే." అని చెప్పి, సత్తెయ్యను పిలిచి "ఎనిమిది బస్తాలు కొణామణిధాన్యంపట్టించి, సావిట్లోపడవేయించ"మని చెప్పేడు.

సత్తెయ్య వెళ్లి తిరిగివచ్చి "చినబాబుగారు వీల్లే దంటున్నారు." అన్నాడు. ఆమాటకు రాజేశ్వరుడు చాలానొచ్చుకుని "వీలేమిటి! నే చెప్పేనని చెప్పు" అన్నాడు. సత్తెయ్య మళ్లా వెంటనే తిరిగివచ్చి "అవి ఎక్కడికి నడిపించటానికో వారికి తెలుసట. యిక్కడ

ఎవరితోలూను యీనామములూ లేవని యిక్కడ తెలియజెప్పమన్నారు" అన్నాడు. ఈమాటకు సుబ్బారాయుడు సిగ్గుతో క్రుంగిపోయాడు. సత్యవతి మొఖం ఎర్రనైంది. రాజేశ్వరుడుమాత్రం శాంతంగా ఒక పొడినవ్వు నవ్వి, వెంటనే గంభీరుడై "ఖరీదు యిచ్చేటప్పుడు ఎవరికైతేనేమి, వెళ్లి పట్టిస్తూ ఉండు; నేనుకూడా వస్తా నక్కడికి" అని, సత్తెయ్యవెనకాలే తానూ వెళ్లాడు. రాజేశ్వరుడు వెళ్లగానే సత్యవతి తండ్రిఒడిలో తల దాచుకొని వెక్కివెక్కి ఏడవ సాగింది. సుబ్బారాయుడు కూతురి తల నిమురుతూ "అమ్మా, నువ్విక్కడ ఎంత సుఖపడుతున్నావో నా కర్థమైంది" అతనికైతే తమ్ముడుగాని నీవుమాత్రం అతని తమ్మునికి వదినెవుమాత్రం కావు. లోకంలో నేను చాలామందిని చూశాను కాని యింత విచిత్రపు సోదరులను ఎక్కడా చూళ్లేదు. నాకూ యింత గొప్ప ఆస్తి లేకపోయినా నలుగురికీ తీసిపోను; యిక్కడిదాసీబ్రదుకు బ్రతకవలసిన అవసరం నీకు లేదు తల్లీ, ప్రయాణమై సిద్ధంగా ఉండు, బండి పిలిపించుకొస్తాను" అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

"వారిని రానియ్యి నాన్నా, వారితో చెప్పి వస్తాను" అన్నది సత్యవతి.

ఆరాత్రి సత్యవతి తండ్రిదగ్గర చాలా సేపు కూర్చుని వచ్చేటప్పటికి రాజేశ్వరుడు కళ్లు మూస్తూ తెరుస్తూ వెల్లకిలా పరున్నాడు. సత్యవతి మెల్లగా అతని పాదాలను స్పృశిస్తూ "రేపు మానాన్నతో వెళతాను" అంది.

"ఇప్పుడేం? యిక్కడ కష్టంగా ఉందా?"

దీనికి సత్యవతి జవాబు చెప్పలేకపోయింది. ఎలా చెపుతుంది, తన కిక్కడ కష్టంగా ఉందని? అమృతమూర్తి తన భర్త సాదరపూర్వకంగా, అలా, ఒక్కమాట మాట్లాడితే చాలదూ? తన తోడికోడలు తనను ఎంత నీచంగా చూస్తే మాత్ర మేం?

"సత్యం! యిక్కడ నీవు చాలా బాధపడుంటావు. నేను చాలా ప్రమత్తుణ్ణయ్యాను. ఏమి చేయను? వాడు నాకు తమ్ముడు" రాజేశ్వరుని కళ్లలో నీళ్లు తిరగటం ఆ దీపపుకాంతిలో స్పష్టంగా చూసింది సత్యవతి. తన పమిట చెరగుతో భర్తకళ్లు ఒత్తుతూ, యిట్లాంటి భర్తను ఒంటిగా విడిచి, తను పుట్టింటికెళ్లడం మహాపాపమనుకొని "మీరుకూడా వస్తే నాలుగురోజు లుండి తిరిగివచ్చేద్దాము" అన్నది కంపితస్వరంతో.

"సత్యం! నీవు వెళ్లి, నీయిష్టంవచ్చినన్ని రోజు లుండిరా; యీలోగా, కఠినహృదయుడైన నీ యీ భర్తను మరిచిపోకుండా ఉత్తరాలు వ్రాస్తూ ఉండు"—యీమాటకు భర్తపాదాలమీద తల పెట్టి ఏడ్చింది సత్యవతి. తన భర్త కఠినహృదయుడా? తను ఆమాటను ఊహించటానికే భయపడింది.

ఆమరునాడు సత్యవతి భర్తదగ్గరకు వచ్చి అతని పాదధూళి తీసుకొని "వెళ్లివస్తా" నన్నది. రాజేశ్వరుని నేత్రాలు సజలమైనాయి. "పోయి సుఖంగా..." అతని కంఠము రుద్ధమైపోయింది. యిట్లాంటి భర్తను విడిచివెళ్లడమంటే సత్యవతికి సుతలామూ యిష్టం లేకపోయినా, పుట్టిల్లు చూసి చాలాకాల మైనందువల్లా, యీలోగా తన భర్త అతని తమ్ముని నిజస్వరూపం గుర్తించగలుగుతా డనే ఆశతోనూ ప్రయాణమైంది. భర్తకళ్లు ఒత్తుతూ "వీలుంటే ఒకసారి అక్కడికి రాండి." అన్నది. యింతలో సుబ్బారాయుడు అక్కడికి వచ్చి అల్లునితో చెప్పి కూతుర్ని వెంటబెట్టుకుని యెడ్లబండీ యెక్కి వెళ్లేడు.

ఆ మర్నాడు పార్వతమ్మ శేషును వెంటబెట్టుకొని రాజేశ్వరుని గదిలోకి రాగానే అతను చాలా కంగారుపడ్డాడు. తన తండ్రి పోయాక ఆమె యింతవరకూ తనయెదుట పడలేదు. యిప్పుడు ముందుగా కబురన్నా లేకుండా అలా రావడంతో చాలా ఆశ్చర్యపడి లేచి నిలబడ్డాడు.

"అందరూ కలిసి సత్యవతమ్మను సాగనంపేశారా నాయనా!" అన్నది పార్వతమ్మ క్రింత కంబళిమీద కూర్చుంటూ. రాజేశ్వరుడు చకితుడై "మీతో చెప్పకుండానే వెళ్లిందా?" అన్నాడు విచలిత స్వరంతో.

"అది నాతో చెప్పకుండా వెళ్లగలదా? మీ తమ్ముడూ, మీతమ్ముని భార్యా దాన్ని నిలవనీకుండా

తోచేలేనేరు. మరి నీకేమో నీతమ్ముడే లోకం. యితర జనం ఎంత బాధపడుతున్నా నీకనవసరం" అన్నది పార్వతమ్మ యించుక తీవ్రంగా.

"వాడు మీ చిన్నబ్బాయేకదూ. వాడి కింకా చిన్నతనం వదల్లేదు. వాడివల్లేదైనా తప్పంటే మీరు..."

"ఆ, కాకేమి! నాకున్నదల్లా యిద్దరే సంతానం. పెద్దవాడి పేరు రాజేశ్వరుడు; రెండోది శేషూను" యీమాట వినగానే ఎందువల్లో రాజేశ్వరునికి దుఃఖం పొర్లుకొచ్చింది. ఆదుఃఖంలోనే 'అమ్మా' అంటూ ఆమెవొడిలో ఒరిగిపోయాడు.

"తే నాయనా. నీవు ఈలోకానికి తగవు. ఒకొక్కప్పుడు నిన్ను చూస్తూ, నీ మంచితనాన్ని వింటూంటే నాకు భయంకూడా కలుగుతుంది" అని పార్వతమ్మ కంట తడిపెట్టింది.

"అమ్మా! యిప్పుడేమైంది?"

"ఏమైనా అవుతుంది, నీలాంటివాడివి మూల కూర్చుని అజ్ఞానులకు అధికారమంతా వప్పజెపితే. సత్యవతిలాగే నేనూ ఎప్పుడో యీయిల్లు విడిచేరోజొస్తుంది."

"ఏమి జరిగింది శేషూ?" అని శేషువంక చూసి అడిగేడు రాజేశ్వరుడు.

"ఏమీ లేదన్నయ్యా! నేను బట్టలు కావాలని చిన్నన్నయ్యను మాఅమ్మ రెండువందలిమ్మందని అడిగేను. చిన్నన్నయ్య మండిపడుతూ 'యిక్కడ ఎవరి అమ్మమొగుడి సొమ్మూ లేద'న్నాడు."

రాజేశ్వరుని మోము జేవురించిపోయింది. "అలా అన్నాడేం" అన్నాడు. యింతలో పెద్ద గుమస్తా సీతయ్య గదిలోకి వచ్చి నాలుగుమూలలూ పరకాయించి, రాజేశ్వరుని చెవిలో "చినబాబుగారు ఉమ్మడి సొమ్మెట్టి అత్తవారి ఊరిలో భూమి కొన్నారు. అది వరలక్ష్మిగారి పేర పెడతారట. రేపే రిజిష్టరౌతుందట" అని ఊదేడు. రాజేశ్వరుని మొఖం మరీ కందగడ్డలా ఐపోయింది. శరీరం వణకింది. గుప్పెళ్లు బిగుసుకున్నవి. కళ్లల్లో అగ్ని మెరిసింది. ఆ ఉమ్మడిసొమ్ములో తన ఒక్కడిదే ఉన్నట్లయితే ఊరుకొనేవాడు. కాని దానిలో తన తండ్రి ప్రత్యేకించిపోయిన శేషుసొమ్ముకూడా ఉంది.

"వా డెక్కడున్నా, తక్షణం నేను రమ్మంటున్నానని చెప్పండి వెళ్లి."

గుమస్తా వెళ్లి వెంటనే తిరిగివచ్చి "యిప్పుడు ఎవరో పెద్దమనుష్యులతో మాట్లాడుతున్నారట. రావటానికి వీల్లేదన్నారు" అని చెప్పేడు.

"ఆ! అంతవరకూ వచ్చిందా? ఎక్కడున్నాడు?"

"కచ్చేరి సావిట్లోనండి."

పైన కండువా లేకుండానే రాజేశ్వరుడు కచ్చేరి సావిడికి పయనమయ్యాడు. పార్వతమ్మకు ఏమీ అర్థంకాక నిశ్చేష్టురాలై అలానే కూర్చుండిపోయింది. శేషుమాత్రం "యిప్పుడు పెద్దన్నయ్య మొఖం చూస్తే భయమేసిందే అమ్మా" అన్నది.

రాజేశ్వరుడు కచ్చేరిసావిట్లోకి వెళ్లగానే, గౌరవసూచకంగా అక్కడివాళ్లందరూ లేచి నిలబడ్డారు. వారి గౌరవాన్నిగాని, అగౌరవాన్నిగాని పరామర్శించే స్థితిలో లే డిప్పుడు రాజేశ్వరుడు. తిన్నగా తమ్ముని దగ్గరకు నడిచేడు. చిన్నారావు అన్నగారి ఆకారం చూసి భయపడ్డాడు.

"ఏరా! నీవు నామరణవార్త వినేవరకూ తృప్తిపడ వనుకుంటాను!" అన్నాడు రాజేశ్వరుడు, కించిత్కర్కశంగా.

చిన్నారావు అప్రతిభుడై "నే నలా ఎవరిదగ్గరన్నాను? బహుశా పార్వతమ్మ మీకు అలా చెప్పిందేమో: నే నన్నానని" అని అంటూండగానే రాజేశ్వరుడు తన సత్తువకొద్దీ తమ్ముని దవడమీద 'ఫెడీ'లమనిపించేడు. ఆవూపుకి తమ్ముని చేతిలో ఉన్న తాళాల గుత్తి తూలి రాజేశ్వరుని పాదాలముందుపడింది.

"పార్వతమ్మా? ఆమె చెబుతుందా?...వెంకటయ్యగారికి నీవు ఒక్కడివే సంతానం అయివుంటే ఎంత బావుండును!" తాళాల గుత్తి తీసుకొని వెళ్లిపోయే రాజేశ్వరుని చూసి, అక్కడివాళ్లంతా వణకిపోయారు.



శృంగార దేవత

యను మదనుఁడు వసంతఋతువు గడచినవెనుక యువతీ జనుల తలవెండ్రుకలలో చిరస్థాయి యగునని మహాకవి కాళిదాసు పలికెను. దేవతలను సైతము ముగ్ధులనుచేసి యాకర్షించు నా కేశసంపదను కేశవర్ధిని నుపయోగించి సర్వకాలములయందు మనోజ్ఞముగ వృద్ధిచేసికొనరాదా!

కేశవర్ధిని మీకుంతలములకు ప్రకాశమును ప్రకాశమునకు తగిన అందము అందమునకు తగిన యౌవనము నిచ్చును. విశేషించి బాల్యమునుండియే కుదుళ్లను గట్టిపరిచి రాలనీయక కాపాడును.

కేశవర్ధిని తులలేని చక్కని పెన్నెరులను ఆనెరి కురులు మీ కద్వితీయ సౌందర్యమునిచ్చును. 1

కేశవర్ధిని

నేడే మీ కురులకు కేశవర్ధిని
వాడుడు. మీ తలవెండ్రుకలను
అందముగా పెంచి బలపరచును.

కేశవర్ధిని	అణాలు	0-12-0
కేశవర్ధిని షాంపూ	,,	0-12-0
కేశవర్ధిని క్రీం	రూ.	1- 0-0


ప్యాకింగు పోస్టేజి అధికము.
వర్తకులందరివద్దను దొరుకును లేక

సౌత్ యిండియా కెమికల్సు,


158, తిరువెంకటస్వామి రోడ్డు,
ఆర్. యస్. పురము — కోయంబత్తూరు.

గమనిక :—దీనినిపోలిన యితర యిమిటేషను నూనెలనుకొని మోసపోవద్దు, మీరు కొనుటకుముందు, దానిమీద, "కేశవర్ధిని" మరియు "సౌత్ యిండియా కెమికల్సు" అను పేర్లనుచూచి తీసికొనుడు.

దేవాలయ పరిశుభ్రతకు



శుభ్రతకు దైవత్వమునకు దగ్గిర సంబంధము కలదు. ఆచార నియమములతో శుభ్రముగా స్నానముచేయుటకు మనము పరిశుభ్రమైన సబ్బునే వాడవలెను. సబ్బులో యేదో యుండవచ్చును. కాని అన్ని టాయిలెట్సుకువలెనే గోద్రెజ్ చందనసబ్బులో గూడ స్వచ్ఛమయిన, మేలైన, మూలికాతైలములు, ఎస్సెన్సులు, ధారాళముగా వాడబడినవి. ఏవిధమగు జంతుక్రొవ్వును కలియలేదు. గోద్రెజ్ చందనపు సబ్బు, స్వచ్ఛమైన మైసూరు చందనతైలముతో తయారుచేయబడినది. అది హాయినిగొల్పు, చల్లని మనోహరమగు సువాసనగల నురుగును పుట్టించును. మీగడవంటి యీ మూలికాతైలముల నురుగు రోమకూపములను శుభ్రపర్చి, చర్మమును మొహమల్‌వలె నునుపుగా జేయును. చల్లదనము చేకూర్చును. గోద్రెజ్ వెజిటబుల్ చందనసబ్బుకంటె స్నానములకు మంచిది వేరేకలదా యని మనలో మనము ప్రశ్నించుకొని, నిష్పక్షపాతముగా సమాధానము చెప్పకొనవచ్చును. ఎందువల్లననగా, శరీరమే దేవునియొక్క ఆలయము.



గోద్రెజ్ లిండ: క్రిమి సంహారకము, చికిత్సా గుణములు గల వేపనూనె లక్షణములు గలది.

Godrej Sandal
'chavi' brand

గోద్రెజ్ చందన

చావి బ్రాండ్

టాయిలెట్ సబ్బులు

గోద్రెజ్ సోప్సు, లిమిటెడ్.,
మదరాసు (164, బ్రాడ్వే)
కోయంబత్తూరు (3, థామస్ స్ట్రీట్.)

చందా వివరాలు

దినపత్రిక ఆదివారపు సంచికతోసహా

సంవత్సరం చందా ...	రు.	36	0	0
అర్ధసంవత్సరం చందా ...		18	8	0
3 మాసముల చందా ...		9	6	0
నెల చందా ...		3	4	0

ఆదివారం వెలువడే వారపత్రిక

సంవత్సరం చందా ...	రు.	9	12	0
అర్ధసంవత్సరం చందా...		5	0	0

భారతి (సచిత్ర మాసపత్రిక)

సంవత్సరం చందా ...	రు.	6	0	0
అర్ధసంవత్సరం చందా ...		3	0	0

విడిప్రతి 8 అణాలు.

ప్రమాదకరమైన వివాహము

= శ్రీ రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులు =

వివాహముహూర్తములన్నియుం దికాలమునకు సాధించుటలోఁ గల పరమార్థము తెలియక, తెలుసుకొను కోరికే లేక, మామూలు పద్ధతిని మాత్రము వదలుటకు ధైర్యము చాలక, ఏదోయొక లగ్నమును లగ్నపత్రికలలో నచ్చువేయించుటకొఱకై యేర్పరచుకొను నలవాటు మనవారిలో నానాఁటికి ప్రబలుచుండుట శోచనీయము. "ఇదంతా మూఢవిశ్వాసము. ఏదో శాస్త్రార్థమొక లగ్నమును చూడండి" అని తమ వివేకసంపత్తును తెలుపుకొను విద్యావంతులు బయలుదేరుచున్నారు. ఆధునికపరమైకొంతులలో కొందరు "తేన వినా తృణమపి నచలతి. లాంఛనానికి లగ్న మొకటి కావలెను." అను మహనీయులున్నారు. "మీ సాస్త్రములో మాకు నమ్మకము లేదు. మా అండవాళ్లు అంగారకదోష మున్నదేమో, చూపించుకొనిరమ్మన్నారు." అని యొకానొక యున్నతోద్యోగి యొక జ్యోతిష్కుని నడుగుచుండగా వినియున్నాను. ఈ మధ్య తపాలావాడు నాకు తెచ్చియిచ్చిన వివాహమహోత్సవాహ్వానపత్రిక యొకటి ౧౭-౪-౧౯౪౪ నాఁడు ౨౯-౧౦ గడియలకు, అనఁగా మధ్యాహ్నము ౧-౨౦ ఘంటల సమయమున శుభకన్యా లగ్నములో వివాహము జరుగు నని చెప్పుచున్నది. ఏ సుమారుపాటి నక్షత్రజ్ఞానము కలవానికయినను నాఁటి దినమున పగలు ౨౯-౧౦ గడియలకు ౧-౨౦ గంటలు కాని, ౧-౨౦ గంటలకు కన్యాలగ్నము కాని అసంభవమని తెలియక పోదు. విద్యావంతులలో జ్యోతిషవిచారమున కానవచ్చుచున్న యౌదాసీన్యము, అశ్రద్ధ, అవిచారపరత మితిమీరుచున్న వనుట కింతకన్న వేఱు సాక్ష్య మక్కఱయుండదు. అది యట్లుండె.

కడచిన స్వభానుసంవత్సర వైశాఖబహుళపంచమీ సోమవారమున పగలు ౧౧-౩౦ A.M (R S. T.) ఘంటల కాలమున నొక వివాహము జరిగినది. ఆ శుభ ముహూర్తకాలమునకు సాధించిన నిరయనకుండలి యిది:—

కు ౪-౩౪		బు ౯-౧౧ వక్రి ర ౯-౬ వ ౧౧-౨౭ శ ౨౧-౫	శు ౨౧-౧౭ గు ౨౯-౨౭
	వివాహ లగ్నము		ల ౧౪-౩౦ రా ౨౬-౫౨
కే ౨౬-౫౨ చ ౭-౫౭	నిరయన రాశికుండలి		
			ఇ ౬-౧౭ వక్రి

చూడుఁడు! లగ్నములో శుభగ్రహ మొకఁడు కాని లేఁడు. చాలనందుకు సమీపమందే పాము (రాహువు) పడగవిప్పి భుస్సుమనుచున్నది. ఇతర కేంద్రములకయినా శుభగ్రహాశ్రయము లేదు. ముఖ్యముగా సప్తమస్థానమునకు శుద్ధి కానరాదు.

"క్రూరో వా యదివా సౌమ్యో
లగ్నా చ్చంద్రాచ్చ ఖేచరః,
ఏకో వా యది జామిత్రే
పత్యుః ప్రాణహరో భవేత్" (సప్తర్షి మతము)

చరరాశిలో నున్న చంద్రుఁడు సప్తమ భావమున నుండుట—అనఁగా, చంద్రాస్తమానసమయమున పాణిగ్రహణము జరుగుట—మఱింత లోపము. "సప్తమగే శశిని భవేత్ ససపత్నీ" యని శౌనకమహర్షి యానతిచ్చెను. కాని, కన్యకు సపత్నిప్రాప్తి అంత దోష

ముగా పరిగణింప పనిలేదన్ని ముహూర్తసిద్ధాంతుల మతమేమో? చంద్రుఁ డభిజిన్నక్షత్రమం దుండుటచే రోహిణిలో ప్రవేశింపఁబోవున్న రవికి వేధవచ్చినదనవచ్చును. కాని, లాభస్థానమం దుండినను, రవి నుండి లాభము కానరాదు. పైఁగా, వరుణగ్రహసంయోగము నభిలషించుచు రెండు భాగల దూరమందే యున్న రవి శుభఫల మీఁగలఁడా? లగ్నాధిపతియై అస్తమింపనున్న చంద్రునకును, సప్తమాధిపతియగు శనికిని పూర్ణకేంద్రశత్రుదృష్టి యుండుట మఱియొక దోషము. వివాహకాలమున చంద్రుఁ డుండరాదని ఏ నక్షత్రములు దుష్టములుగ నెన్నఁబడినవో, వానిలో వివాహలగ్నము సైత ముండరాదనుట శాస్త్రముర్యాద.

"విలగ్నస్థోపి నక్షత్రో
వివాహే కథిత స్శుభః,
అన్యేచ న శుభా స్సర్వే
చంద్రనక్షత్రవ చ్ఛుభాః."

అని బృహస్పతిశాసనము. ఈవివాహముకాలమున లగ్నము కటకరాశి ౧౭౨ భాగలలో నుండుటచే నది పుష్యమీనక్షత్ర మగును. ఏకార్యమైనా పుష్యమిలో చేయఁడు; వివాహముమాత్రము వలదని శాస్త్రముద్ఘోషించుచున్నది.

"వివాహమేకం పరిహృత్య పుష్యే
సర్వాణి కార్యాణి కరోతు సిద్ధ్యై."

అని విద్యామాధవుల సూక్తి. మఱియు, శుభగ్రహములగు గురుశుక్రు లిద్దఱు ద్వాదశభావమున నున్నారు. లగ్నమునకో, పట్టరాని వృశ్చికనవాంశ పట్టినది. ఏవిధముగ చూచినా, లగ్నమునకు బలము లేదు. దోషములుమాత్రము చాల ప్రబలముగ నున్నవి. ఇట్టి ముహూర్తము లెవరికి లాభకరములు — పురోహితులకు తప్ప?

ఈప్రక్క నున్నది యీ ముహూర్తమునకు సాయనకుండలి.

శు౨౭-3౭			బు౧-౧౪ వక్రి. ర౨-౯ వ ౪-30 శ ౧౪-౭
కే ౧౯-౫౫ చ ౧-౦	తేది ౨౪-౫-౪3 వివాహ లగ్నము (సాయనము)		శు౧౪-౨౦ గు౨౨-30
			I ౭-30 రా౧౯-౫౫
			ఇం ౨౯-౨౦ వక్రి

వివాహమునకు ముందు నాఁ డాకస్మికముగ లగ్నపత్రిక నొక మిత్రునియొద్ద చూచితిని. ఉబుసుపోకకై కుండలి వేసిచూచుచున్నాఁ గుండెలు గుభేలుమనెను. పొరఁబా టుండునేమో యని మరల గ్రహభావాదులను గుణించి చూచితిని. ఆలోచించిన కొలఁది లగ్నము ఘోరముగ కన్పట్టసాగెను. నామనస్సులో కలిగిన యాందోళనము ముఖమున దాఁగినది కాదు. ఇది కనిపెట్టి నామిత్రుఁడు "ఏమి? లగ్న మంత బాగ లేదా?" అని అడిగెను. "అంతా ఘోరముగ నున్నది" అంటిని. "అట్లయినచో, చింత యేల? చెడ్డలగ్నములో వివాహ మెట్లు జరుగును?" అని నామిత్రుఁడు వాదించెను.

"ఉద్వాహే నియతి ర్న యత్యతిబలా
వేలాం సమాం ప్రాక్ఫలైః"

అను వరాహమిహిరాచార్యుని సూక్తి స్ఫురణకు వచ్చినది. దృఢమూల మగు దుష్కర్మఫలము పక్వస్థితికి వచ్చినపుడు శుభకార్యములను సంకల్పించితిమేని వానికి దుర్ముహూర్తములే లభించునని సమాధానము చెప్పితిని. కాని నా మిత్రుని కది తృప్తికరముగ తోఁచలేదు. "నీపుణ్యము! లగ్నము బాగుగా లేదని పెండ్లివారికి చెప్పి శుభకార్యమునకు విఘ్నము చేయు పాపము కట్టుకోవలదు సుమా?" అని యతఁడు హేళన చేసెను.

ఈ దుర్ముహూర్తమున పెండ్లి జరుగకుండ నిలుపఁగల్గినచో పాపమునకు జంక పనిలేదు. ఇది పాపకార్యము కాదను గట్టి నమ్మకము నాకేమో కలదు. కాని, యీ కాలమున చుక్కలను చూచి శుభకార్య

ముల నిలుపువా రెంద ఱున్నారు? "శుభస్య శీఘ్రం" మ్మనువారు పెద్దలు. యుక్తవయస్సు వచ్చినవారు కాన "నైవ శాస్త్రం నచ క్రమః" అనురీతి క్షంతవ్య మయిన ఆత్రము గలవారు వధూవరులు. పరిస్థితు లిట్లుండఁగా, నక్షత్రములకై నిరీక్షించువా రెవరు? శాస్త్రముపై ప్రామాణ్యజ్ఞాన మెందరి కున్నది? శుక్రవరుణుల సమసప్తకము; రవివరుణుల శత్రుదృష్టి; లగ్నచంద్రుల జామిత్రశుద్ధి; చలిత గ్రహముల పరస్పర వేధ-ఇత్యాదులను గురించి యుపన్యసించుచుఁ బోయిన యెడల నెందరకు రుచించఁగలదు? నవనాగరకుల విషయమున నిది మఱింత కష్టమయిన పని. వారి దృష్టిలో నిదంతయు మూఢవిశ్వాసము. నా మనస్సు చాల నొచ్చినది.

వివాహము యథావిధిగ జరిగినదని విన్న తరువాత, ఇట్టి దుర్ముహూర్తమున పెండ్లి నిర్ధరింపఁబడుటకు వధూవరుల జాతకము లేమి తప్పు చేసినవో చూత మను కుతూహలము కలుగఁగా, తరువాత కొన్ని దినముల కెట్లో ప్రయాసపడి మిత్రుల నాశ్రయించి జాతకములను సంపాదింపఁ గల్గితిని.

వరుఁ డొక నవనాగరిక సుందరతరుణుఁడు. న్యాయశాస్త్ర పట్టభద్రుఁడు. సంగీత సాహిత్య విద్యా విశారదుఁడు. రసికుఁడు. వివేకి. కన్యక యతనికి మీరరాని యాప్తబంధువర్గములోనిది. సంపన్నుల యింటి యాఁడుబిడ్డ. చక్కనిది. సౌశీల్యమునకు పెట్టిన పేరు. మణికనకములవలె వారనోన్యానురూపులు. వీరిరువురకిని చిరకాలపరిచయముతోడి మైత్రి గలదు. వివాహమువలన నది దృఢమూల మగు ప్రేమగా మారుటకు చక్కని యవకాశ మబ్బినది.

ఆవధూవరుల జాతకములు సాయనరీతిగా నీక్రింద నుదాహరింపఁబడినవి.

[నిరయనపద్ధతి వలయునేని, ఆయాకుండలులలోఁ జూపిన అయనాంశలను త్రోసివేసి నిరయనకుండలులు సాధించుకొనవచ్చును. గ్రంథవిస్తరభీతిచే వానినిట చూపలేదు.]

కన్యనక్షత్రము పూర్వఫల్గుని యనియు, వరనక్షత్రము శ్రవణ మనియు చదువరులు గుర్తించియుందురు. షష్టాష్టమదోషము ప్రబలముగనే కలదు. కాని, మొత్తముమీఁద పొంతనములలో ౩౬ టికి ౧౭½ గుణములు వచ్చినవి. నక్షత్రానుకూల్యము తృప్తికర మనుటకు వీలున్నదిగదా?

వరుని జాతకమున లగ్నాధిపతి (రవి) లగ్నమందుండుట ద్వికళత్రయోగ మనవచ్చును.

"మనస్వీ చాతిచాంచల్యో
ద్విభార్యః పరగోపితా"

అని బృహత్పరాశరహోర.

	వ ౧౮-౫౩ వక్రి రా ౨౬-౨౫		కు ౨౮-౪౫
	కన్యక జాతకము (సాయనము) అయనాంశలు ౨౨ భాగలు ౫౧ లిప్తలు		గు ౧౨-౪౧ X౨౭-౦
శ౫-౨౬ వక్రి			
		శు ౧౬-౩౩ కే ౨౬-౨౫ ల ౨౯-౦	ర౧-౧౨ ఇ౩-౧౫ చ౧౬-౨౫ బు౨౭-౩౦

		X౨౮ ౦	కే ౧౭-౪౫
వ ౨౫-౪౦ వక్రి చ౧౧-౨౩	వరుని జాతకము (సాయనము) అయనాంశలు ౨౨ భాగలు ౪౧ లిప్తలు		గు ౭-౦
			శు ౨-౫౦ ఇ౮-౩౮ శ౧౯-౧౮ ల౨౬-౧౦ ర౨౮-౭
రా ౧౭-౪౫	కు ౨-౨౬		బు ౧౬-౪౫

కుటుంబస్థానాధిపతి బుధుఁడు కుటుంబస్థానమందే యుండుట సయితము భార్యాద్వయప్రాప్తి నిచ్చునని పైగ్రంథము చెప్పుచున్నది. కాని మంగళసూత్రము కట్టి అగ్నిసాక్షిగ పాణిగ్రహణము చేసిన వధువునకు మాత్రమే కళత్రము, భార్య అను పదములు వర్తింపవలెనని జ్యోతిషశాస్త్రమున నియమము లేనందున ఈ ద్వికళత్ర యోగములను ఉదారాశయములు గల కొందరు కన్యాదాత లంతగా పాటింపకుండుటయుఁ గలదు. వరుని జాతకమున సప్తమభావమున వరుణగ్రహమున్నది. లగ్నాధిపతియగు రవితో నీగ్రహమునకు సమసప్తక శత్రుదృష్టి పూర్ణముగఁ గలదు. ఆకస్మికప్రమాదమును సూచించు దుర్దైవపరిణామము నిది చూపఁగలదని పాశ్చాత్యుల మతము. వరుణగ్రహము సప్తమభావమం దుండుటచే జాతకుని వైవాహిక జీవితమున నిష్ఫలము కానవచ్చు నని యూహించుట కవకాశ మున్నది. సప్తమాధిపతియగు శనికి సయితము నీవరుణుని వైరదృష్టి కలుగుటచే పైయర్థమునకు ప్రోది గలుగుచున్నది.

ఇఁక, కన్యక జాతకమున శుక్రవరుణులకుఁ గల సమసప్తకశత్రు దృష్టియోగమును చూడుఁడు! శుక్రుఁడు లగ్నాధిపతియై లగ్నమం దున్నాఁడు. వరుణుఁ డుండునది సప్తమభావము. వరుణగ్రహదోషమిచట నైతము సప్తమభావమునందే యున్నది. వివాహసంబంధము విషాదాంత నాటకముగా పరిణమించు నని యీ శుక్రవరుణయోగమునకు పాశ్చాత్యజ్యోతిష శాస్త్రవేత్త లర్థము వ్రాసిరి.

ఇది యిట్లుండ, పరస్పరముగా వధూవరుల జాతకములందలి గ్రహములకు వైవాహిక జీవితపోషకమగు మైత్రి యేమియు కానరాదు. వరజాతకమున ధనలాభాధిపతియగు బుధునిపై కన్యజాతకమందలి దశమాధిపతియగు చంద్రుఁ డుండుట యొక యాకర్షణ మనవచ్చును. కన్యజనకుని (చంద్రుని దశమాధిపత్యము) వలన వరుని విద్యకై (బుధునికై) కొంత ధనలాభము నిది సూచించునేమోకాని హెచ్చు వెల దీనికి లేదు. వరుని రవికి కన్యజాతకమందలి కుజునితో గుప్తమిత్రదృష్టి యుండుట సత్యమే. కాని, దాంపత్యవిచారమున (రెండును పురుషగ్రహము లగుటచే) దీని కంత ప్రాముఖ్యము లేదు. చతుర్థ భాగ్యాధిపతి యగుటచే వరునికి కుజుఁడు రాజయోగకారకుఁడు. అట్టి కుజుని మిత్రదృష్టి లాభస్థానమునుండి లగ్నాధిపతియగు రవికి వచ్చుటచే, నీకన్యకపరిచయము వరునికి యోగదాయక మని చెప్పుట తప్పు గాదు. కాని, దాంపత్యసౌభాగ్యమునకు ముఖ్యముగా నెంచఁబడు రవిచంద్రులయొక్క కాని, కుజశుక్రులయొక్క కాని శుభసంబంధ మేమియు నగుపడదు. ఒకరి జాతకమందలి శుభగ్రహములైనను మఱియొకరి జాతకమున లగ్నాది ప్రధానస్థానములకు వచ్చినవి కావు. చాలనందుకు, కన్యకజన్మకాలికరవికి వరుని జాతకమందలి వరుణునితో సమసప్తకవైరదృష్టి యొక్కటి కానవచ్చుచున్నది. భర్తజాతకమందలి క్రూరగ్రహమగు కుజుఁడు భార్యజన్మలగ్నమునకు వచ్చినాఁడు. మొత్తముమీఁద పరికించినచో, జాతకములలో వివాహమునకు వలసినంత పరస్పరాకర్షణము లేదనియే చెప్పవచ్చును.

అన్యోన్యజాతకములకు తాత్కాలికముగ సంభవించిన ప్రబలాకర్షణపు ప్రభావమున కొందఱు దంపతులగుట గలదు. దినవర్ష పద్ధతితో గ్రహలగ్నములను చలింపఁజేసినచో, అట్టి గ్రహలగ్నముల కన్యోన్యజాతకములలో ప్రబలదృష్టియోగములు వివాహయోగ్యమగు వయస్సున నేసంవత్సరమందైన వచ్చునేని, అట్టి వధూవరులు తోడనే వివాహబంధమున తగులుకొనుటయు, అచిరకాలమునందే విడివడుటయు కొన్నివేళలలో జరుగుచున్నది. సౌహార్ద్రసూచకమగు సహజాకర్షణము లేక, తాత్కాలికమయిన ప్రబలాకర్షణముచే బద్ధులయిన దంపతుల సంబంధము, రైలువే జంక్షనులలో క్షణకాల మాకస్మికముగ కలుసుకొని, 'హల్లో'యని హస్తచాలనము గావించి,కుశలప్రశ్న చేసి,అల్పాహారము లారగించి, ఉత్తరక్షణమున వేరువేరు మార్గములలో ప్రయాణము సాగించు రైలుప్రయాణీకుల సంబంధము వంటిది.

చూడుఁడు! వివాహకాలమునకు కన్యకజాతకమందలి చలితలగ్నము వృశ్చిక రాశి ౧౨-వ భాగకు వచ్చి, వరుని జాతకమున కర్కాటక రాశిలో ౧౨-వ భాగకు వచ్చియున్న చలిత గురువుతో పరిపూర్ణ

త్రికోణదృష్టిని బొందినది. ఇది ప్రత్యక్ష మిత్రదృష్టి యగుటచే నంతయు చాల సుముఖముగ కానవచ్చును. కాని వరునిజాతకమున గురువునకు మృత్యు (అష్టమ) స్థానాధిపత్య మున్నదని మనము మరువరాదు! వరుని జాతకమున వివాహసహమము (పాశ్చాత్య సంప్రదాయమున) మీనము ౨౦-వ భాగలో నున్నది. పై దశాపద్ధతిలో నిది చలించి వివాహకాలమునకు మేషరాశి ౧౫-వ భాగకు వచ్చుటచే కన్యక జాతకమందలి వరుణగ్రహ సంయోగమును సంపాదించినది. అట్లే, కన్య జాతకమందలి వివాహ సహమ బిందువు వృషభరాశి ౧౨-వ భాగలో నుండినది చలించి ౨౫-వ భాగకు వచ్చుటచే వరునిజాతకమందలి వరుణగ్రహముయొక్క పూర్ణ కేంద్రదృష్టి నార్జించినది. ఈ తాత్కాలిక ప్రబలాకర్షణముచే వీరు బద్ధులయిరి. స్వభానుసంవత్సర వైశాఖమాసము వీరు కలుసుకొన్న జంక్షన్.

ఇరువురి జాతకములందును వరుణగ్రహ దౌష్ట్య మున్నది. అందులో సప్తమ భావమునకే గొప్పదెబ్బ! వీరికి తాత్కాలికాకర్షణము ముఖ్యముగా వరుణ గ్రహమునుండియే కలిగినది. కానసే, లగ్నాధిపతియగు రవి వరుణగ్రహ సంయోగముచే చెడిన దినమున, సాయన సింహలగ్నమున వీరికి పరిణయము జరుగుట!

వివాహము చంద్రాస్తమానకాలములో నయినది. అస్తమించుచున్న చంద్రుడు స్త్రీగ్రహము. మఱియొక స్త్రీగ్రహము — శుక్రుడు — కన్యాజాతక వరుణుని సరిగా ౯౦ భాగల (చతుర్థకేంద్ర) క్రూరదృష్టిస్థానమునకు (కటకరాశి ౧౮౪ భాగలకు) వచ్చిచేరుకొన్నాడు. లగ్నాధిపతియగు రవి వరుణసహవాసముచే చెడినను, లాభస్థానమున నున్నాడు. కాన, ఈ వివాహలగ్నపు ఫలము వరునికన్న వధువునకే యమంగళము సూచించుచున్న దనవచ్చును. జాతకము చూడఁగా చూడఁగా వివాహలగ్నమునుగూర్చి నాకు కలిగిన భయము మఱింత బలపడినది.

కొన్ని నెలలు గడచినవి. మొన్నటి మాఘమాసమున నీ వధూవరుల క్యైక్యము గల్గించినారు పెద్దలు. వారము దినములు సంతోషముగ కాలము గడపునంతలో నొక మంచి యుద్యోగప్రాప్తి కవకాశము దొరకుటచే, భార్యను పుట్టినింట విడిచి భర్త ఏకాఏకిగా నగరాంతరమునకుఁ బోవలసి వచ్చినది. నూతన స్థానమున కొంత కుదురుపాటు చూచుకొని, ఇల్లు వాకిలి సవరించుకొని, భార్యను పిలుచుకొనిపోయి, కాపురము నేర్పరచు కుతూహలముతో భర్త దినములు గడపుచుండెను. అంతయు సుముఖముగా కానవచ్చినది. అదృష్టము ఫలోన్ముఖముగా కన్పట్టినది.

ఈ మధ్యకాలమున నొకనాఁడు నేనొక మిత్రునితో వివాహముహూర్తముల విషయము మాటలాడుచు కాలక్షేపము చేయుచుంటిని. లగ్నమునకుఁగాని, చంద్రునికిఁగాని సమసప్తకమున గ్రహ ముండరా దను విషయము ప్రస్తావములో నుండెను. ఉదాహరణముగా నీ వివాహలగ్నము ప్రశంసలోనికి వచ్చినది. "సప్తమస్థానములో నున్న చంద్రుఁ డేమి చేసినాఁడు? ఇటీవలనే భార్యాభర్త లొకటియై అన్యోన్యముగ నున్నారు" అని నా మిత్రుఁడు వాదించెను. అతని వాదములో నర్థమున్నది. నిషేకమయిన వారము దినములలోనే భర్త కుద్యోగప్రాప్తి కలిగినది. వారి జీవితములలో నే లోపము కానరాలేదు.

దిన వర్ష దశాపద్ధతి ననుసరించి వరుని కుజుఁడు (యోగదాత) వృశ్చికమున ౧౯-వ భాగకు వచ్చియుండుటచే, సప్తమాధిపతి యగు శనికి సరిగా ౯౦ భాగలలో శత్రుదృష్టిలో నిపుడు నిలచినాఁడు. కన్యక జాతకమందు సయితము శనికుజుల కిపుడు సమసప్తక దృష్టి వచ్చినది. ఆమెకు కుజుఁడు సప్తమాధిపతి, శని యోగకారకుఁడు. ఇట్లిరువురికిని సప్తమాధిపతులు దశాక్రమమున చెడినకాలములో వచ్చిన వైవాహిక సంబంధము సత్ఫలము నీఁజాలునా యను శంక కవకాశ మున్నది. ఈ వధూవరులకు పరస్పరాకర్షణ మిచ్చిన సంధానకర్త వరుణగ్రహము; వివాహము జరిగినది వరుణ రవి సంయోగ కాలమున; విశేష మేమన, నిషేకదినమున రవి కుంభరాశిలో ౨౫-వ భాగలో — వెదకుకొనిపోయినాఁడా యనునట్లు — భర్త జన్మకాలిక వరుణగ్రహస్థానమునే చేరుకొన్నాఁడు. విమర్శించినకొలఁది నియతి బలవత్తరముగ తోఁచినది. మఱియొక విశేషము. వరునిచలితలగ్నము జాతకమునందలి

ఇంద్రస్థానమునకు ౪౫ భాగల (అర్ధకేంద్ర) శత్రు దృష్టికి వచ్చినది. వివాహానంతర మేడాదిలో నది ఇంద్రుని చలితస్థానముతో నర్ధకేంద్రమునకు రాఁగలదు. దీని ఫలము నీటిబుగ్గవంటిది; తళతళ మెరసి 'టప్' అని మాయమగును. "అంతయు బాగుగనే యున్నది. కాని, ఇంకను కొన్ని దినములు నిరీక్షించి చూతము" అని నా మిత్రుని కొకవిధముగా అతృప్తికరమగు సమాధాన మిచ్చి యా ప్రసంగము నంతటితో చాలించితిని.

తరువాత వారము దినములం గడచీగడవక మును పొకనాఁడు నామిత్రుఁ డాత్రమున రోజుచు నా గదిలో ప్రవేశించెను. అతని ముఖభావమున నపూర్వముగా నాశ్చర్యవిషాదములు తాండవమాడు చుండినవి. "ఏమి విశేషము" అని ప్రశ్నింపఁగా నతఁడు వణఁకుచు, "ఇంకేమి విశేషము? మన మానాఁడు మాటలాడుకొన్న చిన్నది యాకస్మికముగ ప్రమాదవశమున చీరకు నిప్పంటుకొని యకాలమృత్యువుపాలయ్యె ననితంతి వార్త వచ్చినదఁట! ఇప్పుడే మాయింటి ఆఁడువారు చెప్పిరి." అనెను. నాకు దేహమాద్యంతము కణుదురిగలు పుట్టి శిరసెక్కిన ట్లయ్యెను. ఆ యాతన వర్ణనాతీతము. పాప మాచిన్నదాని తల్లిదండ్రుల యవస్థ యేమో, ఆ సుమంగలి భర్త యారాట మెట్టిదో దైవ మెరుఁగు. కొన్ని నిమిషములు నోటికి మాట రాలేదు.

అయినది. ముహూర్త ఫలము సిద్ధించినది. వైవాహిక చంద్రుఁ డస్తమించినాఁడు. వారము దినములైనను వైవాహిక జీవితపు ముచ్చట నా వధూరత్న మనుభవించినది కాదు. వరుణగ్రహము చలము సాధించినది. ఈ ఘోర పరిణామము ౧౯౪౪ ఏప్రిలు నెల ౪-వ తేదీన సాయంకాలము సుమారు నాల్గు నాల్గున్నర గంటల వేళలో జరిగినదఁట! అప్పటి సాయన గ్రహస్థితి చూడుఁడు! (ప్రక్కకుండలి)

శు ౨౨-౩౦	ర ౧౪-౩౦	బు ౧-౮	వ ౫-౫౮ ల ౬-౦ శ ౨౧-౨౫
కే ౩-౧౧	అగ్నిప్రమాదకాలము		కు ౩-౩౪
	సాయనకుండలి		రా ౩-౧౧ గు ౧౭-౯౮ క్రీ.చ ౨౭-౦
		ఇం౨-౩౨	

సుమారు సాయంకాలము ౪-౧౫ p. m (R. S. T.) వేళలోనే వరుణగ్రహ ముదయించును. ఈ అపాయ మాకాలమందే నడచియుండుట అసంభవము కాదు. దైవచిత్రము!

వరుణగ్రహ వ్యాపార మెట్లున్నదో పరిశీలింపుఁడు:— (౧) వధూవరు లిరువురి జాతకములందును సప్తమభావమును వరుణుఁ డాశ్రయించినాఁడు. (౨) జన్మకాలిక రవి రెండు జాతకములందును వరుణగ్రహ క్రూరదృష్టిపాతమునకు చిక్కినాఁడు. (౩) వివాహకాలమున రవి వరుణ సంయోగ మున్నది. (౪) పరిణయ దినమున వరుని దైనిక జాతకములో జన్మకాలిక వరుణస్థానము రాజ్యభావమధ్యమునం దున్నది. (౫) ఆనాఁటి దైనికలగ్నమును తాత్కాలిక వరుణుఁడు వచ్చి యధిష్ఠించినాఁడు. (౬) శుక్రుఁ డానాఁడు కన్యక జన్మకాలిక వరుణుని స్థానమునకు పూర్ణ కేంద్ర దుష్టదృష్టికి వచ్చినాఁడు. (౭) నిషేక మహోత్సవ కాలమున రవి భర్తజాతకమందలి వరుణగ్రహస్థానమున కాకర్షింపఁబడెను. (౮) అపాయము జరిగిన నాఁటి రవిని భార్యజాతకమునందలి వరుణగ్రహస్థాన మాకర్షించినది. (౯) తాత్కాలిక చంద్రుఁడు భర్తజాతకపు వరుణస్థానముతో సమ సప్తకమునకు వచ్చినాఁడు. (౧౦) అపాయపు సమయమునకు సరిగా వరుణుఁడు పూర్వదిగ్భాగమున నుదయించుచు (లగ్నములో) తొంగి చూచుచున్నాఁడు! *

తాత్కాలిక రవి అపాయకాలమున నెచ్చట నున్నాఁడో గమనింపుఁడు. కన్యక జన్మకాలిక వరుణ గ్రహస్థానమందే కదా రవి యుండుట? ఆదినము

వరుణ గ్రహ మీ కన్యారత్నమును కాచి,

* ఇట్టివి వ్రాసినచో నింకను కొన్ని గలవు, కాని ఇంత చాలును.

పొంచి, పట్టి, లాగి, కబళించి, ఆహుతి తీసుకొన్నట్లు కానవచ్చుచుండలేదా? ఘోరము! భగవంతుఁడీ సుమంగళిఆత్మకు శాంతి నొసఁగుఁగాత!

"The influence of Uranus is always sudden and peculiar. Under affliction it frequently brings most promising opportunities which if taken lead to sudden disaster"

అను రాబ్సన్ మహాశయుని సూత్రము మరువరానిది.

వరుణగ్రహ మక్కరలేదనువారికీ కథ మంచి గుణపాఠము నేర్పు ననుకొందును. ఇతర గ్రహములే చాలు ననువారు కొన్ని కారణములు చూపఁగల్తురేమో? "ధర్మే కుజేగ్ని విపార్దితః" అను జాతక తత్త్వ సూత్రము ననుసరించి కన్యకజాతకమున నవమస్థానమందున్న కుజుఁ డగ్నిబాధను సూచించు ననవచ్చును. కాని, ఇది ఘోర ప్రమాదముగా పరిణమించఁ బనిలేదు. రమారమి నూటికి నెనమండుగురికి కుజుఁ డిట్లుండును గదా.

" శుక్రాత్తుర్యాష్టమగైః పాపైర్భార్యాయా అగ్నిదాహః" అనుసూత్ర మొకటి జాతకతత్త్వమందే కలదు. భర్త జాతకమున శుక్రునికి నాల్గింట కుజుఁడు, ఎనిమిదింట వరుణుఁడు నుండుటచే భార్య కగ్నిప్రమాదము కలదనవచ్చును. వరుణ గ్రహ కార్య మిచట సయిత మున్నది.

సప్తమస్థానము వరుణునిచే చెడిన స్త్రీపురుషులకు వివాహబంధము తెచ్చుట యొక పొరబాటనియు, ప్రబల గ్రహ వైషమ్యము సూచించు వయసున నట్టివారికి పెండ్లి తలపెట్టుట యంతకన్న గొప్ప తప్పనియు, అట్టి వివాహము వరుణగ్రహదౌష్ట్యము గల దినమున చంద్రాస్తమానకాలమున జరుపుట మరింత ఘోరకార్య మనియు మనకీ కథ బోధించుచున్న దనవచ్చును.

భరద్వాజమహాముని చేసిన బంగారువంటి యుపదేశ మిది స్మరింతము :—

" యదా గ్రహాణాం వైషమ్యం
సర్వారంభం పరిత్యజేత్,
కార్యవిఘ్నకరా హ్యేతే
కృత మప్యత్ర నశ్యతి. "

ఒక్క విన్నపము. ఈవివాహ ముహూర్తములను నిర్ణయించిన పెద్దల నధిక్షేపించుట సర్వథా నా యాశయము కాదు. అట్టి శక్తియు నాకు లేదు. లోకకల్యాణమునకై ప్రాచీన మహర్షులు ప్రసాదించిన జ్యోతిష శాస్త్రమును మనము నిరాదరము చేయుట నీతి కాదని చూపుటకై యీ విషాదాంత వివాహపు కథను వ్రాసితిని. చదువరులు క్షమింతురు గాక!

మహావీరాచార్యుడు

— శ్రీ వేదము లక్ష్మీనారాయణశాస్త్రి —

భారతీయగణితశాస్త్రమునకు ఉజ్జయినీనగరమును, పాటలీపుత్త్రనగరమును జన్మస్థానము లని ప్రసిద్ధి. ఈ యభిప్రాయము ప్రజాహృదయముల నెంతో రూఢిగ పాదుకొనియుండుటచేత తత్సంబంధముగ స్థలాంతరమును పేర్కొన్న అత్యంతాశ్చర్యము జనించును. చిరకాలమునుండియు ఆర్యభట బ్రహ్మగుప్త భాస్కరాచార్యులు మువ్వురుమాత్రము గణితజ్ఞులకు నైతము సుపరిచితు లగుటవలన వారికన్నను భిన్నులుం కల రనుమాట కలలోని సంగతియు, కల రని యొప్పుకొన్నను వారి వృత్తాంతములు సంశయగ్రస్తములు, వివాదగ్రస్తములు నైనవి. సావధానముగ పరిశీలించినచో నిందలి నిజము తేటపడును. మన దేశమున వెలసిన జ్యోతిశ్శాస్త్రపీఠము లనేకములు; ఆ శాస్త్రకైంకర్యమున జీవితము గడపిన మహనీయులసంఖ్య బహుళము. వాస్తవ మిట్లుండ పాశ్చాత్యవిజ్ఞానమునకు వశులైనవారు స్వదేశీయశాస్త్రులపట్ల నిరాదరము చూపుట మిగుల శోచనీయము. సమస్తవిజ్ఞానశాఖలందును తామే మిన్నల మని విఱ్ఱవీగుచు మన శాస్త్రులను తుచ్ఛప్రాయములుగ గణించు పాశ్చాత్యుల మత్సరము నణచు నిమిత్తమైనను స్వాభిమానపూరితు లగుట శ్రేయము. కొంద ఱనునట్లు వస్తుభావ మీయుపేక్షకు మూలము కానేరదు. సంస్కృతభాషయందే కాక పారసీకారబికచీనీయజాపానీయభాషలలోను గ్రంథజాల మెంతో యంధకారమునుండి సూర్యరశ్మిని గన్నవి. చారిత్రికదృష్టితో వాని ననువదించుట యసాధ్యమా? ఒకమాట నిజము. చాలినంత భాషాపాండిత్యము, సంప్రదాయజ్ఞానము లేకున్న నివి సుబోధకములు గావు. ఆయాభాషలలో పాండిత్య మలవఱచుకొని కార్యసిద్ధి పొందుటకు ఉచితమైన కాలవ్యవధియు, శ్రద్ధయు నే సున్న. కాలవ్యవధి కలిగినను ఓపిక నెటనుండి తేగలము? అది యట్లుండనిండు.

గణితసారసంగ్రహకర్త యగు మహావీరాచార్యుడే కాలమువాడో నిర్ణయించుటకు తగినన్ని యాధారములు దొరకుట మహాభాగ్యము. తన గ్రంథమున ప్రథమాధ్యాయములోనే జినేశ్వరునిగూర్చిన మంగళాచరణానంతర మాఱు శ్లోకములలో చక్రికాభంజను డను రాజును ప్రశంసించియున్నాడు. ఇత డమోఘవర్ష నృపతుంగు డను బిరుదముచే ప్రఖ్యాతిగాంచినట్లు తెలియును. పై యాఱుశ్లోకములలోను చివరిరెంట —

"యోవిద్యానద్యధిష్ఠానో మర్యాదావజ్రవేదికః,
రత్నగర్భో యథాఖ్యాతచారిత్రజలధి ర్మహాన్.
విధ్వస్తైకాంతపక్షస్య స్యాద్వాద న్యాయవాదినః,
దేవస్య నృపతుంగస్య వర్ధతాం తస్య శాసనమ్"

అని యారాజునకు మంగళాచరణము కోరియున్నాడు. ఆధునిక భారతీయశాసనపరిశోధనముల ఫలముగా నీ యమోఘవర్ష నృపతుంగుడు క్రీ. శ. ౮౧౪-౧౫ నకును, ౮౭౭-౭౮ లకును మధ్యకాలమున పరిపాలించినవా డని నిశ్చయించియున్నారు. ఈ యమోఘుడు రాష్ట్రకూటప్రభువు. గణితసారసంగ్రహకర్త మహావీరాచార్యు డాప్రభువునాస్థానముతో నెట్లో సంబంధపడియుండవచ్చును. కనుక నాగ్రంథమును క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దమధ్యకాలమునాటిదిగా పరిగణింపనగును. భారతీయచారిత్రికపరిశోధనలద్వారా భారతీయగణకవరులలో సుప్రసిద్ధులగు ఆర్యభటుడు ౫-వ శతాబ్దమునను, వరాహమిహిరుడు ౬-వ శతాబ్దమునను, బ్రహ్మగుప్తుడు ౭-వ శతాబ్దమునను, భాస్కరాచార్యుడు ౧౨-వ శతాబ్దమునను విలసిల్లి రని నిర్ధారించియున్నారు. కనుక కాలానుక్రమమున బ్రహ్మగుప్త భాస్కరుల నడిమికాలమువాడు మహావీరాచార్యుడు. చారిత్రికముగ నిది యొక ముఖ్యాంశము.

మఱియు, మహావీరుడు దక్షిణాపథమున కన్నడ దేశమునకు చెందినవాఁడనియు, జైనుఁడనియు నిశ్చయించిరి. జైనగెజట్టు అను పత్రికయందు (Vol. 29, No 1, Jan 1933) లో జైనులు భారతీయసభ్యతాభివృద్ధికై చేసిన మహోపకారమును తడవుచు సి. యల్. కాళె అను పండితుడు గణితసారసంగ్రహము వర్ధమానాచార్యునిచే రచియింపబడినదని పలికియున్నాఁడు. ఒకవేళ వర్ధమానాచార్యుఁ డనునది మహావీరాచార్యునకు నామాంతరమేమో? ఇయ్యదియు చరిత్రయందు మఱొక ప్రశస్తవిషయము.

మహావీరాచార్యుఁడు జ్యోతిశ్శాస్త్ర ప్రాముఖ్యమును, ఆ శాస్త్రశిక్ష గణితశాస్త్రాభ్యాసముపై నెట్లాధారపడియున్నదో వివరించియుండినప్పటికిని పూర్వోక్తులగు ఆర్యభట బ్రహ్మగుప్త భాస్కరాచార్యులవలె కేవలము జ్యోతిశ్శాస్త్రజ్ఞుఁడు గాఁడు. ఆకాలమున జైనపండితులలో గణితశాస్త్రపఠన మతిగౌరవస్థానమలంకరించియుండెను. మోక్షసాధనములగు చతురనుయోగములలో నిది యొకటిగ గణింపబడినది.

గణితసారసంగ్రహమున తొమ్మిదధ్యాయములు కలవు. ఈసంఖ్య భాస్కరుని బీజగణితాధ్యాయ సంఖ్యకు సమానము; బ్రహ్మగుప్తుని కుట్టకమునకంటె నొకటి యెక్కువ. ఆయాయధ్యాయముల వర్ణితవిషయములలో ప్రకరణసామ్యము గన్పట్టును. బ్రహ్మగుప్త గణితమందలి విషయములును, భాస్కరుని లీలావతిలోని విషయములును కొన్ని యిందు చూపట్టును. ఈ పరిగణనమున నంతగా విశేషమేమియు లేకున్నను చారిత్రిక నిర్ధారణమునకు మహోపకారి యని సూచించితిని.

బ్రహ్మగుప్తుని బ్రహ్మస్ఫుట సిద్ధాంతముతో గణితసారసంగ్రహతుల్యభాగములను పోల్చినచో మహావీరాచార్యునకు బ్రహ్మగుప్తగ్రంథము సుపరిచితమనియు, అతఁడు తన గ్రంథమున పూర్వగ్రంథమున గన్పట్టు దోషముల నవసరమైనంత పరిహరించి ఉత్కృష్టము గావించెననియు విశదమగును. మహావీరాచార్యుని గణితపరికర్మ విభాగము చాల సంకీర్ణమైనది. అతని సూత్రములా, సమగ్రములు; సూత్రోదాహరణములా, అనేకములు; ఉద్దేశకములా, బహుళములును విస్తారములును. బ్రహ్మస్ఫుటసిద్ధాంత వ్యాఖ్యాతయగు పృథూదకస్వామి మహావీరాచార్యునకన్నను చాల వెనుకబడినవాఁడు గాఁడు. వ్యాఖ్యాత యొసగిన యుదాహరణములకును, మహావీరాచార్యోదాహరణములకును గల సాదృశ్యము అతివిచిత్రమైనది. ఏది యెట్లుండినను మహావీరాచార్యుని గణితసారసంగ్రహ రచనాకాలమున జ్యోతిశ్శాస్త్ర గణితశాస్త్రములలో బ్రహ్మగుప్తునిదే ప్రమాణపదవి. భాస్కరాచార్యునకు గణితసారసంగ్రహ పరిచయము కలదో లేదో నిశ్చయించుట దుష్కరము. భాస్కరుఁ డేమి, యతని వ్యాఖ్యాత లేమి మహావీరాచార్యుని పేర్కొనమిచేతను, అతని గ్రంథములనుండి ప్రమాణముల నుద్ధరింపమిచేతను, భాస్కరుఁడు తన సిద్ధాంతశిరోమణియు, బీజగణితాంకగణితములును బ్రహ్మగుప్తుని కృతికి మెఱుఁగుగా రచింపనెంచిన ట్లూహింపవలసియున్నది. ఒకవేళ మహావీరుఁడు జైనుఁ డను కారణమున భాస్కరుఁ డాతని కృతి యెడ విముఖత జూపెనేమో! లేదా, జైనగణితజ్ఞుని కీర్తి పండ్రెండవ శతాబ్దమునాటి కుత్తరదేశములకు వ్యాపింపలేదేమో! కాని యాగ్రంథమునకు దక్షిణదేశమున మిక్కిలి వ్యాప్తియు, ప్రశస్తియు నుండెననుట నిర్వివాదాంశము. పదునొకండవ శతాబ్దమునాటికే రాజమహేంద్రవర ప్రభువు రాజరాజనరేంద్రుని ప్రోత్సాహమున పావులూరి మల్లనచే పద్యకావ్యముగా నాంధ్రీకృతమై ప్రజాభిమానము నందినది. ఈమల్లనంగూర్చి ఇంకొక వ్యాసమున ముచ్చటించెద.

దశాంశసంజ్ఞామానోత్పత్తియు, శూన్యకల్పనమును– తత్సంకేతమును భారతీయగణితచరిత్రమున ప్రాబల్యమందిన కారణమున, గణితసారసంగ్రహమున సంఖ్యాస్థానములు ఇరువది నాల్గింటివఱకును పేర్కొనబడియున్నవి. మొదటిది యేకస్థానము; చివరిది మహాక్షోభము. ప్రతిస్థానమును దాని పూర్వస్థానముకంటె పదిమడుగులు పెద్ద. కొన్ని సంఖ్యలకు పర్యాయముగ వస్తునామములను తెల్పు నాచారము విరివిగా నుండినను దశాంశపద్ధతి విస్మృతము కాక అవికారముగ నను

కృతమైనది. చంద్ర నేత్ర అగ్ని ఆకాశములు క్రమముగా ౧, ౨, ౩, ౦-లకు సంజ్ఞలగుచో అగ్న్యాకాశచంద్రనేత్రము లన్న ౨౧౦౩ ను, చంద్రనేత్రాకాశాగ్నులన్న ౩౦౨౧ యు సూచించును. సాధారణముగ సంఖ్యల నీసంజ్ఞలచే నుదాహరించుపట్లనవి యేకస్థానాంకాదిగా నుక్తములు. ఇట్టి సంఖ్యాసంజ్ఞ దశాంకపద్ధతులు ఛందోబద్ధములగు వ్రాత కనుకూలముగను, సంఖ్యాప్రవచన క్లేశము మాన్పుటకును మిక్కిలి ప్రయోజనకారులు. ఈ విధానమును మహావీరాచార్యుడు పూర్వులయొద్ద సంప్రదాయానుసారముగ గ్రహించియుండును. దశాంశవిధానమును ఆర్యభటుడు సుగమము కావించి సంఖ్యాజ్ఞానమును సునిపుణముగ వివరించెను. అతడు వర్ణసమామ్నాయములోని అజ్ఝల్సంయోగములను సంఖ్యాసంజ్ఞలుగ సంకేతించినను దశాంశవిధానమును ౧౮ స్థానములవఱకు వ్యవహరించె ననుట నిర్వివాదాంశము. అట్లే బ్రహ్మగుప్తుని రచనయందును సంఖ్యాసంజ్ఞలును, దశాంశవిధానమును పరిపక్వమందె ననుటకు నిదర్శనము లనంతములు. ఆర్యభట బ్రహ్మగుప్తు లిరువురును తమతమ గ్రంథములు బ్రహ్మసిద్ధాంతము నాశ్రయించిన వని స్పష్టముగా పలికియున్నారు. ఆ పేరుగల గ్రంథ మొకటి శాకల్యసంహితా భాగము కలదు. అందును ఈవిధానమే వ్యవహృతము. ఆర్యభట బ్రహ్మగుప్తు లుదాహరించిన గ్రంథ మిదే యనుటకు ప్రమాణములు చాలకున్నను సంఖ్యాసంజ్ఞ దశాంశపద్ధతుల వ్యవహారము మిక్కిలి ప్రాచీనమని చూపుటకై యీవిషయము ప్రస్తావితము.

అంకములకు నిజమూల్యము గాక స్థానమూల్యము సైత మొకటి సిద్ధముగనుక శూన్యకల్పన మత్యంతావశ్యక మయ్యెను. ఆపద్ధతిలో సంఖ్యామానము నుదాహరించు పట్టుల నంకరహితస్థానమును గుర్తించుట కిది పరమోపకారి. అందువల్ల నేమియు లేదను నర్థమున శూన్య మను సంస్కృతశబ్దము వాడబడినది. సంస్కృతశూన్యశబ్దమునకు తుల్యార్థము గల యరబ్బీశబ్దమునకు సమానార్థకమైనది సైఫ రను నాంగ్లశబ్దము. కావున మన దేశమున దశాంశవిధానములో నీశూన్యకల్పనము సహజసిద్ధము. ౫-వ శతాబ్దము నాటికే ఆర్యభటునకీశూన్యాంకపరిచయము వెలపిండిప్రాయము. శూన్యమునకు సంకేత మొకటి లేకున్న గణితపరికర్మాభ్యాసము శ్రమసాధ్య మని మనవారు దీనిని కల్పించిరి.

మహావీరాచార్యుడు ప్రథమాధ్యాయముననే శూన్యగణితపరికర్మముల నన్నిటిని, సంకలనవ్యవకలనగుణకారభాగహారములను వివరించెను. ఏసంఖ్యను సున్నతో భాగించినను అది వికారమొందదు అని పేర్కొన్నను, భాస్కరునివలె నాఫల మనంత మని వివరింపజాలకున్నను శూన్యసంబంధపరికర్మల నుదాహరించుటయే యతని కాపరికర్మ సుపరిచయ మనుటను విశదీకరించును. మహావీరునకు ౧౫౦ యేండ్ల పూర్వమువాడగు బ్రహ్మగుప్తుడీశూన్యపరికర్మమును పేర్కొన్నందువల్ల నతనికి పూర్వమే సున్న కొక గుర్తు సిద్ధకల్పక మని తేటతెల్లమగును. ఆర్యభటునకు సైత మది జ్ఞాతమనుట అతిశయోక్తి కానేరదు. అంతే కాదు. మహావీరు డంకముల నుదాహరించుచో ౧-౯ వఱకు నంకముల పేర్కొని యాపిదప సున్నను చెప్పెను. ఈ పదిసంజ్ఞలతో దశాంశపద్ధతిలో సంఖ్యల నన్నిటిని సూక్ష్మసూక్ష్మతరములుగ సూచించు టతిసుకరము. కాని యాకాలమున సున్నకు గుర్తుగ దేనిని వాడిరో తెలుపుట దుష్కరము.

గణితసారసంగ్రహమును పరిశీలించువారికి ప్రశ్నలు తోచును: (౧) భారతీయుల విషయప్రతిపాదనశక్తి యెంతవఱకు అనుకృతము కాదు? (౨) గ్రీకుల ప్రాబల్యము కలదనుటకు నిదర్శనము లేవైనను కలవా? (౩) హిందూదేశమున వెలసిన వివిధగణితపీఠములకును పరస్పర మేలాటి సంబంధ ముండెను? (౪) హైందవబీజగణితసిద్ధాంతముల విశేషలక్షణ మేమి?

ఇట్టి ప్రశ్న లొక క్రొత్త కాదు. భారతసారస్వతాభిమానము గొన్న విదేశీయులు డేవిసు, ప్లేఫెయిరు, కోల్బ్రూకు, టెయిలరు మున్నగువారు వంద సంవత్సరములకు పూర్వమే యీలాటి ప్రశ్నములనే లేవదీసిరి. నాటికి నేటికి నాప్రశ్నముల కుచితసమాధానము పుట్టలేదు. ఇప్పటి ప్రయత్నముల జూచిన నాయవకాశమున కెంతో కాలము వేచియుండ నక్కఱ

లేదని గోచరించును. గతశతాబ్దమున అపూర్వముగు చీనీయజాపానీయగ్రంథజాల మెంతో పాశ్చాత్యులకు సుపరిచయ మైనది. వానికన్నను ప్రముఖములైన యరబ్బీగ్రంథములుకూడ వారి పరిచితికి లభ్యపడెను. భాస్కరుని గ్రంథములు ముద్రణభాగ్య మందినవి; వానిని విమర్శకదృష్టితో పరిష్కరణము గావించియున్నారు. కావున భారతీయుల బీజగణితప్రశస్తి నిదమిత్థమని నిర్ణయింపజాలకున్న మనకే సిగ్గులచేటు.

ప్రాచ్యపాశ్చాత్యఖండముల పరస్పరవిజ్ఞానశాస్త్రిసంబంధమును నిర్వచించుచో గ్రీకుల బీజగణితమునకు హైందవబీజగణితముపై నింతేనియు ప్రాబల్యము లేదనుట నిర్వివాదవిషయము; ఉండె ననుటకు సాక్ష్యములే లేవు. రెండింటను స్వాభావికభిన్నత కలదు. ప్రథమార్యభటునకు — ఆర్యభటు లిరువురని చరిత్రకారులు — రెండు శతాబ్దములకు పూర్వము ఉండినవాడు గ్రీకుగణితజ్ఞుడు డయఫాంటసు. [ఇతని రచనము మూలలేఖనము లభ్యము కాదు. వారు వీరు తమ గ్రంథముల నుద్ధరించిన యుదాహరణకతిపయమును బట్టియే యాతని మహత్త్వఘోష.] ఆకాలమున పాశ్చాత్యదేశములనుండి ప్రాచ్యమునకు వాణిజ్యము విశేషముగా ప్రబలియుండినను, దేశాటనప్రియులగు విద్వాంసులు తమ విజ్ఞానమునకు విస్తారము ప్రచారమొసంగుచున్నను డయఫాంటసుకృతములగు విచిత్రసమీకరణములవంటివి ప్రాచ్యగ్రంథములలో గోచరములు కావు. అతని యుద్దేశకములవంటివియు, సంకేతములును, పరిభాషయు నొక్క భారతీయ బీజగణితమందైనను పొడచూపవు. భారతీయబీజగణితములలో శైలియు, విషయవిస్తృతియు స్వభావసిద్ధములై ఆశ్చర్యజనకము లై యుండును. పాశ్చాత్యలోకమునకు వ్యవచ్ఛేదనము, గభీరత, సూక్ష్మత అనునవి గుణములు; అవి వీరియందు కనబడవు. వీరి భాష కావ్యాత్మకమై రసవంతమై యుండును. మనవారు ప్రసక్తియోగ్యములుగ భావించిన విషయములకు యవనగ్రంథముల తావు లేదు. మహావీరాచార్యునకు పాశ్చాత్యసమకాలికుడు అలుఖ్వారిజ్. ఇతడు కొన్ని చమత్కారగణితముల నుపపాదించె నందురు; అది వివాదగ్రస్తమగు విషయము. కాని మిత్రోడోర సనునతని గ్రంథములం దప్పు మఱెక్కడ నింతటి రససాదృశ్యము దృష్టిపథమున కెక్కదు.

సాధారణముగా ప్రపంచమున దేశాటనతత్పరులగు విద్వాంసుల మూలమున నానాదేశవిజ్ఞానము సర్వత్ర వెల్లివిరియుచుండుటవలన అంతో యింతో సామ్యము అన్ని జాతిగ్రంథములలోను చోరబడుట కవకాశము కలుగునుగదా! అయినను, హైందవసిద్ధాంతములుగాని, వారి యుద్దేశకములుగాని యట్టి పాశ్చాత్యప్రాబల్యమునకు తలయొగ్గినటులు జాడలింతేనియు లేవు.

ప్రాచ్యదేశములలోనైనను పరస్పరప్రాబల్య మెట్టిదో నిశ్చయింపబూనినచో క్లేశము అధికము. ఆర్యభటునకు స్థానమొసగిన పాటలీపుత్త్రిపీఠమునకును, బ్రహ్మగుప్తభాస్కరులు పేరుగడించిన యుజ్జయినీపీఠమునకును సంబంధ మెట్టిది? ఈ రెంటికిని మహావీరుని గౌరవించిన దక్షిణాపథమందలి పీఠముపై నెట్టి పలుకుబడి యుండెను? ఈ రెంటిని మించినది చీనాజాతి హైందవజాతులు పరస్పర మెట్టి విజ్ఞానప్రాబల్యము నెఱపగల్గియుండిరో యన్న ప్రశ్న.

నానాఘాటుశాసనములను జూచినయెడల, మొదటిమూడు చీనాంకముల యుపయోగమును, మెసపొటేమియారూపముల వ్యవహారమును మనవారికా కాలముననే తెలిసియుండె ననుట విస్పష్టమగును. కాని మన గణితముపై నవి యెంత ప్రాబల్యము నెఱపెనో యూహింప సాధ్యముకాదు. కాని పదుమూడవశతాబ్దమందలి చీనీయగణితజ్ఞుల యుద్దేశకములు — షక్ష్యూపాంగ్, లీయే, చూషీచియే మున్నగువారి రచనలు - విమర్శపూర్వకముగ శోధించినచో ఉత్తరాసియాగణితముపై భారతీయగణితము అగణితమగు ప్రభావము వహించియుండె నన్నమాట స్ఫుటస్ఫోరకమగును. కొన్నివిషయముల నాడు చీనీయులదే మేలుచేయియేమో యను సంశయమునకును నాస్పదము గలదు.

భారతీయపీఠముల యన్యోన్యాశ్రయ మెంత ప్రబలమో నిశ్చయించుట సుకరము గాదు. ప్రసిద్ధగణితజ్ఞుల కృతులను పరిశీలించిన ప్రప్రథమము

సాదృశ్యతారతమ్యనిరూపణము సంకరముగ దోచును. అట్లు చేసిన మనకు మహావీర బ్రహ్మగుప్తభాస్కరుల గ్రంథములలో వస్తుసాదృశ్యము ఉండినా విస్తృతి యందును, వివరణమునందును విశేషభేదము స్ఫురించును. ఈ ముప్వురును బహుభుజినిగూర్చి ప్రస్తావించి యున్నను రీయెంట్రెంటు (Reentrant) ను సూచించినవాడు మహావీరు డొక్కడే. ముప్వురును వృత్తచాపభాగము (Segment of a circle) ను గూర్చి వివరించినను మూడువిధముల సూత్రములను ప్రతిపాదించి యున్నారు. జన్యపరికర్మప్రస్తావము బ్రహ్మగుప్తుని గ్రంథముతో సాటివెందిన ఉద్దేశకములలో నేలాటి సాటియు గన్పడదు. ఛాయావ్యవహారము, త్రికోణమితి, శంకుమితులకు ప్రారంభదశాసంబంధిగణితము ముప్వురి కృతులలో నుదాహృతములైనను మహావీరుని రచన తక్కినవారి రచనకంటె భిన్నమై ప్రశస్తమై యుండును.

ఈ సాదృశ్యమునకు దృష్టాంతము బ్రహ్మగుప్త వీరాచార్యుల చతుర్భుజ క్షేత్ర వైశాల్యమును సంకేతించు సూత్రము. దాని ఫలము $\sqrt{(s-a)(s-b)(s-c)(s-d)}$. కాని వారెవరును అది వృత్తగర్భ చతురశ్రమునకు మాత్రమే చెల్లునని వివరింపరు. మరికొన్ని యుద్దేశములు—విఱిగిన చెట్టును, యతిని, తటాకమందలి తామరను సంబంధించిన ప్రశ్నములు—అన్నిటను కలవు. అందుమూలమున సుస్పష్టమగు నర్థమేమి? ఈజాతిప్రశ్నలు నేటిపాశ్చాత్త్య లోకములోవలె ప్రాచ్యఖండములోను సామాన్యవ్యవహారమున నుండెను. ఈ సాదృశ్యము ప్రకృతిసిద్ధమైనదిగాని వివరణ విస్తృతి యందు గాదు. ఇది యేమాత్రమును గ్రంథకర్తలలో పరస్పరానుకరణాశ్రయమునకు సాక్షీభూతము కాదు.

రేఖాగణితవిషయమున మాత్రము పాశ్చాత్త్య ప్రభావము తెలుపకయే తెలుపును. ఈ శాఖాభివృద్ధి యందు భారతీయుల శ్రద్ధ బహుస్వల్పము. బ్రహ్మగుప్త మహావీరాచార్య లిరువురును త్రిభుజ చతుర్భుజముల వైశాల్యములను నిర్ధారించుటకు స్థూలసూత్రములనే విధించిరి. అసూత్రములు ఈజిప్టు దేశీయుడు అహ్మసు గ్రంథమునను ఇట్లే యున్నవి. పాశ్చాత్త్యవిజ్ఞానము వానిపై కొంత ప్రాబల్యము వహించినట్లు తెలియును. కాని యా విజ్ఞానము హిందూదేశమును చేరునప్పటికి క్లేశభూయిష్ఠమైయుండెను. ఈ సూత్రములు ప్రమాదాత్మకములని గ్రీకుపండితులు రుజువు చేసిరి. అదియుగాక మెసపొటేమియాలో జనించిన రేఖాగణితము ఒకవంక ఈజిప్టునకును, రెండవ వంక ఇండియాకును పయనించినది. అది తనయందంతర్భూతమైన దోషములను స్థిరీకృత మొనర్చెను. కాని మహావీరాచార్యుడు త్రిభుజ చతుర్భుజ క్షేత్రముల వైశాల్య ఫలానయన సూత్రములను సూక్ష్మమతితో విశదీకరించియున్నాడు. ఆ చతుర్భుజము కేవలము వృత్తాంతర్భూత మని యైనను వివరింపడు. వృత్తపరిధివ్యాసముల ప్రమాణ నిష్పత్తివిషయమున బ్రహ్మగుప్తుడును, మహావీరుడును ప్రాచీన మూల్యమును 3- అని ఉదాహరించుచు $\sqrt{౧౦}$-ను సూక్ష్మ ఫలముగా వివరించిరి. వారి కెవరికిని ఆర్కిమెడీసు హీరానుల గ్రంథములు సుపరిచయము లైనట్లు తెలియరాదు. ఆర్యభటు డీ సంబంధ ప్రమాణమును 3.౧౪౧౬ అని యుదాహరించినను దాని నేమాత్రము స్వయముగా వినియోగపఱచెనో దురవగాహము. కనుక భారతీయ క్షేత్రగణితము బాబిలోనియా జన్యము గాని గ్రీకుజన్యము గాదు. ఇదివరలో సుజ్ఞాతములగు గ్రంథములనుండి మన మూహింపదగిన యర్థ మింతే.

భారతీయ చీనీయ బీజగణితముల పరస్పరాశ్రయ బలమును నిర్ధారింపదగినన్ని ప్రమాణములు లభ్యములు కావు. ఉద్దేశకములలో గొన్ని సదృశాత్మకములైనను చీనీయగ్రంథములకు అనువాదములు లేమిచే వాని సాదృశ్యములును, భిన్నత్వములును నిర్ధారింప వీలులేదు. ఒక్కొక్కదానిలోను గల ప్రశ్నలు సామాన్యముగ పాశ్చాత్త్య గ్రంథముల నుండువానికంటె భిన్నములు. బీజగణితాభిరుచి, తదాశయము, విన్యాస వైఖరి అన్నియు నీ రెండు శాఖలలోను విశిష్టములు, విలక్షణములు నై యుండెను. ప్రాచ్యగణితము పాశ్చాత్త్య గణితము నాశ్రయించిన దనుటకంటె తద్విపరీత పరిణామమే నిజ మనుట యొప్పును. ఆ కాలమున బాగ్దాదు నగరము ప్రాచ్య పాశ్చాత్త్య సంపర్క

మనకు సమానముగా వశమైయుండియు ఇండియా కన్న యూరపునకే యెక్కువ యొసంగెను. లియొనార్డొ ఫిబొనాక్సి యనునతడు భాస్కరాచార్యునకు సమకాలికుడు. లియొనార్డొ వ్రాతలలో ప్రాచ్య ప్రభావము కనబడునంత భాస్కరుని వ్రాతలలో ప్రతీచీప్రభావము కానరాదు.

ఇటీవల భారతీయ బీజగణితము విశిష్టలక్షణము కలదను భావము స్థిరపడినది. దీనికి పలువురు పోషకు లేర్పడి ఏకాశయపరులై స్వతంత్రులై వెలసిరి. భారతీయ బీజగణితము యూరపీయను బీజగణితమునకు తానుపొందిన లాభమునకన్న నెన్నోమడుగులు ప్రోద్బల మొసగియున్నది. స్వదేశీయరేఖాగణితము పేర్కొనదగినంత లేదు. గ్రీకు జ్యోతిశ్శాస్త్రి పండితుల మూలమున త్రికోణమితి కించిత్తుగా మనకు లభ్యమయ్యెను. అదియు గాక మనకు ప్రాప్తమైన రేఖాగణితము గ్రీసు నుండి కాక మెసపొటేమియానుండి సంక్రమించినట్టిది. మహావీరాచార్యుని వ్రాత ప్రాచ్య గణితములో నొక నూతనఘట్టమును ప్రదర్శించును. అందు గ్రీకుల వ్రాతలలో ప్రతిబింబించు నిర్జీవ తర్కము, రచనలో ఆనుపూర్విక విన్యాసము, కేవల భావ విలక్షణమును కానరాక ఊహాసంపన్నతయు, ఉద్దేశక కల్పనోత్సాహమును, ప్రతిభోత్తేజక గుణమును తాండవమాడుచుండును. ఇవి పాశ్చాత్య ప్రపంచమున మృగ్యములు; చీనాజపానుల వ్రాతలలో సమృద్ధములు.

ఇంత దీర్ఘ వ్యాసమునకు ప్రసక్తి యేమని ప్రశ్న కలుగవచ్చును. సారసంగ్రహ పఠనముచే దక్షిణాపథమున ౯-వ శతాబ్దమున జైనులలో గణిత శాస్త్రాభ్యాస మెంత ప్రబలియుండెనో తెలిసికొనుటయేకాక ఆ కాలమున స్వదేశవిదేశ గణితములు పరస్పర మెట్టి ప్రాబల్యము నెఱపుకొనుచుండెనో నిర్ధారించి ఘనీభవించిన విజ్ఞానప్రవాహమును మరల శాఖోపశాఖలుగ, చిలవలు పలవలుగ ప్రవహింపజేయుటకు విజ్ఞులు సంకల్పించి దీక్ష బొందుదు రను నుద్దేశముతో నీ వ్యాసరచనము కావించితి. గుణగ్రహణపారీణులు దోషములను త్యజించి గుణములనే చేకొందురుగాక !



భువనేశ్వరమువద్ద బిందుసరోవరము

నిరాకరణ

●

— శ్రీ సుందరాచారి —

నేలలు దున్ని వానలకు నింగిని చూచెడు రైతుగుండెలో
రాలదు నీటిబొట్టొకటి: రమ్మని లోనికి పిల్వలేను: ఈ
చాలని వేళలో కుసుమసారజలంబుల నేడ దెత్తు? న
న్నేలినవాడ! పూజలకు నేరము కా దిది; ఏగిపొమ్మురా!

తరుగని లేమిబాధలకు తాళని యీ కొఱగాని వేళలో
తిరిపము లెత్తి నా కడుపు తీరక, నాసతినల్లపూసలే
తరమని వెచ్చమాడితిని; తావకకంఠ మలంకరింపగా
దొరకవు రత్నహారములు, దొంగిలితెచ్చినగాని పొమ్మురా.

చేరని జాతిభేదముల చీకటిలో పడిపోయి, తిన్నగా
దారు లెఱుంగలేని పరితాపములో పలవించుచుంటి, నీ
వారసికూడ కప్పురపు హారతు లిమ్మని కోరరాదు: పో
పోర, మహేశ్వరా! అలుక పోవిడి, న న్దయ జూచి పొమ్మురా.

భారతవీరశేఖరుల పౌరుష మింకిన పాడుభూమిపై
తీరని తృష్ణలో కనులుతేల్చిన తమ్ముల సేదదేర్చగా
నేరకయుండె నాకవిత: నిన్ను నుతింపగ జాలినంతగా
తీరిక లేదు నాకు: నను తిట్టిన నేమి ఫలంబు పొమ్మురా.



కృష్ణదేవరాయుని కరుణాకృత్యం

(నాటిక)

= శ్రీ శివరాజు వేంకటసుబ్బారావు =

పాత్రలు

శ్రీ కృష్ణదేవరాయలు	—	విద్యానగర రాజు
హేమరాజు	—	'అనామకుడు'
స్వరూపిణీదేవి	—	మహారాజుశుద్ధాంతంలోని వొక స్త్రీ.
'చిట్టి'	—	పరిచారిక

★

స్థలం—జనానాలో స్వరూపిణిగది

సమయం—౧౫౧౫, సాయంత్రం ౭½ గంటలు

విజయనగరసామ్రాజ్యాన్నిగురించి చాలా గ్రంథాలు చదివాను. గ్రంథకర్తలు ఆనాటి శిల్పాన్ని గురించి చరిత్రాత్మకంగా, మిగతదేశాలలోని శిల్పాలతో పోల్చి వ్రాయడంతప్ప ఆశిల్పులనుగురించి వొక్క విషయంకూడా చెప్పరు. వాళ్లు ఎట్లాంటివ్యక్తులు, ఎక్కడ నేర్చుకున్నారు, వాళ్ల చేతనా లెంత మొదలైన జీవితాలకి సంబంధించిన విషయా లేవీ కనిపించలేదు. ఆ సామ్రాజ్యం పోయింది; కొన్ని శిల్పాలుమాత్రం మిగిలాయి. ఆనాటి వాతావరణాన్ని సృష్టించి, వొక శిల్పి ఆంతరంగికజీవితాన్ని ప్రదర్శించి చూపుదా మన్న సంకల్పానికి యీ నాటిక ఫలితం.

ఆంధ్రోత్పత్తి, కర్ణాటకవాదాలతో దీనికి నిమిత్తం లేదు. ఈనాటికలో జరిగిన విషయాలకి చరిత్రలో ఆధారం లేదు. కాని అవి అసంభవం కాదు. మొదట కృష్ణదేవరాయలని వివాహ మాడటానికి అంగీకరించని ముదుగల్లుకన్య 'నేహాల్'కథ ఫెరిష్టా వ్రాశాడు. ఆమెలాంటి స్త్రీ, తిమ్మరుసులాంటి పురుషుడూ వున్న కాలాలలో యిట్లాంటి వ్యక్తు లుండడం అసహజం కాదు.

చరిత్రకారులు ఏకీభవించని విషయాలు బోలె డున్నాయి. పెయిస్, ఫిగెరిడో మొదలైన పోర్చుగీసులు ౧౫౨౦లో విద్యానగరాని కొచ్చారని కొందరూ, ౧౫౧౩లో వొచ్చారని కొందరూ అంటున్నారు. విఠోబాలయాన్ని కృష్ణదేవరాయలు ప్రారంభించారని కొందరూ, పూర్తిచేశాడని కొందరూ అంటున్నారు. ఇందులో కథకి అనుగుణ్యమైన అంశాలనే తీసుకున్నాను.

[తెర లేవగానే 'స్వరూపిణీదేవి', 'చిట్టి' రంగంమీద కనబడతారు.

'చిట్టి' నల్లటిమనిషి. పసుపురంగు, నల్లటి అడ్డచారలు గల X గజాల బట్టని లుంగీమాదిరి కట్టుకునుంటుంది. మోచేతులదాకా చేతులు గల రవిక. భుజాలచుట్టూ తిప్పిచుట్టిన 3 గజాల ఎర్రరంగు కండువాలాంటిది. కొంచెం పొట్టిమనిషి. చిన్న కళ్లు, పెద్ద పెదవులు-జాగ్రత్తగా పరిశీలిస్తే ఆకర్షణీయమైన చిహ్నాలు లేకపోలేదు. వెడల్పుజడ. చెవులకి దుద్దులు. తివాచీమీద కూర్చుని వీణతీగెలు మోగిస్తూ సరిచేస్తూ వుంటుంది.

'స్వరూపిణి'ది చాలా నాజూకైన నడుం. చామనచాయ. పొడుగాటి ముక్కు పొడుగులో పోటీ పడే నల్లటి కళ్లు. గీతలు స్ఫుటంగా కనపడే నిండైన పెదవులు. గుండ్రని చిన్ని గడ్డం మాట్లాడేప్పుడు పెదవులతో సమంగా లయ కలుపుతూ కదులుతుంటుంది. మధ్యపాపిడి. నల్లత్రాచుపిల్లలలా మెలికెలు తిరిగిన ముంగురులు. మెడవెనక రెండుచుట్టలుగా అమర్చబడ్డ జుట్టు. రెండింటిలోనూ జోలెడు రంగుపూలు. తల చుట్టూ తెల్లరిబ్బను.నుదుటిమీద పాపిడిమొదట్లో 'మణి'. చాలాజతల గాజులు. జబ్బకి బంగారు చుట్టు—దాని నుంచి 'మణి' వేళ్లాడుతుంది. నాట్యభంగిమలు స్ఫురణకి తెచ్చే చేతుల త్రిప్పడు. మృదువైన కంఠం.

మంచం (ఉయ్యాల, లేక సోఫా) మీద కూర్చుని తమలపాకులకి సున్నం రాస్తుంటుంది.

ఒకమూల పెద్దబల్ల. దానిమీద గాజుదీపంబుడ్డి—సిరారంగుది. పక్కన ఆముదపు శెమ్మె. దానివెనక పెద్ద అద్దం. బల్లమీద కొన్ని బట్టలు అమర్చబడి వుంటాయి. సోఫాకింద కలశం. తెల్లద్రాక్షపళ్ల బుట్ట.

'చిట్టి' రాగం ఆలాపిస్తూ వీణతో సుతికలుపుతుంది.]

స్వరూ—అబ్బ-ఆపవే, అది కాదు. ఈపంజరంలోంచి నాహృదయాన్ని ఎగరేసుకుపొయ్యే పాట పాడాలి.

చిట్టి—పంజరం ఎక్కడుందమ్మా! మీరూ రుచీదేవిగారిమల్లే చిలకని పెంచరాదూ?

స్వరూ—దానికేం? ఎన్నైనా పెంచుతుంది. మొగచిలక వున్నంతసేపూ ఆడచిలకని పెంచడం ఏం కష్టంలేదు.

చిట్టి—(పాడుతుంది, గ్రంథం చదువుతూ)

"మూసిన ముత్యమవై కడు
వాసియు వన్నెయును గలిగి వరు డౌననగా
నీ సకలబంధుకోటికి
బూసలతో దార మగుచు బొసగి మెలగుమీ"

స్వరూ—ఎక్కడిదే యీపిచ్చపద్యం?

చిట్టి—మల్లనగారి రాజశేఖరచరిత్రలోది.

స్వరూ—మేమందరం పూసలం, కృష్ణరాయలు దారం! (ఆవలిస్తుంది) ఆపుస్తకం మూసి—నామనస్సుని ఎగరేసుకుపొయ్యే పిచ్చిపాట పాడు. పంజరంపాట ఒద్దు.

చిట్టి—ఊరికే పంజరం పంజరం అంటారు. ఎందుకమ్మా. మీరొక్కరేనా? ఎంతమంది లేరిక్కడ-పోయిగా?

స్వరూ—ఇక్కడికొచ్చి ఐదుసంవత్సరాలైంది; వొక్కసారొచ్చాడే ఆయన—నువ్వే చెప్పు? కృష్ణవేణీనదివొడ్డునతప్ప మళ్లా యింతవరకూ ఆయన్ని ఎప్పుడూ పరీక్షగా చూళ్లేదు. ఒక్కరాత్రి నాతో గడపలేదు. ఎప్పుడూ ఏవో సభలూ, తీర్మానాలూ, యుద్ధాలూ, ఊరేగింపులూ, నాట్యకత్తెలూ! నేనూ చిన్నప్పుడు చిలకల్ని పంజరంలో బంధించి పెంచుకున్నాను. నా పాపం వూరికే పోతుందా! హజారి రాముడు నన్నిందులో బంధించాడు.

చిట్టి—అదేవిటమ్మా అల్లా అంటారు? మీరే వొచ్చారుగా యిక్కడికి?

స్వరూ—ఔను, నాకు జ్ఞానంలేని. లేతరోజుల్లో, రాయలు నామీద చూపిన మోజుకి మానాన్నా, అమ్మా మోసపోయి ధనసంపదలో తులతూగాలని నన్నిక్కడికి పంపించారు. మానాన్నని చూసి ఐదు సంవత్సరాలైంది. తలుపుసందులోంచి, కిటికీరంధ్రాల్లోంచి నే చూసిన మొగాళ్లని వేళ్లమీద లెక్కపెట్టొచ్చు.

చిట్టి—మీ రెప్పుడూ సభలకీ, ఉత్సవాలకీ, ఊరేగింపులకీ వెళ్లరుగనక.

స్వరూ—వెళ్లేవాళ్లందరూ పట్టపురాణీలు. చదరంగలో ఓడిపోయి దాసీలుగా మారి రాయలవారి పాదా లొత్తేందుకు నోచుకున్న పట్టమహిషులు. వాళ్లకి నగలు, మంచిబట్టలు, వజ్రాలు, మణులు, ధనం వుంటే పురుషుడి పాదాలతో తృప్తిపడతారు. నాకు కావలసింది (నిట్టూర్పుతో) పెదవులుకాని పాదాలు కావు.

చిట్టి—(నవ్వుతూ) మీరు యింత బాగా మాట్లాడతారు— రాజుగారు మీ వల్లో ఎందుకు పడ లేదమ్మా? ఎంత అందం మీది? — ఆ చక్కదనం నాకుంటే నే మొగాళ్లని కుక్కపిల్లల మాదిరి ఆడించే దాన్ని.

స్వరూ—నా అందం నా కెట్లా తెలుసు? అద్దం తీసుకురా. (చిట్టి అద్దం ఆమెముందు నిలబెడు తుంది. అద్దంలోకి చూసుకుంటూ—) నా సౌందర్యానికి విలువ లేదే. ఏకాకిగా అరణ్యంలో వుండే యోగి మంచితనానికి ఎంత విలువ వుందో నా అందానికీ అంతే. ఒసే, ఒకవిశేషం చెపుతా విను. జీవితం అంటే కంబళిమీద శయ్య కాదు, కత్తిమీద సాము. రాజుగారి కిరీటంలో మణిగా వెలిసినప్పుడే నా అందం మెరిసిపోతుంది. పాట పాడు. (తాంబూలం నములుతూ పడుకుంటుంది. 'చిట్టి' ప్రేమని గురించిన పాట మొదలెడుతుంది.)

స్వరూ—(లేచి కూర్చుని) ఆపు. నా మనస్సు నాలో నిలవడం లేదే. ఏవో జ్ఞాపకం వొస్తోంది. ఆ పచ్చికబయళ్లు, గొర్రెలమంద, నదీతీరం, తెరచాపలతో చలికి ముడుచుకున్న పడవలు, ముద్దుకోసం చంద్రుడికి దగ్గరగా జరిగిన ఆ మొద్దు మేఘాలు—నేనాగలేనే. (లేచి పచార్లు చేస్తుంది. వొళ్లు విరుపుతో.)

చిట్టి—(లేచి అటూ ఇటూ చూచి) మరిచే పొయ్యాం. యీవాళ పూర్ణిమ. "చందమామ రావే, జాబిల్లి రావే...

స్వరూ— "మా స్వరూపిని తీసుకుపోవే" అదేనా నీపాట? రాత్రి పదిగంటలకి గ్రహణంట. అంతా నదీస్నానాని కెళతారు కాబోలు.

చిట్టి—ఈపాటికి వెళ్లేవుంటారమ్మా. అందుకే అంత నిశ్శబ్దంగా వుంది. మనం వెళదాం లేవండి.

స్వరూ—మనం అందరితోనూ వెళ్లొద్దు. వేరే— రాజుగారు బయలుదేరినప్పుడే వెళదాం. వా రెక్కడున్నారో కనుక్కురా?

చిట్టి—అమ్మో! నే వెళ్లలేను. నాగాంబిక గారు చూశారంటే చంపేస్తారు. ఐనా మాదన్న గొడాని అడిగొస్తా నుండండి. (వెడుతుంది.)

స్వరూ—(వీణతీగెలు మోగిస్తూ పాడడం మొదలెడుతుంది. పాట ఆపుచేసి మధ్యలో లేచి, కొత్త దుస్తులు బుజాలమీద వేసుకుని అద్దంలో చూసుకుంటుంది.)

చిట్టి—(వచ్చి) తెలిసింది. దేవరాయలు విఠ్ఠలాలయాన్ని చూడడానికి వెళ్లారుటమ్మా.

స్వరూ—అందులో చూసేందు కేముందే?

చిట్టి—ఆలయమంటే జ్ఞాపకంవొచ్చింది అమ్మగారూ, రాజుగారు కటకాధిపతిగార్ని జయించి వొచ్చింతర్వాత విజయసౌధాన్ని కట్టించారు, చూశారూ?

స్వరూ—లేదు.

చిట్టి—నేను మొన్న అల్లా వెడుతుంటే—అందరూ దాన్ని చూస్తో నిలబడ్డారు. నేనూ వెళ్లాను. అందులో వెనక రెండు ఆడబొమ్మలు రాళ్లమీద చెక్కివున్నాయండి. నమ్మండి, నమ్మకపొండి — అచ్చంగా మీలాగే వున్నాయండి. ఆ సన్నటినడుం, గుండ్రని బుజాలు, ఆముక్కు అంతా మీరే.

స్వరూ—నిజంగానా? నన్నెవొగా డూ చూడలేదుకదా? లేక నన్ను పొగిడితే నీ కేదేనా బహుమతీ యిస్తానని అంటున్నావా?

చిట్టి—ఛీ, ఛీ! ఎంతమాట? పోనీ, మీరు చూడండి. ఆ సన్నటి మెడ, అ, ఆ, (నవ్వుతుంది సిగ్గుతో) ...రామలింగయ్యగారు ఆబొమ్మ నేం చేశారో తెలుసా, వాటిమీద చెయ్యిపెట్టి...(బిగరగా నవ్వు)

స్వరూ—అనేకమంది స్త్రీల బొమ్మలు చెక్కితే అందులో వొకటి నాలా వుండడంలో ఆశ్చర్యం లేదు. ఇవాళ ఏమైనాసరే, రాయలవారు ఆలయం నుంచి రాగానే ఎదురుగుండా వెళ్లి ఆయన్ని మాటల్లో పెట్టి ఆయనతో కలిసి స్నానాని కెళ్లితీరతానే.

(స్వరూపిణి ద్రాక్షపళ్లు తింటూ పచార్లు చేస్తుంటుంది.)

స్వరూ — ఆ ప్రేమని గురించి పాడిన పాటని మళ్లా పాడవే. ఒసే, అనకూడదు కాని (దగ్గరగా వొచ్చి చెవులో రహస్యంగా) కృష్ణదేవరాయలు నీ కేమన్నా బాగున్నాడే? మొహం నిండా స్ఫోటకపు మచ్చలు, ఆ పెద్ద చేతులు, మొద్దుపాదాలు—ఆలోచించి చెప్పు.

చిట్టి — (నోరు నొక్కుకుని) అమ్మయ్యో, అట్లాంటి మాటలే!

స్వరూ— నే నాయ న్నంతగా పరకాయించి చూళ్లే దనుకో. ఆ హస్తాలలో ఎంత బలముందో, ఆ కళ్లల్లో ఎంత లోతుందో, ఆ పెదవులలో ఎంత మాధుర్యం వుందో నాకేం తెలుస్తుంది? ఆయనలో ఇవన్నీ వున్నాయనుకునే స్త్రీలు ఆత్మవంచన చేసుకుని, వాళ్లల్లో వున్నా యనుకున్న లక్షణాలు ఆయన కారోపిస్తున్నా రంటాను. ఏమంటావ్?

చిట్టి—నాకు మీరు చెప్పింది వొక్కటికూడా అర్థం కాలేదు.

స్వరూ—(దగ్గరగా జరిగి ఒయ్యారంగా తివాసీ మీద కూర్చుని) ఒసే, నీ మనస్సు ఏ మొగాడిమీదికేనా పోయిందే?

చిట్టి—మనస్సు పోవడం అంటే?

స్వరూ— అదే... వాళ్ల దగ్గర వుండాలనీ, వాళ్లని చూడాలనీ, పెండ్లి చేసుకోవాలనీ—

చిట్టి—ఎంతమంది మొగాళ్లండీ — అమ్మో—మీకు కోపం రాదుకదా-మా వీధి చివర వొక సాయిబు వుండేవాడు. సంతకి పోతుంటే వొకరోజున జడట్టుకుని లాగాడు. మళ్లా వాణ్ని చూళ్లేదు. నాకు భలే కోపం వొచ్చింది.

స్వరూ—మళ్లా వాడు నీదగ్గరకు రాలేదనా? (నవ్వుతుంది) నా చిన్నతనంలో నేనూ అంతేనే. మా వీధి చివర పీరపాంచాలుల గుడిసె లుండేవి. ఓ గొర్రెలకాపరి వుండేవాడే. నేను నదికి నీళ్లకి వెళ్లే సమయానికే వాడూ మందలతో చక్కా వొచ్చేవాడు. ఆ గట్టున కూర్చుని నన్నే చూస్తూవుండేవాడు. ఇల్లా రెండు నెలలు. ఏమీ మాట్లాడేవాడు కాదు సుమా. నా కన్నీ జ్ఞాపకం వొస్తున్నాయి. నల్లగా వుండేవాడు. నల్లగా అంటే ఎల్లాగనుకున్నావు? వెన్నెలతాలూకు మెత్తని, పల్చని నలుపు. భుజాలూ— అవీ కండలుతిరిగి వుండేవాడు.

చిట్టి—ఎవడండీ వాడు?

స్వరూ—నువ్వెరగవులే. ఈవూరు కాదు. మావూరు. నే నిక్కడికి వొచ్చేస్తున్నా నని వాడి కెట్లా తెలిసిందో—రోజూ మాయింటిముందు అరుగుకింద నిలబడి, కిటికీలోంచి నేను నాట్యం నేర్చుకుంటూంటే చూస్తూవుండేవాడు. ఆరోజుల్లో మందేశ్వరశర్మ నాకు నాట్యం నేర్పేవాడులే. నాకు వాణ్ణి చూడగానే సిగ్గు వచ్చి పాట నిలిపి ఆగిపొయ్యేదాన్ని.

చిట్టి—మీ రెప్పుడూ నాట్యం చెయ్యరేం—నాకు చూడాలని వుందండీ.

స్వరూ—నన్ను చెయ్యమని అడిగేవాడు లేండే? నే నీ నాట్యంతో రాయలని ఆకర్షించాలిట. రాణీవాసం వొచ్చింతర్వాత నాట్యం నాగలోకాని కెళ్లింది. శుద్ధాంతంలో పడ్డతర్వాత నాశక్తులన్నీ శిలలుగా మారిపోయ్యాయి. సరే, ఇదంతా ఎందుకులే?—ఏం, ఆమట్టున వాడేం చేశాడు—అదే, నేను రేపు యీజనానాలోకి వొచ్చేస్తా ననగా, రాత్రి మండువాలోకి చక్కా వొచ్చి నాచెయ్యి పట్టుకున్నాడు. వాడని గుర్తుపట్టలేదు. ఎవరో అనుకున్నా. నోట్లో వున్న తాంబూలం వాడి మొహాన్న వూశాను. వాడేం చేశాడనుకున్నావ్? "ఆహా, ఆహా" అన్నాడు. తమ్మని ఏరుకుని తిండం మొదలెట్టాడు.

చిట్టి—ఏక్—ఛ, ఛా! (మళ్లా సమర్థించుకుంటూ) లేదు. భలే పని చేశాడు. అబ్బా! (కళ్లు పెద్దవి చేస్తుంది)

స్వరూ—మొద్దూ, చెప్పేది శాంతంగా విను. ఏం ఆమట్టున నే లోపలి కొచ్చేశానే.

చిట్టి—ఓస్, ఇంతేటండీ! నే నైతేనా—

స్వరూ—ఏం చేద్దువే? ఇప్పుడీకనక వాడొస్తే నేను ఏంచెయ్యాను?

(చిట్టి ముక్కుమీద వేలేసుకుంటుంది. పక్క కిటికీలోంచి వొక బాణం వొచ్చి వాళ్లముందు పడు తుంది. దానిమొనకి వొక కాగితం తగిల్చివుంటుంది. ఇద్దరూ ఆశ్చర్యమూ, కొంత భయమూ ప్రకటిస్తారు. చిట్టి కంగారుగా గంతులేస్తూ 'ఎవరు?' అని చప్పట్లు కొడుతూ అన్నిమూలలా చూడడం మొదలెడుతుంది. స్వరూపిణి ఆ కాగితాన్ని బైటికి తీసి చదువుతుంది)

"నువ్వు రాణీవని నాకు తెలుసు. నేను సాధా రణమనిషిని. నిన్ను దూరంనుంచి చాలాకాలం ఆరాధించాను—కీటకం నక్షత్రాన్ని ఆశించినట్లు. ఈ జీవితంలో నేను చెయ్యగల పని చేశాను. ఇప్పుడు నాకు నీతో వొకగంటసేపు ఆంతరంగికస్నేహం కావాలి. ఆతర్వాత చచ్చినా బ్రతికినా నాకు లెక్కలేదు. జవాబు పంపేవరకూ నే నిక్కడనుంచి కదలను. తూర్పువ ౧౩ ద్వారంవద్ద తెల్లటుప్పటీ పాగాచుట్టు కున్న వ్యక్తి. ఇట్లు అనామకుడు"

స్వరూ—చిట్టీ, (చప్పట్లు కొడుతుంది) చాలా ఘోరం జరిగిందే. ఇదుగో, ఇది చదువుకో. మనం హాస్యంగా అనుకున్న సంగతులు ఎవడేనా విని, మనని పరిహాసంచెయ్యాలని యిట్లా చేశాడంటావా? నాకు చాలా కోపం వొచ్చిందని తెలుసుకో.

చిట్టి—పోనీ జవాబుపంపితే? చూద్దాం ఎవడో.

స్వరూ—ఛ, ఛా! నేనెవర్ని? ఒళ్లు దగ్గర వుంచుకో. రాయలని బానిసచెయ్యడానికి సంకల్పించి యీశైదుకి బలిఐన నేను నన్ను వొక సామాన్యఅనా మకుడు లొకడానికి సాహసిస్తాడా? రాయలు రాగానే చెప్పి వాణ్ణి ముక్కలుముక్కలుగా కోయిస్తాను.

చిట్టి—(భయపడుతూ) అయ్యో, పాపం! నేను ౧౩ ద్వారం దగ్గర కెళ్లి చూసొస్తా. అంత ఆగ్రహపడకండమ్మా.

స్వరూ—(కొంచెం శాంతించి) ఓవేళ కృష్ణ రాయలే నన్ను పరీక్షచేద్దామని యిట్లా తమాషాచేశా డంటావా? అబ్బే! నాకు నమ్మకం కుదరడం లేదే. ఆలయానికి వెళ్లిన మహారాజు, చంద్రగ్రహణంనాడు ఎన్నో కృత్యాలు నెరవేర్చవలసిన వుండగా నాతో పరాచికాలాడుతూ కూర్చుంటాడనే — నావెర్రికాక! ఐదుసంవత్సరాలనుంచి లేని ప్రేమ యీనాడు బైలు దేరిందా—నేను నమ్మనే. వీడెవడో దుండగీడు. పొగరు బోతు. నేనంటే అసూయతో కుళ్లిపోతున్న నా సవ తుల ప్రేరేపణవల్ల ఎవడో తుంటరి బహుమానాలకి ఆశపడి పన్నిన పన్నాగం ఇది. ఈ అనామకుడికి శరీరం కూడా లేకుండా చేస్తానే.

(అటూ యిటూ పచార్లుచేస్తుంది—విసుగు రుసరుస నటించి అద్దంలో చూసుకుంటుంది. అందు లో సోఫాకింద వున్న కలశాన్ని చూస్తుంది. వెనక్కి తిరిగి ఆకలశాన్ని పైకి తీస్తుంది. డ్రాయరు యివతలికి లాగి అందులోంచి వొక సీసా తీసి, దానిలోని ద్రావ కాన్ని కలశంలోకి గుమ్మరిస్తుంది)

చిట్టీ, చిట్టీ—ఎక్కడ? (చప్పట్లు కొడుతుంది. వెనకాలే వున్న చిట్టి ఉలిక్కిపడి—)

చిట్టి—అమ్మా, ఇక్కడే వున్నా.

స్వరూ—వాడిని యిక్కడికి రప్పించి, దీనితో నిర్మూలం చేస్తాను. (కలశాన్ని పైకి ఎత్తుతుంది) ఉం డు, మంచి భావం తట్టింది. (చిటికవేసి, చిరునవ్వుతో కూర్చుని) చెబతా రాయి—దానికి జవాబు.

(చిట్టి కాగితం, కలం తీసుకొస్తుంది.)

స్వరూ—తే యిల్లా తే. (ఏదో రాస్తుంది. దాన్ని కోపంతో చించివేస్తుంది) ఆ అనామకుణ్ణి యిల్లా తగులడమని చెప్పు- పో, పరుగెత్తు.

(చిట్టి నిష్క్రమిస్తుంది. స్వరూపిణి లేచి అద్దం దగ్గరగా వెళ్లి దానిలో చూసుకుని తన బట్టలూ, వొళ్లూ సర్దుకుంటుంది. కొత్త ఎర్రకండువా కప్పు కుంటుంది. చెవులకి రుద్రాక్ష లోలాకులు తగుల్చు కుంటుంది. కుంకంతో పొడుగాటి బొట్టు, దానికింద నల్లటి చుక్క పెట్టుకుంటుంది. సోఫామీద వున్న

బట్టలని విప్పి మంచం పైకమ్మీలకు తెరకింద కడుతుంది. తమలపాకులకి సున్నం రాస్తుంటుంది.

ప్రవేశం ‘చిట్టి’, ఆమె వెనక ‘సామరాజు.’

అతని వేషం : తలపాగా పచ్చనిరంగుది ; మరీ పొడుగులు కాని లాగు; పొడుగులు కమ్మీసు; కుడిభుజంపైన నల్ల గళ్ల కండువా; పెద్ద గిరజాల జుట్టు; మధ్యపాపిడి; చెవులకి చక్రాలు (rings); సన్నటి మీసం. చామన చాయ. నిశ్చలమైన చూపు. అసలు మొహమంతా నిశ్చలత్వాన్ని సూచిస్తుంది. మాటలు పట్టిపట్టి మెల్లగా మాట్లాడుతాడు. లావు బుజాలు, పొడనైన చేతులు, చేతులో కర్ర.

వాళ్లకి కనబడకుండా స్వరూపిణి తెరవెనక దాగివుంటుంది.

చిట్టి— దా, రాణీకి నమస్కరించు.

సామ—(నవ్వుతాడు) నీకు కావాలంటే నమస్కరిస్తాను. సౌందర్యరతి ఐన ప్రతి స్త్రీకీ నా హృదయం నమస్కరిస్తూనే వుంటుంది.

చిట్టి — నీ చావు మూడిందిలే. ఏం పొగరుగా మాట్లాడుతున్నావు!

స్వరూ—నువ్వుచేసిన దారుణ కృత్యానికి నీకు శిక్ష తెలుసా ? నా కంఠాన్ని వినేటందుకే అర్హత లేని అనామకుడవైన నువ్వు — నిన్ను నిన్ను... ఏం చెయ్యాలి !

సామ—ఆ కంఠాన్ని విందామనీ, ఆ రూపాన్ని చూద్దామనీ ఎన్నో సంవత్సరాలు కాచుకున్నాను. నన్ను ఏంచేసినా సరే మీ యిష్టం.

స్వరూ—నీ పేరు?

సామ—మొదటే విన్నవించాగా అనామకుడని?

స్వరూ—అప్రస్తుతం,అసందర్భం. పేరు చెప్పు.

సామ—పేర్లతో సంబంధ మేముంది రాణీ. మిమ్మల్ని స్వరూపిణీదేవి అని కాక ‘కురూపిణీదేవి’ అని పిలుస్తే మీసౌందర్యం మారుతుందా? నే నది చూడడానికే వొచ్చాను.

స్వరూ—ఎంత నిర్లక్ష్యం!

సామ—నేను నియమాలని, సంప్రదాయాలని, కట్టుబాట్లని, సంఘనీతిని లక్ష్యంచెయ్యను. అసలు మీ వ్యక్తితో, మీహోదాతో నాకు నిమిత్తం లేదు. మీ సౌందర్యం చూడాలి.

స్వరూ—నేనెవర్నో తెలుసా?

సామ—ఆ. రాయలవారి వుంపుడుకత్తె కావొచ్చు. మర్యాదగా వారి భార్య అనొచ్చు. సామాన్య ప్రజలకి రాణీ. కోటిరాణీలకు సవతి. సంతానంవుంటే తల్లి. నాకు వొక సౌందర్యవంతమైన ఆదర్శం.

చిట్టి—అసలు నువ్వు ద్వారందగ్గర కెల్లా వొచ్చావు? మేము యీ మేడలో వుంటామని నీ కెట్లా తెలుసు?

సామ—నేను నీకోసం రాలేదు. ఊరుకో నా చిన్నినిమ్మపండూ.

స్వరూ—(నవ్వు ఆపుకుంటూ) నీకు భార్య వున్నదా?

సామ—లేదు. నాదగ్గర నౌకరీ చెయ్యడానికి ఏ స్త్రీ అంగీకరించలేదు. నాకు అన్నం పెట్టే శక్తి లేదుగనక.

స్వరూ—భార్య నౌకరీచెయ్యడం ఏమిటి? గూఢార్థం గోచరిస్తోంది.

సామ—వాళ్లనీ, వాళ్ల కుటుంబాలనీ అన్నం, బట్టా పెట్టి పోషించగలడుగనక యీజనానాలో స్త్రీలందరూ రాయలవారికి భార్యలుగా అమ్ముడుపోయారు. అంతకంటె వేరే గూఢార్థం లేదు.

స్వరూ—హద్దుమీరి మాట్లాడుతున్నావు.

చిట్టి—నీకు చావు మూడిందిలే.

సామ—నువ్వూరుకో నా బుల్లి దానిమ్మపండూ.

స్వరూ—నీ వృత్తి ?

సామ— మీ అమాయకత్వానికి నవ్వొస్తోంది. నాకు వృత్తేవుంటే బోలెడు మంది స్త్రీలు నాకు భార్యలుగా అమ్ముడు పోదురు. మన దేశంలో

ప్రతివొక మొగాడికీ ఐదుగురు ఆడాళ్లున్నారు. వీళ్లని పోషించే శక్తి, సంతోషపెట్టే శృంగారం యీ మొగాళ్లలో లేకపోడంవల్లనే యీ విద్యానగరంలో ఎక్కడ చూసినా వారకాంతలే.

స్వరూ—అప్రస్తుతపు ప్రలాపన ప్రేలక నీపనేమిటో చెప్పు.

సాము—నావృత్తి సౌందర్యం సృష్టించడం.

స్వరూ—ఇక్కడికి నీప్రాణాలమీద ఆశపెట్టుకునే వొచ్చావా?

చిట్టి—బాగా అడిగారు.

సాము—నువ్వు తమాయించు నా చిట్టి తమ్మో. లేదు. నాకు బాంధవ్యాల్లూ, స్నేహాలూ, చుట్టరికాలూ లేవు. ప్రపంచం నాకు పరలోకం. మిగతా మానవులు ఏమీ చేతకాక వొత్తిళుంకలై యీలోకానికి లొంగిపోయి—ఖజానాగుమాస్తాలకింద అమ్ముడుపోయి, అందమైన వొస్తువుల అనుభవించడానికి ధైర్యం, తెగింపూ లేక, గౌరవనీయులైన నీతిపరులకింద యీప్రపంచ రథ చక్రాలని పట్టుకు కూర్చున్నారు. వీళ్లలా నేనూ వుంటే యీసాహసం యెల్లా చేస్తా మీరే చెప్పండి. నాకు యథార్థమైన శరీరం వుంటే యిక్కడికి వొచ్చే వుండను. శరీరాన్ని శ్మశానంలోనూ, వ్యక్తిత్వాన్ని విబూదిలోనూ గిరవాపెట్టి, నాయథార్థమైన హృదయాన్ని మీముందు పారేసుకుంటున్నాను. దాన్ని తృణీకరించొచ్చు; హింసించవొచ్చు; తన్నొచ్చు; త్యజించవొచ్చు—కాని దాన్ని చంపలేరు.

స్వరూ—దాన్ని చంపడమే నా సంకల్పం.

సాము — మీ హృదయాలని జనించకుండానే చంపుకున్న మీకు హృదయానికి చావులేదని ఎట్లా తెలుస్తుంది—నా వెర్రి కాకపోతే!

స్వరూ—నీ వొక్కడి హృదయమేనా చావులేంది?

సాము—కావొచ్చు. ఈ చీరలకోసం, ఈనగల కోసం, యీ హోదాకోసం అన్యులు మిమ్మలని చూసి అసూయపడా లన్న మీ గుడ్డికోరిక— యివే యథార్థాలనుకుని నమ్మి, మాతృత్వం, స్త్రీత్వం మొగ్గలోనే తుంచిన మీ మలినశరీరంలో హృదయం ఎక్కడ్డేడిసింది! ఉంటే రాయలకి యింతమంది స్త్రీ లెందుకు?

స్వరూ— ఇంక నీ కిచ్చిన గడువైపోయింది. నీకు కావల్సింది నాతో మాట్లాడడం. అది జరిగింది కాబట్టి యింక...

సాము—మీరు నాకు కనబడాలి—ఏకాంతంగా. రాణీ నన్న సంగతి మరచిపోయి, స్త్రీగా నా ప్రేమని ఆహ్వానించాలి.

స్వరూ—(ఆలోచించి) సరే నీముందు కనబడతాను. కాని అది జరిగిన మరుక్షణానే నువ్వు చావడానికి సిద్ధంగా వుండాలి. ఇదుగో యెదురుగా బల్లమీద కలశంలో విషం వుంది. దాన్ని తాగాలి.

సాము—దానికి సిద్ధం. ఎప్పుడో చచ్చిన యీ శరీరాన్ని యింక యీ విషా లేంచేస్తాయి? మీ సౌందర్యంమీద నిలిచిన నాకళ్లు— మళ్లా యీ రాళ్లగుట్టలని ఎట్లా చూస్తాయి?

స్వరూ—నీకోసం ఏడ్చేవాళ్లు ఎవ్వరూ లేరా?

సాము—ఉన్నారు.

చిట్టి—ఎవరు?

సాము—నువ్వు.

చిట్టి—ఛీ, ఛీ! ఏం పొగరు?

సాము— నీతో కాదు మాట్లాడింది నా నల్ల ఉడతపిల్లా.

స్వరూ—నేనా— దుర్మార్గుడా...!

సాము—ఈ అర్థశూన్యమైన ప్రశ్నలచే కాలం వృథాచేస్తున్నారు. అవును, నాకోసం ఏడ్చేది మీరే. సృష్టికర్తని నేను. మీకు మాతృత్వం అర్పించే శిల్పం కోసం మీరు ఏడుస్తూవుంటారు. మాయింటి ఎదురుగా చెరువొకటి వుండేది. అందులో కెరటాలు గట్టున పడి చేసే చప్పుడు ఎదురుతిరగటం చేతకాక, పైకి చెప్పుకోలేక కుసిల్లికుసిల్లి ఏడ్చే ప్రాచీనస్త్రీల ఏడ్పుచప్పుడులా వుంటుంది. సరస్సులో కెరటాలు గట్టున వయ్యారంగా పడినట్లు మీకన్నీరు మీరొమ్ము వొంకర్ల మధ్య జారతాయి—శక్తికోసం తపించే పల్చని, మధురమైన కన్నీరు. ఏకాంతసౌధంలో బంధింపబడ్డామని తెలుసుకున్నప్పుడు మనమందరం అల్లానే నిశ్శబ్దంగా

ఏడుస్తూవుంటాము. పురుషుడి ఘనమైన, నిండైన కల లని మీకన్నీరు నీరుగా, శూన్యంగా మారుస్తుంది. స్త్రీ కన్నీరులో మునిగిచావడం తప్పనే నేను మీ సౌందర్యమైన కన్నీటిలో మునిగి, రెండు మధురమైన గుటక లేసి చావడానికి సిద్ధంగా వున్నాను.

(స్వరూపిణి తెర తొలగించి అతనిముందు సోఫాలో దర్జాగా కూచుంటుంది. కనుసంజ్ఞతో చిట్టిని పంపేస్తుంది)

స్వరూ—ద్వారం భద్రం...చప్పట్లు వినికిడికి ఎగిరిరావాలి, తెలిసిందా?

(చిట్టి నిష్క్రమణ. అతన్ని చూసి ఆశ్చర్యం తో, ఖంగారుతో లేచి రెండడుగులు వెనక్కి వేస్తుంది. అతను పాగా తీస్తాడు)

సోమ – నువ్వు!– నదీతీరాన్న నాకేసి చూసే నువ్వు ఎంత మారిపొయ్యావు!

సోమ—చాలాకాలంతర్వాత నన్నిదే చూడ డంవల్ల నామార్పు నీకు తెలుస్తోంది. కాని నాకు నీలో ఏమీ కొత్తలేదు. ప్రతినిత్యమూ నావూహాప్రపం చంలో ఏకాంతంగా తిరుగాడే నువ్వు నాకు చిరపరి చితురాలవే. పురుషుడి హృదయం ఎట్లాంటిదో ఎరగని నీకు పురుషుడిపై ఎంత కాఠిన్యం, ఎంత రోత రూపం!

స్వరూ—నా పేరు నీ కెట్లా తెలుసు? నే నిక్కడుంటానని ఎట్లా ఎరుగుదువు? నాకంతా గొడ వగా వుంది. నాకు మతిపోతోంది. (మొహాన్ని చేతు ల్లో దాచుకుంటుంది.)

సోమ—రూపం, ఈలోకంలో నే బ్రతికేది కొన్ని నిమిషాలు. ఈకాసేపూ నన్ను కరువుతీరా నీరూపాన్ని చూడనీ. నన్ను ప్రశ్నలువేసి, గతించిన జ్ఞాపకాలతో నా ఆనందాన్ని కలతపెట్టకు.

స్వరూ—నాలో ఏముంది? నే నొక బానిసని- నిర్భాగ్యురాలిని.

సోమ— అదంతా తాత్కాలికమైన వంచింపు. నువ్వొక రాణీవి. నువ్వెంతో అదృష్టవంతురాలవు గనక నే కృష్ణదేవరాయుల భవనంలో పడ్డావు. మేమం దరం నీ అందానికి బానిసలమే. రాజుకి నీకు చాకిరీ చేసేందుకు వ్యవధీ లేదు, ఓపికా లేదు. నాకు రెండూ వున్నాయి.

స్వరూ—నీమాటలు నన్ను ఎంతో బాధపెడు తున్నాయి. ఎట్లా పిలవను నిన్ను?

సోమ—'సోమా'! నీబాధ నాకెంతో సంతో షం కలగజేస్తోంది.

స్వరూ—నా చుట్టూ శిలలు. నే నొక శిలని– సోమా.

సోమ—ఆశిలలలోని ప్రాచీనం నువ్వు సంపా దించుకున్నావు. సంధ్యాసమయాల సుకుమారమైన ఎరుపు నీది; వెన్నెల బరువుని మొయ్యలేక భయపడి పరుగులెత్తే కెరటాల నురుగుచాంచల్యం నీకళ్లది. చీకటి అడవుల పవిత్రప్రశాంతం నీలో వుంది. ఆనిశ్చ లత్వం, వక్షోభారం మొయ్యలేక ముక్కలుగా విరిగి పడే ఆ నడుం—అన్నీ శిలాకారంగా ఏనాడో మార్చాను.

స్వరూ—నీ కెందు కిట్లాంటి పిచ్చి...? అబ్బా- నా కేడుపొస్తోంది. ఆనాడే ఎందుకు చెప్పలేదు?

సోమ—నాది వాంఛ కాదు; నోరులేని ప్రేమ. నాకేమీ అక్కర్లేకపోయింది. నువ్వు యీ మేఘాల మాదిరి, ఆనదిలో కెరటాల మాదిరి, ఆకొండల మాదిరి, నక్షత్రాలమాదిరి మార్పులేక, నశింపు లేక, శాశ్వతంగా యీ లోకంలో నే వుంటా వనుకునేవాణ్ణి. తరవాత అది 'భ్రమ' అని తెలుసుకున్నా. ఏవో విచిత్రనమ్మకం,- నువ్వెక్కడున్నా, ఎట్లా వున్నా నాదానవే ననుకుని తృప్తిపడేవాణ్ణి. ఈ గాలి మనిద్దరికోసం, సూర్యచంద్రా దులు మనకోసం— అదీ భ్రమే.

స్వరూ — సుఖపెట్టే భ్రమని వొదులుకొని మళ్లా యెందుకు యిట్లా వొచ్చి నన్ను బాధ పెడ తావు సోమా? నీకు నే నెందుకు కనిపించాను?

సోమ— నిజంగా సంతోషం కలగజేసే ప్రతి భ్రమలోనూ చెప్పరాని బాధ వుంది. సూర్యోదయా నికి లోకం ఆనందంతో ఎదురుచూస్తుంది. కాని సూ ర్యుడు తూర్పుకొండవెనకా లేచేటందుకు బాధపడతాడు. రాత్రిమీద నీ ఆకారాన్ని కొట్టలేక నే పడిన బాధ ఎవడికి తెలుసు?

స్వరూ — ఇంత చిత్రంగా మాట్లాడితే నాకేమీ అర్థం కావడం లేదు. కూర్చుని నీగాథ విపులంగా చెప్పు సామా.

సామ — ఏం చెప్పను? నా చిన్నతనంలో నిన్ను చూసి ప్రపంచాన్ని బంగారు రంగులలో తడిపిన రోజుల్లో నేను గొర్రెల కాపరిని. నువ్వెక్కడికి పోయావో మళ్లా తెలీలేదు. ఆనదివొడ్డున కూర్చుని నిన్నుగురించి ఊహించుకుంటూ, నీ ఆకారం జ్ఞప్తికి రాక మతిపోతూంటే, సూర్యుడు విసుగెత్తి అస్తమించేవాడు. తరవాత వీధులమ్మట పూసలు అమ్మేవాడిని. ఎవ్వరూ కొనేవారు కారు. కొంతకాలం కొండమరుసయ్య సాయంవల్ల విలువిద్య అభ్యసించాను. ఇదంతా రెండు సంవత్సరాల క్రితం. అప్పుడు కృష్ణదేవరాయలు ఉదయగిరి ముట్టడి సంకల్పించి సైన్యాలకి చాటించాడు. అందులో చేరి నేనూ యుద్ధంచేశాను. నెలరోజుల్లోనే ఆకోట మా వశమైంది. కాని ఆదుర్గాధ్యక్షుడైన తిరుమల కొంతరాయనీ, అతని పినతండ్రి ప్రహరేశ్వర పాత్రునీ చెఱపట్టడం కాకుండా, అతని మేనత్తనుకూడా చెరపట్టాడు రాయలు. నాకు చాలా కష్టం తోచి ఆమెని విడిపిద్దామని ఎన్నో యత్నాలు చేస్తే అది కొందరికి తెలిసి నన్ను సైన్యంలోంచి తొలగించారు. ఈ భవనాల్లో ఆమె ఎక్కడో వుందని నాకు తెలుసు. ఆనాటినుండి యీ భవనాలచుట్టూ తిరుగుతూ సమయంకోసం కాచివున్నాను.

స్వరూ — ఆమెను విడిపించడంలో నీకెందుకింత పట్టుదల?

సామ — ఆమె సుశీల; చాలా అందమైనది. అందమైన యేవొస్తువు ఖైదులో వున్నా నా ప్రాణం జిల్లార్చుకుపోతుంది. సూర్యచంద్రాదులనూ, గాలినీ, సముద్రకెరటాలనీ ఎవరు బంధించగలరు? వాటినేనా అందరూ సమంగా అనుభవించేటట్టు చెయ్యడం దేవుడు చేసిన వొక మంచికార్యం. సరే, చెప్పనీ— అల్లా కాపలా వేస్తూవున్నప్పుడు, వొకరోజున నిన్ను చూడగలిగాను. జుట్టు ఆరబోసుకుంటూ పడమటి ఆకాశంలోకి చూస్తూ ౧౩ సార్లు పచార్లు చేశావు. ఆ బుజాలు, ఆ నడుం, ఆ నల్లని జుట్టు ఎట్లా మరిచిపోను? సాహసం చేసి నిన్ను తీసుకుపోదామనుకున్నా. వీలుపడింది కాదు.

స్వరూ — వాంఛ లేని నీకు నేనెందుకు?

సామ — ఏదో పిచ్చి! నిద్రరాదు. తోచదు. నాకు యిల్లూ వాకిలీ లేదు. ఎవ్వరూ స్నేహితులూ లేరు. ఈ సంఘం నువ్వు నాదగ్గర వుంటే నన్నూ వొక వ్యక్తిగా గుర్తించును. నావ్యక్తిత్వం సాధించడం ఎట్లా? మనిద్దరి జీవితాలూ వొక నక్షత్రానికి సంబంధించడం ఎట్లా— అని హజారి రామాలయంలో కూర్చుని ఆలోచించేవాడిని. నా పేరు మార్చుకుని, క్రిస్తోవిడి ఫిగరీడో అనే దొరగారి అనుమతి పొంది విజయ సౌధ నిర్మాతలలో వొకడుగా తీసుకోబడ్డాను.

స్వరూ — మా చిట్టి చెప్పింది: అక్కడ రెండు స్త్రీవిగ్రహాలు అచ్చంగా నాలా వున్నాయని.

సామ — అవి నే చెక్కినవే. ఇంక నాకేం కావాలి? మూడు ఆలయాలలో నీ ప్రతిమలు చెక్కి నాబాధనుండి విముక్తి పొందాను. ఇంక యీ లోకంలో నే చెయ్యగల పని లేదు. నువ్వు నాకు లభించనూ లభించవు. అంచేత లోకంపై వొక తృణీకరణభావం బైలుదేరింది. విఠోబాలయనిర్మాతలలో వొకడుగా మళ్లా చేరాను. ఒక స్తంభంపైన నీబొమ్మ చెక్కి నీమూర్తికీ, దానికీ వున్న పోలికని తెలుసుకుందామని సాహసంచేత నిన్ను చూడాలని నిశ్చయించుకున్నాను. ఆసమయం యివాళ చిక్కింది. గ్రహణస్నానానికి అందరు స్త్రీలూ వెళ్లారు. నువ్విక్కడ వుండితీరతావని కనుక్కుని యీ బాణం వేశాను.

స్వరూ — అవి నా ప్రతిమలని రాయలు తెలుసుకుంటే?

సామ — అంత అందమైన స్త్రీ తనదేకదా అనుకుని గర్విస్తాడు.

స్వరూ — సామా, నువ్వింక వెళ్లిపోడం మంచిది. ఈవిషయం రాయలకి తెలిస్తే మన ప్రాణాలు దక్కవు. నే వెళ్లగొట్టబడ్డానంటే నాతలిదండ్రులు నన్ను వాళ్లదగ్గరకి రానివ్వరు. నా బతుకేమాతుంది? నామనస్సు నాకు తెలీకుండా నీమీదికి పోతూనేవుంది.

కాని ఏం చెయ్యను? ఈ జీవితం నాకు తమాషాగానే వుంది. అదృష్టవశాత్తు, నేను సహగమనం చెయ్యాలన్న నియమంలేదు. ఎప్పుడో రాయలు నాదగ్గర కొస్తా డన్న ఆశా వుంది. నగలు, దుస్తులు, హోదా, ఠీవి, తోటిస్త్రీలతో అసూయలు, కొట్లాటలు — నా సోమా, నేనూ వొకే ప్రపంచంలో వున్నాంకదా అన్న సంతోషం.

సోమ—రూపం, నువ్వు నాకుమల్లే తెగించి, యివన్నీ వొదులుకుని వొచ్చేస్తావని నేను కలలోకూడా అనుకోలేదు. నిన్ను కోరిన పురుషులు యీనగరంలోనే బోలెడుమంది వుండొచ్చు. కాని వాళ్లు నాకు మల్లే వారి గౌరవాలనూ, ప్రాణాలనూ త్యాగంచెయ్యడానికి సిద్ధంగా వుండలేదు. నేను నిన్ను కోరి సఫలీకృతం చేసుకోడంలో నామృత్యువు వుందని నాకు తెలుసు. సంతోషం, సత్యం, సౌందర్యం, ప్రేమా లేని నూరేండ్లు ముసిలి వృథాబ్రతుకుకంటే వొకక్షణం మహత్తర ఆశాజ్వాలలో మండి బూడిదవడం వెయ్యిరెట్లు మేలని నా అనుభవం శాసిస్తూనేవుంది. నన్ను పొమ్మంటావు, ఎక్కడికి పోనూ?

స్వరూ—ఇంకా శిలలపై బొమ్మలు చెక్కుతూ వుండు.

సోమ—నా సృష్టిశక్తులన్నీ ప్రజ్వలించుకుని నీప్రతిమలో కూర్చి, నేనూ శిలగా మారిపొయ్యాను. ఇంక నే జీవించి ప్రయోజనం? ఏమీ చేతకాక, కలలు లేక, సంతోషం, ప్రేమా లేక, ముసిలివాడనై యవ్వనాన్ని చూసి అసూయపడుతూ, శరీరంలోంచి బైటికొచ్చిన ఎముకల్ని లెక్కెడుతూ, గతించిన విషయం కూడా లోకానికి తెలియకుండా—

స్వరూ—అబ్బ! ఆపు సోమా — నాఊహాకి అవన్నీ స్ఫురింపచెయ్యకు. మనం జీవితాన్ని అంగీకరించాలి. ఈప్రేమని, బాధని దిగమ్రింగుకుని.

సోమ—నీతులు నేర్పకు రూపం. ఒక సంగతి యథార్థమని నమ్మి దాని కనుగుణ్యంగా ప్రవర్తించక పోవడం మృత్యువుచిహ్నం. ఏనాడు యథార్థనమ్మకాలకీ, దృఢనిశ్చయాలకీ, కార్యానికీ సమన్వయత్వం కుదరకుండా కపటజీవితం కౌగలించుకుంటామో, ఆనాడు యీ సామ్రాజ్యం కూలి రాళ్లగుట్టలుగా మారుతుంది. శరీరాలు, హృదయాలు, రాజ్యాలు—అన్నీ నశింపు. నారక్తంతో నాహృదయంలో నాశాలని ఆయుధాలకింద మార్చి రాళ్లమీద చెక్కిన సత్యమూర్తి శాశ్వతంగా వుంటే వుండొచ్చు.

స్వరూ—ఇదంతా ఆకలితో వున్న సింహం చేసే గర్జన. ఆకలితీరింతర్వాత ఎంత హాస్యాస్పదంగా వుంటుందో తెలుసా సింహం? నేనూ నిన్ను గురించి అనుకుంటూవుంటా. ఊహలో వున్నప్పుడే నువ్వు శాశ్వతంగా, యథార్థంగా వుంటావు. దాన్ని భ్రమగా మార్చి వెక్కిరించడం నా కిష్టంలేదు ఇంతకుముందే చిట్టితో చెప్పేశాను, మనిద్దరికీ జరిగిన యోగస్నేహం. దాన్ని చెప్పేవరకూ నాలో ఎంతో ఆరాటం. చెప్పేసింతర్వాతకూడా అది స్వప్నంలో చరిత్రలా వుంది.

సోమ—సత్యం బైటపడాలని ఎంతో బాధపడుతుంది. దాని ఘోష వినిపించుకోకుండా త్రోసిపుచ్చి, నన్ను భ్రమగా నీ ఊహలో బంధించడం మహాపాపం. నువ్వు యీభవనంలో బంధింపబడ్డావు! నేను నీఊహలో బంధింపబడ్డాను! సత్యాన్ని ఎంతకాలం దాస్తావు రూపం? పూర్తిగా సత్యాన్ని దాచడంలో నెగ్గినప్పుడు ఈ సామ్రాజ్యం కూలి రాళ్లకుప్ప లౌతుంది.

స్వరూ—ఈదీవనలు ఎంతవరకూ నిజమో నీకూ నాకూ తెలీదు. ఉన్న వొస్తువుని వున్నపళంగా స్వీకరించడం నేర్చుకో సోమా. నన్ను—నా వాతావరణాన్ని అల్లానే అంగీకరించాలి. నన్ను మార్చడం, మరోవాతావరణంలోకి లాక్కుపోవడం మూఢత్వం అంటాను. సూర్యుణ్ణి తూర్పుకొండ వెనకనుంచి కాకుండా మరోచోట ఉదయించేటట్టు చెయ్యగలవా, చెప్పు.

సోమ—కార్యశూరత్వం లేని వ్యక్తులకి వేదాంతం ఆయుధంలా తోస్తుంది. బలహీనులు బలవంతులను చూసి ఓర్వలేక భౌతికబలం చెడ్డదని నీతిసిద్ధాంతాలు నెలకొల్పుతారు బీదవాళ్లు భాగ్యం నరకానికి దారి తీస్తుం దని వేదాంతం బోధిస్తారు. చెడిపోడానికి అవకాశాలూ, తెగింపూ లేని వ్యక్తులు చంచలప్రేమని దూషిస్తారు. ఆఖరికి వారకాంతలుకూడా వాళ్లల్లో ఎవత్తైనా

నిజంగా ప్రేమించి, సంసారిగా మారిందంటే దాన్ని హింసించి, వెలేస్తారు. ప్రత్యేకమైన సంస్థలు ప్రతిపాదించిన నియమాలకే నీతని పేరు. నేనొక సంస్థకి చెందను. సంఘంలో నాకు స్థిరపడ్డ స్థానం లేదు. అందుకని వీటిని ఆమోదించను.

స్వరూ—అల్లా ఆమోదించకుండా, అరాజకంగా జీవించడంకూడా నీ నీతే. నీలాటివాళ్లు కొంద మంది వుంటే మీరంతా కలిసి మీనీతిని సాటిస్తారు. దానికి వ్యతిరేకంగా ప్రవర్తించినవాణ్ణి మీరు నిందిస్తారు. అంతేనా ?

సామ—స్వరూ, నీకు హృదయం, దయ, ప్రేమా, స్వచ్ఛమైన ఆనందం లేవు. రాళ్లమాదిరి పదును గల కాఠిన్యమైన తర్కం, బుద్ధీ వున్నాయి. అంతే. నేను హృదయంతో ఆలోచిస్తా—బుర్రతో కాదు. ఆత్మతో వాదిస్తా — నాలుకతో కాదు. నీకీరెండూ లేవంటే నిరాశ వుతుతోంది. నన్ను అర్థం చేసుకోవాలి. వాదించి, నెగ్గి, తో సెయ్యకూడదు. నన్ను సంపూర్ణంగాఅంగీకరించాలి. జీవితాన్ని అంగీకరించాలని నువ్వు చెప్పిన నీతేగా.

స్వరూ—నాకు నిన్ను చూస్తే జాలిగా వుంది సామా. నా ప్రపంచాన్ని వొకక్షణంలో పునాదులతో సహా పెల్లగించాలని యత్నిస్తున్నావు. నా నాశనానికి నువ్వే హేతువులా గున్నావు. నాఊహలో నదివొడ్డున కూర్చుని నాకేసి చూస్తున్న సామరాజు నిజమైనవ్యక్తి. అతన్ని అంగీకరిస్తున్నాను. నాశరీరాన్ని వాంఛించి, ప్రాణాలకే తెగించిన నువ్వు పరపురుషుడవు. నిన్నెట్లా అంగీకరించను?

సామ—నీమనస్సు—నిశ్చయం—నాకు బోధపడింది రూపం. నేనింక బ్రతికేది కొన్ని నిముషాలు.

స్వరూ—నువ్వు యిప్పుడు వెళ్లి, మరోసారి ఎప్పుడేనా రాకూడదా?

సామ—అట్లాంటి పిరికిపని, దౌర్భాగ్యపుపని చెయ్యమనడానికి నీకు నోరెట్లా వొచ్చింది స్వరూపిణీ? నేను ముందుకి సాగిపోవలిసిందేకాని—వెనక్కి మళ్లడం లేదు నాకు. ఏదో దాక్కుంటూ, రహస్యంగా, దొంగవేషంతో వొచ్చి, కాసేపు నిన్ను చూసి, అలభ్యమని తెలుసుకొని బాధపడుతూ, కుటిలప్రేమతో, నీచమనస్సుతో బ్రతకమంటావా? అది అసంభవం స్వరూ. నువ్వు నాతో ప్రయాణం చెయ్యలేవు. ఇది కత్తిమీద సాము. దానిమీదే నానడకంపు. నువ్వు నీ ఊహాలో బ్రతుకుతూ, పాతివ్రత్యం నటిస్తూ, వృద్ధురాలవై, సంతానం లేక, యీ సామ్రాజ్యంతో పాటు నశించి, మరిచిపోబడి రాళ్లగుట్టగా మారతావు. కాని — రూపం ! (ముందుకి వెళ్లి) నీకు నా శిల్పాలద్వారా అమరత గడించిపెట్టానని నమ్మ. నావ్యక్తిత్వానికి, ప్రేమకీ అవే బహిర్గత చిహ్నాలు. మనం అనామకులం. కాని నాలోని యథార్థం, ఆశాజ్వాలా, సృష్టి సౌందర్యం- అన్నీ ఆప్రతిమలు శాశ్వతంగా సాటిస్తూనే వుంటాయి.

(కిటికీలోకి చూసి) చంద్రుడు పైకి సాగిపోతున్నాడు. సోమరిగా మేఘాలు అతని పవిత్రతను కలవరపెడుతున్నాయి. నా హృదయం వాటి మరుగులోకి పోతోంది. స్వరూ, ఒక్కసారి నువ్వు- నీశరీరం మరిచి - తన్మయతతో నాట్యం చేస్తూంటే చూడాలని వుంది. అదీ నా కడసారి కోరిక.

(స్వరూపిణి పైన కప్పుకొన్న కండువా తొలిగించి అతని ముందు నాట్యం మొదలెడుతుంది. అతను ద్రాక్షపళ్లు తింటూ చూస్తూ కూర్చుంటాడు. పది నిముషాలు కాగానే అతను లేస్తాడు.)

సామ— ఎలకపిల్లలమాదిరి లంగాలోంచి బైటికి తొంగిచూస్తూ గంతులేసే నీపాదాలు, కళ్లు ప్రారంభించిన చిరునవ్వును పూర్తిచేసే నీ పెదవులు...

(ఆమె చేతులు పైకెత్తివుంచిన భంగిమలో అతని ముందు నిలబడుతుంది. అతను ఎడమచేత్తో ఆమె చేతిని పట్టుగుని, రెండోదానితో ఆమె ముఖాన్ని తన ప్రక్కకి త్రిప్పుకుంటాడు. తటాలున గిలిగింతలు పెట్టి పరుగెడుతుంది. అతను వెనకా, ఆమె ముందూ—గది చుట్టూ నాలుగైదుసార్లు నవ్వుకుంటూ పరుగెత్తుతారు. చిట్టి " అమ్మో" " అమ్మో" అనుకుంటూ, నోరూ గుండెలూ బాదుకుంటూ ప్రవేశిస్తుంది.)

స్వరూ—ఏమొచ్చిందే?

చిట్టి—ఇంకేముంది? కొంప మునిగింది! గంటలు మ్రోగినాయి. మహారాజు యిక్కడికే వొస్తున్నాడమ్మా.

స్వరూ—నిజంగా? మన గదికే? ఆయనతో కూడా యింకెవరేనా ఉన్నారా?

చిట్టి—ఆ. చాలామందున్నారు. ఇక్కడికే... ఎట్లా? (అటూ యిటూ చూస్తూ గంతులేస్తుంది.)

స్వరూ—(కండువా కప్పుకుని, బట్టలు సర్ది) సామా, నువ్వు పారిపో. పరిగెత్తు.

(అతను తల పంకిస్తాడు)

సామ—నిన్ను చూసి విప్పుకున్న కళ్లని మళ్లా యీపాడులోకంమీద యెట్లా వాల్చను?

స్వరూ—ఇప్పుడిట్లాంటి మాటలొద్దు. పద. ఎక్కడో దాక్కో.

సామ—ప్రాణాలమీద ఆశపడే పిరికిపందని కాను.

స్వరూ—సామాన్యం, నాగౌరవం ... (ఆలోచించి చిటికవేసి) లేకపోతే విషం తాగాలి.

సామ—సిద్ధంగా వున్నాను.

చిట్టి—వీడు చచ్చినా బ్రతికినా మనకి ముప్పు తప్పేటట్లు లేదు. శవాన్ని ఏం చేద్దాం?

సామ—శెలవు తీసుకుంటా నా చిన్ని శెలయేరూ. (కలశం తీసుకుంటాడు)

స్వరూ—నువ్విక్కడే వుండి విషం తాగించు. సామా, ఈ లోకంలో లేని స్వేచ్ఛ మరో లోకంలో. నిన్ను మరచిపోను.

(వెడుతుంది గదిబైటకి. శ్రీకృష్ణదేవరాయలు తొందరగా ప్రవేశిస్తాడు. అతను సామాన్యమైన యెత్తు; మంచి ముఖవర్చస్సు; దృఢకాయం; ముఖాన అక్కడక్కడ స్ఫోటకపుమచ్చలు. కాని అవి వికారం కలిగించవు. పాగా-అందులో యీక. శాలువా కప్పుకునుంటాడు. వంకరతిరిగిన మీసాలు అతన్ని చూడగానే పూజ్యభావం పుదయిస్తుంది*)

కృష్ణ—(చప్పట్లు కొడుతూ) స్వరూపిణీ,... సరే బాగుంది, నువ్వే వొచ్చావు. నదీస్నానానికి వెళ్లక యింకా యిక్కడే వున్నావేం? లే, లే, మనకోసం బైట చాలామంది కాచుకున్నారు.

స్వరూ—(జుట్టంతా చిందరవందరగా వుంటుంది. ఆయాసం-మాటతడబడుతుంది) నామీద నేటి కాలానికి ఎంతదయ! (నమస్కరిస్తుంది)

కృష్ణ— ఇప్పుడు విశోబాలయాన్నించి వొస్తున్నా. అందులో వొక స్తంభంపైన నీమాదిరిగా వున్న చిత్రాలు చెక్కబడి వున్నాయి. నాకు తట్టలేదు. తెనాలిరాముడు ఆ పోలికని చూపించాడు. కాదన్నాను. నాతో పందెం వేశాడు. ఇప్పుడక్కడికి నాతో రావాలి. పద, పద...

స్వరూ— (ఆశ్చర్యం నటించి) నిజంగా? ఐనా, నే ఎల్లా వుంటానో మీ కెట్లా తెలుస్తుంది లెండి? నన్నెప్పుడేనా చూస్తేగా?

కృష్ణ—సరసాలకి సమయం యిదా స్వరూ? క్షణం చూసినా ఏండాది చూసినా మనస్సుమీద ఒత్తిడికలిగించే శక్తి నీలో వుంది. అదీ తెలియనంతటి శృంగారరహితుడ ననుకోకు.

స్వరూ—సరే - పదండి - వొస్తున్నా.

కృష్ణ—ఏమిటి, యిల్లాగే? ఎవరేనా నవ్వుతారు. నీ ఆభరణా లేవి? బంగారు జడేదీ? జ్వాలలా మెరిసే నీఎర్రటి బొట్టేదీ? నీ రత్నాల హారమేదీ? జరీ...

స్వరూ—అలయానికెడుతూ అవన్నీ ఎందుకు లెండి...పదండి.

కృష్ణ—అహ్హహా. అల్లా కాదు. నీతో వుండి, నిన్ను చూసే అవకాశాలే తక్కువ. అప్పుడేనా నాకు నీ నిజస్వరూపం చూపించవా? గదిలోకి పద—నే సర్దుతాను నీజడ, నీఓణీ, నీ బంగారు కడియాలు—

స్వరూ—ఒద్దువొద్దు—ఇట్లాగే పోదాం.

---

* ఇది న్యూనెజ్, పేయిస్ ల వర్ణనలని అనుసరించి.

(రాయలు ఆమెచెయ్యి పట్టుకుని బలవంతంగా తీసుకెడతాడు. ఆమె పెనుగులాడుతుంది. బుగ్గమీద కొట్టి నవ్వుతూ లాక్కుపోతాడు.

గదంతా చిందరవందరగా వుంటుంది. ఒకమూల సామరాజు బోర్లపడివుంటాడు. వెన్ను, జుట్టుమాత్రం కనిపిస్తూవుంటాయి. నడుందాకా తెల్లటిబట్ట కప్పబడి వుంటుంది. దగ్గర్లోనే కలశం వొంకరగా పడివుంటుంది. కృష్ణరాయలూ, స్వరూపిణీ ప్రవేశించేటప్పటికి చిట్టి వీణని ఎత్తి బల్లమీద పెట్టి సోఫా సర్దుతుంది. వాళ్లని చూసి సాష్టాంగ ప్రణామం చేస్తుంది.)

కృష్ణ—రామలింగ డెప్పుడూ యిల్లాంటి పంజాలే వేస్తుంటాడు. మొండిమనిషి! ఎవడికీ తట్టని భావాలు అతనికి తట్టుతుంటాయి. అసలు నిన్నెప్పుడు చూశాడు? ఓహో! శివరాత్రినాడు నాట్యం చేసినప్పుడు కాబోలు...(ఎదురుగా చూసి) ఆదెవరు? మనిషిలా వుందే...మనిషే. మొగాడు. ఎవడు వీడు?

స్వరూ—మనిషి.

కృష్ణ—(కాలు నేలని కొట్టి) ఎల్లా వొచ్చాడిక్కడికి?

స్వరూ—వాడు వొక నేరస్థుడు లెండి.

కృష్ణ—చాలా చిత్రంగా వుంది. తొందరగా చెప్పు.

స్వరూ—అబ్బ-వుండండి. ఇవాళ ఫెరిస్టాఖాన్ కొన్ని పరిమళా లంపాడు. నా కెప్పుడూ పంపుతుంటాడులెండి—మంచి మంచి అత్తరులు. వాటితోపాటు, బాధలేకుండా సునాయాసంగా చంపే విషంకూడా పంపించాడు. అ దెంతవరకూ నిజమో పరిక్షిద్దామని యీఖయిదీని తెప్పించి తాగమన్నాను. మంచి విషం. చప్పుడు చెయ్యకుండా ప్రాణం విడిచాడు.

కృష్ణ—అయ్యో పాపం, వీడిమీ దెందుకు ప్రయోగించావు? బోలెడుమంది శత్రువులు నీకూ, శత్రురాజులు నాకూ వున్నారుగా.—అకులకి సున్నం రాయి. తొందరగా తెమలాలి.

(స్వరూపిణి మొహాన్ని చేతుల్లో దాచుకుంటుంది.)

ఏమిటది? చచ్చినవాడికోసం జాలిపడి ప్రయోజనం లేదు. నేరస్థుడు—అందులో రోగిలా వున్నాడు.

స్వరూ—రోగి కాడు. ఎంతో బలంగా వున్నాడు. (ఏడుపు సాగిస్తుంది.)

కృష్ణ—అయ్యోపాపం! లే, మా చిట్టికా,... పోతేపొయ్యాడులే. ఎవళ్లతో చెప్పద్దు. ఏం? (బుజ్జగిస్తాడు)

స్వరూ—(బిగ్గరగా)అతను...అతను నేరస్థుడు కాడు. మామూలుమనిషి.

కృష్ణ—(కాలు నేలకి కొట్టి, పాగా తీసి) ఏమి టీవేషం – నాకర్థం కావడం లేదు. ఎవడు వాడు?

స్వరూ—అతను నాస్నేహితుడు...

కృష్ణ—ఐతే?

స్వరూ—నిష్కారణంగా చంపేశా. నాకోసం వొచ్చాడు. చంపేశా...యీచేతులతో...

కృష్ణ—ఎందుకు?

స్వరూ—మీ రొస్తున్నారని తెలిసింది. వెళ్లమంటే వెళ్లాడుకాడు. విషం తాగాడు.

కృష్ణ—పాపం, పిచ్చివాడు. నే నేదో చేసేస్తాననుకున్నాడు. (కోపంగా) నీతో ఏంపని?

స్వరూ—నన్ను కోరాడు – ప్రేమించాడు. నేను వీల్లేదన్నాను. చంపేశాను.

కృష్ణ—పిచ్చివాడు! నాతో చెబితే నిన్ను అతనివెంట పంపివుందునుగా. నీది కఠినహృదయం.

స్వరూ—మీదీ అంతే. ఇన్నిసంవత్సరాలనుంచి నన్నిక్కడ బంధించారు. దాస్యమే స్వర్గమనుకున్నాను. మీకు హృదయం లేదు.

కృష్ణ—వెర్రిపిల్లా, నీసౌందర్యం అర్హతలేని సంతలు అనుభవించి నశింపుకాకుండా నేను భద్రంగా కాపాడాను. ప్రేమించినందుకు నువ్వు చేసిన ప్రతిఫలం వాణ్ణి చంపడం. ఎవరికి లేదూ హృదయం?

స్వరూ—అత నెల్లానూ చచ్చాడు కాబట్టి అల్లా అంటున్నారు. బ్రతికివుంటే ఎంత అల్లరిపెట్టి

హింసిద్దురో? శత్రురాజుల స్త్రీలని చెరపట్టి హింసించిన మీరు నా రాజుని దయతో కౌగలించుకుందురా?

కృష్ణ—(నవ్వుతాడు) నా దయ నీమీద కాదు. అతనిమీద. నీతాత్కాలికక్షేమకోసం ప్రాణం త్యాగంచేసిన యీవ్యక్తి మహత్తరవ్యక్తి ఐవుండాలి.

స్వరూ—అంతా హేళన, వెక్కిరింపు. మీరు, మీసంగతి? ఎవరికి పుట్టారు మీరు? మీతల్లి? మీతండ్రి నరసరాయలు ఆదాసీదీ- కులకాంతా ఐన నాగాంబికతో కలియడంవల్లకదా మీరు పుట్టింది?

కృష్ణ—(లేచి కోపంతో పులిలా తిరుగుతూ) ఛీ, ఛీ! నోరు ముయ్యి. నీ నీచపుబ్రతుకుని అందరు స్త్రీలకీ ఆపాదించకు. మాతల్లి వారకాంత అని ఎవరో నేనంటే గిట్టనివాళ్లూ, నన్ను సింహాసనాన్నుండి తొలగించాలన్నవాళ్లూ వేసిన పుకారు. మాతల్లి సాగివారి ఆడపడుచు. దాసీది కాదు; క్షత్రియస్త్రీ. ఒకసారి చదరంగంఆటలో దాసీగా వోడిపోవడంమూలాన అట్లా పరిహాసంగా అనేవారు. ని న్నేం చేస్తానో చూడు. (మొహాన్ని గీరబోయి వెనక్కి తగ్గుతాడు)

(నిశ్శబ్దం)

ఈ స్నేహం గురించి నాతో ఎందుకు చెప్పలేదు? అప్పుడే వాణ్ణి రప్పించి, వాడితో పంపుదును కదా.

స్వరూ—ఆ, పంపుతారు! అసలు మీ కింతమంది స్త్రీ లెందుకు?

కృష్ణ—అసందర్భపు ప్రేలాపనలకి దండన మృత్యువు...(కొంచెం తమాయించి) ఏదో అల్లా చిరాకుపడుతూంటుంది. రాజుకి సంప్రదాయాన్ననుసరించి కొందరు స్త్రీలు, భార్యలు అవసరం. నా హోదానీ, ఠీవినీ వారు సాటుతారు. లేకపోతే యింతమందీ మహా పతివ్రత లనుకునే మూర్ఖుణ్ణి అనుకున్నావా? ఈ జనానాలో నిర్బంధం లేదు. ఇష్టంలేనివాళ్లు తక్షణం వెళ్లిపోవొచ్చు. నగలనీ, దుస్తులనీ, దర్జానీ ఆశించి వొచ్చినవాళ్లలో నువ్వొకదానవు. నీకు పతిభక్తి, పవిత్రప్రేమా వున్నాయని ఎవ్వరూ నమ్మరు. నువ్విప్పుడు చేసిన ఘోరపాపం నీకు హృదయంకూడా లేదని చాటుతోంది.

స్వరూ—నన్నిట్లా బాధించకండి. నాకిప్పటికి కాని అతని ప్రేమలో వున్న లోతు అర్థం కాలేదు. నేను బ్రతకను. నా ప్రతిమల్ని స్తంభాలపై చెక్కింది యితనే.

కృష్ణ—నిజంగా? ఇత నొక గొప్ప శిల్పి. ఇతని కళని నీఅందం బలికోరింది. నీకు అమరత కల్పించిపెట్టాడు—విలువలేని నీకు...

స్వరూ—అతను నన్ను నిజంగా వాంఛించలేదు. నన్ను నమ్మండి—ఏమీ చెయ్యలేదు.

కృష్ణ—రూపం, నీ వెర్రికి జాలేస్తోంది. వాంఛంటే నాకూ తెలుసు. అనేక మధువులు త్రాగాను. చివరిది మొదటిదానిలాగే వుంది. దాహానికంటె మధురమైన పానీయం లేదు. అనేక ఫలాలనీ, రుచులనీ చవి చూశాను. అన్నీ ఒకలాగే ఉన్నాయి. ఆకలికంటె మధురమైన తినుబండం లేదు. ఆమధువునీ, ఆఫలాలనీ పశువుల కెట్టు. నేను నా దాహంతోనూ, నా ఆకలితోనూ నీరసంగా పడుండి మోక్షం పొందుతా. నీకు పూర్తి స్వాతంత్ర్యం యిచ్చాను. నీయిష్టం: యిక్కడుండొచ్చు, వెళ్లొచ్చు. నేను నమిలి పారేసిన ఫలాలను ఏరుకు తినొచ్చు.

స్వరూ— ఎక్కడికి పోనూ? నాకు పామూ కూడా దూరమైపోయ్యాడు.

కృష్ణ—నీ కతడు జీవించివుండగానే దూరమయ్యాడన్న సంగతి తెలుసుకో. అతని ప్రతిభ ఆ శిల్పాలలో వుంది. భౌతిక దేహాన్ని నువ్వు నశింప చేశావు. అంతే. (లేస్తాడు. లోపల్నించి ఎవరో పిలుస్తారు.)

ఇంక నే వెడతాను. అష్టదిగ్గజాలు మావటివాడి కోసం కాచుకునివున్నారు. సేవకులని పంపుతాను. బైట పారెయ్యమను. (ఆలోచించి) ఆ- మరిచాను. ఇది బందిఖానా అంటూ ఏదో గొణిగావు మొదట్లో. నీ కొక్కదానికే కాదు యీ సంకెళ్లు. మనందరినీ యీ ప్రపంచం బంధించింది. కిరీటం నన్ను, స్వార్థం

నిన్ను, కళ అతన్నీ, ఆకృతి రాళ్లనీ, చీకటి వెలుగునీ, సంస్థలు సంఘాన్నీ, ప్రేమ మానవహృదయాన్నీ సంకెళ్లతో సాకుతాయి. ఇదుగో ఈ సంకెళ్లు చప్పుడు కాకుండా చూసే బాధ్యత మనదీ- బాధ్యత నాదీ... (ఎవరో రాజుని పిలుస్తారు) బాధ్యత... (గొణుగుతూ వెడతాడు) రామలింగడికి బహుమానం ఏమివ్వను? ఈశిల్పికి స్మారకచిహ్నం......ఆలోచించాలి...... (నిష్క్రమణ).

(విచారంతో వాలిపోయిన స్వరూపిణి మెల్లగా లేస్తుంది. చిట్టికోసం చప్పట్లు కొడుతుంది. లేచి బల్ల దగ్గర కెళ్లి అందులోంచి విషంసీసా తీసుకొస్తుంది.)

స్వరూ—చిట్టీ, నువ్వింటాకటినుంచీ యిక్కడే వున్నావా?

చిట్టి—కొన్నేపున్నా; కొన్నేపు లేను. కాదు కాదు; మొదట్లో లేను, చివరలో వున్నా.

స్వరూ—చిట్టీ, రాజుగారి మాటలు విన్నావా?

చిట్టి—భయమేసింది. దూరంగా పారిపోయా. విన్నా కాని విననట్టే లెఖ్ఖ.

స్వరూ—నే నేం చెయ్యనే? విషం తాగాడే!

చిట్టి—కలశం నాచేతులోంచి లాక్కుని - పక్కకి తిరిగి 'మంట, మంట' అని అరిచాడు. గబగబా పరుగెత్తాను. ఏంమంట, వాడి నెత్తిమంట! చూసేప్పటికి పడివున్నాడు. కావాల్సిందే.

స్వరూ—చచ్చినవాడిని ఎందుకే దూషించడం? నోరు నొక్కుకో. (రెండు చేతులతో నోరు నొక్కుకుంటుంది) అతను బతికివుంటే ఎంత బాగుండును?

చిట్టి—బ్రతికివుంటే పిచ్చవాగుడు. (మళ్లానోరు నొక్కుకుంటుంది)

స్వరూ—నే నీప్రపంచాన్ని ఎల్లా చూడగలనే?

చిట్టి—కళ్లతో.

స్వరూ—నీ కిప్పుడా పరిహాసం! ఛీ! అవతలికి పో. (తోస్తుంది)

చిట్టి—లేకపోతే నేత్రాలతో...

స్వరూ—చిట్టీ, నే జీవించనే...

చిట్టి—అమ్మో- నేనూ జీవించను. నేను అసలు మొదలే చావను...కాదుకాదు — మొదలే చస్తాను.

స్వరూ—ఇక్కడినుంచి అవతలికి పో.

(గట్టిగా తోస్తుంది. అతని దగ్గర కెళ్లి కూర్చుని వెన్నమీద చెయ్యివేసి పక్కకి తిప్పుతుంది. ఆకలశం తీసుకుని, అందులో విషంపోస్తుంది. 'చిట్టీ, నే జీవించనే' అని త్రాగబోతుంది. సోమరాజు చివాలున లేచి, ఆమె చేతులోని కలశాన్ని లాక్కుంటాడు. స్వరూపిణి ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి వెనక్కి తగ్గుతుంది. చిట్టి 'అమ్మో, దయ్యం దయ్యం' అంటూ అక్కడకొచ్చి గంతులేస్తుంది.)

సోము—నే దయ్యాన్ని కాను నా సత్తుదీపం లేనమ్మ.

చిట్టి — అమ్మో! నల్ల కొరివిదయ్యం.

స్వరూ—ఎవరో తలుపు తడుతున్నట్లుంది. వెళ్లి చూడు.

(చిట్టి వెడుతుంది)

సోమూ, ఎంతసాహసం?

సోము—నేను ప్రాణాలమీద ఎల్లానూ ఆశ వొదులుకున్నా. కాని, చూద్దాం ఏంజరుగుతుందోనని విషం పారబోసి—చిట్టికి తెలుసు — చచ్చినవాడి మల్లే పరున్నాను. రాయలకి ఎంతదయ? ఎంత ఆదరణ? మనం బైటకి పోదాం, పద. గ్రహణస్నానం చేద్దాం. ఆనుట్టున మావూరు.

స్వరూ—రాజుకి తెలిస్తే...?

సోము—మనని రప్పించి బాహాటంగా బహూకరిస్తాడు. పద పోదాం.

చిట్టి—మరి నామాటో?

స్వరూ—నీకు సాయిబు.


చిట్టి—ఛీ, ఛీ!

సోము—కాదు. నువ్వూ మాతోనే వొస్తావ్ మాచిన్ని మిరపపండూ. (వెళ్లబోతుంటే తెర తొందరగా జారుతుంది.)

కలగూరగంప

మణిపురం

"మణిపురం - జపానువారు"- ఇప్పుడు ప్రతినోటా ఇవే ముక్కలు. ఈమణిపురం ఎక్కడున్నదో, దాని ప్రాముఖ్యత ఏమిటో, దానికా పేరు ఎలా వచ్చిందో మొదలైన విషయాలు తెలుసుకుందుకు అందరికీ కుతూహలంగానే వుంటుంది.



మణిపురి యువతి - ఆమెచంటిబిడ్డ

మణిపురం అని మనం ఇప్పుడిప్పుడు కొత్తగా వింటున్నాం గాని రెండేళ్లకు పూర్వమే మణిపురం ప్రజల నృత్యాలవల్లా, మతోత్సవాలవల్లా, నిరాడంబర జీవనంవల్లా పై ప్రపంచానికి తెలుసు. ఇప్పుడు జపానువారు అందులోనికి రాప్రయత్నించగానే ప్రపంచదృష్టి అంతా దానిమీద పడింది.

మణిపురం రాజ్యం అస్సాముకు ఆగ్నేయాన (South-east) వున్నది. దీని విస్తీర్ణం ౮౦౦౦ చదరపు మైళ్లు. అందులో మూడవవంతు కొండప్రదేశం. ఈ రాజ్యపు జనసంఖ్య అయిదులక్షలు. ఇందులో నాగులు, కూకీలు, ఇంకా ఇతరకొండజాతులవాళ్లు సుమారు ఒక లక్ష వుంటారు. ఈరాజ్యానికి రాజధాని ఇంఫాల్. ఇది అస్సాములోకెల్లా పెద్దపట్టణం.

మణిపురం ఆరోగ్యమైన ప్రదేశమనే చెప్పొచ్చు. అక్కడి భూములు సారవంతమైనవి. అక్కడి ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. వారు చాలా చురుకైనవారు. ఉన్నదానిలో జీవితాన్ని సుఖంగా గడపాలని ప్రయత్నిస్తారు.

మణిపురంలో చాలామంది హిందువులే. అంతా చైతన్యుని వైష్ణవమతస్థులే. అక్కడ మహమ్మదీయులు సుమారు నూటికి ఏ అయిదుపాళ్లో వుంటారు.

భారతంలో, అర్జునుడు వనవాస సమయంలో చిత్రాంగద అనే కన్యను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని మనం చదివేం. ఆ చిత్రాంగద నివాసస్థలం ఈ మణిపురమేనట.

మణిపురం అని దానికి పేరురావడానికిగల కారణాన్ని గురించి ఎన్నో చిత్రమైన కథ లున్నాయి.



నాగజాతి యువకుడు

ఒకప్పుడు అర్జునుడు అశ్వమేధయాగ సందర్భంలో దిగ్విజయయాత్రకు బయలుదేరినప్పుడు చిత్రాంగదకు పుట్టిన తనకొడుకు బభ్రువాహనుడితో యుద్ధం చేస్తూ మూర్ఛపోయినాడు. అప్పుడు అర్జునుడికి తెలివి తెప్పించడానికి పాతాళలోకానికి వెళ్లి, అక్కడ వెదకి వెదకి చివరకు నాగరాజు కూతుళ్ల (నాగకన్యకల) దగ్గరున్న 'మణి'ని బలవంతంగా తీసుకుని వచ్చారు. ఆ మణివల్లనే అర్జునుడు మళ్లీ పునర్జీవితుడైనాడు. అందుకని ఈ ప్రదేశానికి 'మణిపురం' అని పేరువచ్చిందని చెబుతారు. అక్కడ నాగజాతికన్యలకు మణులు ఎక్కడెక్కడున్నాయో పోల్చుకునే శక్తి వుంటుందని అంటారు. ఆ చుట్టుపక్కలున్న కొండల్లో మణులు విరివిగా వుంటాయనికూడా అంటారు.

మణిపురం స్త్రీలు :


మణిపురంలో స్త్రీలకు అక్షరజ్ఞానం శూన్యమైనా, వారు రాజకీయాల్లో మంచి వుత్సాహం చూపుతారు ౧౯౭౦ లో మణిపురసంస్కరణ విషయంలో పురుషులకన్నా స్త్రీలే ముందుకు వచ్చి అతిపట్టుదలతో పనిచేశారట.

అక్కడి స్త్రీలు అందంగానూ, ఆరోగ్యంగానూ వుంటారు. అక్కడ చేతిపనులు, గృహపరిశ్రమలు మంచి అభివృద్ధిలోకి వచ్చాయి. అక్కడి స్త్రీలు బట్టలునేయడంలో అతినిపుణులు. పత్తి, పట్టు, నారలు మొదలైనవాటితో రంగురంగుల బట్టలు తమాషాగా నేస్తారు. ఇప్పుడు మన సేనలు అక్కడ ప్రవేశించగానే బట్టలపరిశ్రమ అంతులేని అభివృద్ధి పొందింది. మణిపురం స్త్రీ ఆ మెఇంటి రాణి. పైపనుల్లో మొగవారికి ఎంతో సహాయం చేస్తుంది. పొలం దున్నడంలో, దారం తీయడంలో, బట్టలు నేయడంలో తండ్రికిగాని, భర్తకిగాని, ఎవరికికాని తన శక్త్యనుసారంగా సహాయం చేస్తుంది. స్వంతంగా ఇంట్లో తయారుచేసిన చేతిపనుల్ని మార్కెట్టులోకి తీసుకుని వెళ్లి ఆమె అమ్ముతుంది.

అక్కడి ప్రజలకు వ్యవసాయం ముఖ్యవృత్తి. ప్రజలు ౯౯ వంతులు రైతుజనమే, వారి పంట వారికి సరిగ్గా సరిపోతుంది.

మణిపురంలోనూ బీదజనం వున్నారు. కాని మిగతా మన హిందూదేశంలో వున్న గర్భదరిద్రులు అక్కడ లేరు. తిండికి లేక మలమల మాడి చనిపోవడం అక్కడ అరుదు. వారికి 'కరువు' అంటే ఏమిటో కూడా తెలియదనే చెప్పాలి.

మణిపురంరాజుకు నిరంకుశాధికారం వుంది. రాజ్యంలో ముఖ్యమైన ఉద్యోగాలన్నీ రాజబంధువుల చేతుల్లోనే వున్నాయి. కానీ ౧౯౦౭లో ఆరేడుగురుతో ఒక దర్బారు స్థాపించారు. ప్రస్తుతం అస్సాంనుంచి ఒకతన్ని ప్రెసిడెంటుగా నియమించారు.



నాగజాతి యోధులు

ఈ రాజ్యానికి మొత్తం ఆదాయం ఆరులక్షలు. అందులో నాలుగవభాగం పరిపాలకులది. మణిపురం రాజు ఒక్క రాజ్యాంగవిషయాలందేకాక మత, సాంఘిక, విద్యావిషయాల్లోకూడా శ్రద్ధచూపుతాడు.

వందసంవత్సరాలకుపూర్వం అప్పటి మణిపురం రాజు సర్ చంద్రకీర్తిసింగు బ్రిటిష్‌వారితో సంధిచేసుకున్నాడు. అతనితరువాత శూరచంద్రుడు సింహాసనం ఎక్కాడు. ఇతని ఇరువురు అన్నతమ్ములు — కులచంద్రుడు, తికేంద్రజిత్తు — సైన్యాధిపతితో కుట్ర చేయగా, ఇతను (శూరచంద్రుడు) బ్రిటిష్‌వారికింద నున్న సిల్చార్ (Silchar) పట్నానికి పారిపోయి, వారిని శరణుకోరేడు. వెంటనే అప్పటి ఛీఫ్‌కమీషనర్ క్వింటన్ (Quinton) దొర మణిపురంమీదికి దాడిసాగించాడు.

మాయోపాయంచేత తికేంద్రజిత్తుని పట్టుకుందామని క్వింటన్ దొర తనింటికి రమ్మని ఆహ్వానించాడు. లోపలి సంగతి తెలుసుకుని, ప్రతీకారంగా తికేంద్రజిత్తు సంధిమాటలు మాటాడుదామని క్వింటన్ దొరను పిలిచాడు. క్వింటన్ తన నలుగురు సహచరులతో అతని వద్దకు వెళ్లగా, అతను వారినందరినీ హత్యచేయించాడు.

తర్వాత బ్రిటిష్‌వారు రెండవసారి దండెత్తి వెళ్లి, కుట్రదారుల్ని పట్టుకుని, కులచంద్రుణ్ణి హాజారి బాగ్ జైల్లో వుంచి, తికేంద్రజిత్తునూ, సైన్యాధిపతినీ వురితీశారు.

పరిస్థితులు చక్కబడ్డాక బ్రిటిషువారు ఇప్పటి రాజైన సర్ శూరచంద్రసింగును మణిపురంరాజుగా నియమించారు. అప్పట్నుంచి మణిపురం బ్రిటిషువారి కిందనే వుంది.

మణిపురంప్రజలు మనలానే స్వరాజ్యం అని అలజడిచేశారు. వారిది చైతన్యడిమతంకాబట్టి, గాంధీజీ బోధలు- సత్యాహింసలు వారికి బాగా నచ్చాయి.

కాంగ్రెసును అనుసరిస్తూ "నిఖిలమణిపుర మహాసభ" నొకదానిని స్థాపించి వారి పూర్తిహక్కులకై తీవ్రంగా పోరాడుతున్నారు.

['ఓరియంట్ వీక్లీ' నుంచి]

బాబులు.

వజ్రపరిశ్రమం

వజ్రపరిశ్రమకు నిపుణులు, అనుభవజ్ఞులు, సూక్ష్మ పరిశీలనాశక్తి గలవారు చాలా అవసరము. ఓర్పుగూడ ముఖ్యమైనదే. ప్రస్తుత యుద్ధమునకు పూర్వము ఆమ్‌స్టర్డాము, ఆంట్‌వర్పులు వజ్రపరిశ్రమకు ప్రధానకేంద్రములై యుండెడివి. ౧౯౪౦-వ సం. లో హిట్లరు ఆ దేశములపై దండెత్తి వెళ్లినప్పుడు కొందరు పనివారును, యజమానులును యింగ్లండునకు పారిపోయిరి. అచ్చట బ్రిటిషు ప్రభుత్వముతో సంప్రదించి యింగ్లండులో నొక వజ్రపు పని చేయు యంత్రశాలలను క్రొత్తగా స్థాపించిరి. అక్కడ తయారుచేయు వజ్రములలో నూటికి ౮౦% వంతులు అమెరికాకు ఎగుమతిచేయబడును. మిగిలినవి యింజనీరింగులోను, విమానములలోను ఉపయోగింతురు.

గనులనుండి తీయబడిన ముడివజ్రములు మొట్టమొదట యంత్రశాలకు పంపబడగానే వానిని రంగు, తూకము, రకములను బట్టి విభజింతురు. అన్నిటిలో మంచి వజ్రమునకు శ్వేతనీలవజ్ర మందురు.

ముడివజ్రములపైన స్ఫటిక స్థితి పొందని పొర యొకటి యుండును. మొట్టమొదట యీ పొరను తీసివేయవలెను. యీ ముడివజ్రములను ముడివజ్ర ప్రవీణులు జాగ్రత్తగా పరీక్షచేసి ఒకచోట గుర్తు పెట్టుదురు. ఈపరీక్షకు కొన్ని గంటలకాలము పట్టును. సరియైన చోట గుర్తు పెట్టక పోయినచో వజ్రముయొక్క విలువ చాలా తగ్గి పోవును.

ప్రథమ విధానము (First Process):

సుమారు జానెడు పొడవు గల పుల్లచివర వెచ్చచేసిన సిమెంటు కొంచెము అంటించి దానిలో పైవజ్రమును జాగ్రత్తగా నమర్చి నీటిలో ముంచినచో సిమెంటు గట్టిపడును. తర్వాత యింకొక వజ్రముతో మరియొక పుల్లను తయారు చేయుదురు. ఈ రెండవ వజ్రముతో మొదటివజ్రముమీదనుండు గుర్తుపైన కొంచెముగా గోకి ఒక సన్నని గాడి తయారుచేయుదురు. యీ విధముగా తయారైన చిన్నగాడిలో ఒక పదునైన ఉక్కుకత్తిని పోనిచ్చి ఒక అదునైన దెబ్బతో రెండుగా బద్దలు చేయుదురు. యీ పనిగూడ చాలా అనుభవజ్ఞులు చేయవలెను. కొంచెము హెచ్చు తగ్గుగా గనుక కొట్టినచో సరియైన స్థలములో బద్దలు గాక, వజ్రపు విలువను చాలా తగ్గించును. యీపనియైనతర్వాత మరియొక ప్రవీణునకు పంపబడును. అతడు రంపపుకోతకు తగినట్లు గుర్తులు పెట్టి తర్వాత యంత్రమునకు పంపును.

రంపపుకోత:

వజ్రమును కోయుటకు ఒక లోహపుపళ్లెము నుపయోగింతురను విషయము చాలామందికి క్రొత్తగా ఉండవచ్చును. ఈ గుండ్రని లోహపుపళ్లెమును నిముషమునకు ౪౦౦౦ చుట్లు చొప్పున ఒక విద్యుద్యంత్రసహా

యమున త్రిప్పుదురు. యీపళ్లెముపై వజ్రపుపొడి, ఆలివ్ నూనె కలిపి తరుచుగా పట్టించుచుందురు. యీవజ్రపుపొడి చాలావేగముగా తిరుగు పళ్లెముపై నుండుటచే "వజ్రం వజ్రేణ భిద్యతే" అను న్యాయప్రకారము వజ్రమును ఛేదించును. యీ రంపపుకోత చాలా సున్నితమైన పని. ౫౦ కారట్ల వజ్రమునకు సుమారొక మాసము పట్టును. యీయంత్రము లన్నియూ విద్యుత్ప్రాయమున నడుపబడును.

రంపపు కోతయంత్రమునుండి వజ్రము మరియొక పనివానియొద్దకు పంపబడును. అత డీవజ్రము నొక రాగిశంఖువు(Cone)లో బిగించి, ఆరాగిశంఖువును నిముషమునకు ౬౦౦ చుట్లు తిరుగు మరియొక యంత్రమునకు సిమెంటుతో అతికించును. మరియొక వజ్రమును ఒక పుల్ల కతికించి, తిరుగుచున్న యీ వజ్రముపైన స్వల్పశక్తితో కదల్చుటవలన తిరుగుచున్న వజ్రమును కావలసిన ఆకారమునకు తేవచ్చును. అచ్చటనుండి వజ్రము మెరుగుపెట్టుటకు పంపబడును.

మెరుగుపెట్టుట:

మెరుగుపెట్టుటలో రెండు విధానములు గలవు. మొదటిది క్రూయిట్జు విధానము; రెండవది బ్రిలియాండరు విధానము. మెరుగుపెట్టుటకు ముందు వజ్రము నొక శ్రావణమునకు బిగింతురు. ౧౦ అంగుళముల వ్యాసము గల యినుపపళ్లెమొకటి నిముషమునకు ౨౫౦౦ చుట్ల చొప్పున త్రిప్పబడుచుండును. దీనికికూడ వజ్రపుపొడిని పట్టించి వజ్రమును మెల్లగా దీనిపై ఆనించి పళ్లెమును త్రిప్పుదురు.

యీవిధముగా మొదట వజ్రము నాల్గుమూలలకును మెరుగుపెట్టుదురు. పిమ్మట వజ్రమును తీసి శ్రావణమందు మరియొక కోణములో బిగించి తిరిగి నాల్గుమూలలు మెరుగుపెట్టుదురు. పిమ్మట బ్రిలియాండరుపనివానియొద్దకు పంపుదురు. అతడు మిగిలిన భాగమంతకును మెరుగుపెట్టును. మెరుగుపెట్టుటలో భూతద్దము పెట్టి ప్రతిక్షణమును పరిశీలించుచుందురు. మెరుగుపెట్టుట పూర్తిఅయినపిమ్మట ద్రావకములో ఉడుకబెట్టి తీసి పరీక్షించి పిమ్మట అమ్మకమునకు పంపుదురు. పనిముట్లు, యంత్రములు ఎల్లప్పుడును జాగ్రత్తగా పరీక్షచేయబడుచుండును.

యీవిధముగా 3 సం.లలో ముఖ్యమైన క్రొత్త పరిశ్రమ యొకటి యింగ్లండులో అభివృద్ధిపొందినది. యిప్పటికే ఆ ఫ్యాక్టరీలో యింగ్లీషువిద్యార్థు లనేకులు తర్ఫీదైరి. పరిశ్రమ అభివృద్ధిచెందినకొలదియు ఎక్కువమంది యింగ్లీషువారు ప్రవీణులై, అసలువారిని స్వదేశమునకు పంపుదురు.

యుద్ధకాలమందు తలదాచుకొనుటకు వెళ్లినవారినుండి క్రొత్తవిద్య, పరిశ్రమ నేర్చుకొని, బ్రిటిషు ప్రభుత్వము తమ దేశాభివృద్ధి చేసుకొనుచున్నది. భారతప్రభుత్వముగూడా అట్లెన్నడు చేయగల్గునో గదా !!!

పి. వి. రామమూర్తి.

దొనె తహశీల్దారు

(వినోదకథ)

ఆంగ్లేయులు ఇప్పటివలె హృదయం లేకుండా సంచరించే రకంగా పూర్వ ముండేవారు కారు. కంఫినీపరిపాలనలో ప్రజలతో చాలా కలసిమెలసి వ్యవహరించే ఉద్యోగు లుండేవారు. ప్రజల కష్టసుఖములను విచారించి వాటి నివారణోపాయములను వెదకి సర్వవిధములా సహాయకారులుగా ఉండేవారు. అందువలననే సర్ తామస్ మన్రోవంటి ఉద్యోగులు యిప్పటికీ ప్రజల హృదయాలలో జీవించే ఉన్నారు.

ఆకాలంలో సర్ వాల్టర్ స్మిత్ అనే ఆంగ్లేయుడు చిత్తూరుజిల్లాకలెక్టరుగా ఉండేవాడు. అది ౧౮౭౯–వ సంవత్సరము. అప్పటికప్పుడే ప్రభుత్వము కంఫినీవారి చేతులలోనుండి పోయి విక్టోరియారాణి చేతులలోనికి వచ్చిన రోజులు. ఆయన ప్రజల కష్టసుఖాలను విచారించడానికి తనజ్యూరిస్‌డిక్షనులో గల గ్రామాల కన్నిటికీ తరుచు వెళుతూఉండేవాడు.

అటువంటప్పుడు అతను తరుచు మదనపల్లికి వెళ్లవలసివచ్చేది. అది అప్పటికే ఆరోగ్యానికి పేరుపడింది.

ఆరోగ్యకేంద్రాలలో అది ఒకటిగా ఉండేది. ఆయన అక్కడ క్యాంపుచేసినపుడల్లా ఆ ఊరిలో దోసెలమ్ముకొనే బ్రాహ్మడొకడు ఆయన రాగానే నాలుగు దోసెలు, గ్లాసెడు వేడిపాలు పట్టుకువెళ్లి కలెక్టరుగారికి సమర్పించి వచ్చేవాడు. ఇలా చాలాకాలం ఆ బ్రాహ్మడి అతిథిసత్కారం కలెక్టరుగారికి ప్రాప్తించింది. ఆకాలంలో కాఫీఅలవాటు లేదు. ఇతర గ్రామాల్లో ఇంత ఆదరణ ఆ కలెక్టరుకు లభించలేదు. మంచి ఆకలిమీద ఉన్నప్పుడే దోసెలూ, పాలూ కడుపులో పడేవేమో - ఆ కలెక్టరుగారి కా బ్రాహ్మడి మీద అపారమైన ప్రేమ పుట్టుకొచ్చింది.

ఒక పర్యాయము ఆయన వచ్చినపుడు దర్బలు విశేషంగా ఇచ్చి గౌరవించి అయిదువందల రూపాయలు బహుమతీ ఈయబోయాడు. బ్రాహ్మడు "రామ రామ" అని చెవులు మూసుకొని, "ప్రభూ! మీరు విష్ణ్వంశ సంభూతులు. మీ కాతిథ్యాన్ని నేనమ్ముకోడానికి రాలేదు" అని ఆ ధనాన్ని మెల్లిగా నిరాకరించాడు. ఆరాత్రి కలెక్టరుగారు ఆలోచనలో పడ్డారు— "ఏమి ఉపకారం చేస్తే యీ బ్రాహ్మడి ఋణం తీరుతుం"దని. ఆయన కొక చక్కటి ఉపాయం తోచింది. అప్పుడు కలెక్టరులు భూములు బహుమతీగా యీయవచ్చు. కాబట్టి ఆ బ్రాహ్మడిని పిలిచి "మహారాజా! కోరుకోవయ్యా, నీయిష్టంవచ్చిన చోట నూరు ఎకరాల భూమి యీనాంపట్టా వ్రాసియిస్తాను" అన్నాడు. "ఏలినవారి అనుగ్రహం ఉంటే చాలు, నూరు ఎకరాలు ఇచ్చినట్లే. నాకు ఏమీ వద్దు" అన్నాడు ఆ బ్రాహ్మడు. కలెక్టరు నివ్వెరపోయాడు. ఇంతటి నిష్కామసేవ అత డెన్నడూ కని విని యెరుగడు.

తుద కా కలెక్టరుగారు ఆ బ్రాహ్మడికేదైనా ఉపకారం చేయకపోతే పిచ్చెత్తే స్థితికి వచ్చాడు. మరోసారా బ్రాహ్మణ్ణి పిలిపించి "భూసురోత్తమా! నీవు నావలన ఏదైనా ఉపకారం పొంది తీరాలి. లేకుంటే నేను నీఋణాన్ని పడిపోనా? నీవు ఏమి కోరుకొన్నా యిస్తాను" అని తెగ బలవంతపెట్టాడు. చివరకు బ్రాహ్మడు మొగమాటపడి "దేవరవారికంత పట్టుదలగా ఉంటే ఒక తహసీల్దారుపని యిప్పించండి" అన్నాడు. వెంటనే ఆయన్ని కాళహస్తి తహసీల్దారుగా వేశారు.

దోసెతహసీల్దారుగారు వస్తున్నారని కాళహస్తిలో తెలిసిపోయింది. మందీ మార్బలం అంతా ఎదురేగి ఆయన్ని ఊరేగించి గ్రామంలోనికి తీసుకువెళ్లి ఒక హవేలిలో ప్రవేశపెట్టారు. ఆ బ్రాహ్మడికి పప్పురామశర్మ అని తన పేరు దస్కతుపెట్టడంతప్ప మరొకటి రాదు. క్రింది ఉద్యోగులంతా చేసిపెడితే చివరను 'పప్పు రామశర్మవ్రాలు' అని దస్కతు చేసేవాడు. కాని దబాయింపువల్లా, లోకజ్ఞాన మున్నవాడవడంచేతా ప్రజలకు విశేషంగా రెమిషనూ అవీ యిప్పించి బాగా లంచాలు చెక్కేసి యిటు ప్రజచేత మెప్పు పొందాడు; అటు తానూ బాగుపడ్డాడు.

ఆయన చనిపోయేటప్పటికి తొమ్మిదివందల ఎకరాల మాగాణీ సంపాదించాడు. కలెక్టరిస్తానన్న వందఎకరాలు ఎందుకూ? ఇప్పటికీ అతని సంతతివారు సుఖంగా అనుభవిస్తూ ఉన్నారు.

ప్రజల నెత్తిగొట్టి విర్రవీగేవారికంటె వారి కుపకారంచేసి తృణమో పణమో తిన్న యితడు యోగ్యుడు కాడూ?

పులవర్తి కమలావతీదేవి





విమర్శనము

వేంకటేశ్వర స్తవము

రచయిత: జంగంకోట కృష్ణరావుగారు, బి.ఏ., బి.యల్., చిత్తూరు. క్రౌనుసైజులో ౨౬ పుటలు. వెల ౧౨ అణాలు.

లోకోపకృతికై బద్ధకంకణుఁడు కవి యనుట నిర్వివాదము. మతధర్మ ప్రచారమే కవికి సుఖము. దేశసేవాపరాయణత్వమే కవికి భుక్తి. భగవన్మహాత్మ్య ప్రకటనమే కవికి ముక్తి. పరమమూర్ఖులు సాధువు లగుటకుఁ దన సద్గ్రంథములు తోడుపడియె నని యెవరైన వచించిన నాసద్వాక్యశ్రవణమునఁ గవి యానందసాగరమున నోలలాడును. ఇట్టి మార్గములు గాక లోకోపకృతులన నింక నెట్టివి? ఇవియే పరమపురుషార్థము లనుకొను కవికంటె నుపకారి యెవఁ డుండును? కనుకనే భర్తృహరి "సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్" అని వచింపఁగల్గెను. భావప్రపంచమున సత్కవి సర్వజ్ఞుఁడై భగవంతునిఁ గాంచుచుండు ననుటలో నచ్చెరువేమి? వాఙ్మయమంతయు నతని మూలమున నిలిచియున్నది.

కవులు మూఁడు తెగలని వచింపవచ్చును. పరార్థైక ప్రవృత్తిప్రమోదుఁడు, స్వార్థపరార్థసమత్వప్రవృత్తిప్రమోదుఁడు, స్వార్థైక ప్రవృత్తి ప్రమోదుఁడు అని వాని పేరులు. ఉత్తమమధ్యమాధమపంక్తుల వానిని వ్రాయవచ్చును. పరార్థ మనఁగా నుత్కృష్ట ప్రయోజన మెద్దానఁ గలుగునో యామార్గమును జూపుట అని నా భావము. అది భగవన్మహాత్మ్య ప్రకటన రూపమే, దాన నొరులకు మేలుగూర్చినంత వేఱొకమార్గమున మేలుగూర్పఁజాలఁడు. అట్టి మహాకార్యమున బద్ధకంకణుఁడైనచో నతనికంటె నుత్తమపురుషుఁ డెవఁ డుండును? భగవంతుని మహాత్త్వమును జరిత్రరూపమున బోధింపవచ్చును. కాని యది యత్యల్పము. స్తవరూపమునఁ దెల్పఁజాలినంతఁ జరిత్రమూలమునఁ దెల్ప నవకాశ ముండదు. దుఃఖసమయమున భగవంతుని స్తవములు చేయఁగల్గినంత మేలు మఱియుఁ జేయఁజాలవు. భక్తిని స్థిరముగా హృదయమున నిల్పుటకు స్తవములు ప్రధానములు.

"తనువే నిత్యముగా నొనర్ప మది లే
దా చచ్చి జన్మింపకుం
డ నుపాయంబు ఘటింపు మీగతుల రెం
టఁ జేర్ప లేకున్న లే
దని నా కిప్పుడె చెప్పు చేయఁగల కా
ర్యం బున్న సంసేవచే
సి నినుం గాంచెదఁ గాక కాలమున నో
శ్రీకాళహస్తీశ్వరా"

అని మహాకవి స్తుతించినాఁడు. భగవంతుని యెడల భక్తుల కుండు స్వాతంత్ర్యము నిదియే తెల్పును. దీని యర్థమును జక్కఁగా నవగతము చేసికొనినయెడల దుఃఖములు నిలువఁగల్గునా? భక్తి కుద్బోధకములు స్తవములనుట సిద్ధాంతము. స్తవరూపమున భగవచ్చరిత్రమును బోధించిన నదియు నీపంక్తిలోనిదే. ఈవిషయమును స్మృతికిఁ దెచ్చినది వేంకటేశ్వర స్తవ మను నీ చిన్నిగ్రంథము. శ్రీ జంగంకోట కృష్ణరావుగారింతకు మున్నే ఆత్మబోధము, శ్రీ శంకరభగవత్పాదాచార్య కృతశ్లోకార్థోప బృంహిత సవ్యాఖ్యానపద్యకదంబము, తిక్కన శ్రీనాథులఁగూర్చిన వ్యాసములు, మాతృపటము (శేప రను ఆంగ్లకవి రచించినదానికిఁ దెలుఁగు

అనువానిని ముద్రించియున్నారు. మఱియు సారస్వత వ్యాసములు, చాటువులు ముద్రింపనున్నారని తెలియుచున్నది.

ప్రకృత మీవిమర్శనమున కాధారమగు వేంకటేశ్వర స్తవమునుగూర్చి నాలుగుమాటలు వ్రాసెదను. ఇయ్యది నూటపది పద్యములు గల గ్రంథము. దీనికి శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డిగారు చక్కఁగా వ్యాఖ్యవ్రాసియున్నారు. అదియు దండాన్వయక్రమము ననుసరించి లలితపదములతో వ్రాయఁబడియున్నది. గ్రంథకర్తలు కృష్ణరావుగారు; వ్యాఖ్యాతలు శ్రీరాములురెడ్డిగారు; గ్రంథప్రతిపాద్యవస్తువు శ్రీ వేంకటేశ్వరులు — ఇట్లు కుదిరిన దీనియందుఁ గొఱంత లేవి యుండును? "కలౌ యుగే వేంకటనాయకస్య" అను సూక్తి యందఱెఱింగినదియే. కలియుగము పోయిన దని చేతావని గ్రంథము పల్కినను గలికాలము వృద్ధియగుచున్నది. సకలధర్మములు కార్యార్థముగ నాచరింపఁబడు నీకాలమున భగవన్నుతులు వ్రాయువారే పరార్థైకప్రచారకు లనవలయును.

"కులము దహించు నాకశిఖి
కుండసముద్భవసాధ్వి ద్రౌపదిన్
గొలువున కీడ్చి కౌరవులు
గూడని కృత్యము లాచరింప న
ప్పొలతికి సభ్యు లడ్డపడి
ప్రోచిరె గొబ్బున నీవుగాక చు
ట్టలు చెలు లెవ్వరౌదు రక
టా! తఱిదప్పిన వేంకటేశ్వరా" (౧౨)

గ్రంథకర్తకు సుచిత పదవిన్యాసమునందు మిక్కిలి మక్కువ గలదని యీపద్యము తెల్పుచున్నది. శిఖికుండసముద్భవ, సాధ్వి యను నీ రెండువిశేషణములు 'కులము దహించు' ననుదానిని సార్థకము చేయుచున్నవి. సాధ్వికి మాఱుగాఁ గల్కి లోనగు పదము లుంచిన నేమియు బాగుండదుగదా. ఈ విషయమునఁ దిక్కనపోలిక వీరికిఁ గలదని తోఁచెడు. 'గొబ్బునన్' అనునది పాదపూరణముగాక "నీవుగాక సభ్యులు ప్రోచిరె" అనుదానిని సార్థకము చేయుచున్నది. 'అవ్యవధిగా' నను నర్థము గల పద ముపయోగింపకున్న నిచ్చో రసహీనమే యనవలసియుండును. ఇట్లు పద్యముల నన్నిటిని విమర్శింపసాగిన నీవిమర్శనయే గ్రంథమంత యగును. నీహారశేశములవలె నెఱసు లందందుఁ దోఁచినను గ్రంథమంతయు రసమయముగా నున్నది. శైలి మనోహరముగ నున్నది.

శైలీసౌందర్యమునకు మచ్చు:

"కైవల్యలక్ష్మికిఁ దావలంబై పొల్చు
మంజులదివ్యాంఘ్రి కంజములును
జిన్నారిమడతల చీనాంబరములోన
నొఱపైన జానుజంఘోరువులును
మణిపుష్పమాలికా మారమ్యతనుమధ్య
పృథులవక్షో దరగ్రీవములును
సుస్మితధవళిమా శోభితపుండ్రాస్య
ముకుటమండనదీప్త మూర్ధములును
శంఖచక్రము లిరుకేల జానువందు
వామకరమొండు దక్షిణపాణియొండు
పాదములచక్కి వెలయ నొప్పారు నీదు
విశ్వమోహనరూపంబు వేంకటేశ!"

నవ్యసాహిత్యము పొడసూపి నూత్నపద్ధతుల నలరించి భక్తికే చోటు లేకుండఁజేయు నీకాలమున నీకవితల్లజులు పూర్వమర్యాదల ననుసరించి కవిత్వము చెప్పఁబూనుట విచిత్రముగనే తోఁచినది. అందును బి. ఏ. బి.యల్ అను పరీక్షలలో నాఱితేఱినవారయ్యుఁగూడ భక్తిరసమయముగ నీ గ్రంథమును రచించు టెంతయు శ్లాఘ్యమని తలంచుచున్నాను. ఇట్టి యుత్తమోత్తమగ్రంథముల నింకను రచించి వీరు త్రిలింగాంధ్రదేశములయందు నిర్మలయశస్సు నార్జింతురుగాక యని వాంఛించుచున్నాఁడను.

జనమంచి శేషాద్రిశర్మ

విజయఘోషణ

కర్త: ఆకిలి శ్రీరామశర్మగారు, ముత్తుకూరు, నెల్లూరుజిల్లా. డాదాపు ౨౬౦ పద్యములు: ౯౨ పుటలు. వెల రూపాయ.

హిందీలో రామనరేశత్రిపాఠీకృత "మిలన్" కావ్యమున కిది అనువాదమట.

ఉత్తర ఇటలీదేశమునకు రోమునగరము వంటిది 'మిలాన్' నగరము. ౧౨-వ శతాబ్దమునుండి ౧౯-వ శతాబ్దమువఱకు పలుసార్లుశత్రువులచే నాక్రమింపబడినది. పెక్కుసార్లు శత్రువుల నెదిరించి స్వాతంత్ర్యముగూడ నందినది. రామనరేశత్రిపాఠి ఏఘట్టము నేరితిగ వర్ణించి నాఁడో ఈ యనువాద (అనుసరణ?) గ్రంథమునుండి తెలియకున్నది. ఇందు మిలాన్ ప్రతిష్ఠాననగరమయినది. ఇది ఆంధ్రప్రజాప్రబోధముతో నిండియున్నది. కావున నీఅనుసరణగ్రంథము ననువాదగ్రంథ మనుట యుక్తముగ గనుపట్టదు.

హిందీనుండి కావ్యాదులను దిగుమతి యొనర్చుటతో నాంధ్రకవులకు ముచ్చట తీరుచుండుటవలన నాంధ్రచారిత్రకదృష్టియు, స్వతంత్రరచనయు మనలో నశించిపోవుచున్నవి. వర్తమాన కవిప్రపంచ మీవిషయమును జ్ఞప్తి యుంచికొని స్వతంత్రకావ్యసృష్టియందు ముందంజవేయదగును.

'విజయఘోషణ' ౨౬౦ పద్యముల నిర్వచన కావ్యము. కవి మిక్కిలిగ నూరుమూలపదప్రయోగముల యందు ప్రయత్న మతిగా గావించియున్నా రనవలసియున్నది. పీఠికకు 'బూర్వాభావ్యము!' ఇట్టివి చమత్కార ప్రయోగము లనిపించుకొనక కృతికహ్రాస్వికాసములను బ్రకటింపగలవు. పీఠికయందు, వీరు కోరిన మాత్రాన "సమీక్షారూపముగ మూలముతోడి తులనాత్మకచర్చతో, ఈ అనువాదములోని తగ్గుమొగ్గులు (హెచ్చుతగ్గులం?) నిరూపించుచు నొకపీఠికను వ్రాసియుం"డన్నప్పు డటుగావింపలేని మహావిమర్శకులు శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిపండితులవారి 'ఋట్టి' పీఠికతోడను, సంగ్రహకథతోడను పాఠకలోకమును మఱియొక పఱి పరిచయ మొనర్చుకొందు నని సెలవిచ్చియున్నారు. కావున నీగ్రంథమును మరల విమర్శించు భాగ్యము మా కుగల్గునని యెంచుచున్నాము. అది ఇంతకంటె సహజసుందరమై యుండగలదనియు ఆశించు చున్నాము.

Indian Freedom—Eminent Americans speak out

(భారతస్వాతంత్ర్యం — సుప్రసిద్ధులగు అమెరికనుల అభిప్రాయాలు) ప్రచురణకర్తలు: భారత్ పబ్లికేషన్స్, ౫౯, బ్రాడ్వే, మద్రాసు. వెల ౧౨ అణాలు.

మన ఆశయసిద్ధికై గాంధీజీ సంకల్పించిన మహోద్యమాన్ని గురించి జగద్విఖ్యాతి గాంచిన అమెరికనులు కొందరు గావించిన సుస్పష్టప్రకటనలు ఈ చిన్నగ్రంథ రాజంలో క్రోడీకరింపబడినవి. రచనలన్నీ బహు రమ్యమైనవి. ప్రతి భారతీయుని వ్యక్తిగత గ్రంథాలయాన్ని అలంకరించవలసిన సంపుటి. 'జ'

శ్రీ సింహాచలచరిత్ర

కృతికర్త: గంటి సూర్యనారాయణశాస్త్రిగారు, సింహాచలము. వెల ౧ రూపాయి.

ఇది శాసనములనుండి, పురాణములనుండి, పూర్వప్రబంధములనుండి, గాథలనుండియు అనేకవిషయముల నేర్చి పూర్వోత్తరసందర్భములతో, కథాక్రమమున, ప్రమాణబద్ధముగా కూర్పబడినది. క్షేత్రపరిపాలనాక్రమముకూడ వివరింపబడినది.

గ్రంథ స్వీకారము

దీపావళి

ఖండకావ్యసంకలనము. రచయిత: అట్లూరి అయోధ్యరామయ్య కవిగారు, ఇల్లెంద, ఓరుగల్లుజిల్లా, నైజాం. రాయల్ ౧౬ పుటల సైజులో ౩౨ పుటలు వెల ౪ అణాలు. ప్రకాశకులు: విజ్ఞాన గ్రంథమాల, శాగన్నదరవాజ, హనుమకొండ, నైజాము.

దక్షిణ

నాటిక. కర్త: అంబటిపూడి వెంకటరత్నంగారు. ప్రకాశకులు: సాహితీ మేఖల, కొండాపురము, చండూరుపోస్టు, నల్లగొండజిల్లా నైజాము ఇలాకా.

వీరాంజలి

(కథానికలు-పద్యరూపము) కర్త, ప్రకాశకులు కూడ పైవారే. వెల అర్ధ రూపాయ.

ఎక్కడికి కమలా?

(కథల సంపుటి) కథకుడు: చందూరి నాగేశ్వరరావుగారు. ప్రకాశకులు: ప్రతిభా బుక్సు, పవరుపేట, ఏలూరు. వెల అర్ధ రూపాయు.

ఉదయిని

(చతుర్థగుచ్ఛము)

కావ్యకర్త: వేదాంతము నరసింహారెడ్డిగారు, తలమర్ల, అనంతపురముజిల్లా. వెల ౨ అణాలు.

పౌలస్త్యహృదయము

కావ్యకర్తలు: పింగళి లక్ష్మీకాంతము, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు. మచిలీపట్టణములోని శశికళాకిరణమాల తొలిప్రచురణము. వెల పావలా.

యుద్ధకాలపు చైనా

గ్రంథకర్త: శివలెంక బ్రహ్మయ్యగారు, బి. ఏ. వెల ౮ అణాలు.

ప్రజాయుద్ధము

గ్రంథకర్త: కలినిన్. అనుసరణ: పరుమారి కోటయ్యగారు. వెల ౬ అణాలు.

నేటిచైనా

రచయిత: పింగళి పరశురామయ్యగారు, వెల ౧౦ అణాలు.

పైమూటికిని ప్రకాశకులు: సంస్కృతి గ్రంథమండలి, పెరంబూరు, మద్రాసు.

దురాక్రమణ

నవల. అనువాదకుడు: విద్వాన్ విశ్వంగారు. ప్రకాశకులు: నవ్యసాహిత్యమాల, అనంతపురము. వెల రూ. ౧-౮-౦.

పుళిందకన్య

రచయిత్రి: కవితిలక పులవర్తి కమలావతీదేవిగారు, రాజమహేంద్రవరము. చిన్న, ౨౮ పుటల నవల.

శ్రీ సూర్య శతకము

కృతికర్త: కీ. శే. నేమాన సూర్యప్రకాశకవిరాజుగారు, ఆస్థాన కవి, దేవిడి. ప్రకాశకులు: నేమాన సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, c/o బాక్సుప్రెస్, రాజమహేంద్రవరము.

సాభిప్రాయ విశేషాలు

లిపిలోకూడా హిందూ-ముస్లిము తగాదాలా?

మన భారతదేశానికి ఏకైక రాష్ట్రభాషగా ఇప్పుడు హిందీ అందరిచేతా అంగీకరింపబడింది. ఆ విధంగానే అది చలామణీ అయిపోతున్నది. దినదినానికీ అది దేశంలోని మూలమూలకూ వ్యాపించిపోయి, ప్రజలలో రూఢమూలమై పోతున్నది. దేశంలో ఏమూలనో కొంతమంది వ్యతిరేకులుంటే ఉండవచ్చు. అది వేరే విషయం. రాష్ట్రభాషగా ఉండడం విషయంలోగాని, దానికి నాగరీలిపినే వాడడం విషయంలోగాని ఇంతవరకు మాకెక్కడా విప్రతిపత్తి కనబడలేదు. నాగరీలిపి ఉన్నందుకు ఎవరూ ఆక్షేపించినట్టుకూడా మేము వినలేదు. ఇప్పుడు ఒక కొత్త ఆక్షేపణ వినవస్తున్నది.

పర్షియన్ లిపి గల ఉర్దూయే ఇస్లామీ భాషయని సహజంగా నమ్మే మహమ్మదీయులు ఆర్యభాషా సంబంధం గల నాగరీలిపికి ఒప్పుకోరట. పోనీ, వారి మాటే అంగీకరిస్తామంటే హిందువులు నాగరీలిపిని విడిచిపెట్టడానికి ససేమిరా సమ్మతించరట. ఏమంచ, రాష్ట్రభాషా విషయంలో ఈ అంశం ఒక విడరాని సమస్యగానే ఉన్నదట. ఈ విషయంలో ఈ యిద్దరికీ పొందికకుదరటం దుర్ఘటమట. ఏకైక సార్వజనిక భాషకు ఏకైకలిపియే ఉండితీరవలెనట. ఈ తగాదాను తీర్చవలెనంటే రోమకలిపిని స్వీకరించడ మొక్కటే మార్గమట.


యస్. కె. ఛటర్జీ అనునతని ఈ కొత్తసూచనను మొన్నటి ప్రబుద్ధ కర్ణాటక పత్రిక ఉద్ఘాటించింది. ఈసందర్భంలో పర్షియను — నాగరీ లిపుల స్వరూప స్వభావాలనుగురించి ప్రస్తావించడం అసమంజసం కాదు.

పర్షియను లిపిలో చుక్కలూ, చిన్నచిన్న గీతలూ విశేషంగా ఉండి, అనేక సంక్షిప్తలిపివలెనే ఉంటుంది. దాన్ని చదవడం చాలా కష్టం. లిపియేమో చూడడానికి సుందరంగానే ఉంటుందిగాని భాషలో ఆరితేరినవారు తప్ప తదితరులు దానిని చదవడానికి చాలా శ్రమపడవలసిఉంటుంది. కాక, ఈలిపి హిందూదేశానికి విదేశీయము. హిందూజనత దీనిని ఒప్పుకోవడమంటే కొంచెం దుర్ఘటమే.

దేవనాగరీలిపి హైందవభాషలలోకెల్లా బహుళ ప్రచారం గలది. బహుప్రాచీనమయిందికూడా. అన్ని వ్యంజనాలకూ, అన్నిస్వరాలకూ ఆలిపిలో ఆకార, ఆదరణ లున్నవి. అయితే, అందులోని అక్షరాలన్నిటిని సాంగోపాంగంగా నేర్చుకోవడంమాత్రం శ్రమైకసాధ్యం. అక్షరమాలలోని సంఖ్యయేమో యాభైయే. అచ్చుకూర్పులోమట్టుకు ఇది ఇంతింతగానే పెరిగిపెరిగి దాదాపు ౪౫౦ వరకూ జేకిపోయింది. అక్షరస్వరూపంకూడా కొంత క్లిష్టంగానే ఉన్నమాట నిజం. అందువల్ల ఆ లిపిని త్వరత్వరగా వ్రాయడానికి వీలుపడదు.

ఈ లిపులలోని ఈ కాస్త లోటుపాట్లనుబట్టి ఇందులో ఏదికాని సార్వత్రిక లిపిగా ఉండడానికి వీలుకాదనీ, వేరే ఏదైనా లిపిని స్వీకరించవలసివుంటుందనీ, అందుకుతగిందిఒక్క రోమకలిపియేననీ ఛటర్జీగారివాదం. రోమక లిపి సరళమైనదే కావచ్చు; పర్షియను నాగరీ లిపులలోని లోటుపాట్లు అందులో లేకపోనూవచ్చు; అది ప్రపంచంలో బహుళాతిబహుళ ప్రచారం కలదీ కావచ్చు. కాని, దాన్ని స్వీకరించమని నచ్చచెప్పడానికి ప్రస్తుతం నిరాఘాటంగా, నిరాక్షేపంగా చలామణీ అయిపోతూవున్న లిపికి స్వస్తిచెప్పడమూ, ఆ మాత్రానికి ఈ లిపివిషయంలోకూడా హిందూ-ముస్లిమత గాడాలను లేవదీయడమూమట్టుకు ఎంతమాత్రమూ

భావ్యంగాలేదు. రోమక లిపియే కావలసివస్తే భాషా వేత్తలంతా కలిసి, కూడబలుకుకొని, అందరికీ ఏకీభావం కుదిరినట్టయితే దానినే మనమూ స్వీకరిద్దాము. తప్ప కుండానూ. కాని, మావిచారమంతా యేమిటంటే, ఈమాత్రందానికోసమై భాషాలిపులలోకూడా అణప రాని ఈ హిందూ–ముస్లిము తగాదాలను రేపడమెందు కనే. అయినా, దేశంలో బాగా నాటుకొనిపోయిన ప్రస్తుత హిందీ లిపిని ఇప్పుడు ఉపసంహరించుకొని, కొత్తలిపిని వ్యాప్తిలోకి తేవడం తేలికమాటలతో జరిగేదిగా తోచడం లేదు.



Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.

Regd. No. M. 1356. 7th MAY 1944.